www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 15-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 60 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 2.33 తదుపరి దశమి; నక్షత్రం: ఉత్తర ఉ. 8.14 తదుపరి హస్త; వర్జ్యం: సా. 5.40-7.28; దుర్ముహూర్తం: ఉ. 5.44-7.28; అమృతఘడియలు: తె. 4.28 మొదలు; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.46 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆరుగురిని బలిగొన్న 'ఓవర్‌టేక్'!

కృష్ణా జిల్లా కృత్తివెన్నులో ఘోర ప్రమాదం

- ఓవర్‌టేక్ చేస్తూ ట్రాక్టర్‌ను ఢీకొని ఆగిన మినీవ్యాన్
- అదే సమయంలో మినీవ్యాన్‌ను ఢీకొన్న కంటైనర్
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- మృతులు, క్షతగాత్రులు కోనసీమ, కాకినాడ జిల్లా కూలీలు
- మృతుల కుటుంబాలకు రూ.ఐదేసి లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన మంత్రి కొల్లు



3 రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనాలు

కోడ్ మాటున కోట్లు కొట్టేశారు

గనుల శాఖలో చీకటి దందా

- ఎన్నికల సందడిలో ఘనుల సడేమియా
- పాత తేదీలతో 280 ఎల్‌వోఐల జారీ
- ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు
- ఆ మర్నాడు రాత్రంతా ఆఫీసులోనే
- 190 సంతకాలు చేసిన కీలక అధికారి, పీఏ
- కొత్త సర్కారు వస్తే ఇబ్బంది పడతారంటూ రెట్టింపు కమీషన్
- లీజుదారులతో సమావేశాలు పెట్టి మరీ వసూలు చేసిన ముగ్గురు జిల్లా అధికారులు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లుగా అవినీతి అక్రమాలతో అంటకాగిన గనుల శాఖ ఉన్నతాధికారి ఒకరు ఎన్నికల సమయంలో రెచ్చిపోయారు. మొత్తం అధికార వ్యవస్థ, ప్రభుత్వం, పార్టీలు ఎన్నికల్లో మునిగితేలుతుంటే, ఈయన మాత్రం కోట్లు వెనకేసుకునే పనిలో తలమునకలయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈ ఏడాది ఏప్రిల్ 18న ప్రకటించారు. అప్పటినుంచి ఎన్నికలు జరిగి ఫలితాలు వచ్చిన మరుసటి రోజు అంటే, జూన్ 5వ తేదీ నాటికి భారీ గోల్‌మాల్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖనిజాల లీజులకు సంబంధించిన 280 దరఖాస్తులను సెటిల్ చేశారు. వాటికి రెండు దశల్లో లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు (ఎల్‌వోఐ) జారీ చేశారు. ఇదంతా పరమరహస్యంగా చేశారు. ఇందులో ఎక్కువగా గ్రానైట్‌కు సంబంధించిన లీజులున్నాయి. ఈ డీల్ విలువ రూ.90 కోట్లపైమాటే. లీజుదారులను అదిరించి, బెదిరించి విశాఖ, ఒంగోలు, కృష్ణా జిల్లాలకు చెందిన ముగ్గురు కీలక అధికారులు ఈ సొమ్మును వసూలు చేశారు. వీటిని గత ప్రభుత్వంలోని గనుల శాఖ పెద్దమనిషి, కీలక అధికారి పంచుకున్నారు. గనులశాఖలో ఇప్పుడు దీని గురించిన చర్చే సాగుతోంది. ప్రభుత్వం విచారణ చేస్తే ఎల్‌వోఐల లోగుట్టు బయటకొస్తుందని, అధికారుల అక్రమాల గురించి ఫైళ్లే నిజాలు చెబుతాయని అధికారవర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. గనుల శాఖలో దాదాపు 300కుపైగా ఖనిజాల లీజు రెన్యువల్, గ్రాంట్లు,

మిగతా 12వ పేజీలో...



లోకేశ్ - ఐటీ, విద్య, ఆర్టీజీ | అనిత హోం శాఖ

డిప్యూటీ సీఎం పవన్

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు

అచ్చెన్నాయుడికి వ్యవసాయం

- మంత్రులకు శాఖలు కేటాయించిన చంద్రబాబు
- పయ్యావులకు ఆర్థిక, సభా వ్యవహారాలు
- సత్యప్రసాద్‌కు రెవెన్యూ, నిమ్మలకు జలవనరులు
- ఎక్సైజ్, గనులు కొల్లుకు.. వైద్యం సత్యకుమార్‌కు
- మనోహర్‌కు పౌరసరఫరాలు.. సవితకు బీసీ సంక్షేమం
- ఆనంకు దేవదాయం.. రాంప్రసాద్‌రెడ్డికి రవాణా
- పరిశ్రమలు భరత్‌కు.. కార్మిక శాఖ సుభాష్‌కు

12

నవతరానికి 'బరువు' బాధ్యతలు

- శాఖల కేటాయింపుపై చంద్రబాబు సుదీర్ఘ కసరత్తు
- నేపథ్యం, సామర్థ్యం, అనుభవమే ప్రాతిపదికలు
- భావి నాయకత్వం పెంపొందించడమే లక్ష్యం
- యువతను ఇప్పటి నుంచే సానపట్టే యత్నం



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా?

12

మరోసారి ఉత్తరాంధ్ర బీసీలకు అవకాశం!

- గాజువాక నుంచి 95 వేల ఓట్ల భారీ మెజారిటీతో శ్రీనివాసరావు గెలుపు
- ఇతర సమీకరణలతో మంత్రి పదవి ఇవ్వలేకపోయిన చంద్రబాబు
- పార్టీ పగ్గాలు కట్టబెడతారని తాజా ప్రచారం



2

ఆర్మీ అమ్ముల పొదిలో నాగాస్త్రం

తొలి విడతలో సైన్యానికి చేరిన 120 డ్రోన్లు



3

టైట్లింగ్ యాక్టు మంచిదే!

రాజ్యసభలో బలముంది అక్కడ చూసుకుందాం!

- తగ్గింది 10 శాతం ఓట్లే!
- అంశాలవారీగా కేంద్రానికి మద్దతు
- వైసీపీ ఎంపీలతో జగన్

పాలనలో వడివడిగా

సోమవారం పోలవారం!

- క్షేత్రస్థాయి పర్యటనకు సీఎం చంద్రబాబు
- నవ్యాంధ్ర సీఎంగా ప్రతి సోమవారం సమీక్ష
- తిరిగి ఇప్పుడు కూడా అదే ఆనవాయితీ
- 2019 నాటికి 73% నిర్మాణం పూర్తి
- ప్రస్తుతం విధ్వంసకర స్థితిలో కట్టడాలు
- హెడ్‌వర్క్స్‌పై బాబు నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

12

యువతకు భవిత

- ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా ముందుకు
- తొలిరోజే కీలక హామీల ఫైళ్లపై సంతకాలు
- 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ
- మరోవైపు యువత నైపుణ్యాల అంచనా
- మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా సంధానం
- బహుళ నైపుణ్యాలు పెంపొందించేలా శిక్షణ

టీటీడీ ఈవోగా శ్యామలరావు

రిలీవ్ కావాలని ధర్మారెడ్డికి ఆదేశం



శ్యామలరావు

అమరావతి (ఆంధ్రజ్యోతి)/తిరుమల, జూన్ 14: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవోగా జే శ్యామలరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ఆయన్ను టీటీడీ ఈవోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం

మిగతా 2వ పేజీలో...



నీట్ మార్కులు, ర్యాంకులపై

సర్కార్ రిగ్గింగ్

- 24 లక్షల మంది ఆకాంక్షల్ని తొక్కేసింది
- పేపర్ లీక్ కాకపోతే బిహార్‌లో 13 అరెస్టులు ఎందుకు?: ఖర్గే
- యువత కలలపై దాడి: ప్రియాంక
- 'చీట్'లా 'నీట్': జైరాం రమేశ్ 2
- ఎంట్రన్స్ కుంభకోణాలకు చరమగీతం పాడదాం: తమిళనాడు సీఎం స్టాలిన్
- సీబీఐ దర్యాప్తు కోసం సుప్రీంలో పిటిషన్లు
- కేంద్రానికి, ఎన్‌టీఏకి నోటీసుల జారీ

జగన్ 'బొమ్మ'తో కోట్లు వృథా

రూ.19.80 కోట్లతో ఆరోగ్యశ్రీ కార్డులు

- 3.50 కోట్లతో ఆర్బీకేలకే బుక్‌లెట్లు
- అన్నింటిపైనా జగన్ ఫొటోలు
- ఎన్నికలకు 2 నెలల ముందు ముద్రణ
- మళ్లీ జగన్ ప్రభుత్వమే వస్తుందని కొందరు అధికారుల అత్యుత్సాహం
- ఇప్పుడా కార్డుల్ని ఏం చేయాలో?

ఎన్నికల ముందు అచ్చేశారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో జగన్ ప్రచారం కోసం కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్ము వృథా చేశారు. ఐదేళ్ల పాలనలో కొన్ని వేలకోట్లు ఖర్చు చేశారు. ఎన్నికల ముందు కూడా కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కార్డులపై జగన్ ఫొటోలను ముద్రించారు. ఆరోగ్య శాఖలో జనవరి, ఫిబ్రవరిలో కోటి 30 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు, 70 లక్షల ఆర్‌బీఎస్‌కే బుక్‌లెట్లు ముద్రించగా..

మిగతా 12వ పేజీలో...

టీటీడీ ఈవోగా శ్యామలరావు

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం టీటీడీ ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ధర్మారెడ్డిని ఆ పోస్టు నుంచి రిలీవ్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వాస్తవానికి ధర్మారెడ్డిని గత ప్రభుత్వం టీటీడీ అదనపు ఈవోగా నియమించింది. ఆ తర్వాత ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. వైసీపీ ప్రభుత్వం ఓటమి తర్వాత జగన్మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే ధర్మారెడ్డి తనకు సెలవు కావాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. సీఎం చంద్రబాబు తిరుమల పర్యటన ఖరారు అయిన తర్వాత ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు ఆయనకు సెలవు మంజూరు చేసింది. అనేక ఆరోపణలు ఎదుర్కొన్న ధర్మారెడ్డి రిటైర్మెంట్ దగ్గరలో సెలవు పెట్టి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సెలవు ముగిసిన తర్వాత ఆయన విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

అసోం నుంచి ఏపీకి

1997 బ్యాచ్‌కు చెందిన శ్యామలరావును డీవోపీటీ తొలుత అసోం కేడర్‌కు కేటాయించింది. అయితే నిబంధనలకు విరుద్ధంగా తనను అసోం కేడర్‌కు పంపారని, తన ర్యాంక్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించాలని క్యాట్‌లో పోరాటం చేశారు. కొంతకాలం అసోంలో పనిచేశాక 2009లో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. విశాఖ కలెక్టర్‌గా, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీగా, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ ఎండీగా పనిచేశారు. ఆయన ఎక్కువ కాలం మున్సిపల్ శాఖలో పనిచేశారు. త్వరలో టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు.

సీఎంవోలోకి ముగ్గురు ఐఏఎస్‌లు

- రాజమౌళి, కార్తికేయ మిశ్రా, యువరాజుకు చాన్స్!
- రాజమౌళి, మిశ్రా కోసం కేంద్రానికి ప్రభుత్వం లేఖ

అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయంలో అధికారుల కూర్పు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు. ఆయన కాకుండా మరో ముగ్గురు ఐఏఎస్‌లను సీఎంవోలోకి తీసుకోనున్నారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి అడుసుమిల్లి రాజమౌళి, కేంద్ర సర్వీస్‌లో ఉన్న కార్తికేయ మిశ్రాతోపాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజు పేర్లు దాదాపు ఖాయమైనట్టు తెలిసింది. ప్రస్తుతం ఏపీలోనే ఉన్న యువరాజు సీఎంవోలో రిపోర్ట్ చేయడానికి ఎలాంటి సమస్యాలేదు. కానీ, రాజమౌళి యూపీలో, మిశ్రా కేంద్ర సర్వీసులో ఉన్నారు. వారిని తమకు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. వారు అక్కడ రిలీవ్ అయి.. ఏపీలో రిపోర్ట్ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కొంత సమయం పడుతుంది. అయితే వారు వచ్చే వరకూ ఆ పోస్టులు ఖాళీగా ఉంచుతారా..? మరొకరితో భర్తీ చేస్తారా అన్నది చూడాలి.

ఖాతాలు అమ్మేసి.. కోట్లు కాజేసి..

- సైబర్ నేరగాళ్లకు వివరాలు విక్రయం
- వాటి ద్వారా రూ.10 కోట్ల లావాదేవీలు.. విశాఖలో 8 మంది అరెస్టు

ఎండాడ (విశాఖపట్నం), జూన్ 14: అక్రమ లావాదేవీల కోసం బ్యాంకు ఖాతాల వివరాలను సైబర్ నేరగాళ్లకు అమ్మిన ఎనిమిది మందిని విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారంతా కలిసి రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు వ్యక్తులతో 31 కరెంట్ ఖాతాలను ఓపెన్ చేయించి, అందులో ఎనిమిది మంది ఖాతాల వివరాలను సైబర్ నేరగాళ్లకు అమ్మేశారు. ఈ ఎనిమిది అకౌంట్‌లను వినియోగించి సైబర్ నేరగాళ్లు దేశవ్యాప్తంగా సుమారు రూ.10 కోట్లు దోచుకున్నారు. ఈ ఖాతాలపై దేశవ్యాప్తంగా నేషనల్ సైబర్‌క్రైమ్ పోర్టల్‌లో 79 ఫిర్యాదులు నమోదయ్యాయి. వాటిలో ఏపీ నుంచి 8, తెలంగాణ నుంచి 13, బిహార్ నుంచి 3, ఢిల్లీ నుంచి 2, గోవా నుంచి ఒకటి, గుజరాత్ నుంచి 9, హరియాణా నుంచి 5, కర్ణాటక నుంచి 6, కేరళ నుంచి 4, మహారాష్ట్ర నుంచి 13, పంజాబ్ నుంచి 2, రాజస్థాన్ నుంచి 6, తమిళనాడు నుంచి 4, ఉత్తరప్రదేశ్ నుంచి 3 ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫేక్ ఖాతాలు ఓపెన్ చేయించి, ఆ వివరాలను సైబర్ నేరగాళ్లకు అమ్మేసిన హైదరాబాద్‌కు చెందిన సంకాబత్తుల సాయిచరణ్, పులి అవినాష్, యల్లబండి రామకృష్ణ, మహ్మద్ ఇర్ఫాన్, విశాఖకు చెందిన శెట్టి యెర్నిబాబు, పల్లంటి సతీశ్, దూడ వంశీకృష్ణ, అనకాపల్లికి చెందిన ఇమంది రాజేంద్రను విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎవరైనా అపరిచితులు డబ్బులిస్తాం.. బ్యాంకు అకౌంటు ఓపెన్ చేయాలని సంప్రదించినా, మొబైల్ సిమ్ కార్డులు ఇప్పిస్తామని చెప్పినా... వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు తెలియజేయాలని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ సూచించారు. తన వాట్సాప్ నంబర్ 9493336633కి తెలియజేయాలని కోరారు.

నేటి నుంచి ముంబైకు విమానం


విజయవాడ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కరోనాకు ముందు, జగన్ హయాంలో రద్దయిన విజయవాడ - ముంబై విమాన సర్వీసు మళ్లీ నేటి నుంచి ప్రారంభమయింది. శనివారం విజయవాడ విమానాశ్రయంలో ఈ సర్వీసును ఎయిర్‌పోర్టు అధికారులతో కలసి ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రారంభించనున్నారు. ఈ మార్గంలో 185 మంది సామర్థ్యం కలిగిన ఎయిర్ బస్‌ను ఎయిర్ ఇండియా నడుపుతుంది. విమానం సాయంత్రం 5.15 గంటలకు ముంబై నుంచి విజయవాడకు వస్తుంది. దానికి వాటర్ గన్స్‌తో ఘనస్వాగతం పలుకుతారు. సాయంత్రం 5.30 గంటలకు టెర్మినల్ బిల్డింగ్‌లో కేక్ కటింగ్ కార్యక్రమం తరువాత ఎంపీలు ఇద్దరూ ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌లను అందిస్తారు. ప్రారంభ టికెట్ ధర రూ.5,600గా నిర్ణయించటంతో ప్రయాణీకుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉంది. ప్రతిరోజూ రాత్రి 7.10 గంటలకు విజయవాడ నుంచి ముంబైకు ఈ విమానం బయలుదేరుతుంది.

ఇస్రో మాజీ శాస్త్రవేత్త శ్రీనివాస్ హెగ్డే కన్నుమూత

- చంద్రయాన్-1 మిషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహణ

బెంగళూరు, జూన్ 14: ఇస్రో మాజీ శాస్త్రవేత్త, చంద్రయాన్-1 మిషన్ డైరెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్ హెగ్డే (71) శుక్రవారం కన్నుమూశారు. హెగ్డే కొన్నాళ్లుగా మూత్ర పిండాల సమస్యతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో స్థానిక జయనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. హెగ్డేకు ఇస్రోతో సుదీర్ఘ అనుబంధం ఉంది. 1978 నుంచి 2014 వరకు ఆయన ఇస్రోలో శాస్త్రవేత్తగా సేవలందించారు. అనేక అంతరిక్ష ప్రయోగాల్లో భాగస్వామి అయ్యారు. చంద్రుడిపై నీటి జాడలను గుర్తించిన భారత తొలి మూన్ మిషన్ చంద్రయాన్-1 డైరెక్టర్‌గా పనిచేశారు. యూఎస్‌రావు శాటిలైట్ సెంటర్ (యూఎస్ఆర్‌సీ) నిర్వహించిన స్పేస్ మిషన్లలో పనిచేశారు.

ప్రముఖ వ్యంగ్య, హాస్య రచయిత.. నండూరి పార్థసారథి కన్నుమూత




- సంగీత, నృత్య, నాటక, చిత్ర, శిల్ప కళలపై వందలాది విమర్శనాత్మక వ్యాసాలు

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు పాఠకలోకానికి, సాహితీప్రియులకు 'నం.పా.సా.'గా చిరపరిచితుడైన ప్రముఖ వ్యంగ్య, హాస్య రచయిత, సీనియర్ పాత్రికేయుడు.. నండూరి పార్థసారథి (85) ఇకలేరు. కొద్ది రోజులుగా మెదడుకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్న ఆయన నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు తుదిశ్వాస విడిచారు. పార్థసారథి పుట్టింది, పెరిగింది ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఆరుగొలను గ్రామం. 'ఆంధ్రజ్యోతి' పూర్వ సంపాదకుడు నండూరి రామ్మోహనరావు ఆయన సోదరుడు. ముళ్లపూడి వెంకట రమణ సతీమణి శ్రీదేవి.. పార్థసారథికి సోదరి. 1957లో కథా రచన ప్రారంభించిన ఆయన.. 'రాంబాబు డైరీ (మూడు భాగాలు)', 'పిబరే హాస్యామరసం', 'అయోమయ రాజ్యం', 'సాహిత్య హింసావలోకనం', 'ఖర్మానాఖ్యానము', 'జేజి మావయ్య పాటలు' తదితర హాస్య, వ్యంగ్య రచనలతో పాటు 'స్వరార్ణవం' 'సంగీత కళా చరిత్ర', 'శ్రీకృష్ణ కథామృతం', 'శిఖరాలు- సరిహద్దులు' తదితర రచనలు చేశారు. సంగీత, నృత్య, నాటక, చిత్ర, శిల్ప, వాస్తు కళలపై సాధికారిక విశ్లేషణలతో 'రసమయి' సాంస్కృతిక మాస పత్రికను 2000 నుంచి 2009 వరకు నిర్వహించారు. లలిత కళలపై కొన్ని వందల విమర్శనాత్మక వ్యాసాలు రాశారు. 1959 నుంచి 1996 వరకూ 'ఆంధ్రప్రభ'లో పాత్రికేయుడిగా సేవలందించా రు. వెయ్యికి పైగా అరుదైన గ్రామఫోన్ రికార్డులు, కొన్ని వందల పాటల క్యాసెట్లు, సీడీలను నండూరి సేకరించారు. భారతీయ సంప్రదాయ సంగీతంతోపాటు పాశ్చాత్య సంగీత, నృత్యాలకు సంబంధించిన అరుదైన పుస్తకాలనూ ఆయన వ్యక్తిగత గ్రంథాలయంలో చూడచ్చు. నండూరి పార్థసారథికి.. భార్య సువర్చలా దేవి, కుమారుడు మధుసారథి ఉన్నారు. నండూరి మృతి పట్ల పలువురు సాహితీ, పాత్రికేయ ప్రముఖులు సంతాపం తెలిపారు. 'ప్రత్యేకమైన శైలితో వ్యంగ్య, హాస్య రచనల ద్వారా తెలుగు పాఠకుల ఆదరాభిమానాలు పొందిన రచయిత నండూరి పార్థసారథి మరణం బాధాకరం' అంటూ వయోధిక పాత్రికేయ సంఘం ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టు కె. రామచంద్ర మూర్తి, చిత్రకారుడు బ్నింతో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు, రచయితలు విచారం వ్యక్తం చేశారు. ముళ్లపూడి వెంకట రమణ సతీమణి శ్రీదేవి, వారి కుమారుడు, సినీ దర్శకుడు వర ముళ్లపూడి.. పార్థసారథి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. కాగా.. నండూరి పార్థసారథి అంత్యక్రియలు శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించారు.

మరి 13 అరెస్టులు ఎందుకు?

నీట్ పేపర్ లీక్ కాలేదన్న వ్యాఖ్యలపై ఖర్గే.. 24 లక్షల మంది యువత ఆకాంక్షల్ని తొక్కేశారని ధ్వజం

- సీబీఐ దర్యాప్తు కోరుతూ ఏడు పిటిషన్లు
- కేంద్రానికి, ఎన్‌టీఏకి సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ, జూన్ 14: నీట్ అక్రమాలు, పేపర్‌లీక్ ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మోదీ సర్కారుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. మోదీ ప్రభుత్వం నీట్ కుంభకోణాన్ని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎన్‌టీఏ ద్వారా కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. నీట్ అక్రమాలపై ఆయన సర్కారును ఉద్దేశించి 'ఎక్స్'లో ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ కూడా ప్రభుత్వంపై మండిపడ్డారు. "లక్షలాది మంది యువత, వారి తల్లిదండ్రుల ఆందోళనను పట్టించుకోకపోవడం ద్వారా.. వ్యవస్థలో ఎవరిని కాపాడడానికి ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నదే ప్రశ్న" అని ప్రియాంక ధ్వజమెత్తారు.

నీట్ కాదు.. చీట్

'నీట్' ఈ ప్రభుత్వ హయాంలో 'చీట్ (సెంట్రల్ హైప్‌డ్ ఎంట్రన్స్ అడ్మిషన్ టెస్ట్)'లా తయారైందని.. కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ధ్వజమెత్తారు. మోదీ హయాంలో పరీక్షల పవిత్రత పదేపదే ప్రమాదంలో పడుతోందని.. పేపర్ లీక్‌లు సాధారణంగా మారిపోయాయని.. నీట్ పేపర్ లీక్ కుంభకోణం కూడా అలాంటివాటిలో ఒకటని ఆయన ఆగ్రహం వెలిబుచ్చారు. "ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ పాలనలో 40కి పైగా పేపర్ లీక్ ఘటనలు బయటపడ్డాయి. గుజరాత్ అయితే పేపర్ లీక్‌లకు రాజధానిగా మారింది. అక్కణ్నుంచే దేశం మొత్తానికీ పేపర్లు లీక్ అవుతున్నాయి. మధ్యప్రదేశ్.. భారీ వ్యాపం కుంభకోణానికి పేరు మోసింది. ఇలాంటి అక్రమాలు లక్షలాది మంది యువ విద్యార్థుల ఆకాంక్షలను దెబ్బతీస్తున్నాయి" అని జైరామ్ రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక.. కాంగ్రెస్ మీడియా అండ్ పబ్లిసిటీ విభాగం అధిపతి పవన్ ఖేడా అయితే నీట్ కుంభకోణాన్ని వ్యాపం 2.0గా అభివర్ణించారు. నీట్ అక్రమాలపై దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు, కోర్టు కేసులు ఎవరో ప్రేరేపిస్తే జరుగుతున్నవంటూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలు.. 24 లక్షల మంది నీట్ అభ్యర్థుల పుండుపై కారం జల్లినట్టుగా ఉన్నాయని మండిపడ్డారు. అంతమంది యువత భవిష్యత్తు ప్రమాదంలో ఉన్నప్పుడు ప్రధాని మోదీ మౌనంగా ఎందుకు ఉన్నారని ఆయన నిలదీశారు. "గత ఏడాది, ఈ ఏడాది నీట్ పరీక్షల్లో 580కి మించి స్కోర్ చేసిన విద్యార్థులందరి వివరాలూ బయటపెట్టాలి. వారు పరీక్ష రాసిన కేంద్రాల వివరాలను కూడా బహిర్గతం చేయాలి. అప్పుడు.. నీట్ పరీక్ష రాయడానికి ఎంత మంది విద్యార్థులు తాము ఉన్న చోటు నుంచి ఎంత దూరం ప్రయాణించారో బయటపడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. నీట్‌లో అవకతవకలపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఫోరెన్సిక్ దర్యాప్తు చేయిస్తేనే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. ఇక.. నీట్ తరహా ప్రవేశపరీక్ష కుంభకోణాలకు తాము చరమగీతం పాడతామని, అది తమ బాధ్యత అని తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటించారు. "నీట్‌లో అక్రమాలు జరిగాయని మొట్టమొదట చెప్పింది తమిళనాడే. ఇప్పుడు యావద్దేశం అదే మాట చెబుతోంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేసిన ప్రశ్నలు

- "నీట్ పేపర్ లీక్ కాకపోతే.. బిహార్‌లో 13 మంది నిందితులను ఆ ఆరోపణపై ఎందుకు అరెస్ట్ చేశారు? బిహార్‌లోని ఎడ్యుకేషన్ మాఫియా, పేపర్ లీక్ రాకెట్‌లో భాగమైన వ్యవస్థీకృత గ్యాంగులు నీట్ అభ్యర్థుల నుంచి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల దాకా వసూలు చేసిన విషయాన్ని పట్నా పోలీస్ శాఖలోని 'ఆర్థిక నేరాల విభాగం' బయటపెట్టలేదా?
- గుజరాత్‌లోని గోధ్రాలో ఒక కోచింగ్ సెంటర్ నడుపుతున్న వ్యక్తి, ఒక టీచర్, మరొకరు కలిసి నడిపిన నీట్-యూజీ చీటింగ్ రాకెట్ గుట్టు రట్టు కాలేదా? ఈ ముగ్గురి మధ్య రూ.12 కోట్ల లావాదేవీలు జరిగిన విషయం బయటకు రాలేదా?
- 24 లక్షల మంది రాత్రింబవళ్లు శ్రమించి.. వైద్య వృత్తిలో ప్రవేశించడానికి నీట్ పరీక్ష రాశారు. మోదీ సర్కారు ఎన్‌టీఏని దుర్వినియోగం చేసి.. మార్కులు, ర్యాంకులను రిగ్గింగ్ చేసింది. అందుకే రిజర్వుడు సీట్లకు కూడా ఈసారి కటాఫ్ పెరిగింది. ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో రాయితీ ఫీజులకు సీట్లు పొందకుండా చేసేందుకే.. గ్రేస్ మార్కులు, పేపర్ లీక్, రిగ్గింగ్ ఆటలు ఆడినట్లు కనిపిస్తోంది. మోదీ ప్రభుత్వం 24 లక్షల మంది యువత ఆకాంక్షలను తొక్కేసింది.

సీబీఐ దర్యాప్తుపై మీ స్పందనేంటి?

నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపైన, పేపర్ లీక్ ఆరోపణలపైనా సీబీఐ దర్యాప్తు జరిపించాలంటూ దాఖలైన పిటిషన్లపై స్పందన తెలపాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని, సీబీఐని, బిహార్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. రెండు వారాల్లోగా స్పందన తెలపాలని సీబీఐని ఆదేశించిన సర్వోన్నత న్యాయస్థానం.. మిగతా వారికి తదుపరి విచారణ జరిగే జూలై 8 దాకా అందుకు సమయం ఇచ్చింది. నీట్‌లో అక్రమాలు, పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కోరుతూ మొత్తం ఏడు రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆ పిటిషన్లపై విచారణ జరిపింది. వాటిలో ముఖ్యమైనది.. నీట్-2024 అభ్యర్థులైన హితేన్ సింగ్ కాశ్యప్, పలక్ మిత్తల్ వేసిన పిటిషన్. పరీక్షా కేంద్రాల్లో జరిగిన అక్రమాలపై వారు తమ పిటిషన్‌లో ప్రధానంగా ప్రస్తావించారు. ఉదాహరణకు.. ఒడిసా, కర్ణాటక, ఝార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 16 మంది విద్యార్థులు పరీక్ష రాయడానికి గుజరాత్‌లోని గోధ్రాలో ఉన్న ఒక పరీక్షా కేంద్రాన్ని ఎంచుకున్నారని తెలిపారు. నీట్ పరీక్షలో మంచి మార్కుల కోసం వారు రూ.10 లక్షలు లంచంగా ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈమేరకు గుజరాత్ పోలీసులు ఒక టీచర్‌పై కేసు కూడా నమోదు చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. అలాగే.. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి పట్నా (బిహార్)లో ఎఫ్ఐఆర్ దాఖలైన విషయాన్ని కూడా తమ పిటిషన్‌లో వివరించారు. యూపీలో నీట్ పేపర్ లీక్ రాకెట్‌కు సంబంధించిన ఒక రింగ్ లీడర్ ప్రమేయం ఉందంటూ యూపీలో వచ్చిన వార్తా కథనాల గురించి కూడా అందులో ప్రస్తావించారు. కాగా.. నీట్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా పలు హైకోర్టుల్లో దాఖలైన పిటిషన్లన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ ఎన్‌టీఏ వేసిన పిటిషన్‌పై కూడా ధర్మాసనం ఆయా ప్రైవేట్ పార్టీలకు నోటీసులు జారీ చేసింది.



ఆ ఆత్మహత్యలకు నీట్‌తో సంబంధం లేదు

విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదుల్లో ఒకరు.. రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యల గురించి ప్రస్తావించగా ధర్మాసనం అందుకు అభ్యంతరం వ్యక్తం చేసింది. కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలకు నీట్ 2024 కాదన్న జస్టిస్ విక్రమ్‌నాథ్.. "అనవసరంగా భావోద్వేగపరమైన వాదనలను ఇక్కడ వినిపించొద్దు" అని హెచ్చరించారు. ఇది 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని.. సీబీఐ దర్యాప్తు తప్పనిసరి అని పిటిషనర్ల తరఫు న్యాయవాది పేర్కొనగా.. ఆ విషయం తమకు తెలుసని, కానీ ఎన్‌టీఏ వాదనలు వినకుండా ఈ విషయంలో ఎక్స్‌పార్టీ డిక్రీ (కక్షిదారు లేకుండా ఇచ్చే తీర్పు) ఇవ్వలేమని జస్టిస్ నాథ్ స్పష్టం చేశారు.

లోకం తీరు



ఆర్మీ అమ్ములపొదిలో 'నాగాస్త్రం'

- తొలి విడతలో సైన్యానికి చేరిన 120 డ్రోన్లు

న్యూఢిల్లీ, జూన్ 14: రక్షణ రంగంలో స్వావలంబన దిశగా కీలక ముందడుగు పడింది. తొలిసారి స్వదేశీయంగా రూపొందించిన ఆత్మాహుతి డ్రోన్ నాగాస్త్ర-1 భారత ఆర్మీ అమ్ములపొదిలో చేరింది. నాగ్‌పూర్‌లోని సోలార్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఎకనామిక్స్ ఎక్స్‌ప్లోజివ్ లిమిటెడ్ (ఈఈఎల్) ఈ యూఏవీ (మానవ రహిత విమానం) డ్రోన్లను తయారు చేసింది. తొలి విడతలో భాగంగా 120 డ్రోన్లను ఆర్మీకి అందించింది. పుల్గావ్‌లోని డిపోకు వాటిని తరలించారు. 9 కేజీల బరువుండే ఈ పోర్టబుల్ డ్రోన్ గాలిలో ఏకధాటిగా 30 నిమిషాలు ఎగరగలదు. ఒక కేజీ బరువున్న పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. జీపీఎస్ ఆధారంగా పనిచేసే ఈ డ్రోన్ కామికేజ్ మోడ్‌లో అత్యుత్తమంగా పనిచేస్తుంది. లక్ష్యాలపై కచ్చితత్వంతో దాడిచేస్తుంది. ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్ కారణంగా నాగాస్త్ర-1 తక్కువ శబ్దంతో ప్రయాణిస్తుంది. ఇది 200 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఎగిరితే శత్రువుకు దీన్ని గుర్తించడం కూడా కష్టమే.

అరుంధతీ రాయ్‌పై 'ఉపా' కేసు

న్యూఢిల్లీ, జూన్ 14: ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం (ఉపా) కింద విచారణ జరిపేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా శుక్రవారం ఆమోదం తెలిపారు. కశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ లా విభాగం మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌ను విచారించడానికి కూడా అంగీకారం తెలిపారు. 2010 అక్టోబరు 21న ఢిల్లీలో 'ఆజాదీ-ద ఓన్లీ వే' అన్న పేరుతో జరిగిన కార్యక్రమంలో భారత్ నుంచి కశ్మీర్ విడిపోవాలంటూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారంటూ కేసులు నమోదయ్యాయి. ఈ ప్రసంగాలపై కశ్మీర్‌కు చెందిన సుశీల్ పండిట్ అనే వ్యక్తి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు కోర్టులో ఫిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భారత్‌లో న్యాయబద్ధంగా ఎన్నికలు

విస్తృత సాంకేతికతతో అత్యంత పారదర్శకంగా నిర్వహణ

- నా గెలుపు ప్రపంచ ప్రజాస్వామ్య విజయం
- టెక్నాలజీలో గుత్తాధిపత్యం పోవాలి..
- జి-7 సదస్సులో ప్రధాని మోదీ పిలుపు

బారి, జూన్ 14: భారత్‌లో ఇటీవలి ఎన్నికలు అత్యంత న్యాయంగా జరిగాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రతి అంచెలోనూ విస్తృత స్థాయి సాంకేతికత వినియోగంతో పూర్తి పారదర్శకతతో నిర్వహించారని తెలిపారు. తాను మరోసారి గెలవడం ప్రజాస్వామ్య ప్రపంచానికంతటికీ విజయంలాంటిదని అభివర్ణించారు. ఇటలీలోని అపూలియాలో జరుగుతున్న జీ7 దేశాల కూటమి సదస్సులో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇది జి-7 కూటమి 50వ సమావేశం. ఆహ్వానిత దేశ హోదాలో హాజరైన మోదీ మాట్లాడుతూ.. సాంకేతికతలో గుత్తాధిపత్యం పోవాలని, ఫలితాలు అందరికీ అందాలని ఆకాంక్షించారు. సమ్మిళిత సమాజానికి పునాది వేసేందుకు, అసమానతలు రూపుమాపేందుకు ఇది అవసరమని పేర్కొన్నారు. కృత్రిమ మేధను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, సురక్షితంగా అందుబాటులోకి తెచ్చేందుకు అన్ని దేశాలతో కలిసి పనిచేస్తూనే ఉంటామని ప్రకటించారు.

అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఒత్తిడి

అభివృద్ధి చెందుతున్న దేశాలు (గ్లోబల్ సౌత్) ప్రపంచంలో అనిశ్చిత పరిస్థితులు, ఉద్రిక్తతల కారణంగా ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దేశాల ప్రాధామ్యాలు, ఆందోళనలను ప్రపంచ వేదికపై వెల్లడించడాన్ని భారత్ తన బాధ్యతగా స్వీకరించిందని పేర్కొన్నారు. ఆఫ్రికా యూనియన్‌ను జీ20 శాశ్వత సభ్యురాలిగా చేర్చుకుని తాము అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన సంగతిని గుర్తుచేశారు. "ఏఐ అందరికీ అంటూ కృత్రిమ మేధపై జాతీయ విధానం రూపొందించిన అతి తక్కువ దేశాల్లో భారత్ ఒకటి. మానవ కేంద్రీకృతంగా ఉంటేనే సాంకేతికత విజయవంతం అవుతుంది. టెక్నాలజీని విధ్వంసానికి కాదు.. అభివృద్ధికి వాడాలి. ఈ ధోరణితోనే మేం ముందుకెళ్తున్నాం" అని ప్రధాని వివరించారు.



నమస్కారంతో మోదీని స్వాగతిస్తున్న మెలోని

పర్యావరణాన్ని కాపాడేందుకు అందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

వరుస భేటీలతో బిజీబిజీ

జీ7 సదస్సులో మోదీ.. బ్రిటన్, ఇటలీ ప్రధానులు రిషి సునాక్, మెలోనీ, ఫ్రాన్స్, ఉక్రెయిన్ అధ్యక్షులు మేక్రాన్, జెలెన్ స్కీతో సంభాషించారు. క్రైస్తవ మత పెద్ద పోప్ ఫ్రాన్సిస్‌ను హత్తుకుని, కొద్దిసేపు మాట్లాడారు. రష్యాతో యుద్ధం పరిస్థితిని జెలెన్‌స్కీ వివరించగా చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే శాంతి నెలకొనే వీలు ఉంటుందని మోదీ స్పష్టం చేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) చర్చల పురోగతిపై సునాక్‌తో సంభాషించారు. రక్షణ, సెమీ కండక్టర్లు, సాంకేతికత, వాణిజ్య రంగాల్లో ఇరు దేశాల సంబంధాలను మరింత విస్తృతం చేసేందుకు చాలా అవకాశాలు ఉన్నాయని ట్వీట్ చేశారు. మేక్రాన్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం, రక్షణ, అణు, సాంకేతికత, కృత్రిమ మేధ, సముద్ర మార్గ వాణిజ్యం, అంతరిక్ష రంగాల్లో సంబధాలను పటిష్ఠం చేసుకోవడంపై చర్చించారు. కాగా, మెలోని.. సదస్సుకు మోదీని ఆహ్వానిస్తూ భారతీయ పద్ధతుల్లో రెండు చేతులూ జోడించి 'నమస్కారం' చేశారు. మోదీ సైతం ఆమె ప్రతి నమస్కారం చేశారు.

ఏఐతో జాగ్రత్త: పోప్ ఫ్రాన్సిస్

చరిత్రలో తొలిసారిగా పోప్ ఫ్రాన్సిస్.. జి-7 సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. కృత్రిమ మేధ (ఏఐ)తో లాభాలు, పొంచి ఉన్న ముప్పు గురించి మాట్లాడారు. చాట్ జీపీటీ తదితర సాంకేతికతల అందుబాటుతో మానవ సంబంధాలను ఏఐ యాంత్రికంగా మార్చే ముప్పుందని హెచ్చరించారు. "మన నిర్ణయాలు యంత్రాలు కాకుండా మనమే తీసుకునేలా ఏఐని కట్టడి చేయండి. దీనికోసం అంతా చేతులు కలిపేందుకు ఇదో అవకాశం" అని పిలుపునిచ్చారు.

కేరళకు చేరిన 45 మంది భారతీయుల మృతదేహాలు

- సీఎం విజయన్, మంత్రుల నివాళులు
- చికిత్స పొందుతూ మరో భారతీయుడి మృతి

న్యూఢిల్లీ/కువైట్ సిటీ, జూన్ 14: గల్ఫ్ దేశం కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మరణించిన 45 మంది భారతీయుల మృతదేహాలతో ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ప్రత్యేక విమానం శుక్రవారం ఉదయం కేరళలోని కొచ్చికి చేరుకుంది. మృతుల్లో 23 మంది కేరళ వారే ఉండటంతో కువైట్ నుంచి నేరుగా కొచ్చికే విమానం బయలుదేరింది. అప్పటికే మృతుల కుటుంబీకులు కొచ్చి విమానాశ్రయానికి భారీగా చేరుకోవడంతో పరిస్థితి ఉద్విగ్నంగా మారింది. అలాగే కేరళ సీఎం పినరయి విజయన్, క్యాబినెట్ మంత్రులు, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ, ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ తదితరులు అక్కడికి చేరుకుని నివాళులర్పించారు. అనంతరం శవపేటికలను బంధువులకు అప్పగించారు. ప్రమాద వార్త విని కువైట్ వెళ్లిన కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ కూడా అదే విమానంలో తిరిగొచ్చారు. మృతుల్లో తమిళనాడుకు చెందిన ఏడుగురు, ఏపీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల వారు ముగ్గురు చొప్పున, ఒడిశాకు చెందిన ఇద్దరు, బిహార్, పంజాబ్, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్, హరియాణలకు చెందిన వారు ఒక్కొక్కరున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందినవారి మృతదేహాలను కొచ్చి నుంచే తరలిస్తామని.. మిగతావారి మృతదేహాలను ఢిల్లీకి పంపి అక్కడి నుంచి ఆయా రాష్ట్రాలకు చేరవేస్తామని అధికారులు వెల్లడించారు. ఇక అగ్నిప్రమాదంలో గాయపడిన మరో భారతీయుడు చికిత్స పొందుతూ చనిపోయాడు. దీంతో దేశానికి చెందిన మృతుల సంఖ్య 46కి చేరింది. మృతుడిది యూపీ అని సమాచారం.

తమిళిసైతో అన్నామలై భేటీ



చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు బీజేపీలో వర్గపోరు చల్లబడినట్లే కనిపిస్తోంది. ఇటీవల తనపై తీవ్ర విమర్శలు గుప్పించిన మాజీ గవర్నర్, బీజేపీ తమిళనాడు రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌తో అధ్యక్షుడు అన్నామలై తాజాగా భేటీ అయ్యారు. శుక్రవారం ఉదయం చెన్నైలోని సాలిగ్రామంలోని తమిళిసై నివాసానికి వెళ్లిన అన్నామలై.. ఆమెతో గంటపాటు సమావేశమయ్యారు. అనంతరం అన్నామలై తన 'ఎక్స్' పేజీలో ఓ సందేశం వెలువరించారు. 'అక్క తమిళిసైతో భేటీ కావటం నాకెంతో సంతోషంగా ఉంది' అన్నారు. రాష్ట్రంలో ఖచ్చితంగా కమలం వికసిస్తుందన్నారు. దీనికోసం ఆమె రాజకీయ అనుభవాలు, సలహాలు స్ఫూర్తిని ఇస్తాయని పేర్కొన్నారు. కాగా అంతకు ముందు గురువారం రాత్రి తమిళిసై తన ఎక్స్ పేజీలో అమరావతిలో అమిత్‌షాతో తాను జరిపిన సంభాషణపై వివరణ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి అమిత్‌షా తనతో చర్చించారని పేర్కొన్నారు. అంతేకాకుండా నియోజకవర్గాలవారీగా పార్టీని అభివృద్ధిపరిచే విషయంపై దృష్టిసారించాలంటూ ఆయన సలహా ఇచ్చారని, ఆ సలహాలు తనకు ఎంతో ఉద్వేగాన్ని కలిగించాయని వ్యాఖ్యానించారు. తమిళిసై-అన్నామలై ఇలా స్పందించడంతో ఇప్పటికి వీరి మధ్య వివాదం సమసినట్లేనని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

ఇంతకీ అసలేం జరిగింది?

లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ తమిళనాడు శాఖలో చిచ్చు రేగింది. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన బీజేపీ ప్రస్తుత అధ్యక్షుడు అన్నామలై, మాజీ అధ్యక్షులు తమిళిసై, పొన్ రాధాకృష్ణన్, ఎల్.మురుగన్ తదితరులంతా ఓటమి చెందిన విషయం తెలిసిందే. దక్షిణచెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో పరాజయం పొందిన తమిళిసై.. అన్నామలైపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వ్యూహరచన సరిగ్గా లేదని, అన్నాడీఎంకేతో పొత్తు వుంటే తమ పార్టీ విజయం సాధించేదన్నారు. అనేకమంది క్రిమినల్స్‌ని అన్నామలై పార్టీలో చేర్చుకున్నారని, తాను అధ్యక్షురాలిగా ఉంటే వారిని దరిచేరనిచ్చేదాన్ని కాదంటూ వ్యాఖ్యానించారు. వీటన్నింటి నేపథ్యంలోనే అమిత్‌షా తమిళిసైని గత బుధవారం సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవ వేదికపై హెచ్చరించారు. కాగా, ఢిల్లీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఇద్దరు నేతల భేటీ జరిగినట్లు బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

అహంకారం వల్లే బీజేపీకి 240 సీట్లు

- ఆరెస్సెస్ సిద్ధాంతకర్త ఇంద్రేశ్‌కుమార్

జైపూర్, జూన్ 14: లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఆరెస్సెస్ సిద్ధాంతకర్త ఇంద్రేశ్‌కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శ్రీరాముడిని పూజించి క్రమంగా అహంకారం పెంపొందించుకున్న పార్టీ ఎన్నికల్లో 240 సీట్లకే పరిమితమైందని, కానీ అతి పెద్ద పార్టీగా నిలిచిందని అన్నారు. అలాగే, శ్రీరాముడిని విశ్వసించని వారు 234 స్థానాల వద్దే ఆగిపోయారని పేర్కొన్నారు. జైపూర్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ బీజేపీ, ఇండియా కూటమిని ఉద్దేశిస్తూ ఇంద్రేశ్‌కుమార్ పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేశారు. రాముడిని పూజిస్తున్నప్పటికీ అహంకారం పెంచుకున్న వారి ఓట్లను, అధికారాన్ని దేవుడు అడ్డుకున్నాడని ఇంద్రేశ్‌కుమార్ అన్నారు. ఈ నేపథ్యంలో యూపీ సీఎం యోగి ఆరెస్సెస్ చీఫ్‌తో శనివారం భేటీ కానున్నారనే వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

బీజేపీతో విభేదాల్లేవ్: ఆరెస్సెస్ వర్గాలు

న్యూఢిల్లీ, జూన్ 14: ఆరెస్సెస్, బీజేపీ మధ్య ఎలాంటి విభేదాలు లేవని సంఘ్ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఆరెస్సెస్ చీఫ్ భాగవత్ ఇటీవల బీజేపీపై విమర్శలు చేసిన నేపథ్యంలో ఈ స్పష్టతనిచ్చాయి. "2014, 2019 ఎన్నికల అనంతరం ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన ప్రసంగాలకూ తాజా ప్రసంగానికి పెద్దగా తేడా ఏమీ లేదు. కానీ, కొందరు ఆయన మాటలను వక్రీకరించి, గందరగోళం సృష్టిస్తున్నారు. 'అహంకారం' అన్న వ్యాఖ్యలు ప్రధాని మోదీ లేదా ఏ బీజేపీ నేతనూ ఉద్దేశించి చేసినవి కాదు" అని తెలిపాయి. ఆరెస్సెస్ ఏటా బీజేపీ సహా అనుబంధ సంస్థల ప్రతినిధులతో నిర్వహించే సమన్వయ భేటీని ఆగస్టు 31 నుంచి కేరళలోని పాలక్కడ్‌లో నిర్వహించనున్నట్లు, దీనికి బీజేపీ అధ్యక్షుడు కూడా రానున్నట్లు సంఘ్ వర్గాలు తెలిపాయి



ఎమ్మెల్యే ఎదుట తొడగొట్టి సంతోషం వ్యక్తం చేస్తున్న చంద్రమ్మ

తొడగొట్టి చెబుతున్నా..!

- చంద్రబాబు రూ.4వేల పింఛన్ ఇస్తున్నాడు!
- అనంత ఎమ్మెల్యే ఎదుట ఓ వృద్ధురాలి ఆనందం

అనంతపురం అర్బన్, జూన్ 14: 'నా పెద్ద కొడుకు చంద్రబాబు రూ.4 వేలు పింఛన్ ఇస్తున్నాడు.. ఇక మాకు ఇంకేం కావాలి' అంటూ.. అనంతపురంలో ఓ వృద్ధురాలు తొడగొడుతూ అమితానందం వ్యక్తంచేశారు. నగరంలోని పాతూరులోని అన్న క్యాంటీన్ పరిశీలనకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ శుక్రవారం వెళ్లారు. అక్కడికి నీరుగంటి వీధికి చెందిన వృద్ధురాలు చంద్రమ్మ వచ్చారు. ఆమెతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 'ఏం అవ్వా.. ఇప్పుడు అంతా బాగుందా.. అన్న క్యాంటీన్‌ను కూడా మళ్లీ ఓపెన్ చేస్తున్నా'మని చెప్పారు. 'మంచిది నాయనా.. నాతో పాటు అందరికీ అన్నం దొరుకుతుంద'ని చంద్రమ్మ బదులిచ్చారు. పింఛన్ వస్తోందా అని అడగ్గా.. రూ.3వేలు ఇస్తున్నారని చెప్పింది. ఇప్పుడు ఎంత వస్తుందో తెలుసా? అని అడగ్గా.. 'నా పెద్ద కొడుకు చంద్రబాబు రూ.4 వేలు ఇస్తున్నాడ'ని చెబుతూ ఆనందంతో తొడకొట్టడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు స్వీటు తినిపించారు.

ఉత్తర కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ నుంచి మధ్య బంగాళాఖాతం మీదుగా పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. దీనికితోడు ఒడిశా పరిసరాల్లో వడగాడ్పుల ప్రభావం కొనసాగింది. ఇంకా ఉత్తర కోస్తాలో ఎండ తీవ్రత, ఉక్కపోత పెరిగాయి. వీటన్నింటి ప్రభావంతో వాతావరణ అనిశ్చితి నెలకొని ఉత్తరకోస్తాలో అనేకచోట్ల శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. అక్కడక్కడా భారీవర్షం కురిసింది. రాజాంలో 77, సంతకవిటిలో 62, నర్సీపట్నంలో 61, కోటవురట్లలో 55 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోస్తా, రాయలసీమల్లో కూడా పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని, రెండు రోజుల్లో మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఆరుగురిని బలిగొన్న 'ఓవర్‌టేక్'!

కృష్ణా జిల్లా కృత్తివెన్నులో ఘోర ప్రమాదం



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనాలు

- ట్రాక్టర్‌ను ఢీకొని ఆగిన మినీవ్యాన్
- అదే సమయంలో మినీవ్యాన్‌ను ఢీకొన్న కంటైనర్
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- మృతులు, క్షతగాత్రులు కోనసీమ, కాకినాడ జిల్లా కూలీలు
- మృతుల కుటుంబాలకు రూ.ఐదేసి లక్షల చొప్పున

ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన మంత్రి కొల్లు



కనకరాజు, రేవు భూషణం



లోవరాజు, నాగరాజు



వరప్రసాద్

మచిలీపట్నం/కృత్తివెన్ను, జూన్ 14: కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద జాతీయ రహదారి-216పై శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మినీ వ్యాన్‌ను కంటైనర్ లారీ ఢీకొట్టడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఐదుగురు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. వీరిలో ఒకరు ప్రాణాపాయస్థితిలో ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా తాళ్లరేవు ప్రాంతం నుంచి డ్రైవర్‌తో సహా పది మంది కూలీలు బంటుమిల్లి మండలం తుమ్మిడిలో చేపల ప్యాకింగ్ పట్టుబడి చేసేందుకు మినీవ్యాన్‌లో శుక్రవారం రాత్రి 1.30 గంటలకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం ఉదయం 4-5 గంటల మధ్య శీతనపల్లి వద్ద ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయింది. ఆ ప్రయత్నంలో ట్రాక్టర్ వెనుక వైపు ఢీకొట్టి.. అదే వేగంతో ముందుకెళ్లి రోడ్డు మధ్యలో ఆగిపోయింది. సరిగ్గా ఆ సమయంలో ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ.. రెప్పపాటులో మినీవ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. లారీ, వ్యాన్ ముందుభాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో కోనసీమ జిల్లా ఉప్పలగుంట గ్రామానికి చెందిన పెదసింగు కనకరాజు (34), కాట్రేనికోన మండలం గద్దనపల్లికి చెందిన చింత లోవరాజు (32), మాగాపు నాగరాజు(26), కరప మండలానికి చెందిన వ్యాన్ డ్రైవర్ గాంధీ ధర్మవరప్రసాద్ (27), తమిళనాడు వేల్పూరుకు చెందిన లారీ డ్రైవర్ అయ్యప్పన్ జయరామన్(42) అక్కడికక్కడే మృతి చెందారు. ఉప్పలగుంట గ్రామానికి చెందిన రేవు భూషణం (26)ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. ప్రమాదంలో కాకినాడ సమీప గొర్రిపూడికి చెందిన మేడిశెట్టి మహేష్‌కుమార్, గద్దనపల్లికి చెందిన చింతా దుర్గప్రసాద్, ఉప్పలగుంటకు చెందిన రేవు జ్ఞానేశ్వరరావు, ఎస్.యానాంకు చెందిన మల్లాడి శ్రీకాంత్, సంగాని నాగేంద్రబాబు గాయాలపాలై మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో నాగేంద్రబాబు పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను మంత్రి కొల్లు రవీంద్ర, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించారు.



కోవూరు సమీపంలో కంటైనర్‌ను ఢీకొని నుజ్జునుజ్జయిన మినీ లారీ

నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో రక్తమోడిన రహదారులు

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

సంగం, కోవూరు, చిత్తూరు రూరల్, జూన్ 14: నెల్లూరు, చిత్తూరుజిల్లాల్లో శుక్రవారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మొత్తం ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన జయమంగళం నాగరాజు నెల్లూరు జిల్లా సంగం మండలం శంకరవీరరాఘవపురంలో చేపల చెరువులను లీజుకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కైకలూరుకు వెళ్లి గర్భిణి అయిన తన కుమార్తె అనసూయను, మరో కుమార్తె ప్రశాంతి, మనుమరాలిని వెంటబెట్టుకుని శంకరవీరరాఘవపురం బయలుదేరారు. అర్ధరాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో నెల్లూరులో రైలు దిగి బస్సులు లేకపోవడంతో సంగం వైపు వచ్చే పేపర్ వ్యాన్‌లో ఎక్కారు. బుచ్చిరెడ్డిపాళెం దాటిన తరువాత వేగంగా వస్తూ మార్గమధ్యంలోని దువ్వూరు సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న రెండు గేదెలను ఢీకొని వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాగరాజు (45), డ్రైవర్ శ్రీనివాసులు (40) మృతి చెందాడు. ఓ గేదె కూడా మృతి చెందింది. మిగిలినవారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అలాగే, చెన్నై-కోల్‌కతా హైవేపై శుక్రవారం తెల్లవారుజామున ఆగిఉన్న కంటైనర్ లారీని ఓ లారీ ఢీకొనడంతో కావూరు గ్రామానికి చెందిన మినీ లారీ డ్రైవర్ మొగిలి సతీష్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, వైద్యసిబ్బంది అతి కష్టం మీద మృతదేహాన్ని వెలికితీశారు. గాయపడిన క్లీనరు అజయ్‌ను ఆసుపత్రికి తరలించారు. అలాగే, చిత్తూరు మండలం చెర్లోపల్లె వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. బంగారుపాళ్యం మండలం మహాసముద్రం గ్రామానికి చెందిన పవన్, మంజు, చరణ్ వారి స్నేహితుడి జన్మదినానికిగాను కాణిపాకం నుంచి బైకులో కేక్ తీసుకొస్తుండగా మినీ లారీ ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు.

ఆరుద్రకు సీఎం అభయం

- చంద్రబాబును కలిసిన కాకినాడకు చెందిన మహిళ
- ఆరుద్ర కుమార్తె ఆరోగ్య ఖర్చులకు 5 లక్షలు సాయం ప్రకటించిన సీఎం
- రూ.10 వేల పింఛనుపైనా హామీ
- వైసీపీ హయాంలో తీవ్ర వేధింపులు.. కాశీ వెళ్లిపోయిన కుటుంబం



కుమార్తెతో పాటు సీఎం చంద్రబాబును కలిసిన ఆరుద్ర

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన ఆరుద్ర అనే మహిళ తన కుమార్తెతో సహా సీఎం చంద్రబాబును శుక్రవారం సచివాలయంలో కలిశారు. గత వైసీపీ హయాంలో తాను ఎదుర్కొన్న సమస్యలను, వేధింపులను చంద్రబాబుకు వివరించారు. తన కుమార్తె సాయిలక్ష్మీచంద్రకు వెన్నులో కణితి ఏర్పడడంతో తీవ్ర అనారోగ్యం పాలయిందన్నారు. గతంలో బిడ్డ వైద్య ఖర్చుల కోసం తన ఆస్తులు అమ్ముకునే ప్రయత్నంలో తనకు ఎదురైన కష్టాలను ఆమె వివరించారు. అమలాపురంలో తన స్థలం విక్రయంలో ఇబ్బందులకు గురిచేసి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని సీఎం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుద్ర సమస్యలపై స్పందించిన సీఎం చంద్రబాబు.. ఆమె కుమార్తె సాయిలక్ష్మీచంద్రకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ప్రతి నెలా రూ.10 వేలు పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చారు. కోర్టులో ఉన్న స్థల వివాదంపై ప్రభుత్వ పరంగా ఎంత సాయం చేయవచ్చు అనేది కూడా పరిశీలించి అండగా ఉంటామని సీఎం తెలిపారు. ఈ సందర్భంగా ఆరుద్ర మాట్లాడుతూ.. "మీ(చంద్రబాబు) గెలుపుతో మా కష్టాలు తీరిపోయినట్లు అనిపించింది. ఇప్పుడు ఎంతో ధైర్యంగా ఉంది. గతంలో మా సమస్యను అప్పటి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లేందుకు తాడేపల్లి క్యాంపు కార్యాలయం వద్ద ప్రయత్నించగా స్పందించలేదు. పైగా ఎదురు కేసులు పెట్టి, వివాదాలు సృష్టించి మానసిక హింసకు గురి చేశారు. పిచ్చిదాన్ని అనే ముద్ర వేశారు" అని ఆరుద్ర కన్నీటి పర్యంతమయ్యారు. ఆమె కష్టాలు విన్న చంద్రబాబు ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

వైసీపీకి భయపడి కాశీకి వెళ్లిపోయాం: ఆరుద్ర

సీఎంను కలిసి వచ్చిన అనంతరం ఆరుద్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. తమ పాపకు చిన్న ఉద్యోగం ఇప్పించమని కోరినట్టు తెలిపారు. "మా పాపకు ఆపరేషన్ చేయించుకోవడానికి మా ఇల్లు అమ్ముకోవాలని చూస్తే గత ప్రభుత్వంలో మంత్రి దాడిశెట్టి రాజా, ఆయన గన్‌మెన్ ఇల్లు అమ్ముకోనీయకుండా చాలా ఇబ్బంది పెట్టారు. ఈడ్చి ఈడ్చి కొట్టారు. మా ఆస్తిని నా బిడ్డకు రాకుండా చేశారు. నన్ను, నా భర్తను, నా బిడ్డను మెంటల్ ఆసుపత్రిలో చేర్పించారు. చంద్రబాబు ఆదేశాలతో మమ్మల్ని మెంటల్ ఆసుపత్రి నుంచి గండి బాబ్జీ, శ్రీభరత్ బయటకు తెచ్చారు. మేం లోకేశ్, శ్రీభరత్‌కు రుణపడి ఉన్నాం. వైసీపీ వాళ్లకు భయపడి కాశీకి వెళ్లిపోయాం. మళ్లీ జగన్ గెలిస్తే చావే పరిష్కారం అనుకున్నా. చంద్రబాబు, పవన్ కల్యాణ్ గెలవడం.. మా పాప గెలిచినంత ఆనందం కలిగింది" అని ఆరుద్ర అన్నారు.

కంట్లోకి దూసుకెళ్లిన కర్ర ముక్క

- శస్త్రచికిత్స చేసి తొలగించిన కేజీహెచ్ వైద్యులు
- కంటిచూపు తిరిగి రావడంతో ఆనందం



నాగేశ్వరరావు కంట్లో గుచ్చుకున్న కర్ర ముక్క

మహారాణిపేట (విశాఖపట్నం), జూన్ 14: ఇంటి మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ కింద పడిన వ్యక్తి కంట్లోకి కర్రముక్క దూసుకుపోయింది. అది మెదడు నరాల వరకు చొచ్చుకుపోవడంతో కంటి చూపు పోయింది. బాధితుడిని విశాఖ కేజీహెచ్‌లో చేర్పించగా.. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి కంట్లో గుచ్చుకున్న కర్ర ముక్కను బయటకు తీశారు. అంతేకాదు పోయిన కంటిచూపును తిరిగి రప్పించారు. ఆ వివరాలను కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ శుక్రవారం వెల్లడించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలోని గవరపాలేనికి చెందిన మీసాల నాగేశ్వరరావు (39) ఈ నెల నాలుగో తేదీ రాత్రి తన ఇంటి మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ జారి కింద పడిపోయాడు. ఆ సమయంలో 12 అంగుళాల సరుగుడు కొమ్మ (కర్ర ముక్క) కుడి కంటి నుంచి మెదడు భాగం వరకు చొచ్చుకుపోయింది. కుటుంబ సభ్యులు నర్సీపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఈ నెల 5న విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ అతనికి పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, అనస్థీషియా నిపుణులతో కూడిన వైద్య బృందం.. మరుసటిరోజు విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించింది. కంట్లోని నరాలు, మెదడు దగ్గర ఉన్న రక్తనాళాలను జాగ్రత్తగా వేరుచేసి కర్రముక్కను తొలగించారు సర్జరీ అనంతరం నాగేశ్వరరావు పూర్తిగా కోలుకున్నాడు. అలాగే కంటి చూపు కూడా తిరిగొచ్చింది. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్య బృందాన్ని, నర్సింగ్ సిబ్బందిని సూపరింటెండెంట్ అభినందించారు.

సీనియర్‌గా అర్థం చేసుకున్నా: ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తానూ మంత్రి పదవిని ఆశించానని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన స్వగృహంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఏడో సారి ఎమ్మెల్యేగా నెగ్గాను. స్థానికంగా, రాష్ట్రంలో, దేశ విదేశాల్లో నన్ను అభిమానించే లక్షలాది మంది నాకు మంత్రి పదవి వస్తుందని ఆశించారు. కానీ పరిస్థితిని ఓ సీనియర్‌గా అర్థం చేసుకున్నా. పదవి రాలేదని బాధలేదు. సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీ నాయకత్వంలో మంచి మెజార్టీతో గెలిచాం. ప్రజలకు సేవ చేసి రుణం తీర్చుకుంటాం.' అని స్పష్టం చేశారు.

కేబినెట్ కూర్పు అద్భుతంగా ఉంది: యనమల

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కేబినెట్ కూర్పు అద్భుతంగా ఉందని టీడీపీ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు అన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రజలు ఒక మార్పు కోసం తీర్పు ఇచ్చారు. ప్రజల తీర్పునకు అనుగుణంగానే మంత్రి వర్గం ఉండాల్సిన అవసరం ఉంది. యువతకు ప్రాధాన్యం ఉండాలి. కేబినెట్‌లో అవకాశం వచ్చిన యువతరం చిత్తశుద్ధితో పని చేయాల్సిన బాధ్యత ఉంది. జగన్ గత ఐదేళ్లలో రాష్ట్రంలో సంక్షోభం సృష్టించారు. కొంత సమయం పట్టినా చంద్రబాబు సమర్థుడు కాబట్టి ఈ సంక్షోభం నుంచి బయటకు రావడం పెద్ద విషయం కాదు. సంక్షేమంతో పాటు అభివృద్ధి జరగాలి' అని యనమల అన్నారు.

చంద్రబాబు చేతుల్లో రాష్ట్రం సురక్షితం: దువ్వారపు

'విజన్ ఉన్న చంద్రబాబు అధికారంలోకి రావడం వల్ల రాష్ట్రం అన్ని విధాలా సురక్షితంగా ఉంటుంది. అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టగల సమర్థుడు చంద్రబాబు' అని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

ఉద్యోగులు కోరుకున్న ప్రభుత్వమిది: శివారెడ్డి

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లు తీరుస్తుందన్న ఆశాభావాన్ని ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు కే శివారెడ్డి వ్యక్తం చేశారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును ఎన్జీవో నేతలు కలిసిన తర్వాత శివారెడ్డి మీడియాతో మాట్లాడారు. ' ఈ నెల చివరిలోగా అన్ని ఉద్యోగ సంఘాలను పిలిచి, సమస్యలపై చర్చించి, న్యాయం చేస్తానని సీఎం తెలిపారు. కూటమి మేనిఫెస్టోలో ఐఆర్ ఇస్తామని ప్రకటించిన విషయాన్ని కూడా చంద్రబాబు గుర్తు చేశారు. ఉద్యోగులందరూ ఈ ప్రభుత్వం రావాలని కోరుకున్నారు' అని శివారెడ్డి అన్నారు.

రామరాజ్యం వచ్చింది: ఎంపీ రమేశ్

తిరుమల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఐదేళ్ల రాక్షసపాలన పోయి రామరాజ్యం వచ్చిందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ సంతోషం వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'స్వామి ఆశీస్సులు నిత్యం ఏపీ ప్రభుత్వంపై, ప్రజలపై ఉండాలని కోరుకున్నా' అని రమేశ్ తెలిపారు.

5 కోట్ల మందిలో ఆనందం: రఘురామరాజు



తిరుపతి అర్బన్, జూన్ 14: సీఎం చంద్రబాబు గురువారం చేసిన ఐదు సంతకాలతో ఐదు కోట్ల మంది ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోందని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు (ఆర్ఆర్ఆర్) అన్నారు. శుక్రవారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. 'ఐదేళ్లు కాదు కదా 50 ఏళ్లయినా జగన్ ఇక సీఎం కాలేరు. నాకు ఏ పదవి అప్పగించినా స్వీకరిస్తా. ఇవ్వకపోయినా ఎమ్మెల్యే బాధ్యతలను ఆనందంగా నిర్వర్తిస్తా. నాపై దాడి కేసులో పోలీసులు బిజీగా ఉన్నారు. రెండ్రోజుల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. లేకుంటే తదుపరి చర్యలపై దృష్టి సారిస్తా' అని రఘురామరాజు తెలిపారు. తిరుమలేశుని దర్శించుకున్న అనంతరం తిరుమలలో మాట్లాడుతూ, 'ఏపీ ప్రజలు ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా ఇక్కడే సుఖసంతోషాలతో ఉండాలని శ్రీవారిని కోరుకున్నా.' అని తెలిపారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి: ఏపీ పరిరక్షణ సమితి

న్యూఢిల్లీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): విభజన హామీ చట్టం ప్రకారం ఏపీకి ప్రత్యేక హోదాను కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. వెనుకబాటుకు గురైన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ అందించాలని డిమాండ్ చేసింది. శుక్రవారం, ఇక్కడ ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పరిరక్షణ సమితి అధ్యక్షుడు గోవిందరావు మాట్లాడారు. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ నిర్మాణం చేపట్టాలని, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీలో అన్న క్యాంటీన్: అప్పలనాయుడు



అన్నవరం, జూన్ 14: తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్‌ను దేశరాజధాని ఢిల్లీలోనూ ఏర్పాటు చేయాలని టీడీపీ ఎంపీలంతా ఆలోచన చేస్తున్నామని విజయనగరం ఎంపీ అప్పలనాయుడు తెలిపారు. అన్నవరంలో శుక్రవారం సత్యదేవుడిని దర్శించుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మా పార్టీ అధినేత చంద్రబాబుతో ఈ విషయమై చర్చిస్తాం. అన్న క్యాంటీన్లకు అయ్యే ఖర్చు ను టీడీపీ ఎంపీలందరూ విరాళంగా అందజేయాలని అనుకుంటున్నాం.' అన్నారు.

టైట్లింగ్ యాక్టు మంచిదే!

- రాజ్యసభలో బలముంది అక్కడ చూసుకుందాం!
- తగ్గింది 10 శాతం ఓట్లే!
- అంశాలవారీగా కేంద్రానికి మద్దతు.. వైసీపీ ఎంపీలతో జగన్

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై ప్రజలు గగ్గోలు పెట్టిన విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో ఈ యాక్టుపై ఆందోళన కూడా వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టాన్ని తాము అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని టీడీపీ అధినేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు అప్పట్లో ప్రకటించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన వెంటనే ఈ చట్టాన్ని రద్దుచేస్తూ సంతకం కూడా చేశారు. అయితే.. ఇంత జరిగిన తర్వాత కూడా ఈ చట్టం మంచిదేనని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ సమర్థించుకున్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టును వ్యతిరేకించడాన్ని తప్పుబట్టారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన వైసీపీ ఎంపీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ల్యాండ్ టైట్లింగ్ యాక్టును సమర్థించుకున్నారు. సరిగ్గా ఎన్నికలకు ముందు విపక్షాలు ఈ చట్టాన్ని భూతంలా చూపించాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. వాస్తవానికి ఈ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే తీసుకువచ్చిందని, దీనికి అనుగుణంగానే రాష్ట్రంలో చట్టాన్ని తెచ్చామని చెప్పారు. అమెరికా, యూరప్ దేశాల్లో అనుసరిస్తున్న మంచి విధానాలతో దీనిని రూపొందించామని, శాసనసభ సాక్షిగా ఈ చట్టాన్ని ప్రతిపక్షం కూడా ప్రశంసించిందని గుర్తు చేశారు. కానీ, ఎన్నికల సమయంలో మాత్రం ఒక భూతంలా చూపించి టీడీపీ కూటమి పార్టీలు విష ప్రచారం చేశాయని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సుబ్బారెడ్డికి బాధ్యతలు

వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డిని నియమిస్తున్నట్టు జగన్ చెప్పారు. ఈ బాధ్యతలను నిన్న మొన్నటి వరకు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి చూశారు. ఈయనను రాజ్యసభలో పార్లమెంటరీ నేతగా పరిమితం చేశారు. అదేవిధంగా లోక్‌సభలో వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డినే కొనసాగిస్తున్నట్టు జగన్ చెప్పారు. కాగా, తమకు లోక్‌సభలో బలం లేకపోయినా.. రాజ్యసభలో బలముందని.. అక్కడ చూసుకుందామని వ్యాఖ్యానించారు. వైసీపీకి పార్లమెంటులో నలుగురు లోక్‌సభ, 11 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారని, టీడీపీకి 16 మంది లోక్‌సభ సభ్యుల బలం మాత్రమే ఉందని జగన్ అన్నారు. రాష్ట్ర, దేశ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని.. అంశాలవారీగా కేంద్రానికి మద్దతు ఉంటుందని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో గతంలో కంటే పది శాతం ఓట్లు మాత్రమే వైసీపీకి తగ్గాయన్నారు. ఇక నుంచి తాను అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.

వైసీపీ నేతలను నమ్మి మోసపోయాం

- మమ్మల్ని తిరిగి తీసుకోండి...
- రాజీనామా చేసిన వలంటీర్ల విజ్ఞప్తి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ వలంటీర్లు

గూడెంకొత్తవీధి, జూన్ 14: 'అధికారంలోకి వచ్చేది మేమే. మీ ఉద్యోగాలకు ఢోకా లేదు. రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొనండి. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఉద్యోగాల్లో చేరవచ్చు' అని చెప్పిన వైసీపీ నాయకుల మాటలు నమ్మి మోసపోయామని గ్రామ వలంటీర్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల ముందు రాజీనామా చేసిన వలంటీర్లు కొందరు గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధిలో విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ నాయకుల ఒత్తిడి మేరకు చింతపల్లి మండలంలో 335 మంది, గూడెంకొత్తవీధి మండలంలో 92 మంది, కొయ్యూరు మండలంలో 150 మంది గ్రామ వలంటీర్లు ఉద్యోగాలకు రాజీనామా చేశారు. మా ఇళ్లకు వచ్చి రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొనాలని వైసీపీ నాయకులు తీవ్రస్థాయిలో ఒత్తిడి చేయడంతోనే ఉద్యోగాలు వదులుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఉద్యోగాలు లేక ఉపాధి కోల్పోయాం. మమ్మల్ని తిరిగి వలంటీర్లుగా తీసుకోవాలి' అని వారు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.

కొత్త కేసుల్లోనే జగన్ అరెస్టు..!

- సీబీఐ కేసుల్లో ఆ అవకాశం లేదు
- రెండేళ్ల కంటే ఎక్కువ శిక్ష పడితే అనర్హత వేటు తప్పదు
- వైసీపీ పోవాలన్న కసితోనే ఓట్లేసిన జనం
- లిక్కర్ భారమే జగన్ కొంప ముంచింది: ఉండవల్లి

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): 'సీబీఐ దర్యాప్తు చేస్తున్న అక్రమాస్తుల కేసుల్లో జగన్ అరెస్ట్ కాకపోవచ్చు. కూటమి ప్రభుత్వం కొత్త కేసులేమైనా పెడితే అరెస్టు అయ్యే అవకాశం ఉంది. రెండేళ్ల కంటే ఎక్కువ శిక్ష పడితే జగన్‌పై అనర్హత వేటు పడుతుంది' అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలోని కొత్త ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. 'ఈసారి ప్రజలు కేవలం జగన్ పోవాలనే కసితోనే ఓట్లేశారు. మరో ఆలోచన ఏదీ చేయలేదు. అందుకే జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా లభించలేదు. జగన్ చేసినవన్నీ కక్షతోనే చేశాడని మెజార్టీ ప్రజలు నమ్మారు. లిక్కర్ ధరలు పెంచడంతో సామాన్య కుటుంబాల బడ్జెట్ తారుమారైంది. అతని సంక్షేమ పథకాలకంటే లిక్కర్ భారమైంది. అది జగన్ కొంప ముంచిందన్నారు. టీడీపీ బలమైనది. కేడర్ ఉంది. కానీ వైసీపీకి జగన్, వలంటీర్లే. పార్టీ లేదు. వైఖరి మారాలి. ఎందుకు ఓడిపోయామనే దానిపై జగన్ సమీక్ష చేసుకోవాలన్నారు. ఇవాళ మోదీ భవిష్యత్ చంద్రబాబు, నితీశ్‌కుమార్ నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. కేంద్రంలో ఎన్‌డీఏ, ఇండియా కూటమికి కేవలం 2 శాతం ఓట్లు మాత్రమే తేడా? ఈ అవకాశాన్ని చంద్రబాబు ఉపయోగించుకోవాలి. ప్రత్యేక హోదా, పోలవరం, అమరావతి వంటి వాటితో పాటు ఇతర విభజన అంశాలన్నీ సాధించుకునే అవకాశం వచ్చింది' అని ఉండవల్లి అన్నారు.

35,591 పాలిటెక్నిక్ సీట్లు భర్తీ

అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ అడ్మిషన్ల తొలి విడత కౌన్సెలింగ్‌లో 35,591 మందికి సీట్లు కేటాయించినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి ఓ ప్రకటనలో తెలిపారు. 38,348 మంది పాలిసెట్‌లో అర్హత సాధించారని, 36,758 మంది సీట్లకు ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారని వివరించారు. ఈ నెల 19లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. 88 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 17,915 సీట్లు ఉంటే 12,180 భర్తీ అయ్యాయని, 172 ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో 62,313 సీట్లకు 23,411 నిండాయని తెలిపారు. మొత్తంగా 44.36 శాతం సీట్లు భర్తీ అయ్యాయన్నారు.

ఉపాధ్యాయ సంఘాల హర్షం

అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నారా లోకేశ్‌కు మానవ వనరుల అభివృద్ధి శాఖను కేటాయించడం పట్ల ఉపాధ్యాయ, లెక్చరర్ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఆయన వల్ల విద్యాశాఖలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అభిప్రాయపడ్డాయి.

యథావిధిగా సెంట్రల్ జైలు ములాఖత్

రాజమహేంద్రవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా మార్పు చేసిన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైల్ ములాఖత్ సమయాలను మునుపటి మాదిరిగా సవరిస్తూ ప్రధాన కార్యాలయం ఆదేశాలు జారీ చేసిందని సెంట్రల్ జైలు పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ తెలిపారు.

న్యాయవాదులకు వృత్తిపరమైన శిక్షణ అవసరం

- జస్టిస్ దుర్గాప్రసాదరావు
- కెఎల్‌యూలో రాష్ట్రస్థాయి న్యాయవాదుల శిక్షణ తరగతులు ప్రారంభం



జస్టిస్ దుర్గాప్రసాదరావు

తాడేపల్లి, జూన్ 14: రాష్ట్రంలోని న్యాయవాదుల ప్రయోజనాల కోసం వారి వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరచడానికి, చట్టం విషయంలో పరిజ్ఞానం పెంపొందించడానికి న్యాయవాదుల శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు అన్నారు. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో మూడు రోజులపాటు జరిగే రాష్ట్ర స్థాయి న్యాయవాదుల శిక్షణా తరగతులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ.. ఆర్ట్ ఆఫ్ అడ్వకెసి, రోల్ ఆఫ్ బార్ అండ్ బెంచ్ ఆస్తి బదిలీ చట్టం, ఆస్తి హక్కు, నిర్దిష్ట ఉపశమన చట్టం, రిజిస్ట్రేషన్ చట్టం, మేధో సంపత్తి హక్కులు, ఎలక్ట్రానిక్ ఆధారాలు రాజ్యాంగ లక్షణాలను సాధించడంలో న్యాయవాదుల పాత్ర తదితర అంశాల గురించి కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథ్ రెడ్డి, మాజీ ఛైర్మన్ గంటా రామారావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు, కెఎల్‌యూ వీసీ సారథివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, వెంకట్రామ్, రిజిస్ట్రార్ సుబ్బారావు, డాక్టర్ రాజశేఖర్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నీటుకు చేటు

దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయస్థాయి అర్హత పరీక్ష 'నీట్'లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవకతవకలు జరిగాయన్న అనుమానాలను, పేపర్ లీక్ ఆరోపణలనూ నిగ్గుతేల్చడానికి సీబీఐ దర్యాప్తు చేయించాలంటూ ఏడు పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో, కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే), సీబీఐ, బిహార్ ప్రభుత్వం స్పందనలను సుప్రీంకోర్టు శుక్రవారం కోరింది. సీబీఐ దర్యాప్తు విషయంలో సర్వోన్నత న్యాయస్థానం ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది అటుంచితే, అక్రమాలు జరిగాయన్న తమవాదనకు మద్దతుగా పిటిషన్‌దారులు ప్రస్తావించిన ఉదంతాలు చిన్నవేమీ కావు. ఒడిశా, కర్ణాటక, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన పదహారుమంది విద్యార్థులు గుజరాత్‌లోని గోధ్రాలో ఓ పరీక్షాకేంద్రాన్ని ఎంచుకోవడం, మంచి మార్కులకోసం వారు పదిలక్షలు లంచంగా ఇచ్చారన్న ఆరోపణల మేరకు గుజరాత్‌లో ఒక టీచర్‌పై కేసు నమోదుకావడం, బిహార్‌లోని పట్నాలో పేపర్ లీక్‌కు సంబంధించి ఎఫ్ఐఆర్ దాఖలు కావడం వంటివి వారు ఉదహరించారు. యూపీలో నీట్ పేపర్ లీక్ రాకెట్ నడిచిందన్న కథనాలను కూడా వారు ప్రస్తావించినప్పటికీ, కనీసం మూడు రాష్ట్రాల్లో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలో, లోతుగా విచారణ జరగాల్సిన అంశం ఇది.

అవకవతవకలు జరగలేదనీ, విపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని కేంద్ర విద్యామంత్రి గట్టిగానే అంటున్నారు కానీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వేస్తున్న ప్రశ్నలు కూడా కొట్టిపారేయలేనివే. పేపర్‌లీక్ లీక్ కాకపోతే బిహార్‌లో పదమూడుమందిని ఎందుకు అరెస్టు చేశారు, రాకెట్‌లో భాగమైన గ్యాంగులు యాభైలక్షలవరకూ వసూలుచేశారన్న విషయాన్ని అక్కడి ఆర్థిక నేరాల విభాగం బయటపెట్టలేదా, గుజరాత్‌లోనూ ఓ ముగ్గురి మధ్య పన్నెండు కోట్ల రూపాయల లావాదేవీ జరిగిన విషయం బయటకు రాలేదా అంటూ ఆయన చాలా ప్రశ్నలు వేశారు. అసలే పలు అనుమానాలు, ఆందోళనలు చుట్టుముట్టిన తరుణంలో, ఒక జాతీయ స్థాయి పరీక్షనుంచి కాంగ్రెస్ రాజకీయంగా లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించడం సులభమే. కానీ, లక్షసీట్లకోసం పాతికలక్షలమంది విద్యార్థులు రేయింబవళ్ళు శ్రమించి రాసిన ఈ పరీక్ష చివరకు అవకతవకలకు గురై, అందరి నమ్మకాన్ని వమ్ముచేయడం సరికాదు.

ఎన్నడూ లేనిది, ఆరవైయేడు మంది విద్యార్థులు పూర్తిమార్కులతో టాపర్లుగా నిలవడం, హర్యానాలోని ఒక పరీక్షాకేంద్రంలో పక్కపక్కనే కూచున్న ఆరుగురు విద్యార్థులు వీరిలో ఉండటం, కొంతమందికి 718, 719లాంటి అసంభవమైన మార్కులు రావడం వంటివి అనుమానాలకు కారణం. ఇక, అత్యున్నత ప్రతిభావంతులను గుర్తించేందుకు ఉద్దేశించిన ఓ కఠినాతి కఠినమైన పరీక్షలో గ్రేస్ మార్కులు ఇవ్వడమనేదే తప్పు. ఒక్క గ్రేస్ మార్కుతో వేలాది ర్యాంకులు మారిపోయి, విద్యార్థుల భవిష్యత్తు తారుమారవుతుంది. ఏ కారణాన, ఏ ప్రాతిపదికన ఆ మార్కులు ఇచ్చారన్నది అటుంచితే, వివాదం రేగిన తరువాత వాటిని రద్దుచేసి, ఇప్పుడు ఆ పదిహేనువందల పైచిలుకు విద్యార్థులకు తిరిగి పరీక్షరాసుకొనే అవకాశం ప్రభుత్వం కల్పిస్తున్నది. నచ్చినవారు రాయవచ్చు, వద్దనుకున్నవారు తమ అసలు స్కోరుతో కౌన్సెలింగ్ ఎదుర్కోవచ్చు అని కేంద్రప్రభుత్వం అంటోంది. వినడానికి బాగున్నది కానీ, ఈ రీ టెస్ట్ తరువాత వివాదం మరిన్ని మలుపులు తిరగవచ్చు, అనుమానాలు పెంచవచ్చు.

నీట్‌లో అక్రమాలు జరుగుతున్నాయని తాము ఎప్పటినుంచో అంటున్నామని స్టాలిన్ గుర్తుచేస్తున్నారు. వ్యాపం 2.0 అంటూ దశాబ్దం క్రితం మధ్యప్రదేశ్‌ను కుదిపేసిన కుంభకోణంతో కాంగ్రెస్ నాయకులు దీనిని పోల్చుతున్నారు. నీట్–చీట్ వంటి నినాదాలు, కొత్త నిర్వచనాలు జోరందుకుంటున్నాయి. నీట్ పరీక్షావిధానంమీద చాలా విమర్శలు, అనుమానాలు ఉన్నప్పటికీ, ఇప్పుడు కొన్ని ఆధారాలు కూడా తోడైనందున లోతైన శస్త్రచికిత్స వెంటనే జరగడం అవసరం. పాతికలక్షలమంది విద్యార్థుల ఆశయం, భవితవ్యం, కుటుంబీకుల కష్టనష్టాలతో ముడిపడిన అంశమిది. ఇంతటి అస్తవ్యస్థమైన, అనుచిత నిర్ణయాలు, చర్యలు ఎన్టీయే ఎన్నడూ తీసుకోలేదు. తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి అది చేస్తున్న ప్రయత్నాలు వికటిస్తున్నాయి. పరీక్షను పూర్తిగా రద్దుచేయకుండా ఆగినప్పటికీ, సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు, చేసిన నిర్ణయాలు ఈ వ్యవహారంలో లోతైన దర్యాప్తు జరగడం, విశ్వాసాన్ని పెంపొందించడం అవసరమని రుజువుచేస్తున్నాయి.

ప్రజా తీర్పుపై క్రూర పరిహాసం

జూన్ 9న పదవీ ప్రమాణస్వీకారం చేసిన కొత్త ప్రభుత్వం కథను సంగ్రహంగా ఇలా చెప్పవచ్చు: ప్రజలు మార్పు కోసం ఓటు వేశారు, నరేంద్ర మోదీ అవిచ్ఛిన్నతను ఎంచుకున్నారు.

ఓటర్లకు ఇంగిత జ్ఞానం సమృద్ధిగా ఉన్నది. కనుకనే మార్పు కోసం ఓటు వేశారు సరైన తీర్పునిచ్చారు. గత పది సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం అనుసరించిన పాలనా నమూనాను వారు తిరస్కరించారు. అయితే నరేంద్ర మోదీకి మరో అవకాశాన్ని ఇచ్చారు. ఆయన తన ప్రభుత్వ విధానాలలో మౌలిక మార్పులు తీసుకురావాలని, తీసుకురాగలరని వారు భావిస్తున్నారు. బీజేపీ 303 సీట్లతో ఈ సార్వత్రక ఎన్నికల గోదాలోకి దిగింది. తను సొంతంగా 370 సీట్లను గెలుచుకోవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. తన నేతృత్వంలోని ఎన్డీఏకు 400కు పైగా సీట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ రెండు లక్ష్యాలు నెరవేరగలవని ప్రధాని మోదీతో సహా బీజేపీ శ్రేణులు నిండుగా విశ్వసించాయి. అయితే వారి ఆశలు ఘోరంగా వమ్మయ్యాయి. బీజేపీ అంతిమంగా 240 సీట్లను మాత్రమే గెలుచుకోగలిగింది. కనీస మెజారిటీ కూడా దక్కలేదు. ఇక ఎన్డీఏ 292 సీట్లతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. ఈ తీర్పుతో బీజేపీకి ప్రజలు పంపించిన సందేశమేమిటో స్పష్టమే : సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయండి. భాగస్వామ్య పక్షాలకు కీలక బాధ్యతలు అప్పగించండి. ప్రజల్లో విభేదాలు, విభజనలను సృష్టిస్తున్న విధానాలను విడనాడండి. ఆర్థిక రంగ వాస్తవ పరిస్థితులను అంగీకరించండి. సామాజిక వైమనస్యతలను రూపుమాపండి. పాలన గురించి డాబుసరి మాటలను కట్టిపెట్టండి. ఆచరణాత్మకం కాని హామీలు ఇవ్వొద్దు. సమస్త భారతీయులనూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లండి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్, కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకోవడానికి దృఢ సంకల్పంతో పోరాడిందనే అభిప్రాయానికి ఓటర్లు వచ్చారు. అయితే ఆ పార్టీ బహుశా బృహత్తర పాలనా బాధ్యతలకు సన్నద్ధం కాలేదని కూడా ఓటర్లు భావించినట్టున్నారు. 170 లోక్‌సభా నియోజకవర్గాలు ఉన్న 9 రాష్ట్రాలలో కాంగ్రెస్ తన పునాదులను తిరిగి పటిష్ఠం చేసుకోవలసి ఉన్నది. ఆ రాష్ట్రాలలో పార్టీ పెరుగుదలకు గల అనుకూలతలను కంగ్రెస్ సద్వినియోగపరచుకోవలసి ఉన్నది.

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు షరతులతో కూడిన ప్రజామోదాన్ని నరేంద్ర మోదీ పొందారు. అయితే ప్రజా తీర్పుపై వ్యక్తమైన ప్రజల అభీష్టాన్ని ఆయన గుర్తించలేదు. ఈ దురహంకారం మోదీకి స్వాభావికమైనదని మరి చెప్పనవసరం లేదు. ఎన్నికల ఫలితాలపై తొలి దిగ్భ్రాంతి నుంచి తేరుకున్న వెంటనే తనను సవాల్ చేయగల నేతలు బీజేపీలో లేరన్న వాస్తవాన్ని గుర్తించారు. మరి ఏ ఇతర పార్టీకీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సంఖ్యా బలం లేదన్న యథార్థాన్నీ అర్థం చేసుకున్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన కొత్త ప్రస్థానం మొదటి అడుగు– ప్రభుత్వం ఏర్పాటు– లోనే తడబడ్డారు. దేశ ప్రజలకు భరోసా కల్పించడంలో విఫలమయ్యారు. ప్రజలు ఆశాజీవులు. మరి కేంద్రంలో కొలువుదీరిన కొత్త సర్కార్ తన రెండవ, మూడవ అడుగులు– పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ సమర్పణ– ఎలా ఉండనున్నాయోనని ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

సార్వత్రక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మొత్తం 99 సీట్లను కైవసం చేసుకున్నది. వీటిలో 79 కేవలం తొమ్మిది రాష్ట్రాలలో మాత్రమే ఉన్నాయి. 170 నియోజకవర్గాలు ఉన్న మరో తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెస్ కేవలం నాలుగు సీట్లను మాత్రమే గెలుచుకున్నది (ఐదు రాష్ట్రాలలో ఒక్క సీటు కూడా రాకపోగా మిగతా నాలుగు రాష్ట్రాల నుంచి ఒక్కొక్క సీటును సాధించుకున్నది) 79 సీట్లను ఇచ్చిన తొలి తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెస్ చేసిన మంచి ఏమిటి? కేవలం ఐదు స్థానాలను మాత్రమే ఇచ్చిన మరో 9 రాష్ట్రాలలో కాంగ్రెస్ చేసిన చెడు ఏమిటి? ఉదయ్‌పూర్, రాయపూర్‌లలో జరిగిన పార్టీ జాతీయ సదస్సులలో సార్వత్రక ఎన్నికలలో విజయ సాధనకు సన్నాహక కృషి జరిగింది. అయితే ఆ కృషిని తార్కిక అంతానికి తీసుకువెళ్లి, అధికారాన్ని కైవసం చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలమయింది. హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో కాంగ్రెస్ మంచి ఫలితాలను సాధించింది. ఈ మూడు రాష్ట్రాలలో మరి కొద్దినెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో గెలుచుకున్న సీట్ల ప్రాతిపదికన చూస్తే కాంగ్రెస్ తన మిత్రపక్షాలతో పాటు బీజేపీ కంటే ముందంజలో ఉన్నది. ఈ మూడు రాష్ట్రాలలోను అధికారాన్ని కైవసం చేసుకునేందుకు అవకాశాలు సమృద్ధంగా ఉన్నాయి. ఈ మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాలపై ప్రభావాన్ని తప్పక చూపుతాయి కనుక ఆ మూడు రాష్ట్రాలను కోల్పోయేందుకు బీజేపీ ఇష్టపడదు. కనుక రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ప్రత్యర్థి పార్టీలకు తీవ్ర పోటీనిస్తుంది. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ మూడు రాష్ట్రాలలోనూ గెలుపే లక్ష్యంగా ఇండియా కూటమి పోరాడాలి.

మార్పు కంటే ప్రభుత్వ విధానాల కొనసాగింపు క్రమాన్నే ఎంచుకున్నారు తద్వారా ఆయన అనుద్దేశపూర్వకంగా క్లిష్ట పరిస్థితులను సృష్టించుకున్నారని చెప్పవచ్చు. మోదీ మూడో ప్రభుత్వ మంత్రిమండలి కూర్పు మంత్రిత్వ శాఖల కేటాయింపు నుంచి అనేక నిర్ధారణలకు రావచ్చు.

అవేమిటో చూద్దాం. 1) ప్రభుత్వ విధానాలలోను, తన పాలనా శైలిలోను మౌలిక మార్పులు రావాలన్న ఓటర్ల హెచ్చరికను మనసున పెట్టుకునేందుకు మోదీ నిరాకరించారు. 2) తన ప్రభుత్వ మౌలిక విధానాలలో అపసవ్యతలు లేవన్న వైఖరిని మోదీ దృఢంగా వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికాభివృద్ధి, అంతర్గత భద్రత, విదేశాంగ వ్యవహారాలకు సంబంధించిన విధానాలు దేశ ప్రయోజనాలను సంపూర్ణంగా కాపాడుతున్నాయని ఆయన గట్టిగా అభిప్రాయపడుతున్నారు. 3) తన మూడో ప్రభుత్వం ప్రధానమంత్రి కార్యాలయం పర్యవేక్షణలో నడుస్తుందన్న వాస్తవాన్ని అంగీకరించిన వారికి తన కేబినెట్‌లో స్థానముంటుందని మోదీ స్పష్టం చేశారు. 5) ప్రభుత్వంలో మిత్రపక్షాలకు గౌరవప్రదమైన పాత్ర కల్పించకుండానే వాటిని తమపక్షాన ఉంచుకునేందుకు అవసరమైన సకల వనరులు తనకు, అమిత్ షాకు ఉన్నాయన్న ధీమా మోదీలో బాగా వ్యక్తమవుతోంది.

మంత్రులు ఎవరూ ఇంతవరకు తమ ప్రాథమ్యాలు, విధానాల గురించి మాట్లాడలేదు. పి.కె. మిశ్రాను ప్రిన్సిపల్ సెక్రటరీగాను, అజిత్ డోవల్‌ను జాతీయ భద్రతా సలహాదారుగాను నియమించారు. ఈ నియామకాలతో మోదీ ప్రభుత్వం మార్పులేకుండా అదే విధంగా కొనసాగుతుందనే విషయం సందిగ్ధతకు తావు లేకుండా ధ్రువీకరణ అయింది. ఈ కొత్త ప్రభుత్వం నిస్సందేహంగా మోదీ 3.0 కాదు, అది మోదీ 2.1 మాత్రమే.

ప్రజలు తమ జీవన స్థితిగతులను మెరుగుపరిచే మార్పును ఆకాంక్షించారు. ఉద్యోగాలు, ధరల స్థిరీకరణ, భద్రత, శాంతి సామరస్యాల కోసం ఓటు వేశారు. మరి పాత ప్రభుత్వంలో ఉన్న మంత్రులే ఈ కొత్త సర్కార్‌లోనూ కొనసాగుతున్నారు. గతంలో వారు ఏ మంత్రిత్వ శాఖలు నిర్వహించారో ఇప్పుడూ అవే శాఖలకు సారథ్యం వహిస్తున్నారు. మరి విధానాలో? అవే. పాతవే. మార్పు లేనివి, మారనివి. ఈ యథాతథ పరిస్థితి ప్రజాతీర్పుపై క్రూర పరిహాసమే అవుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన కొత్త ప్రస్థానం మొదటి అడుగు– ప్రభుత్వం ఏర్పాటు– లోనే తడబడ్డారు. దేశ ప్రజలకు భరోసా కల్పించడంలో విఫలమయ్యారు. ప్రజలు ఆశాజీవులు. మరి కేంద్రంలో కొలువుదీరిన కొత్త సర్కార్ తన రెండవ, మూడవ అడుగులు– పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ సమర్పణ– ఎలా ఉండనున్నాయోనని ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

నరేంద్రుని పాలనా శైలి మారేనా?

సరిగ్గా ఏడాది క్రితం (జూలై 1, 2023) ఇదే కాలమ్‌లో భారత ప్రజాస్వామ్య నవీకరణ గురించి నా భావాలు, ఆలోచనలు, ఆకాంక్షల గురించి తెలియజేస్తూ తదుపరి (2024) సార్వత్రక ఎన్నికల విషయమై ఒక ఆశను వెల్లడించాను. 'ఏ ఒక్క పార్టీ లోక్‌సభలో మెజారిటీ సీట్లు పొందకూడదు. ఏకైక పెద్ద పక్షంగా ఆవిర్భవించిన పార్టీకి సైతం కనీస మెజారిటీ (272) కంటే తక్కువ సీట్లు రావాలి'– నా యీ చిన్న ఆశ గురించి ఒకటి రెండు ఆసక్తికరమైన విషయాలను తెలియజేసేందుకు కుతూహలపడుతున్నాను.

మన ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాభావికంగా నిరంకుశవాది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులకు ఇటువంటి ప్రవృత్తి ఉండడం ఎంతమాత్రం తగదు. సార్వత్రక ఎన్నికలలో వరుసగా రెండుసార్లు గణనీయమైన మెజారిటీతో గెలుపొందడంతో ఆయనలో నియంతృత్వ ధోరణులు మరింతగా పెరిగాయి. 18వ లోక్‌సభలో ఏ పార్టీకి కనీస మెజారిటీ ఉండకూడదన్న ఆశ నెరవేరడమనేది జూలై 2023లోను, ఆ తరువాత అనేక నెలల తరబడి కూడా అసాధ్యంగా కనిపించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 'ఫారిన్ ఎఫైర్స్' అన్న జర్నల్‌లో ప్రధాని మోదీ విధానాలను తీవ్రంగా విమర్శిస్తూ రాసిన ఒక వ్యాసంలో 'మోదీని, ఆయన పార్టీ బీజేపీని అధికారం నుంచి దించివేసేందుకు ఇండియా కూటమి చాలా చాలా కష్టపడవలసి ఉన్నది. మహా అయితే పార్లమెంటులో వారి మెజారిటీని దెబ్బతీయడం మాత్రమే ప్రతిపక్ష కూటమి చేయగలుగుతుంది' అని వ్యాఖ్యానించాను.

అదే నెలలో ఒక మిత్రుడు నాకు రాసిన ఒక లేఖలో 'బీజేపీని ప్రతిపక్షం దెబ్బతీయడమేకాదు, పార్లమెంటులో ఆ పార్టీ మెజారిటీని కూలదోస్తుంది' అని పేర్కొన్నాడు. జర్నలిస్టు అనీల్ మహేశ్వరి ఆ మిత్రుడు. ఉత్తర భారతావని రాజకీయాల గురించి బాగా లోతైన అవగాహన ఉన్న పాత్రికేయుడు. హిందీ రాష్ట్రాలలో దశాబ్దాలుగా పాత్రికేయుడుగా పనిచేసిన అనుభవంతో వర్తమాన భారత చరిత్రపై ఆయన పలు పుస్తకాలు రాశారు. 'ది పవర్ ఆఫ్ ది బ్యాలెట్' అన్న సుప్రసిద్ధ గ్రంథానికి ఆయన సహ రచయిత. 'మీ భయాలు నిరాధారమైనవి. వామపక్షాలు, ఉదారవాదులు సైతం వాస్తవ పరిస్థితులను గుర్తించడంలో విఫలమవుతున్నారు. రాబోయే సార్వత్రక ఎన్నికలలో బీజేపీకి ఇంచుమించు 230 సీట్లు మత్రమే రావచ్చు' అని కూడా ఆయన పేర్కొన్నారు. మార్చి 18న నాకు పంపిన ఒక ఈ–మెయిల్‌లో మహేశ్వరి ఇలా పేర్కొన్నారు: 'బీజేపీకి 230 సీట్లు మాత్రమే రాగలవని మరో మారు చెప్పుతున్నాను. ఉత్తరప్రదేశ్‌లోని 80 సీట్లలో ఆ పార్టీకి 30 మాత్రమే దక్కుతాయి. ఓటర్లలో ఆ పార్టీ పట్ల తీవ్ర అసంతృప్తి ఉన్నది– రాహుల్‌గాంధీ నాయకత్వ దక్షత పట్ల నాకు సందేహాలు ఉన్నప్పటికీ బీజేపీయేతర పార్టీ నాయకులలో ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్న ఏకైక నేత ఆయనేనని చెప్పి తీరాలి'. సార్వత్రక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవడానికి నెల రోజులు ముందే అనీల్ మహేశ్వరి ఈ విషయాలను పేర్కొన్నారు. రెండు దశల పోలింగ్ పూర్తయిన తరువాత, బీజేపీ మంచి మెజారిటీతో మళ్లీ అధికారానికి వస్తుందని వివిధ ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడయిన విషయం పట్ల పలువురు వ్యాఖ్యాతలు సంశయాన్ని వ్యక్తం చేశారు. పోల్‌స్టర్స్ పూర్తిగా పొరపడ్డారని కూడా కొంతమంది స్పష్టంగా అభిప్రాయపడ్డారు. దేశ వ్యాప్తంగా ప్రచలితంగా ఉన్న ఒక అభిప్రాయానికి విరుద్ధమైన అభిప్రాయాన్ని ఘంటాపథంగా వ్యక్తం చేసిన నిశిత పరిశీలకుడు అనీల్ మహేశ్వరి. బీజేపీకి మెజారిటీ రాదని ముందే గ్రహించిన ప్రతిభావంతుడు. ఆయన దూర దృష్టి బహుదా అభినందనీయమైనది.



నరేంద్ర మోదీ పాలనా శైలిలో ప్రతీకాత్మక సంయమనం చోటుచేసుకోవాలని నేను ఆశిస్తున్నాను; పార్లమెంటులో చర్చలకు మరింత సమయాన్ని కేటాయించి అవి సమగ్రంగా జరిగేందుకు అవకాశమివ్వాలని కోరుతున్నాను. ప్రతిపక్షాల ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గవర్నర్ల విధుల నిర్వహణ రాజ్యాంగబద్ధంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రధాని మోదీతో సహ సీనియర్ మంత్రులు మన తోటి భారతీయ పౌరులు అయిన ముస్లింలను అనుక్షణం తెగనాడే అలవాటుకు స్వస్తి చెప్పి తీరాలి.

1989–2014 సంవత్సరాల మధ్య పార్లమెంటులో ఏ ఒక్క పార్టీకి మెజారిటీ లేదు. ఆ కాలంలో ఏడుగురు ప్రధానమంత్రులు అధికారంలో ఉన్నారు. వారిలో నలుగురు– వి.పి.సింగ్, చంద్రశేఖర్, దేవేగౌడ, ఐ.కె.గుజ్రాల్– ఒక్కొక్కరు రెండు సంవత్సరాల కంటే తక్కువ కాలమే అధికారంలో ఉన్నారు. అదే కాలంలో కనీసం ముగ్గురు ప్రధానమంత్రులు– పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజపేయి, మన్మోహన్ సింగ్– కనీసం ఒక పర్యాయమైనా ఐదేళ్ల పాటు పూర్తిగా అధికారంలో ఉన్నారు.

ఇప్పుడు మూడో పర్యాయం ప్రధానమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ఈ విశిష్ట జాబితలో చోటు సాధించుకున్నారు లోక్‌సభలో తన పార్టీకి మెజారిటీ లేకపోయినప్పటికీ ఆయన ప్రధానమంత్రిగా ఉన్నారు. మోదీకి ముందు ప్రధానమంత్రిగా ఉన్నవారు ఆలనానుభవాలు, స్వభావ రీత్యా ఇతర పార్టీలతో సమన్వయ సహకారాలతో సమర్థ పాలననందించగలిగారు. వారికి పూర్తిగా భిన్నమైన పాలకుడు నరేంద్ర మోదీ. పీవీ నరసింహారావు ప్రధానమంత్రి కాక పూర్వం ఇందిర, రాజీవ్ ప్రభుత్వాలలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించారు. వాజపేయి ప్రధానమంత్రి కాకపూర్వం మొరార్జీ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా ఉన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రికాక పూర్వం నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా పని చేశారు. అనేక సంవత్సరాల పాటు ఆరెస్సెస్ ప్రచారక్‌గా, బీజేపీ కార్యకర్తగా నరంద్ర మోదీ ఇతరులతో కలిసి, లేదా వారి నాయకత్వంలో పని చేసిన మాట నిజమే అయితే ఎన్నికల రాకీయాలలోకి ప్రవేశించిన నాటి నుంచీ ఆయన స్వతంత్రంగా ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో మంత్రిగా గానీ, చివరకు ఎంపీ లేదా ఎమ్మెల్యేగా గానీ ఎన్నడూ ఆయన లేరు. 2001 నుంచి మోదీ ఒకే ఒక్క ధ్యేయంతో పని చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం లేదా దేశ ప్రధాన మంత్రి కావడమే ఆయన లక్ష్యంగా ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే 23 సంవత్సరాల పాటు బిగ్‌బాస్, టాప్‌బాస్ లేదా సుప్రీంబాస్‌గా మాత్రమే ఆయనకు జీవితం తెలుసు.

ముఖ్యమంత్రిగాను, ప్రధానమంత్రిగాను నరేంద్ర మోదీ అవధులు లేని స్వీయ వ్యక్తి పూజను ప్రోత్సహించారు, పెంపొందించారు. తొలుత గుజరాత్‌ను, ఆ తరువాత దేశాన్ని మహా సంపద్వంతంగా తీర్చిదిద్దిన పాలకుడుగా, నాయకుడుగా తనను తాను దేశ ప్రజలకు, విశాల ప్రపంచానికి నిస్సంకోచంగా చాటుకున్నారు. ఇలా అధికారానికి వ్యక్తిత్వారోపణను మరింత ముమ్మరం చేసేందుకు గాంధీ నగర్‌లోను, న్యూఢిల్లీలోను, తనకు ఎటువంటి మినహాయింపులు లేని విధేయత చూపాలని కేబినెట్ సహచరులను పురిగొల్పారు. మోదీ ఆశించిన విధంగానే వారూ ఆయన అధికారాన్ని సంపూర్ణంగా అంగీకరించారు. విధేయులు అయ్యారు. ముఖ్యమంత్రిగాను, ప్రధానమంత్రిగాను తన ప్రభుత్వం ఎప్పుడు ఎక్కడ ఏ కొత్త ప్రాజెక్టును ప్రారంభించినా, దాని నిర్మాణాన్ని ముగించినా ఆ ఘనతను పూర్తిగా తనకే ఆపాదించుకోవడం ఆయనకు పరిపాటి అయింది.

తన నేతృత్వంలో బీజేపీ వరుసగా మూడోసారి కూడా ఘన విజయం సాధిస్తుందని, తాను మరోసారి తప్పక ప్రధానమంత్రిని అవుతానని మోదీ విశ్వసించారు. అందుకే మూడోసారి ప్రధానమంత్రి పదవినధిష్ఠించిన వెన్వెంటనే తొలి 100 రోజుల్లో అమలుపరిచే ఒక ఎజెండాను ప్రజలకు నివేదించనున్నట్టు మోదీ ప్రకటించారు. తన 100 రోజుల ఎజెండాలో 50 నుంచి 70 లక్ష్యాలను మోదీ నిర్దేశించుకోనున్నారని మే 10న ఒక జాతీయ దినపత్రిక వెల్లడించింది. మోదీ తన తొలి 100 రోజుల్లో అమలుపరచదలిచిన ఎజెండా విషయమై అధికారులతో సమావేశమవనున్నారని జూన్ 2న మరో జాతీయ దినపత్రిక పేర్కొంది. గమనించారా? అధికారులతో సమావేశమవడానికి మాత్రమే మోదీ నిర్ణయించుకున్నారు!



■ రామచంద్ర గుహ

గతానుగతం

సరే, అనుకున్నవన్నీ జరగవు కదా. సార్వత్రక ఎన్నికల అనంతరం మోదీ మూడో ప్రభుత్వం వస్తుందని ఆయనతో పాటు చాలా మంది భావించారు. అయితే అనూహ్యంగా మోదీ మూడో ప్రభుత్వానికి బదులుగా ఎన్డీఏ రెండో ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ దిగ్భ్రాంతికర పరిణామం ఒక ప్రశ్నను లేవనెత్తుతుంది! స్వాభావికంగా నిరంకుశుడు అయిన నాయకుడు ఒక ప్రజాస్వామ్య పాలకుడుగా పరిణమిస్తారా? ఈ పుణ్యభూమిలో తాను భగవంతుడి ప్రతినిధినని ఇటీవలే చెప్పుకున్న వ్యక్తి తననుతాను మానవ మాత్రుడుగా పరిగణించుకుంటారా? తానూ తప్పులు చేస్తానని అంగీకరిస్తారా? పాలనా వ్యవహారాలలో ఇతరుల సలహాలు తీసుకునేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారు. సలహాలు ఇచ్చిన వారి గురించి ఒక మంచి మాట చెప్పే సుగుణం ఆయనకు ఉన్నదా? పార్లమెంటులో సంఖ్యాబలం లేని ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ప్రధాని మోదీ, తన కేబినెట్ సహచరులకు మరింత అధికారాన్ని ఇచ్చేందుకు అంగీకరిస్తారా? తన ఎంపీలపై అనుచిత పెత్తనం చెలాయించడాన్ని మానుకుంటారా? ప్రతిపక్షాన్ని సమాదరించి పాలనలో దాని సహాయాన్ని తీసుకోవడానికి సిద్ధమవుతారా? తన పార్టీ పాలనలో లేని రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను గౌరవిస్తారా?

జాగ్రత్తగా ఆలోచించిన తరువాత మాత్రమే సమాధానాన్ని ఇవ్వాల్సిన ప్రశ్నలివి. ఆ సమాధానాలు వెల్లడయేందుకు తప్పక కొన్నినెలలు లేదా సంవత్సరాలు పడుతుంది. అందుకు ఆశాభావంతో వేచి వుందాం. ఈ లోగా నరేంద్ర మోదీ పాలనా శైలిలో ప్రతీకాత్మక సంయమనం చోటుచేసుకోవాలని నేను ఆశిస్తున్నాను; పార్లమెంటులో చర్చలకు మరింత సమయాన్ని కేటాయించి అవి సమగ్రంగా జరిగేందుకు అవకాశమివ్వాలని కోరుతున్నాను. ప్రతిపక్షాల ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గవర్నర్ల విధుల నిర్వహణ రాజ్యాంగబద్ధంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఆ రాజ్యాంగ అధికారులు అసహ్యకరమైన పద్ధతుల్లో వ్యవహరించకుండా కేంద్రం వారిని కట్టడి చేసి తీరాలి. ప్రధాని మోదీతో సహ సీనియర్ మంత్రులు మన తోటి భారతీయ పౌరులు అయిన ముస్లింలను అనుక్షణం తెగనాడే అలవాటుకు స్వస్తి చెప్పి తీరాలి. పాలనా రీతుల్లో గణనీయమైన మార్పు వస్తుందో లేదో వేచి చూడవలసి ఉంది. ప్రధాని మోదీ స్వాభావికంగా సమస్త అధికారాలను తన చేతుల్లోకి తీసుకునేందుకు ఇష్టపడతారు. ఆధిపత్య చెలాయింపే ఆయన సహజ ప్రవృత్తి. రెండు దశాబ్దాల పాటు అడ్డూ అదుపు లేని విధంగా అధికారాన్ని చెలాయించిన కారణంగా ఆయనలో అప్రజాస్వామిక ధోరణులు మరింతగా దృఢపడ్డాయి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

బీజేపీకి 'ఆమె' మద్దతు తక్కువే!



రైతుల ఆగ్రహమే భారతీయ జనతా పార్టీకి కనీస మెజారిటీని నిరాకరించిందా? దళితులలో రహస్య వ్యాకులత బీజేపీకి వ్యతిరేకంగా పని చేసిందా? ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు బీజేపీకి దూరమయ్యారా? లేక ముస్లిం ఓటర్ల వ్యతిరేకత వల్లే పాలక పక్షానికి సీట్ల ఆధిక్యత లభించలేదా? బీజేపీ కొత్తగా సమకూర్చుకున్న మహిళా ఓటుకు ఏమయింది? 18వ సార్వత్రక ఎన్నికల ఫలితాల విశ్లేషణలో ఈ ప్రశ్నలకు కీలక ప్రాధాన్యమున్నది.

ఆ ఫలితాల సమగ్ర విశ్లేషణ అనేక భ్రమలను తొలగించింది. జాతీయ స్థాయిలో ప్రధాన సామాజిక వర్గాల ఓటింగ్ ప్రాధాన్యాలలో ఎటువంటి మార్పు లేదు. అయితే దళితులు, పేదలు, సన్నకారు రైతాంగ వర్గాలలో అటువంటి మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల ఓటర్లు, ముస్లిం ఓటర్లు సంఘటితమయ్యారు. అగ్రకులాలు, మధ్యతరగతి ప్రజలు, హిందువులలోని బాగా వెనుకబడిన కులాలవారు, ఆదివాసీలలో బీజేపీ తన ప్రభావాన్ని, ఆధిక్యాన్ని నిలబెట్టుకున్నది. ఓటింగ్ తీరుతెన్నులలో ఈ మార్పులు, యథాతథ పరిస్థితుల మూలంగా ఎన్‌డీఏకు లభించిన ఓట్ల శాతం జాతీయ స్థాయిలో లభించిన ఓట్ల శాతం తగ్గిపోయింది రాష్ట్ర స్థాయిలో ఆయా సామాజిక వర్గాల ఓటింగ్ ప్రాధాన్యాలలో మార్పులు చాలా ఆసక్తికరంగాను, ప్రభావ శీలంగాను ఉన్నాయి. మా విశ్లేషణ ఒక బృహత్ రాజకీయ సవాల్‌ను నివేదిస్తుంది. 1990ల్లో అధికార సాధనలో బీజేపీ ఉత్థానం ఒక కొత్త సామాజిక కూటమిని సృష్టించింది.. 'అగ్ర' కులాల, 'మధ్య' తరగతి, పట్టణ ప్రాంతాల, , పురుష ఓటర్ల సామాజిక సంకీర్ణమది. ఈ సామాజిక సంకీర్ణం రాజకీయ మెజారిటీని సాధించేందుకు సామాజికంగా దిగువ స్థాయిలో ఉన్న కులాలను కూడా కలుపుకున్నది. మోదీ జాతీయ స్థాయిలో రంగంలోకి వచ్చిన తరువాత ఈబీసీలు, పేదలు, ఆదివాసీలను కలుపుకోవడం ద్వారా ఆ సామాజిక కూటమి మరింతగా సంఘటితమయింది. అయితే ఈబీసీలు, పేదలు, ఆదివాసీలు ఈ సామాజిక సంకీర్ణంలో అనుబంధ, ప్రతీకాత్మక భాగస్వాములు మాత్రమే అన్న వాస్తవాన్ని విస్మరించకూడదు. ఈ సార్వత్రక ఎన్నికలలో బీజేపీ రాజకీయ ఓటమికి లోనయినప్పటికీ దానికి మద్దతునిచ్చే సామాజిక సంకీర్ణం చాలవరకు ఆ పార్టీ పక్షానే ఉన్నది. సామాజిక వ్యవస్థలో బాగా దిగువ స్థాయిలో ఉన్న పేదలు, గ్రామీణులు, దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, మైనారిటీలను ఏకం చేసే రాజకీయ కర్తవ్యం నెరవేరేందుకు ఇంకా చాలా దూరం పయనించవలసి ఉన్నది. సామాజికంగా అధిక సంఖ్యాకులు అయిన బహుజనులను రాజకీయంగా అధిక సంఖ్యాక వర్గంగా మార్చవలసి ఉన్నది. బహుజనులను రాజకీయ అధిక సంఖ్యాకులుగా మార్చడమనేది కాంగ్రెస్, ఇండియా కూటమిలోని దాని భాగస్వామ్యపక్షాల ముందున్న ఒక ప్రధాన సవాల్.

1) హిందూ అగ్రకులాల వారు బీజేపీకి విధేయ ఓటు బ్యాంకుగా ఉన్నారు. సార్వత్రక ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఏదో ఒక రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్నారనే వార్తలు రావడం పరిపాటిగా ఉంది. ఇటీవలి ఎన్నికలలో యూపీలో రాజ్‌పుట్‌లు, గుజరాత్‌లో క్షత్రియులు బీజేపీ పట్ల అసంతృప్తితో ఉన్నారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే అగ్రకులాల హిందువులు బీజేపీకి అత్యంత విధేయ ఓటు బ్యాంకుగా ఉన్నారని మా విశ్లేషణలో వెల్లడయింది. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు ఉన్న 'ముస్లిం ఓటు బ్యాంకు కంటే బీజేపీకి ఉన్న అగ్రకులాల ఓటు బ్యాంకే చాలా పెద్దది. మొత్తం ఓటర్ల మొగ్గు బీజేపీ నుంచి ఇతర పార్టీల వైపు ఉన్నప్పుడు అగ్రకులాల హిందువులు సైతం స్వల్పసంఖ్యలో బీజేపీకి దూరమయ్యారు. హర్యానా, యూపీలలో ఓటింగ్ ధోరణులే ఇందుకు నిదర్శనాలు.

2) ఇండియా కూటమి వైపు కిసాన్ సామాజిక వర్గాల మొగ్గు : గ్రామీణ ప్రాంతాలలో భూవసతి గల రైతు కులాలు (సవర్ణేతరులు, అయితే చాల వరకు ఓబీసీ యేతరులు) బీజేపీకి కాకుండా ఇండియా కూటమికి మద్దతు తెలిపారు వ్యవసాయరంగ దురవస్థలు, రైతుల ఆందోళనలే ఇందుకు కారణం కావచ్చు. రాజస్థాన్, హర్యానాలో జాట్‌లు, యూపీలో యాదవులు, మహారాష్ట్రలో మరాఠాలు కర్ణాటకలో కొంతవరకు లింగాయత్‌లు, ఒక్కళిగలు ఎన్‌డీఏను దెబ్బ తీశారు. అయినప్పటికీ బీజేపీ కొన్ని రైతు కులాల వారిలో తన ఓట్ల వాటాను పెంచుకున్నది. గుజరాత్‌లో పాటీదార్లు, మధ్యప్రదేశ్‌లో యాదవులు బీజేపీ విజయానికి బాగా తోడ్పడ్డారు.



■ యోగేంద్ర యాదవ్

3) కీలక రాష్ట్రాలలో నష్టపోయినా ఈబీసీలను నిలుపుకున్న బీజేపీ : గ్రామీణ భారతదేశంలో బీజేపీ ప్రధాన మద్దతుదారులుగా బాగా వెనుకబడిన కులాల వారు ఆవిర్భవించారు. అయితే ఈ వర్గాల మద్దతు విషయంలో దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల మధ్య వ్యత్యాసమున్నది.

4) బీఎస్పీకి దూరమైన దళిత ఓటర్లు: ఉత్తరప్రదేశ్‌లోను, ఇతర ఉత్తరాది రాష్ట్రాలలోను బీఎస్పీకి, మహారాష్ట్రలో వంచిత్ బహుజన్ అఘాడి దళిత ఓటర్లు దూరమయ్యారు. ఇండియా కూటమి వైపు వారు మొగ్గారు. అయినప్పటికీ బీజేపీ, దాని మిత్రపక్షాలు దళిత ఓట్లలో తమ వాటాను ఐదు శాతం మేరకు కోల్పోయాయి. మధ్యప్రదేశ్, గుజరాత్‌లో దళిత ఓటర్ల మద్దతును బీజేపీ నిలుపుకున్నది. అలాగే తెలంగాణలో మాదిగలు బీజేపీకి మద్దతునిచ్చారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దళిత ఓట్లను మళ్లీ గణనీయంగా పెంచుకున్నాయి. ఈ విషయంలో ఇండియా కూటమి ఎన్‌డీఏతో సరిసమానంగా ఉన్నది.

5) హిందూ ఆదివాసీ ఓట్లలో ఎన్‌డీఏ ఆధిక్యత: ఈ పరిణామం కాంగ్రెస్‌కు కలవరపాటు కలిగించేది. 2009 – 2024 మధ్య బీజేపీ ఆదివాసీల వాటా ఇతోధికంగా పెరిగింది. ఆదివాసీ ఓటర్లలో కాంగ్రెస్ బీజేపీ కంటే 20 శాతం మేరకు వెనుకబడి ఉన్నది. హిందూ ఆదివాసీ ఓట్లను బిజూ జనతాదళ్, బీఆర్ఎస్, తృణమూల్ కాంగ్రెస్ నష్టపోయిన మేరకు బీజేపీ లబ్ధి పొందింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో హిందూ ఆదివాసీ ఓట్లను కాంగ్రెస్ గణనీయంగా కోల్పోయింది.



ప్రస్తుత సార్వత్రక ఎన్నికల ఓటింగ్‌లో మహిళలు మున్నెన్నడూ లేని విధంగా పాల్గొన్నారు. మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలూ అత్యధిక ప్రాధాన్యమిచ్చాయి. మహిళా కేంద్రిత సంక్షేమ పథకాల గురించి బీజేపీ ఎంతగా ప్రచారం చేసినప్పటికీ మహిళా ఓటర్ల మద్దతును పొందడంలో బీజేపీ వెనుకబడే ఉన్నది.

6) బీజేపీ ఓటమి లక్ష్యంగా సంఘటితమైన ముస్లిం ఓటర్లు: ముస్లింలకు వ్యతిరేకంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ ఎడతెగని ప్రచారం కారణంగా ఆ పార్టీని ఓడించేందుకు ముస్లింలు సంఘటితమయ్యారు. జాతీయ స్థాయిలో సగటు ఓటింగ్ (65 శాతం) కంటే ముస్లింల ఓటింగ్ (62 శాతం) స్వల్పంగా తక్కువ. బీజేపీకి వ్యతిరేకంగా వేసిన ఓట్లు 65 శాతం మేరకు ఉన్నాయి. ఇండియా కూటమిలోని తృణమూల్ కాంగ్రెస్ ఓట్లను కూడా కలుపుకుంటే బీజేపీ వ్యతిరేక ముస్లిం ఓటింగ్ శాతం మరింత అధికంగా ఉంటుంది. 2019లో యూపీఏ / ఇండియా కూటమికి ముస్లిం ఓట్లు 45 శాతం లభించగా 2024లో అది 65 శాతం మేరకు ఉన్నది. అయితే ఈ పెరుగుదల ఒక మిథ్య మాత్రమే. ఎందుకంటే సమాజ్‌వాది పార్టీ, జేకేఎన్‌సీ మొదలైన పార్టీలు 2019లో యూపీఏ కూటమిలో భాగస్వాములుగా లేవు. ముస్లిం ఓట్లు ఈ పార్టీలకు గణనీయంగా పడి ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుత విశ్లేషణలో ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు కనుకనే బీజేపీ వ్యతిరేక ముస్లిం ఓటింగ్ శాతం అత్యధికంగా ఉన్నది. యూపీలో ఎస్పీ, కాంగ్రెస్‌ల మధ్య పొత్తు కారణంగా ముస్లిం ఓట్లలో చీలిక సంభవించలేదు.

7) కాంగ్రెస్‌కు పేద ఓటర్ల, బీజేపీకి ధనిక ఓటర్ల మద్దతు: పేద ప్రజల ఓట్లలో బీజేపీ వాటా స్తంభించిపోయింది. పేదల ఓట్లలో కులాల వారీ చీలికలు సంభవించాయనేందుకు రుజువులు లేవు. పేదల, నిరుపేదల ఓట్లలో బీజేపీ తన వాటా లోటును మోదీ రంగంలోకి వచ్చిన తరువాత భర్తీ చేసుకోగలిగింది. అయితే సంపన్నవర్గాల వారి ఓట్లలో తన వాటాను అంతకంతకూ పెంచుకొంటోంది. పేదల అనుకూల గ్యారంటీల ద్వారా పేదల ఓట్లలో తమ వాటాను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు గణనీయంగా పెంచుకున్నాయి. అయితే పేద ప్రజల సానుకూల విధానాలను ఓట్లకు ప్రాతిపదికలుగా మార్చుకోవడానికి కాంగ్రెస్ ఇంకా చాలా దూరం ప్రయాణించచవలసి ఉన్నది.

8) మహిళా ఓటర్ల మద్దతులో బీజేపీ ఎప్పటి మాదిరిగానే వెనుకబడి ఉన్నది: ఈ సార్వత్రక ఎన్నికల ఓటింగ్‌లో మహిళలు మున్నెన్నడూ లేని విధంగా పాల్గొన్నారు. మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు అత్యధిక ప్రాధాన్యమిచ్చాయి. అయితే మహిళా కేంద్రిత సంక్షేమ పథకాల గురించి బీజేపీ ఎంతగా ప్రచారం చేసినప్పటికీ మహిళా ఓటర్ల మద్దతును పొందడంలో వెనుకబడే ఉన్నది.

9) బీజేపీకి యువ ఓటర్ల మద్దతు తగ్గుదల: ఐరోపాలో మాదిరిగా మన దేశంలో వయస్సుల వారీగా ఓటింగ్ ప్రాధాన్యాలు లేవు. 35 సంవత్సరాల వయసులోపు ఓటర్ల మద్దతు బీజేపీకి 1 నుంచి 2 శాతం మేరకు తగ్గిపోయింది యువ ఓటర్లు ఇండియా కూటమి వైపు మొగ్గు చూపారనేందుకు గట్టి రుజువులు లేవు.


10) నగరాలలో ఎన్‌డీఏ, గ్రామాలలో ఇండియా కూటమికి మద్దతు: నగర ప్రాంతాలలో తన ప్రాబల్యాన్ని బీజేపీ నిలబెట్టుకున్నది. చిన్న పట్టణాలు, గ్రామాలలో మద్దతును స్వల్పంగా కోల్పోయింది. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలైన శివసేన (యుబిటి) ముంబైలోను, డీఎంకే చెన్నైలోను మంచి ఫలితాలను సాధించినప్పటికీ ఈ కూటమికి నగరాలలో చాలా తక్కువ మద్దతు మాత్రమే లభించింది. గ్రామీణ, చిన్న పట్టణాలలోనే ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు ప్రధాన విజయాలను సాధించాయి.

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

(ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్రయాదవ్ అందిస్తున్న ఐదు వ్యాసాల పరంపరలో ఇది నాలుగవది)


లారీలకు పార్కింగ్ ప్లేస్..

ఆంధ్రజ్యోతి



- గతంలో టీడీపీ హయాంలో వెలిగిన పర్యాటక ప్రాంతం
- వైసీపీ వచ్చాక సర్వనాశనం
- కృష్ణా, గోదావరి హారతులకు చెల్లు
- పూర్తిగా ఎండిపోయిన నందనవనం
- పనికిరాకుండా పోయిన స్నానఘాట్లు
- కుంగిపోయిన నాలుగు వరుసల రోడ్డు
- బోటింగ్ పాయింట్ కూడా బంద్
- రావడమే మానేసిన పర్యాటకులు
- టీడీపీ ప్రభుత్వ రాకతో మళ్లీ ఆశలు

సమస్యల సంగమం

అపవిత్రంగా మారిన పవిత్ర సంగమం


నాచుపట్టి బురదమయంగా స్నానఘాట్

నాడు.. : చుట్టూ ఆధ్యాత్మిక వాతావరణం.. అందమైన పచ్చటి ప్రకృతి సోయగం.. ఓవైపు కృష్ణమ్మ పరుగులు.. మరోవైపు గోదావరి ఉరుకులు.. నడుమ నదీ హారతులు.. పుణ్యస్నానాలు ఆచరించేందుకు ప్రత్యేక ఘాట్లు.. ఆహ్లాదంగా గడిపేందుకు బోటింగ్ పాయింట్లు.. ఐదేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం ప్రాంత పవిత్రత ఇదంతా.

నేడు.. : నాచు పట్టి బురదగా మారిన నదీతీరం.. ఎండిపోయి వడిలిపోయిన పచ్చిక బయళ్లు.. కనుచూపు మేరలో కనిపించని కృష్ణమ్మ.. పూర్తిగా పక్కనపెట్టిన హారతులు.. తుప్పుపట్టిన బోట్లు.. కుంగిపోయిన రోడ్లు.. ఐదేళ్లలో పవిత్ర సంగమంలో వైసీపీ ప్రభుత్వ అపవిత్రత ఇదంతా..


నిలిచిన బోటింగ్


ఎండిపోయిన గ్రీనరీ



నెర్రలిచ్చి కుంగిపోయిన నాలుగు వరుసల రోడ్డు

విజయవాడ, ఆంధ్రజ్యోతి : కృష్ణ, గోదావరి నదులు సంగమించే ఇబ్రహీంపట్నంలోని ఫెర్రీ ఎగువ ప్రాంతాన్ని గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 'పవిత్ర సంగమం'గా నామకరణం చేసి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేశారు. గత కృష్ణా పుష్కరాలను పురస్కరించుకుని ఇక్కడ రివర్ ఫ్రంట్ ఘాట్లను నిర్మించారు. వంపులు తిరుగుతూ చూడముచ్చటగా, పూలవనంలా వీటిని నిర్మించారు. ఈ ప్రాంతానికి చేరుకోవటానికి వీలుగా ఇబ్రహీంపట్నం రింగ్ నుంచి ఎన్‌హెచ్-65కు అనుసంధానంగా కిలోమీటరున్నరకు పైగా నాలుగు వరుసల రోడ్డు నిర్మించారు. రోడ్డుకు రెండు వైపులా గ్రీనరీని అభివృద్ధి చేశారు. సెంట్రల్ డివైడర్‌పై గ్రీనరీ, ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. ఘాట్ల వెంబడి, సర్క్యులేటెడ్ ఏరియాలో హైమాస్ట్ ఎల్ఈడీ టవర్లను భారీగా ఏర్పాటు చేశారు. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల ఈ ప్రాంతం ఓ వెలుగు వెలిగింది. కృష్ణా పుష్కరాల సందర్భంలో ఇక్కడ కృష్ణా హారతుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ హారతులు చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు వచ్చేవారు. పర్యాటకుల కోసం బోటింగ్ పాయింట్‌ను కూడా భారీగా ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతి విధ్వంసంతో పాటే పవిత్ర సంగమాన్ని కూడా నిర్వీర్యం చేశారు. నాలుగు వరుసల రోడ్డు బీటలు వారింది. గ్రీనరీ ఎండిపోయింది. ప్రస్తుతం ఈ రోడ్డును లారీలు నిలుపుకొనే పార్కింగ్ ఏరియాగా మారిపోయింది. పరిసర ప్రాంతాల్లోని వ్యర్థాలన్నింటినీ ఈ రోడ్డు వెంబడే డంప్ చేస్తున్నారు. ఘాట్‌లోని నందనవనం ఏనాడో ఎండిపోయింది. కృష్ణానదిలో రెయిలింగ్ కొట్టుకుపోయింది. బోటింగ్ నిలిచిపోయింది. ఘాట్లు అపరిశుభ్రమయ్యాయి. ఇప్పుడు మందుబాబులకు ఇదొక అడ్డా. అసాంఘిక కార్యక్రమాలకు వేదిక. తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో సంగమానికి పూర్వ వైభవాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉంది.

తెల్లారిన బతుకులు

పొట్టకూటి కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం

వారివి రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు. కోడి కూయకముందే పొట్టకూటి కోసం పొరుగు ప్రాంతాలకెళ్లే వలస కార్మికులు. చేపల పట్టుబడే జీవన వృత్తిగా బతికే బడుగుజీవులు. ఎప్పటిలాగే అర్ధరాత్రి తొమ్మిది మంది మినీవ్యానులో బయలుదేరారు. తెల్లవారుజాము 4.30 గంటల సమయం.. వేగంగా వెళుతున్న ఆ మినీవ్యానులో డ్రైవర్ మినహా మిగిలినవారు గాఢనిద్రలో ఉన్నారు. ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను మినీవ్యాను బలంగా ఢీకొట్టింది. మినీవ్యానులోని డ్రైవర్ సహా నలుగురు తేరుకునేలోపే శాశ్వత నిద్రలోకెళ్లారు. కంటైనర్ డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కొన ఊపిరితో ఆస్పత్రికెళుతూ మార్గంమధ్యలో మరొకరు ప్రాణాలు వదిలారు. నలుగురు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులంతా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందినవారు. ఈ ప్రమాదం కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద 216-ఏ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది.


ప్రమాదస్థలి


ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలు

- మినీవ్యాను, కంటైనర్ ఢీకొని ప్రమాదం
- మృతుల్లో ఐదుగురు కోనసీమ జిల్లావాసులు
- మరొకరి పరిస్థితి విషమం.. నలుగురికి గాయాలు
- కృత్తివెన్ను మండలంలో జాతీయ రహదారిపై ఘటన

మచిలీపట్నం/కృత్తివెన్ను, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన తొమ్మిది మంది.. తమ కుటుంబ పోషణ కోసం చేపల పట్టుబడి, ప్యాకింగ్ చేసే పనిని వృత్తిగా ఎంచుకున్నారు. రోజువారీ మాదిరిగానే చేపల పట్టుబడి కోసం శుక్రవారం రాత్రి 1.30 గంటల సమయంలో కోనసీమ జిల్లా తాళ్లరేవు నుంచి అశోక్ లేల్యాండ్ దోస్త్ (మినీవ్యాను)లో బంటుమిల్లి మండలం తుమ్మిడి గ్రామంలో చేపల పట్టుబడి, ప్యాకింగ్ పనుల నిమిత్తం బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం కృత్తివెన్ను మండలం సీతనపల్లి సమీపంలో ఎదురుగా సరుగుడు బాదుల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టి రోడ్డు మధ్యలోకి వెళ్లింది. అప్పటివరకు వ్యానులో నిద్రపోతున్న వీరంతా మేలుకునే లోపే రొయ్యల సీడ్‌లోడుతో చెన్నైవైపు నుంచి వస్తున్న ఐషర్ (కంటైనర్) వాహనం మినీవ్యానును అత్యంత వేగంతో ఢీకొట్టింది. ప్రమాదంలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఉప్పలగుంట గ్రామానికి చెందిన పెదసింగు కనకరాజు (34), కాట్రేనికోన మండలం గద్దనపల్లి గ్రామానికి చెందిన చింత లోవరాజు (32), మాగాపు నాగరాజు (26), కరప మండలానికి చెందిన వ్యాన్ డ్రైవర్ గాంధీ ధర్మవరప్రసాద్ (27), తమిళనాడు వేల్పూరుకు చెందిన కంటైనర్ డ్రైవర్ అయ్యప్పన్ జయరామన్ (42) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మినీవ్యానులో ఉన్న రేవు భూషణం (26) తీవ్రగాయాల పాలయ్యారు. ఆయన్ను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గంమధ్యలో మరణించాడు. కంటైనర్ ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. స్థానికులు, పోలీసులు అతికష్టం మీద వ్యానులో చిక్కుకుపోయిన మృతదేహాలను, క్షతగాత్రులను బయటకు తీశారు. కాకినాడ సమీపంలోని గొర్రిపూడికి చెందిన మేడిశెట్టి మహేష్ కుమార్, కాట్రేని కోన మండలం గద్దనపల్లికి చెందిన చింతా దుర్గప్రసాద్, ఉప్పలగుంటకు చెందిన రేవు జ్ఞానేశ్వరరావు, ఎస్.యానాం గ్రామానికి చెందిన మల్లాడి శ్రీకాంత్, సంగాని నాగేంద్రబాబు గాయాలపాలై మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంగాని నాగేంద్రబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

- రేవు భూషణానికి ఏడాది క్రితమే వివాహమైంది. అతడి భార్య జ్యోతి గర్భవతి.
- మరో మృతుడు కనకరాజుకు భార్య, కూతురు ఉన్నారు. రోజూ మాదిరిగానే ఇంటికి అవసరమైన సామగ్రి తీసుకుని వస్తారని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులను ఇక తమవారు లేరన్న సమాచారం నిలువునా కుంగదీసింది.
- మృతుడు ధర్మవరప్రసాద్‌కు ఏడాదిన్నర పాప, భార్య వరలక్ష్మి ఉన్నారు. ఆమె ప్రస్తుతం నిండు గర్భిణి. తండ్రి సత్యనారాయణమూర్తి దివ్యాంగుడు. తల్లి వరలక్ష్మి వినికిడిలోపం సమస్యతో బాధపడుతోంది. వీరితో పాటు వృద్ధాప్య దశలో ఉన్న తాత ధర్మారావు బాధ్యతలు కూడా ధర్మవరప్రసాద్ చూసుకునేవాడు. ఇప్పుడు తమకెవరు దిక్కంటూ బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు.
- **ఇద్దరు క్షేమం.. :** ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు మాత్రం ఎటువంటి గాయాలూ లేకుండా బయట పడ్డారు. కంటైనర్ క్లీనర్‌కు ఎటువంటి గాయాల్లేకుండా క్షేమంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన కొద్దిసేపటి కోలుకొని, లారీ నుంచి కిందకు దిగి, పోలీసులకు పూర్తి వివరాలు తెలిపాడు. ట్రాక్టర్ డ్రైవర్‌కు కూడా గాయాలు కాలేదు. కానీ ప్రమాదం జరిగిన తీరును చూసి, ట్రక్కును అక్కడే విడిచి, ఇంజన్‌తో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. పోలీసులు సమాచారం తెలుసుకొని అతన్ని స్టేషన్‌కు రప్పించి విచారిస్తున్నారు.


బుల్లెట్ నడుపుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

రెండోసారి

- మంత్రి కొల్లు రవీంద్ర ఎక్సైజ్‌శాఖ కేటాయింపు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండోసారి టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన కొల్లు రవీంద్రకు రెండోసారి కూడా మంత్రి పదవి దక్కింది. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఆయనకు ఏ శాఖలు కేటాయిస్తారనే అంశంపై కూటమి నాయకుల్లో రెండ్రోజులుగా ఉత్కంఠ నెలకొంది. 2014లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందిన కొల్లు రవీంద్ర ఎక్సైజ్, బీసీ సంక్షేమ శాఖల మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం కూడా ఎక్సైజ్ శాఖతో పాటు కీలకమైన గనుల శాఖను కేటాయించడంతో జిల్లాకు చెందిన కూటమి నాయకులు సంబరాలు చేసుకుంటున్నారు. సౌమ్యుడిగా పేరున్న కొల్లు రవీంద్రకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించారని కూటమి శ్రేణులు చెప్పుకొంటున్నారు.

వందలాది బైకులతో స్వాగతం

మంత్రి కొల్లు రవీంద్రకు శాఖ కేటాయింపుతో బందరులో కోలాహలం నెలకొంది. కూటమి శ్రేణులు ర్యాలీ చేసి సంబరాలు చేసుకున్నాయి. బాణాసంచాలు కాలుస్తూ ఆనందంతో చిందులేశారు. నగరంలో శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు జరిగిన భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. మూడు స్తంభాల సెంటర్‌లో వందలాది బైక్‌లతో మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి కొల్లు రవీంద్రకు ఘన స్వాగతం పలికారు. పూలదండలు, గజమాలలతో ముంచెత్తారు. మూడుస్తంభాలు, కోనేరు, బస్టాండ్, లక్ష్మీటాకీసు, జడ్పీ, చిలకలపూడి, పరాసుపేట, నాయర్‌బడ్డీ, రామానాయుడుపేట, బుట్టాయిపేట, జవ్వారుపేట, ఇనకుదురుపేట, చింతచెట్టు, నాగపోతరావు సెంటర్‌ల మీదుగా ర్యాలీ టీడీపీ కార్యాలయానికి చేరుకుంది. ఈ ర్యాలీలో మంత్రి కొల్లు రవీంద్రతోపాటు మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, గొర్రెపాటి గోపీచంద్, కాగిత వెంకటేశ్వరరావు, కాగిత గోపాలరావు, మోటమర్రి బాబాప్రసాద్, గోపు సత్యనారాయణ, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, లంకే నారాయణ ప్రసాద్, కుంచే నాని, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, గడ్డం రాజు, గల్లా తిమోతి పాల్గొన్నారు. అడుగడుగునా కొల్లు రవీంద్రకు మంగళహారతులిచ్చారు.

మీ నమ్మకాన్ని వమ్ము చేయను

మచిలీపట్నం ప్రజలు మునుపెన్నడూలేని విధంగా భారీ మెజారిటీ ఇచ్చి గెలిపించారు. నగర ప్రజల ఆశలు వమ్ము చేయను. నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మోడల్‌గా తీర్చిదిద్దుతా

- కొల్లు రవీంద్ర, రాష్ట్ర ఎక్సైజ్, గనులు, జియాలజీ శాఖల మంత్రి

తీరు మారేనా..?

పోలీస్ శాఖ బదిలీల్లో కనిపించని ఏసీఆర్



- వైసీపీ వచ్చాక అన్నీ రాజకీయ సిఫార్సులే..
- రాజకీయ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఇన్‌స్పెక్టర్లు
- కొత్త ప్రభుత్వంలో ఈ పద్ధతి మారాలంటున్న ఆశావహులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో కొద్దిరోజుల్లో బదిలీలు అనివార్యం కానున్నాయి. కానీ, పోలీసు శాఖలో బదిలీలంటే రాజకీయ సిఫార్సులుగా మారాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో అధికారుల ఆలోచన కంటే ఆయా ప్రజాప్రతినిధులు చేసిన సిఫార్సులనే అమలు చేయాల్సి వచ్చేది. సాధారణంగా పోలీసు శాఖలో బదిలీలు చేసేటప్పుడు ఆయా అధికారుల ఏసీఆర్ (యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు)ను పరిగణనలోకి తీసుకోవాలి. విధినిర్వహణలో అధికారులు, సిబ్బంది చూపిన ప్రతిభకు ఇచ్చే మార్కులను ఏసీఆర్‌గా వ్యవహరిస్తారు. కానీ, ఈ ఏసీఆర్ అనే పదాన్నే మరిచిపోయేలా రాజకీయ సిఫార్సులు పెరిగాయి. ఈ ఏసీఆర్ పది మార్కులకు ఉంటుంది. ఎస్ఐలకు ఇన్‌స్పెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లకు ఆయా జోన్లలో ఏసీపీలు, ఏసీపీలకు డీసీపీలు, డీసీపీలకు పోలీసు కమిషనర్ ఈ మార్కులు ఇస్తారు. అయితే, కమిషనరేట్ పరిధిలో జరిగిన బదిలీల్లో ఏసీఆర్ మాట విని చాన్నాళ్లు అయిందని పోలీసు వర్గాలే చెబుతున్నాయి.

ఎస్‌హెచ్‌వోలుగా బదిలీలకు ప్రయత్నాలు

2014 నుంచి విజయవాడలోని పలు స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలుగా వ్యవహరించినవారే ఈసారి కూడా స్టేషన్లలో పాగా వేయాలని ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఈ ఆలోచనలు తమ బ్యాచ్‌మేట్లతో పంచుకుంటున్నారు. జిల్లాల విభజన సమయంలో పొరుగు జిల్లాలకు వెళ్లిన ఇన్‌స్పెక్టర్లు అప్పటి అధికారుల పలుకుబడిని ఉపయోగించుకుని తిరిగి కమిషనరేట్‌లో స్థానం సంపాదించుకున్నారు. నగరంలో ఉన్న పోలీస్‌స్టేషన్లలో ఒక్కో దానికి ముగ్గురు, నలుగురు ఇన్‌స్పెక్టర్లు పోటీ పడుతున్నారు. ఈ ప్రయత్నాల్లో భాగంగా ఇప్పటికే కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను కలిసి బొకేలు ఇచ్చి మనసులో మాటను చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్నవారు సైతం సిటీలోని సీట్లపై కన్నేస్తున్నారు.

ఆ 'మార్క్' చూపించాలి

పాలనలోనూ, పనితీరులోనూ మార్పు, మార్క్ ఎలా ఉంటుందో సీఎం చంద్రబాబు చూపించడం మొదలుపెట్టారు. అదే మార్క్‌ను బదిలీల్లోనూ చూపించాలని పోలీసు వర్గాలు కోరుకుంటున్నాయి. ఎస్‌హెచ్‌వో అవకాశాలను ప్రతిసారీ ఒక గ్యాంగ్ తన్నుకు పోవడంతో మిగిలిన వారు లూప్‌లైన్లలో ఉండాల్సి వస్తోంది. ఈసారి బదిలీల్లో అయినా సీఎం మార్పు, మార్క్ చూపించాలని కోరుకుంటున్నారు.



ఇక రోజూ ముంబయికి..

- నేటి నుంచి ఎయిరిండియా డైలీ ఫ్లైట్
- సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభం
- హాజరుకానున్న విజయవాడ, మచిలీపట్నం ఎంపీలు
- విమానానికి గ్రాండ్ వెల్కమ్ చెప్పనున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ విమానాశ్రయం నుంచి ముంబయికి విమాన సర్వీసు శనివారం ప్రారంభంకానుంది. ఈ సర్వీసును విజయవాడ విమానాశ్రయంలో శనివారం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ప్రారంభించనున్నారు. ఈ సర్వీసు కోసం బాలశౌరి చాలాకాలం ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు ఆయన కృషి ఫలించింది. శనివారం సాయంత్రం 5.15 గంటలకు ముంబయి నుంచి విజయవాడకు ఎయిరిండియా విమానం రానుంది. ఈ విమానం పైకి వాటర్ వెదజల్లి ఇక్కడి సిబ్బంది ఘనస్వాగతం పలుకుతారు. ఆ తర్వాత సాయంత్రం 5.30 గంటలకు టెర్మినల్ బిల్డింగ్‌లో కేక్ కటింగ్ జరుగుతుంది. అనంతరం ప్రయాణికులకు ఇద్దరు ఎంపీలు బోర్డింగ్ పాస్‌లు అందిస్తారు. మొత్తం 185 మంది సామర్థ్యంతో ఈ విమానం నడుస్తుంది. నెల రోజుల కిందటే ఎయిరిండియా సంస్థ విజయవాడ-ముంబయికి టికెట్ బుకింగ్ చేపట్టింది. రూ.5,600 ప్రారంభ టికెట్ ధరగా నిర్ణయించడంతో డిమాండ్ ఏర్పడింది. వాస్తవానికి విజయవాడ నుంచి ముంబయికి గతంలోనే విమాన సర్వీసు నడిచేది. కానీ, కరోనా సమయంలో రద్దయ్యింది. అయితే, విజయవాడ నుంచి ముంబయికి సర్వీసు నడపాలని ఏపీ చాంబర్స్, విమానాశ్రయ అధికారులకు, ఎయిరిండియాతో పాటు పలు విమానయాన సంస్థలకు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు లేఖ రాసింది. దీనిని ఎయిరిండియా స్వాగతించింది. సర్వీసు నడిపేందుకు నెల కిందటే సంసిద్ధత తెలిపింది. షెడ్యూల్‌ను కూడా ప్రకటించి బుకింగ్ చేపట్టింది. రోజూ రాత్రి 7.10 గంటలకు ఈ సర్వీసు విజయవాడ నుంచి బయల్దేరుతుంది.



పుస్తకాలొచ్చాయోచ్

విద్యాసంవత్సరం ఇలా ప్రారంభమైందో లేదో అలా పాఠ్య పుస్తకాలు, బ్యాగులు విద్యార్థులకు అందాయి. కొత్త ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందజేశారు.



మీ సర్వే రాళ్లకో దండం

- కుమ్మమూరు, కనకవల్లిలో జగనన్న భూరక్ష సర్వేరాళ్ల తొలగింపు
- ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుతో రైతుల్లో తెగింపు

- 6లో..



పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

గత పాలకుల నిర్లక్ష్యం వల్లే

4 వేల ఎకరాలు బీడుగా మారింది

» అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

కోడూరు, జూన్ 14: గత పాలకుల నిర్లక్ష్యం వల్లే 4 వేల ఎకరాల సాగు భూమి బీడుగా మారిందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం కోడూరు మండలంలో సాగు చేయకుండా బీడుగా మారిన పొలాలను, పంట కాలువలను, పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్‌లను ఆయన పరిశీలించారు. మండలంలో బీడుబారిన భూములకు సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చానని, వాటిని నెరవేర్చేందుకు అధికారులతో పర్యటిస్తున్నానని మండలి తెలిపారు. ప్రస్తుతం రూ.43.30 లక్షలతో కోడూరు ప్రధాన పంటకాలువ మరమ్మతులు, నరసింహాపురం లింగన్నకోడుపై వంతెనిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. రైతులకు తాత్కాలికంగా ఊరట కలిగించేందుకు నాలుగు వేల ఎకరాల్లో సాగు చేసుకునేలా తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. వచ్చే ఏడాదికి సముద్రపు ఉప్పునీరు పంట పొలాల్లోకి చేరకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి రైతుల సమస్యలు తీసుకెళ్లి అవుట్‌ఫాల్ స్లూయిస్ నిర్మాణ పనులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపుతానని మండలి హామీ ఇచ్చారు. గతంలో రైతుల దీన స్థితిని చూసి ఎంపీ బాలశౌరి నిధులు మంజూరు చేస్తానని చెబితే, దానికి స్థానిక ఎమ్మెల్యే సంతకం కావాలని. గ్రామ పంచాయతీ తీర్మానం కావాలని కోరారని, స్థానిక ఎమ్మెల్యే దానికి అడ్డుపడి సంతకం చేయలేదని, పంచాయతీ తీర్మానం చేయనివ్వలేదని రైతులు తెలిపారు. ఈ ఏడాది ప్రతీ ఎకరానికి సాగునీరు అందించేందుకు కృషిచేస్తానని బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. మండలి వెంకట్రామ్, బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, ఉల్లి శేషగిరిరావు, గోగినేని సోమశేఖరరావు, పిల్లి మల్లికార్జునరావు, కొక్కిలిగడ్డ సముద్రాలు, విజ్జినేని శివాజీ, దామెర్ల నారాయణ, మద్దూరి కాంతారావు, ముద్దినేని చంద్రరావు, ఇరిగేషన్ డీఈఈ రావెళ్ల రవికిరణ్, డ్రెయినేజీ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈలు పాల్గొన్నారు.





తాడిగడపలో వైఎస్సార్ విగ్రహం స్థానంలో ఏర్పాటు చేసిన రంగా విగ్రహం, ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహం శిలాఫలకం

తాడిగడపలో రంగా విగ్రహం ఏర్పాటు

» వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించి ఆ స్థానంలో ఏర్పాటు చేసిన గుర్తుతెలియని వ్యక్తులు..ఘటన ఆలస్యంగా వెలుగులోకి

పెనమలూరు, జూన్ 14: తాడిగడప వందడుగుల రోడ్డు ఎదురుగా ఉన్న కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఆరు విగ్రహాల్లో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు తొలగించి ఆస్థానంలో రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాడిగడప సెంటరులో బందరు కాల్వ పక్కన ఖాళీ స్థలంలో చిన్నపార్కును నిర్మించి అందులో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం, డాక్టర్ అబ్దుల్ కలాం, జ్యోతిరావుపూలే, ఎన్టీఆర్, వైఎస్సార్‌ల విగ్రహాలు ఏర్పాటుచేశారు. పార్కు చుట్టూ రెయిలింగ్‌ను కూడా ఏర్పాటు చేసి గేట్లు అమర్చారు. గత జనవరిలో ప్రారంభం కావాల్సిన పార్కు, విగ్రహాలు కొన్ని సాంకేతిక కారణాల వల్ల కాలేదు. అప్పటి నుంచి విగ్రహాలకు ముసుగులు కప్పి ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే ఆ ముసుగులను కాస్త పటిష్టం చేశారు. ఈనెల నాలుగున ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు వైఎస్సార్ విగ్రహం సైజుతో సమాన సైజున్న రంగా విగ్రహాన్ని తెచ్చి వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించారు. అదే స్థానంలో రంగా విగ్రహాన్ని అమర్చి కంకరు వేసి, పటిష్ట పరిచారు. విగ్రహాన్ని ఎవరూ గమనించకుండా ఎవరికీ అనుమానం రాకుండా దానికి ముసుగు కప్పారు. వైఎస్సార్ విగ్రహం వద్ద అతికించిన శిలాఫలకాలను ధ్వంసం చేశారు. వాటి ఆనవాళ్లు అక్కడే ఉన్నాయి. తొలగించిన వైఎస్సార్ విగ్రహం ఆనవాళ్లు కనపించకుండా ఎక్కడో పారేశారు.

నూతన క్రీడా పాలసీ అమలు చేయాలి

» ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రావు వినతి

విజయవాడ స్పోర్ట్సు, జూన్ 14: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుతీరిన నేపథ్యంలో 2022లో ముగిసిన క్రీడా పాలసీ స్థానంలో నూతన విధానం తేవాలని, జిల్లాల్లో, రాష్ట్రంలోని క్రీడా అసోసియేషన్లలో స్పోర్ట్సు కోడ్ కచ్చితంగా అమలు చేసేలా చూడాలని యువజన, క్రీడలశాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్నను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రావు తెలిపారు. 2019లోనే వైసీపీ ప్రభుత్వం స్పోర్ట్సు కోడ్ అమలు చేయడంలో విఫలమైందని హైకోర్టులో పిటిషన్ వేయగా, కోర్టు ధిక్కారణ కింద శాప్ అధికారులకు మొట్టికాయలను కోర్టు వేసిందని, అయినా అమలు చేయలేదని ఆయన తెలిపారు. దీంతో నిజమైన క్రీడాకారులకు అన్యాయం జరుగుతోందన్నారు. శాప్‌లో రిటైరైన అధికారులను తిరిగి కొనసాగించే విధానం సరైందని కాదని, ఈ స్థానాల్లో నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని కేపీ రావు కోరారు. నందికొట్కూర్‌లో శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి హయాంలో రెండు స్టేడియాలు నిర్మాణాల్లోను అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు,

సెంట్రల్ జోన్ క్రికెట్‌లో కృష్ణా జయకేతనం

విజయవాడ స్పోర్ట్సు, జూన్ 14: మూలపాడు ఏసీఏ క్రికెట్ స్టేడియం వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్-14 పురుషుల వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో పశ్చిమ గోదావరి జిల్లాపై కృష్ణాటీమ్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. శుక్రవారం ఇరుజట్ల మధ్య మ్యాచ్ సాగింది. తొలుత బ్యాట్‌పట్టిన కృష్ణాజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 324 పరుగులకు ఆలౌటైంది. బ్యాటర్స్ పీవీ దుర్గారావు(97) మూడు పరుగుల తేడాతో సెంచరీ మిస్ కాగా, వరుణ్‌సాత్విక్(73), శ్రీనిశ్చయ్(70) అర్ధ సెంచరీలతో రాణించడంతో కృష్ణా మంచి స్కోర్ చేసింది. పశ్చిమ బౌలర్లలో హర్షవర్ధన్, మహబూబ్, భువనేశ్వర్‌లు రెండేసి చొప్పున వికెట్లను తీశారు. అనంతరం బరిలో దిగిన పశ్చిమగోదావరి జట్టు 50 ఓవర్లలకు 251/6 పరుగులను చేసి పరాజయం పాలైంది. స్వామినాయుడు సెంచరీ(103) చేయగా, కేఎస్ఎన్ రాజు(75) అర్ధసెంచరీతో రాణించారు. కృష్ణా బౌలర్లలో హనుమశాస్త్రి 3 వికెట్లు, గీత్ రెండు వికెట్లు తీశారు.

మలేషియాలో విజయోత్సవాలు



పెనుగంచిప్రోలు: టీడీపీ కూటమి విజయం సాధించి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మలేషియాలో పెట్రోనాస్ టవర్స్ దగ్గర టీడీపీ అభిమానులు పార్టీ జెండాతో విజయోత్సవాలు జరిపారు. ఈ కార్యక్రమంలో కసుకుర్తి దశరథ రామారావు, సామినేని రంగారావు, నల్లబోతు నరేష్, కాకుమాను నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతనపల్లి రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు

రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

» మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటన



మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో బాధితులను పరామర్శించాక ఎక్స్‌గ్రేషియాను ప్రకటిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 216-ఏపై కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున 4-5 గంటల మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోనసీమ జిల్లా తాళ్లరేవు, ఎస్.యానాం ప్రాంతాలకు చెందిన ఆరుగురి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించారు. ప్రమాదంలో గాయపడి మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురు బాధితులను కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీతో కలిసి ఆయన పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ జీఎస్ రమేష్‌కుమార్, ఇతర వైద్యులను చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చేపల పట్టుబడి, ప్యాకింగ్ పనుల నిమిత్తం బంటుమిల్లి మండలం మునిపెడ గ్రామానికి బొలేరోలో వస్తున్నా రన్నారు. వారు ప్రయాణిస్తున్న వాహనం సీతనపల్లివద్ద ఎదురుగా వస్తున్న కంటెయినర్‌ను ఢీకొట్టిందని తెలిపారు. ఎస్.యానాం సమీంలోని ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన రేవు నాగభూషణం(26), అమలాపురానికి చెందిన పెదశింగు కనకరాజు (34), కాట్రేనికోన మండలం గద్దనపల్లికి చెందిన మాద్రాద్రి సోమరాజు(32), చింతా లోవరాజు(32), కరపమండలం తాళ్లరేవుకు చెందిన గండి ధర్మారావు(27), తమిళనాడుకు చెందిన కంటెయినర్ డ్రైవర్ అయ్యప్పన్ జయరామన్(42) ప్రమాదంలో గాయపడి మృతిచెందారని తెలిపారు. ఒక్కొక్క మృతుడి కుటుంబానికి రూ.5లక్షల చొప్పున ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియోగా ఇస్తామని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురిలో ఒకరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించనున్నట్లు తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వాహనాల్లో వారి స్వస్థలాలకు చేర్చాలని కలెక్టర్, అధికారులను ఆదేశించారు. పోస్టుమార్టం రిపోర్టుతో పాటు, మరణ ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన మంజూరుచేసి ప్రభుత్వ పరంగా ఇచ్చే నగదును ఇప్పించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడం దురదృష్టకరమని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు తదితరులు బాధితులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

బాధితులకు కృష్ణప్రసాద్, నాయకర్ పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడి మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ వేర్వేరుగా పరామర్శించారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ జీఎస్ రమేష్ కుమార్‌ను కృష్ణప్రసాద్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని ఆదుకుంటామని ఆయన తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడినవారిని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో పరామర్శించారు. అమలాపురం, పరిసర గ్రామాలకు చెందిన ముగ్గురు ఈ ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆయన పలకరించారు. గాయాలపాలైన వారిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి పంపితే, అక్కడ మరింత మెరుగైన వైద్య సేవలు చేయిస్తానని నాయకర్ తెలిపారు. ఎమ్మెల్యే వెంట నరసాపురం నియోజకవర్గానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

దుర్గమ్మ సేవలో నూతన మంత్రులు

వన్‌టౌన్, జూన్ 14: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను శుక్రవారం నూతన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సవిత, పయ్యావుల కేశవ్‌లు వేర్వేరుగా దర్శించుకున్నారు. మంత్రులకు ఈవో రామరావు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వారికి వేద పండితుల ఆశీస్సులు ప్రసాదం శేష వస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారుపే.



మంత్రులు సవిత, ఆనం రామనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

అమ్మవారిని దర్శించుకునేందుకు శుక్రవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. క్యూలలో భక్తులు ఒత్తిడికి గురికాకుండా చర్యలు తీసుకున్నారు. పలువురు భక్తులు తమ మొక్కుల మేరకు ఆర్జిత పూజల్లో పాల్గొన్నారు. భక్తుల రద్దీ నియంత్రణను ఈవో రామారావు పర్యవేక్షించారు. చీరల కౌంటర్‌ను పరిశీలించారు. ధర్మపథం వేదికపై తునికి చెందిన దర్పన్ నాట్య అకాడమీకి చెందిన కళాకారులు కూచిపూడి నాట్య ప్రదర్శన చేశారు.

మీ సర్వే రాళ్లకో దండం

» కుమ్మమూరు, కనకవల్లి గ్రామాల పరిధిలో జగనన్న భూరక్ష సర్వేరాళ్లను తొలగిస్తున్న రైతులు

» ల్యాండ్ టైటిల్ చట్టం రద్దుతో రైతుల్లో తెగింపు



కనకవల్లి డొంకరోడ్డు వెంట తొలగించిన సర్వే రాళ్లు, కుమ్మమూరులో గట్టు నుంచి కాలువకట్టపైకి చేర్చిన రాళ్లు, సర్వే అస్తవ్యస్తంగా చేసి కుమ్మమూరులో ఒకేచోట వేసిన మూడు రాళ్లు

తోట్లవల్లూరు, జూన్ 14: సీఎం నారా చంద్రబాబునాయుడు ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయటంతో గత వైసీపీ ప్రభుత్వంలో వేసిన వైఎస్సార్ జగనన్న భూరక్ష సర్వే రాళ్లను కొందరు రైతులు తొలగించేస్తున్నారు. రాళ్లను తీసేసి డొంకలు, గట్లపై పడేస్తూ మీ సర్వే మాకొద్దు.. మీ రాళ్లకో దండం అంటున్నారు. రైతులకు సంబంధం లేకుండా డిజిటల్ సర్వే పేరుతో వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలకు నెల ముందు మండలంలో నాలుగు వేల ఎకరాల్లో అధికారులు సర్వేచేసి పొలాల్లో రాళ్లను వేశారు. రైతులకు సమాచారం లేకుండా రెవెన్యూ అధికారులే ఇష్టారీతిన రాళ్లను పాతారు. గతంలో ఉన్న సరిహద్దులను దాటి రాళ్లను వేయడంతో రైతుల మధ్య కొత్త వివాదాలకు తెరలేపినట్లైంది. కుమ్మమూరులో ఓ పొలంలో ఒకేచోట మూడు సర్వే రాళ్లను వేయటం సర్వే ఎంత లోపభూయిష్టంగా జరిగిందో తెలియజేస్తోంది. అధికారులు వేసిన రాళ్లను తీయటానికి రైతులు ధైర్యం చేయలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుతీరి చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టి, ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేస్తూ సంతకం చేయటంతో రైతుల్లో ఎక్కడా లేని ధైర్యం వచ్చింది. ఇక అనుకూలమైన ప్రభుత్వం వచ్చినందున సర్వే రాళ్ల తొలగింపును రైతులు చేపట్టారు. అస్తవ్యస్తంగా వేసిన రాళ్లను తొలగిస్తూ పాత హద్దుల పక్కనే ఉన్న రాళ్లను కదపటం లేదు.



గోవధ నిషేధ చట్టం పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గోవధకు పాల్పడితే చర్యలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు హెచ్చరిక

విజయవాడ లీగల్, జూన్ 14: ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధ పశు సంరక్షణ చట్టం-1977 ప్రకారం గోవధను నిషేధించారని, గోవధకు పాల్పడినా, తోడ్పడినా చట్టరీత్యా శిక్షార్హులేనని, అధికారులు గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా జంతు సంక్షేమ సంఘం చైర్మన్, కలెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షతన రెవెన్యూ, పోలీస్, నగరపాలకసంస్థ, పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో గోవధ నిషేధ చట్టం అమలుపై సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు యానిమల్స్(ఎస్పీసీఏ) సమావేశాన్ని నిర్వహించారు. చట్ట విరుద్ధంగా పశువులను వధించడం, అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు సాధారణ పౌరులు ఇచ్చిన ఫిర్యాదులు కూడా అధికారులు స్వీకరించి విచారణ జరపవచ్చన్నారు. బక్రీద్ సందర్భంగా గోవధ నియంత్రణకు మండల, డివిజన్ గ్రామస్థాయిలో అధికారులతో చట్టాన్ని పర్యవేక్షించేలా ప్రత్యేక బృందాలు నియమించామన్నారు. పశువులను కబేళాకు తరలించే ముందు పరిశీలించి, ఫామ్-ఏ సర్టిఫికెట్ ఉంటేనే దానిని నిర్ధారించి లోపలికి అనుమతిస్తారన్నారు. గోవధ నిషేధ చట్టం పోస్టరును విడుదల చేశారు.

డ్రెయినేజీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కృష్ణలంక: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మురుగునీటి నిల్వను అరికట్టేందుకు డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాల్సిన అవసరముందని, మురుగు పారుదల వ్యవస్థల్లో లోపాలను గుర్తించి తక్షణమే సరిదిద్దాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రెయినేజీ వ్యవస్థ సజావుగా సాగేలా చూడాలని, దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలని, పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడం, పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోక్వాల్, ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్ పాల్గొన్నారు.



కంచికచర్లలో ధ్వంసం చేసిన టీడీపీ, జనసేన ఫ్లెక్సీలు

టీడీపీ, జనసేన ఫ్లెక్సీలు ధ్వంసం

» పోలీసుల అదుపులో వైసీపీ కార్యకర్త

» వైసీపీ నాయకుల పనే అని కూటమి నేతల ఆరోపణ

» చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

కంచికచర్ల రూరల్, జూన్ 14: కంచికచర్లలో టీడీపీ, జనసేన నేతల ఫొటోలతో అభిమానులు, కార్యకర్తలు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ప్రమాణస్వీకారం సందర్భంగా నెహ్రూ సెంటర్, గొట్టుముక్కల రోడ్డు, ఇందిరా కాలనీ తదితర చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నెహ్రూ సెంటర్లో ఏర్పాటు చేసిన 50 అడుగుల భారీ ఫ్లెక్సీని ధ్వంసం చేశారు. ఇది వైసీపీకి చెందిన వారి పనే అని కూటమి నేతలు ఆరోపించారు. నిందితులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై టీడీపీ నేత కోగంటి బాబు, వేమా కిషోర్, జనసేన నాయకుడు తోట ఓంకార్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్‌ను కూటమి నేతలు కలిసి ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వైసీపీ కార్యకర్త నరేంద్రతో పాటు వైసీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్, అతని అనుచరుడు మంగినేని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. వైసీపీ కార్యకర్త దేవిరెడ్డి నరేంద్రను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

రేపు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు

» ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్(యూపీఎస్సీ) నేతృత్వంలో సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం విజయవాడలో జరగబోతున్నాయి. మొత్తం 11,112 మంది అభ్యర్థులు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు రాయడం కోసం విజయవాడలో 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సివిల్స్ ప్రిలిమ్స్ రాసే అభ్యర్థుకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల నిర్వహణకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం 25 మంది రూట్ అధికారులను, 25 మంది సహాయ సూపర్‌వైజర్లను నియమించింది. వీరంతా పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తారు. సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షల ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు సమీక్షించారు. పరీక్షా కేంద్రాలలో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై చర్చించారు. పరీక్షా కేంద్రాల దగ్గర పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఆరోగ్య శాఖను, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖాధికారులకు సూచించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆయా రూట్లలో అదనపు బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెట్టాలని, జామర్లను ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. యూపీఎస్సీ ఉన్నతాధికారులు ఇచ్చిన చెక్‌లిస్ట్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మీడియాతో మాట్లాడారు. సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు.

అరాచక పాలకుడు జగన్

» అందుకే 11 సీట్లిచ్చి జనం గట్టిగా బుద్ధి చెప్పారు: దేవినేని ఉమా

గొల్లపూడి, జూన్ 14: ఐదేళ్ల పాటు అరాచక పాలన చేసిన జగన్‌కు జనం 151 సీట్లలో మధ్యలో ఉన్న 5 తీసేసి 11 సీట్లిచ్చి గట్టిగా బుద్ధి చెప్పారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. గొల్లపూడిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అట్టే కళ్లు మూసుకొండి ఇట్టే ఐదేళ్లు అయిపోతాయని జగన్ పగటి కలలు కంటున్నాడని ఆయన దుయ్యబట్టారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిందని, ప్రజా పరిపాలన నడుస్తోందని అన్నారు. సీఎంగా చంద్రబాబు సంతకాలు చేసిన కొన్ని గంటల్లోనే వాటి అమలుకు ఉత్తర్వులు జారీ చేశారని ఉమా తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు చంద్రబాబు నాయుడిని అభినందిస్తున్నారన్నారు.

మర్యాదపూర్వకంగా..



ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీజేఏసీ అమరావతి నాయకులు

వన్‌టౌన్, జూన్ 14: ఆర్థిక శాఖ రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్‌ను శుక్రవారం ఏపీ జేఏసీ అమరావతి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు కోరుకున్న ప్రభుత్వం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఉద్యోగులందరికీ మేలు జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. పయ్యావుల కేశవ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. అనంతరం కొద్దిసేపు మంత్రితో మాట్లాడారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, కోశాధికారి వీవీ మురళీకృష్ణానాయుడు, రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ నాయకుడు కె.రమేష్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు, లేబర్ ఆఫీసర్ల సంఘం నాయకుడు బి.కిషోర్‌కుమార్, జేఏసీ అమరావతి మహిళా విభాగం చైర్‌పర్సన్ పారే లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య, ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి శ్రీనివాస్, కార్యదర్శి బత్తిన రామకృష్ణ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



కొల్లు రవీంద్రకు అభినందనలు తెలుపుతున్న బాలశౌరి

కొల్లు రవీంద్రకు ఎంపీ బాలశౌరి అభినందన

మచిలీపట్నం టౌన్: రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రకు గనులు, ఎక్సైజ్, జియాలజీ శాఖలు కేటాయించడం పట్ల ఎంపీ వల్లభనేని బాలశౌరి, జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ హర్షం వ్యక్తంచేశారు. మంత్రి కొల్లు రవీంద్రను కలిసి ఎంపీ వల్లభనేని బాలశౌరి అభినందించారు. జనసేన నాయకులు గడ్డం రాజు, మాదివాడ రాము, గల్లా తిమోతి, సమీర్, వంపుగడల చౌదరి, మోకా రవి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

మచిలీపట్నం టౌన్, జూన్ 14: మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో పని చేస్తూ విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతిచెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంపూర్ గ్రామా నికి చెందిన బొల్లా జితేంద్ర(23) మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం విద్యుత్ పనులు చేస్తుండగా షాక్ తగిలింది. దీంతో అక్కడికక్కడే మృతి చెం దాడు. రైల్వే పోలీసులు గుర్తించి జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం..కారు డ్రైవర్‌పై కేసు

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 14: పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి బాలికను మోసగించిన వ్యక్తిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతానికి చెందిన బాలిక(16) నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తోంది. రెండేళ్ల క్రితం బాల్య వివాహం జరగగా భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన కారు డ్రైవర్ శీలా వెంకటేశ్వరరావు పరిచమయ్యాడు. ప్రేమ పేరుతో దగ్గరై పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి, బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పెళ్లికి నిరాకరించడం, గతంలోనే వెంకటేశ్వరరావుకు పెళ్లయిందని తెలియడంతో మోసపోయానని గుర్తించిన బాలిక అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.00

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 14 : అజిత్‌సింగ్‌నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బి.వి.సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా యార్డ్ రోడ్డు, లూనా సెంటర్, ఎంకే. బేగ్ స్కూల్, లెనిన్‌సెంటర్, రైల్వేట్రాక్ రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం, వడ్డెర కాలనీ, రైతుబజార్, ఎమ్మెల్సీ కార్యాలయం రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.



పార్కు అభివృద్ధిపై ఆదేశాలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్

అక్కినేని పార్కును అభివృద్ధి చేయండి

పటమట, జూన్ 14 : మారుతీ కో-ఆపరేటివ్ ఎంప్లాయాస్ కాలనీలోని అక్కినేని పూర్ణచంద్రరావు పార్కును అభివృద్ధి చేయాలని వీఎంసీ అధికారులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పార్కును స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణతో కలిసి వీఎంసీ కమిషనర్ పుండ్కర్ శుక్రవారం సందర్శించారు. పార్కులో వాకర్ల సౌకర్యార్థం వాకింగ్ ట్రాక్‌ను, ప్రజలందరికీ ఆరోగ్యానికి తోడ్పడేందుకు ఓపెన్ జిమ్ పరికరాలు, చిన్నారులకు ఆటవస్తువులు ఏర్పాటు చేయాలని, గ్రీనరీ పెంచాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. పార్క్ వెనుక భాగంలో మెడిటేషన్ హాల్‌ను అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంట కాల్వ రోడ్డు పక్క నే గల పార్కులో కూడా ఆటవస్తువులు అందజేసి, అందమైన పెయింటింగ్స్ వేసి అభివృద్ధి చేయాలని అధికారులు సూచించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బీటీ రోడ్డు వేయాలని ఇంజనీరింగ్ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చంద్రశేఖర్‌రావు, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, తిలక్, కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు ఐటీ మంత్రి పదవి పట్ల హర్షం

ధర్నాచౌక్, జూన్ 14 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు మానవ వనరులు, ఐటీ, కమ్యూనికేషన్స్ శాఖ కేటాయించడం పట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ కార్యదర్శి బి.జె.గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సక్రమంగా నిర్వహించాలనే దృఢసంకల్పంతో సమర్థుడైన లోకేష్‌కు ఆయా శాఖలు కేటాయించడం హర్షణీయమన్నారు. ఇది రాష్ట్ర విద్యా వ్యవస్థకు శుభసూచికమన్నారు. విద్యా వ్యవస్థను అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శవంతంగా నిలపాలన్నారు.



చంద్రబాబుకు అభినందన తెలిపే కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దంపతులు



విద్యా కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

అభివృద్ధి, సంక్షేమంలో అగ్రగామిగా నిలుపుతాం

పటమట, జూన్ 14 : రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టే విధంగా సీఎం చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకువెళుతున్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. రాష్ట్రానికి నాల్గవసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి, ఐదు సంక్షేమ పథకాలపై సంతకం చేసిన నేపథ్యంలో చంద్రబాబుకు అభినందనలు తెలియజేసే కార్యక్రమం శుక్రవారం అశోక్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, అనురాధ దంపతులను పార్టీ నాయకులు, కార్పొరేటర్లు సత్కరించారు. రామ్మోహన్ మాట్లాడుతూ పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబు ఐదు సంతకాలతో హామీలు అమలుకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఈ ఐదు సంతకాలతో న్యాయం జరుగుతుందన్నారు. గద్దె అనురాధ మాట్లాడుతూ టీడీపీకీ చారిత్రాత్మక విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బొప్పన భవకుమార్, పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, శాయన బుజ్జి, కొలసాని నాగమణి, ఎం.చిన్నతల్లి, ఎ. శ్రీదేవి, చెన్నుపాటి గాంధీ, కొలసాని నాగమణి, ఎం.చిన్నతల్లి, ఏ. శ్రీదేవి, కె.రాజేష్, పి.శ్రీను, ఆర్. కోటి, బి. సాయి శ్రీనివాస్, వై. దేవేంద్ర, ఎం.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో ప్రజలకు మేలు

కృష్ణలంక : రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పాలన మొదలైందని, రాష్ట్ర ప్రజలకు ఇక అంతా మంచే జరుగుతుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. యువతలో స్కిల్స్ పెంచి వారికి బంగారు భవిష్యత్తును కల్పిస్తామని చెప్పారు. కృష్ణలంక 22వ డివిజన్‌లోని ఎస్‌వీ రెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హాజరై విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఎంఈవో విజయ రామారావు, ప్రధానోపాధ్యాయుడు ఎం. వి.వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పి.అన్నారావు, గొరిపర్తి నామేశ్వరరావు, వేముల దుర్గారావు, మాజీ కార్పొరేటర్ చందన సురేష్, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, తోట శ్రీను, బుల్లెట్ శివ, నడికుప్పుల రవి పాల్గొన్నారు.

నాదెండ్లకు పౌరసరఫరాల శాఖపై రేషన్ డీలర్ల సంఘం హర్షం

మొగల్రాజపురం, జూన్ 14 : పౌరసరఫరాల శాఖను నాదెండ్ల మనోహర్ ఇవ్వడం పట్ల ఎన్టీఆర్ జిల్లా రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ప్రభుత్వంలో ఎంతో కీలకమైన పౌరసరఫరాల శాఖను నీతి, నిజాయితీ కలిగిన నాదెండ్ల మనోహర్ ఇవ్వడం మంచి ఫలితాలను ఇస్తుందని అధ్యక్షుడు యం. శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి పి.శివ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఎన్టీఆర్ జిల్లా రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు.



బోయపాటి పాఠశాలలో విద్యా కిట్లు పంపిణీ

మొగల్రాజపురం, జూన్ 14 : మొగల్రాజపురం బోయపాటి శివరామకృష్ణయ్య పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారావు చేతుల మీదుగా విద్యా కిట్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. మొత్తం 450 కిట్‌లను పంపిణీ చేశామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా డ్రైనేజీ గోతులు

● 40 రోజుల క్రితం తవ్వి.. వదిలేశారు

● డ్రైనేజీ గోతిలో పడి విద్యార్థినికి గాయాలు

● వ్యాపారాలు లేక యజమానుల గగ్గోలు

పటమట, జూన్ 14 : ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రోడ్డుకు ఒక పక్కన డ్రైనేజీ నిర్మాణం కోసం గోతులు తవ్వి వదిలేశారు. డ్రైనేజీ పనులు కోసం తవ్వే క్రమంలో అడుగున ఉన్న మంచినీటి పైపులు పగిలి నీరు నాలుగు అడుగులు లోతున నిలిచింది. దీనివల్ల స్థానిక ప్రజలు, షాపుల వారు ఇబ్బందులకు గురవుతున్నారు. సమీపంలోని అపోలో పార్మసీ, ఇతర షాపులు పదికి పైగానే ఉన్నాయి. పుస్తకాల షాపు యజమాని మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ఈగత నెల రెండో తేదీన డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్వారని, సదరు కాంట్రాక్టర్‌కు డబ్బులు రాకపోవడంతో పనులు ఆపివేశారన్నారు. ఇప్పటికి 40 రోజులవుతోందన్నారు. ఈ గోతుల కారణంగా వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నా వాపోయారు. ఇటీవల ఒక విద్యార్థిని పుస్తకాలను కొనడానికి వస్తూ డ్రైనేజీలో పడిపోయిందన్నారు. షాపులకు రావడానికి కొనుగోలుదారులు బయపడుతున్నారన్నారు. కార్పొరేషన్ అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



ఎన్టీఆర్ సర్కిల్ వద్ద షాపుల ముందు తవ్వి వదిలేసిన డ్రైనేజీ గోతులు

పంచముఖి ఆంజనేయస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వన్‌టౌన్, జూన్ 14 : పశ్చిమ నియోజకవర్గంలోని విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ అంజనేయస్వామివార్ల దేవస్థానంలో శుక్రవారం చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, అఖండ దీపారాధన, అంకురారోపణ, ప్రధాన కలశస్థాపన, ప్రధాన దేవతా మూర్తులకు అనుష్టానాలు, పారాయణ హోమాలు, బలిహరణ శాంతి కల్యాణం తదితరాలను నిర్వహించారు. ఆలయంలో నెలకొన్న దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ, అర్చనలు, మంత్రపుష్పాలు, హారతులు వంటివి సమర్పించారు. భక్తులు పలువురు పాల్గొన్నారు.



ట్రక్కర్స్ ప్రాజెక్ట్ మేనేజర్ వి.వి.సాంబశివరావుకు అవార్డు అందజేస్తున్న ఉషారాణి

ట్రక్కర్స్ ప్రాజెక్ట్‌కు రక్తదాన అవార్డు

కృష్ణలంక : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం విజయవాడ పరిధిలోని ఇబ్రహీంపట్నం వీటీపీఎస్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి ఉషారాణి పాల్గొన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించే సేవకులకు అవార్డులు అందజేశారు. ది కృష్ణా డిస్ట్రిక్టు లారీ ఓనర్స్ అసోసియేషన్, ట్రక్కర్స్ ప్రాజెక్ట్ మేనేజర్ వి.వి.సాంబశివరావు మూడోసారి అదనపు జిల్లా మెడికల్ ఆఫీసర్ ఉషారాణి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అంపాపురంలోని మోడల్ డ్రైవింగ్ స్కూల్‌లో క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.



కల్వర్టు మరమ్మతు పనులు ప్రారంభం

వన్‌టౌన్, జూన్ 14 : వన్‌టౌన్‌లోని 50వ డివిజన్ రాఘవ రెడ్డి రోడ్డులో కల్వర్టు మరమ్మతు పనులను చేపట్టినట్లు డివిజన్ కార్పోరేటర్ బి.సత్యబాబు తెలిపారు. పనులను ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కోరారు. మంచినీరు సరిగా రావడం లేదని ఈఈ, డీఈ, ఏఈలకు తెలియజేశారు. ఏఈ రాజేష్‌తో పాటు సత్యబాబు దాసాంజనేయ వీధి తదితర ప్రాంతాలలో పర్యటించారు. రిజర్వాయర్ పూర్తిగా నిండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు తెలిపారు.



పర్సా సత్యన్నారాయణ చిత్రపటానికి నివాళలర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పర్సా సేవలు చిరస్మరణీయం

రాణిగారితోట, జూన్14 : సింగరేణి బొగ్గు కార్మికులకు ఆరాధ్యుడు పర్సా సత్యన్నారాయణ అని ఎన్టీఆర్ జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ అన్నారు. సీఐటీయూ వ్యవస్థాపక సభ్యుడు, పాల్వంచ మాజీ ఎమ్మెల్యే పర్సా సత్యన్నారాయణ శత జయంతి కార్యక్రమం రాణిగారితోట సుందరయ్య గ్రంథాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి బొగ్గు పనిలో బాలకార్మికుల వ్యవస్థను నిర్మూలించడం గొప్ప విజయం అన్నారు. సీఐటీయూ వ్యవస్థాపక ఉద్యమ నేతగా 32 సంవత్సరాలు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా పనిచేశారన్నారు. ఎమ్మెల్యేగా ప్రజలకు మంచి పాలన అందించడం ఆయనకే సాటి అని అన్నారు. పర్సా జీవితం నేటి తరానికి ఆదర్శం అన్నారు. టి.చంద్రశేఖర్, వి.గురుమూర్తి, ఈశ్వర్ రెడ్డి, రూబెన్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



పరమేశ్వరుని ఆజ్ఞతోనే కన్నప్ప తీశాం

మంచు మోహన్‌బాబు

"కన్నప్ప కథ అన్ని తరాలను ఆకట్టుకుంటుంది. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే 'కన్నప్ప' చిత్రం తీశాం. ప్రభాస్ కోసం రాసుకున్న కథను కృష్ణంరాజు గారు మేం అడగ్గానే ఇచ్చి, ప్రోత్సహించారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఇది కేవలం భక్తి చిత్రమే కాదు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలూ ఉన్నాయి' అని మంచు మోహన్‌బాబు అన్నారు. విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. ముఖేశ్ కుమార్ దర్శకత్వంలో డాక్టర్ మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. శుక్రవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ '2014లో 'కన్నప్ప' సినిమా తీయాలని నిశ్చయించుకున్నాను. అంతా సిద్ధం చేసి పెట్టుకున్నాను. ఇప్పుడు సినిమా తీసి మీ ముందుకు తీసుకొస్తున్నాం. కన్నప్పది కల్పిత గాథ కాదు. రెండో శతాబ్దంలో జరిగిన ఘటన. శంకరాచార్యుల వారు కూడా కన్నప్ప గురించి చెప్పారు. 14వ శతాబ్దంలో ధూర్జటి కన్నప్ప గురించి రాశారు. 18వ శతాబ్దంలో కన్నప్ప గురించి బ్రిటీషర్లు రాసిన పుస్తకం బికనీర్ యూనివర్శిటీలో ఉంది. దాని ఆధారంగానే జాగ్రత్తగా సినిమా తీశాం. ఇకపై ప్రతి సోమవారం కన్నప్ప చిత్రం నుంచి అప్డేట్ వస్తుంది. బడ్జెట్ గురించి ఆలోచించలేదు. చరిత్రలో నిలిచిపోయే సినిమా తీస్తున్నామని ధైర్యంగా ముందుకెళ్లాం' అని చెప్పారు. కన్నప్ప పాత్ర కోసం విష్ణు పడిన కష్టం గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నారు ముఖేశ్ కుమార్. కన్నప్ప సినిమా మాత్రమే కాదు, మన చరిత్ర అని శరత్ కుమార్ చెప్పారు. ఒక గొప్ప సినిమాలో నటించినందుకు ఆనందంగా, గర్వంగా ఉందని మధుబాల చెప్పారు.

పవర్‌ఫుల్ పాత్రలో...



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'విశ్వంభర'. త్రిషకృష్ణన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా, విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ శుక్రవారం సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఇందులో ఆయన చాలా పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తున్నారని మేకర్స్ తెలిపారు. సంక్రాంతి కానుకగా ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. ఈ చిత్రానికి డీఓపీ: చోటా.కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి.

నా కోరిక తీరింది



చైతన్యరావు, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఈ రొమాంటిక్ కామెడీకి బాల శేఖరుని దర్శకత్వం వహించగా, కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో చైతన్య రావు మాట్లాడుతూ "ప్రతి నటుడికీ అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న క్యారెక్టర్ చేయాలనే కోరిక ఉంటుంది. ఈ సినిమా ద్వారా నాకు ఆ కోరిక తీరింది" అని అన్నారు. "అన్ని వర్గాల ప్రేక్షకులకి సినిమా కనెక్ట్ అవుతుంది" అని దర్శకుడు బాలశేఖరుని చెప్పారు. "థియేటర్స్‌లో ప్రేక్షకులని ఆకట్టుకునేది కంటెంట్ మాత్రమే. ఆ మంచి కంటెంట్ ఇందులో ఉంది" అని హెబ్బా పటేల్ అన్నారు.

దీపావళికి సింగం ఎగైన్



అజయ్ దేవ్‌గణ్, అక్షయ్ కుమార్, రణ్‌వీర్‌సింగ్ హీరోలుగా రూపొందుతున్న మల్టీస్టారర్ 'సింగం ఎగైన్'. 'సింగం' సిరీస్‌లో వస్తున్న ఐదో చిత్రమిది. దీపికా పదుకొనే, కరీనాకపూర్ కథానాయికలు. ముందు ప్రకటించిన విధంగా ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవ్వాల్సి ఉంది. అయితే ఇప్పుడు ఈ చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. అక్టోబర్‌లో దీపావళి సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు చిత్రబృందం శుక్రవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. చిత్రీకరణ పూర్తి కాకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని దర్శకుడు రోహిత్ శెట్టి చెప్పారు. జియోస్టూడియోస్, దేవ్‌గణ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నాయి. అయితే సింగం ఎగైన్ స్థానంలో ఆగస్టు 15న 'స్త్రీ 2' చిత్రం రాబోతోంది. శుక్రవారం దర్శకుడు అమర్‌కౌశిక్ సోషల్ మీడియా ద్వారా విడుదల తేదీని ప్రకటించి, టీజర్‌ను విడుదల చేశారు. 2018లో విడుదలైన 'స్త్రీ' చిత్రానికి ఇది కొనసాగింపు. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ జంటగా నటించారు.

నితిన్‌కు జంటగా...



'భీష్మ' చిత్రం తర్వాత హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కలయికలో తెరకెక్కుతున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. శ్రీలీల ఇందులో హీరోయిన్‌గా నటిస్తోంది. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. శుక్రవారం శ్రీలీల పుట్టిన రోజు సందర్భంగా సినిమాలో ఆమె పాత్రను మేకర్స్ పరిచయం చేశారు. ఇందులో విమానం దిగుతూ.. సంపన్నురాలి పాత్రలో కనిపించిన ఆమె పాత్ర పేరు నీరా వాసుదేవ్. ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను డిసెంబరు 20న విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

ఊరి గొడవల్లో కుర్రోళ్ల మజా



సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. నిహారికా కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించారు. యదువంశీ దర్శకుడు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం హీరో నితిన్ ఈ చిత్రం టీజర్‌ను సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఊరి గొడవల్లో తలదూర్చిన యువబృందం ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది అనే నేపథ్యంలో స్నేహం, ప్రేమ, భావోద్వేగాల కలయికగా సాగిన టీజర్ ఆసక్తికరంగా అనిపించింది. సాయికుమార్ కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్. సినిమాటోగ్రఫీ: రాజు ఎదురోలు

వినోదాత్మకంగా 'స్వాగ్'



శ్రీవిష్ణు, రీతూ వర్మ, మీరా జాస్మిన్ నటిస్తున్న చిత్రం 'స్వాగ్'. హసిత్ గోలి దర్శకత్వం వహిస్తుండగా, టి.జి.విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన నటీనటుల ఫస్ట్ లుక్‌లు, క్యారెక్టర్ గ్లింప్స్‌లు అందరినీ ఆకట్టుకోగా.. శుక్రవారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఎంతో వినోదాత్మకంగా సాగిన ఈ టీజర్‌లోని సన్నివేశాలు, సంభాషణలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఈ చిత్రానికి ఎడిటర్: విప్లవ్ విషాదం, డీఓపీ: వేదరామన్ శంకరన్, సంగీతం: వివేక్ సాగర్.

తండ్రీ కొడుకుల సెంటిమెంట్‌తో



చైతన్య రావు, యష్ణ నటించిన ఓటీటీ చిత్రం 'డియర్ నాన్న'. అంజి సలాది దర్శకత్వం వహించగా, రాకేశ్ మహంకాళి నిర్మించారు. ఫాదర్స్ డే స్పెషల్‌గా ఈ సినిమా శుక్రవారం నుంచి ఓటీటీ వేదిక 'ఆహా'లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌లోని తండ్రీ కొడుకుల సెంటిమెంట్ అందర్నీ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రవణ్ కటికనేని, డీఓపీ: అనిత్ కుమార్ మాధాడి, సంగీతం: గిఫ్టన్ ఎలియాస్.

మెప్పించే నాన్న పాట



నూతన నటులు కృష్ణ వంశీ, మోక్ష నటిస్తున్న చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాశ్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని 'నాన్న' పాటను డైరెక్టర్ హను రాఘవపూడి లాంచ్ చేశారు. హృదయానికి హత్తుకునేలా ఉన్న ఈ పాటను దర్శకుడు చిలుకూరి ఆకాశ్‌రెడ్డి రాశారు. శశాంక్ తిరుపతి మ్యూజిక్ అందించగా, అంజనా బాలకృష్ణన్, శ్రాగ్వి ఆలపించారు. ఈ చిత్రానికి ఎడిటర్: జే.సీ.శ్రీకర్, డీఓపీ: ప్రేమ్ సాగర్.

జైలు నుంచి హేమ విడుదల

బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో అరెస్టయి పరప్పన అగ్రహార జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సినీ నటి హేమ శుక్రవారం విడుదలయ్యారు. బుధవారం ఎన్‌డీపీఎస్ ప్రత్యేక కోర్టు హేమకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గురువారం బెయిల్‌లో సూచించిన నిబంధనలకు అనుగుణంగా పూర్తి ప్రక్రియ సాగింది. శుక్రవారం అన్ని షరతులకు లోబడి పత్రాలు సమర్పించడంతో హేమను విడుదల చేశారు.



చింతపండు పానకం

అమ్లికాయాః ఫలం పక్వే మర్దితం వారిణా హృద్యమ్!
శర్కరామరీచేన్మిశ్రం లవంగె నాధివాసితమ్!

చింతపండు అంటే సాంబారుల్లోనూ, పులుసు కూరల్లోనూ వేసేదనే అభిప్రాయం మనలో ఎక్కువ. అది గుండెని బల సంపన్నం చేస్తుందనీ, ఎంతకీ మాడని పుండ్లను తగ్గిస్తుందనీ, ఆకలి పుట్టిస్తుందనీ చాలామందికి తెలియదు. ఔషధాన్ని ఔషధంగా తీసుకోవాలి. ప్రతి ఔషధానికీ ఒక మోతాదు ఉంటుంది. మోతాదు మించితే ఔషధం వికటిస్తుంది. చింతపండూ అంతే. బాగా వేడి శరీర తత్త్వం ఉన్నవారికి, ఎసిడిటీ సమస్యలున్నవారికి, పైత్య వ్యాధులున్నవారికి తప్ప మిగిలిన వారందరికీ చింతపండు మంచిదే.



చింతపండు రసానికి విషదోషాలను హరించే గుణం ఉంది. ఆహారంలో చింతపండు మనకు కలిగించే ప్రయోజనం ఇదే. పురుగు మందులు, ఎరువులతో కలుషితమైన కూరగాయల్ని శుభ్రం చేసుకోవటానికి చింతపండు రసం ఎంతగానో ఉపయోగపడుతుంది. చింతపండుని నీటిలో నానబెట్టి, రసం పిండి, వడగట్టి బాగా పలుచన చేయాలి. ఆ ద్రవంలో కూరగాయ ముక్కలు తరిగితే... కాయలపైన ఉండే విష రసాయనాలు పోతాయి. పండ్లను కూడా ఈ నీళ్లతో కడిగితే పండ్లపైన ఉండే విష దోషాలు పోయి, పండు శుభ్రపడుతుంది.



చింపండు తియ్యతియ్యగా, పుల్లపుల్లగా ఉండి, నాలుక మీద జిగురుని పోగొట్టి, అన్న హితవు కలిగిస్తుంది. ఆహారాన్ని తేలికగా అరిగిస్తుంది. ఒంట్లో నీరు లాగేస్తుంది. 'భోజన కుతూహలం' అనే గ్రంథం చింతపండు రసాన్ని, పంచదారనీ కలిపి తాగితే వాత దోషం తగ్గుతుందని పేర్కొంది. జఠరాగ్నిని పెంపు చేసే ఉపాయాల్లో చింతపండు కూడా ఉపయోగపడుతుంది.

'అమ్లికాఫల పానకం' ఇలా...

క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో 'అమ్లికాఫల (చింతపండు) పానకం' తయారు చేసే విధానం ఇలా వివరించాడు:

- చింతపండుని గింజలు, పుల్లలు లేకుండా శుభ్రపరచుకోండి.
- ఒక పాత్రలో తగినన్ని వేడి నీళ్లు తీసుకొని, అందులో చింతపండు వేసి, కొద్దిసేపు నాననివ్వండి.
- నానిన చింతపండును చేత్తో పిసికి, రసం పిండి, జాలీలో వడగట్టండి.
- ఈ రసంలో పంచదార తగినంత కలపండి. మిరియాలు, లవంగాలు, ఏలకుల పొడి తగినంత చేర్చండి. ఇదే 'అమ్లికాఫల పానకం'.

క్షేమ కుతూహలం'లోనూ, 'భోజన కుతూహలం'లోనూ ఈ చింతపండు పానకం తయారీ ఒకేలా పేర్కొన్నారు. ఇద్దరూ ఈ పానకాన్ని మరిగించటం గానీ, ఉడకబెట్టటం గానీ చెప్పలేదు.

తీపి పులుపు అనే రెండు విరుద్ధ రుచుల కలబోతగా తయారైన ఈ చింతపండు పానకం ఆలస్యంగా అరుగుతుంది. ఉత్తేజాన్ని కలిగిస్తుంది. చలి కాలంలో అనువుగా ఉంటుంది. వాత వ్యాధులతో బాధపడేవారు భయం లేకుండా తాగవచ్చు. ఎసిడిటీ లేకుండా ఉంటే మేలు చేస్తుంది. కొద్దిగా పైత్యాన్ని, కొద్దిగా కఫాన్ని పెంచుతుంది.

అల్సర్లు, విరేచనాల్లాంటి జీర్ణకోశ వ్యాధుల్లో చింతపండు హాని చేస్తుంది. ఏ వ్యాధికైనా చికిత్స తీసుకుంటూ బాగా ఎక్కువగా మందులు వాడేవారు చింతపండుకి దూరంగా ఉండాలి. యాస్పిరిన్ లాంటి కొన్ని మందులు వాడేప్పుడు అధికంగా చింతపండు వాడితే... యాస్పిరిన్ రక్తంలో అవసరమైన దానికన్నా ఎక్కువ అందుబాటులోకి వస్తుంది. నొప్పి, వాపు తగ్గించే మందుల్ని వాడేప్పుడు చింతపండు వాడకాన్ని తప్పనిసరిగా తగ్గించాలి. ఇలాంటివేవీ లేని వ్యక్తులకు చింతపండు అన్ని విధాలా మంచిదే.

'చాంచేయం శర్కరాయుక్తం కర్పూరోదక మర్దనం!
ఫలమార్ద్రక సంయుక్తం ప్రాహసత్పాన కాంతరమ్!'

అంటే... ఈ చింతపండు పానకంలో తగినంత అల్లం, కొద్దిగా పచ్చకర్పూరం కూడా కలిపితే కఫాన్ని, పైత్యాన్ని కూడా తగ్గిస్తుందన్నాడు క్షేమశర్మ. చింతపండు మనకు ఔషధమే. ఇప్పటిలాగా ప్రతి కూరలోనూ, పప్పులోనూ, పచ్చడిలోనూ కలిపి వండే అలవాటు మనకు మొదటి నుంచీ లేదు. మిరప కారం పరిచయం అయ్యాక, ఆ కారానికి తగినంత పులుపు వేసి వండటానికి అలవాటు పడ్డాం. పూర్వపు రోజుల్లో భోజనం పులుసు కూరల్లోనూ, పులుసు లేదా చారులో మాత్రమే కొద్దిగా శాస్త్రార్థం ఒక రెబ్బ మాత్రమే చింతపండు వేసి వండేవారు. ఇప్పుడు కూడా ఇళ్లలో చింతపండుని పరిమితంగా వాడే అలవాటున్నవారికి చింతపండు పానకం మంచి ఔషధమే.

గంగరాజు అరుణాదేవి

రుచిలో.. ఫిష్‌మరైజ్!



ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలి గానీ.. మాంసాహారంలో చేపల కథే వేరు. ప్రొటీన్లు, విటమిన్లు పుష్కలం. తిన్నా కడుపులో ఎలాంటి ఇబ్బందీ ఉండదు. అందుకే చేపలంటే ప్రత్యేకమే. చేపల వేపుడు, ఫిష్ నగ్గెట్స్, మసాలా చేపల కూరను సులువుగా చేసుకోండిలా...

ఫిష్ నగ్గెట్స్



కావాల్సిన పదార్థాలు

చేప ముక్కలు- పావు కిలో, మైదా- పావు కప్పు, ఉప్పు- రుచికి సరిపడ, బ్రెడ్ పొడి- నాలుగు టేబుల్ స్పూన్లు, కోడిగుడ్డు- 1, నిమ్మరసం- టీస్పూన్, మిరియాల పొడి- టీస్పూన్, నూనె- డీప్ ఫ్రైకి సరిపడ

తయారీ విధానం

ముల్లులు లేని లేత ఫిష్ ముక్కలనే తీసుకోవాలి. వీటిని చిన్నగా కట్ చేసి నిమ్మరసం వేశాక తగినంత ఉప్పు, మిరియాల పొడి వేశాక కోడిగుడ్డు సొన వేసి కలపాలి. ఒక ప్లేట్‌లో మైదా వేసి ఇందులోకి కొద్దిగా ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. మరో ప్లేట్‌లో బ్రెడ్ ముక్కలు ఉంచుకోవాలి.

బౌల్‌లోని చేప ముక్కను తీసుకుని మైదాలో ముంచి మళ్లీ బౌల్‌లో ముక్కను ఉంచి కోడిగుడ్డు సొనమీద ఉంచి.. చివరగా బ్రెడ్ ముక్కల్లో వేసి అన్ని వైపులా బ్రెడ్ ముక్కలు పట్టేట్లు చేయాలి. ఇలా అన్నింటికి రెండు కోటింగ్‌లు వేసి ప్లేట్‌లో ఉంచుకోవాలి. నూనె మరిగిన తర్వాత డీప్ ఫ్రై చేసుకోవాలి. ఈ ఫిష్ నగ్గెట్స్‌ను కెచప్‌తో తింటే రుచికరంగా ఉంటాయి. సాయంత్రం పూట పిల్లలకోసం వేగంగా చేసుకునే స్నాక్స్ ఇవి.

మసాలా చేపల కూర



కావాల్సిన పదార్థాలు

రోహు చేప ముక్కలు- అర కేజీ, పసుపు- అర టీస్పూన్, ఉప్పు- టీస్పూన్, నూనె- ఐదు టేబుల్ స్పూన్లు, మెంతులు- పావు టీస్పూన్, ఉల్లిపాయల పేస్ట్- వంద గ్రాములు, అల్లం వెల్లుల్లి పేస్ట్- 2 టీస్పూన్లు, కారంపొడి- ఒకటిన్నర టీస్పూన్లు, జీలకర్ర పొడి- ముప్పావు టీస్పూన్, ధనియాల పొడి- ఒకటిన్నర టీస్పూన్, కశ్మీరి చిల్లీ పౌడర్- 2 టీస్పూన్లు, చిన్న టమోటాలు-2 (సన్నగా తరగాలి), కసూరీ మేతీ- ఒక టీస్పూన్, పెరుగు- 2 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం

చేప ముక్కలను శుభ్రంగా కడగాలి. చతురస్రాకార బాక్స్‌లో ఉంచి అందులో పసుపు, ఉప్పు వేసి ముక్కలకు రెండు వైపులా బాగా పట్టించాలి. గంట పాటు పక్కన ఉంచుకోవాలి.

మూకుడులో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి వేడయ్యాక చేప ముక్కలను రెండు వైపులా రంగు మారేంత వరకూ వేయించుకోవాలి. వీటిని తీసి పక్కన ఉంచుకోవాలి. మరో మూకుడులో మూడు టేబుల్ స్పూన్ల నూనె వేసి కొద్దిగా వేడయ్యాక.. మెంతులు వేసి ఆనియన్ పేస్ట్ వేసి గరిటెతో కలపాలి. ఇందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేశాక.. కొద్దిగా పసుపు, కారంపొడి, జీలకర్ర పొడి, ధనియాల పొడి, కశ్మీరీ చిల్లీ పౌడర్ వేశాక గరిటెతో బాగా కలపాలి. మంటను సిమ్‌లో ఉంచి పది నిముషాల పాటు కలిపితే పేస్ట్‌లా వస్తుంది.

ఇందులో టమోటా ముక్కలు, కసూరీ మేతీ, ఉప్పు వేసిన తర్వాత నాలుగైదు నిముషాల పాటు కలపాలి. ఇందులో పెరుగు వేసి మూడు నిముషాల కలిపాక మూడు వందల మిల్లీ లీటర్లు నీళ్లు పోసి బుడగలు వచ్చేంత వరకూ ఉడికించాలి. ఆ తర్వాత వేయించి పక్కన ఉంచుకున్న చేప ముక్కలను ఇందులో ఉంచి.. మూకుడు మూత పెట్టి పది నిముషాల పాటు ఉడికించాలి. చివరగా కొద్దిగా గరంమసాలా చల్లుకుని రెండు నిముషాల పాటు లోహీట్‌లో కుక్ చేసి దించేసుకోవాలి. ఈ మసాలా చేపల కూరను అన్నంతో తినాలి.

చేపల వేపుడు

కావాల్సిన పదార్థాలు

చేప ముక్కలు- అర కేజీ, ఉప్పు- రుచికి తగినంత, కారం- రెండున్నర టీస్పూన్, పసుపు- చిటికెడు, ధనియాల పొడి- ఒకటి పావు టీస్పూన్, జీలకర్ర పొడి- అర టీస్పూన్, గరం మసాలా- అరటీస్పూన్, మిరియాల పొడి- అర టీస్పూన్, జింజర్ గార్లిక్ పేస్ట్- 1 టీస్పూన్, నిమ్మరసం- టీస్పూన్, కార్న్‌ఫ్లోర్- టీస్పూన్, నూనె- మూడు టేబుల్ స్పూన్లు

తయారీ విధానం

చేపముక్కలను మరీ మందంగా కాకుండా మీడియమ్ సైజ్‌లో కట్ చేయించుకోవాలి.

చేపముక్కలను శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత కొద్దిగా ఉప్పు, నిమ్మరసం పట్టించి పది నిముషాల పాటు అలానే ఉంచాలి. ఆ వెంటనే చేప ముక్కలను శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత బౌల్‌లో ఉప్పు, కారం, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర్ర పొడి, మిరియాల పొడి, జింజర్ గార్లిక్ పేస్ట్, కార్న్‌ఫ్లోర్ వేశాక నిమ్మరసం వేసి మిశ్రమం కలపాలి. ఆ తర్వాత టేబుల్ స్పూన్ నూనె వేసి కలపాలి. చివరగా సరిపడ నీళ్లు పోసి మసాలాను మరీ గట్టిగా కాకుండా మరీ నీళ్లలా కాకుండా తయారు చేసుకోవాలి. ఉప్పు, కారం అవసరమైతే సరిపడ వేసుకోవాలి.

ఈ మసాలాను చేప ముక్కలకు రెండు వైపులానే కాకుండా లోపల వైపు పట్టించి.. ప్లేట్‌లో ఉంచుకోవాలి. ముక్కలకు బాగా పట్టిందా లేదో సరిచూసుకుని ఆ ప్లేట్‌ను ఫ్రిజ్‌లో రెండు గంటల పాటు ఉంచాలి. ఫ్రిజ్‌నుంచి ముక్కలను తీశాక.. ప్యాన్‌లో మిగిలిన నూనె వేసి ప్యాన్‌ను కదిలించాలి. నూనె మరిగాక మంటను కొద్దిగా తగ్గించి చేప ముక్కలను రెండు వైపులా వేయించుకోవాలి. వేయించేప్పుడు మాడిపోకుండా జాగ్రత్తపడాలి. ఈ చేప ముక్కల వేపుడును స్నాక్స్‌లా తినొచ్చు లేదా అన్నంలోకి సైడ్ డిష్‌లా కూడా తినొచ్చు.

స్ఫూర్తి

అన్నం దొరకని స్థితి నుంచి అవార్డు వరకూ...

17 ఏళ్ల లేత వయసులోనే వయసుకు మించిన కష్టాలను చవి చూసింది పంజాబ్‌కు చెందిన టినెస్సా కౌర్. తల దాచుకోడానికి ఇల్లులేక, గురుద్వారలో దొరికే ఉచిత భోజనంతో ఆకలి తీర్చుకున్న టినెస్సా నేడు, యుకెలోని ప్రతిష్ఠాత్మక ప్రో బొనో బారిస్టర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికయ్యే స్థాయికి ఎదిగి ఆ అవార్డును గెలుచుకున్న మొట్టమొదటి సిక్కు మహిళా లాయర్‌గా చరిత్ర సృష్టించింది. ఆవిడ గురించిన ఆసక్తికరమైన కథనమిది.



టినెస్సా కౌర్ బాల్యం కష్టాలు, కడగండ్లతోనే గడిచింది. దుర్భరమైన దారిద్ర్యంలో పుట్టిన కౌర్‌ది నిరక్షరాస్యుల కుటుంబం. 2002లో ఆమె తండ్రి కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయాడు. 2007లో, జనరల్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ పరీక్ష సమయంలో తండ్రి జైలు పాలవడంతో ఆమె నిరాశ్రయురాలైంది. ఆ సమయంలో తన పరిస్థితి గురించి వివరిస్తూ... "భగవంతుడి పట్ల నాకున్న విశ్వాసమే నా జీవితంలో ప్రధాన భాగంగా మారింది. నా దగ్గర తినడానికి ఆహారమే ఉండేది కాదు. దాంతో గురుద్వారలో దొరికే ఒంటిపూట ఉచిత భోజనం మీదే ఆధారపడేదాన్ని" అంటే కౌర్ బిబిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. టీనేజీ వయసులో ఉండడానికి ఇల్లు లేక రోడ్డు పాలైన తాను ఎ లెవెల్ స్థాయి విద్యను అభ్యసించే సమయంలో వీధి రౌడీలు, గ్యాంగ్‌ల నుంచి ముప్పులను ఎదుర్కొనేదాన్ననీ, ఆ కష్టాలతో పోరాడుతూనే 2010 నాటికి బడి చదువును పూర్తి చేయగలిగాననీ మీడియాకు కౌర్ వివరించింది.



నిరుపేదలకు సహాయపడుతూ...

తర్వాత, యుకెలోని సిక్కుల మద్దతుతో కౌర్ వెస్ట్ లండన్‌లోని గ్రీన్‌వుడ్‌కు చేరుకుంది. అక్కడి సిక్కు సమాజం అండదండలతో, మొక్కవోని పట్టుదలతో ఉన్నత చదువు చదివింది. బార్ స్టడీస్ పూర్తి చేసి, 2013లో లా డిగ్రీలో గ్రాడ్యుయేట్ అయింది. 2019లో శ్రమ ఫలించి, కౌర్‌కు బార్ నుంచి పిలుపొచ్చింది. నాలుగేళ్ల తర్వాత 2023లో 32 ఏళ్ల వయసులో ఆవిడ బారిస్టరుగా అర్హత పొందింది. ఇతరుల సేవకే కట్టుబడిన కౌర్, తన కెరీర్ అంతటా తన సేవాతత్పరతను చాటుకుంది. మానవ హక్కుల పట్ల తనకున్న ఆసక్తితో, ఖాళీ సమయాల్లో నిరుపేద సమాజాలకు న్యాయ సలహాలు, సూచనలు ఇస్తూ ఉంటుంది. ప్రజా న్యాయవాదిగా, సిక్కుల, మానవ హక్కుల కార్యకర్తగా కౌర్ తన పరిధి మేరకు ప్రజలకు సహాయసహకారాలను అందించింది.

సిక్కుల లాయర్ల అసోసియేషన్ స్థాపించి...

సేవ, లేదా నిస్వార్థ సేవ అనే సిక్కుల ప్రధాన సూత్రం లక్ష్యంగా, సామాజిక బాధ్యతలో భాగంగా, కౌర్ సిక్కు లాయర్ల అసోసియేషన్‌ను స్థాపించింది. వేర్వేరు న్యాయ విభాగాల్లో అవసరమైన సలహాలు, సూచనలను అందించడం కోసం ఈ లీగల్ కన్సల్టెన్సీని ఆవిడ స్థాపించింది. 'జస్ట్ కట్ ఇట్ ఔట్ నౌ' అనే ప్రాజెక్టు ద్వారా, యువతలో స్వయం స్వావలంబన, ప్రేరణల కోసం కృషి చేస్తూ, ముఠా సంస్కృతి, హింసలను అరికట్టే ప్రయత్నం చేస్తోంది. "తర్వాతి తరంతో పాటు భవిష్యత్తు తరాలకు సహాయం చేయడం కోసం నా వంతు కృషి చేస్తూనే ఉంటాను. అన్ని దారులూ మూసుకుపోయి, జీవితం మీద ఆశ కోల్పోయిన వాళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో నాకు తెలుసు. కాబట్టి ఒక బారిస్టరుగా నాకు సాధ్యమైనంత సహాయాన్ని నేను అందించాలనుకుంటున్నాను. చాంబర్స్‌లోకి అడుగు పెట్టిన ప్రతిసారీ, నేనిక్కడ ఒక సిక్కు మహిళగా వ్యవహరించబోతున్నాను అనే వాస్తవం నాకు స్ఫురిస్తూ ఉంటుంది. 'అవరోధాలను అధిగమించి, ఇతరులకు సహాయపడే స్థాయికి ఎదగగలిగాను' అనే విషయాన్ని నేను చర్యల్లో ప్రతిబింబించగలిగినప్పుడే, ఇతరులకు నేను మార్గదర్శకంగా మారగలుగుతాను" అంటూ తన ముందున్న బృహత్తర బాధ్యత గురించి వివరించింది కౌర్.

మేకప్

మెడకు మేకప్

మేకప్ ముఖానికే కాదు, మెడకూ వేయాలి. లేదంటే ముఖానికీ, మెడకూ పొంతన కుదరక ఎబ్బెట్టుగా కనిపిస్తాం. అందమైన ముఖారవిందంతో పాటు శంఖం లాంటి మెడతో మెరిసిపోవాలంటే ఇవిగో ఈ టిప్స్ పాటించాలి.

పైబడే వయసు మెడలో ప్రతిబింబిస్తుంది. అక్కడి చర్మం సాగుతూ, ముడతలుపడుతూ ఉంటుంది. కాబట్టి మేకప్ విషయంలో ముఖం పట్ల ఎంతటి శ్రద్ధను కనబరుస్తామో, మెడ పట్ల కూడా అంతే శ్రద్ధను కనబరచాలి.

- **సిలికాన్ ప్రైమర్:** మెడ మీద ఏర్పడే సన్నని లైన్లు, ముడతలు కనిపించకుండా చేయడం కోసం, మేకప్‌కు ముందు సిలికాన్ ప్రైమర్ అప్లై చేయాలి. దీంతో చర్మం నునుపుగా మారి గీతలు మటుమాయమవుతాయి. టింటెడ్ ప్రైమర్‌తో ఓపెన్ పోర్స్‌ను కూడా దాచేయవచ్చు. ఇందు కోసం మెడలోని డార్కర్ ఏరియాల్లో ప్రైమర్ అప్లై చేసి, తడి స్పాంజ్‌తో బ్లెండ్ చేయాలి. మెడ మీద డార్కర్ ఏరియాలను కరెక్ట్ చేయడం కోసం కన్సీలర్ కంటే ముందు కలర్ కరెక్టర్‌ను కూడా ఉపయోగించవచ్చు.
- **మాయిశ్చరైజర్:** మెడ మీద చర్మం పలుచగా ఉంటుంది కాబట్టి తేలికగా పొడిబారిపోతూ ఉంటుంది. కాబట్టి ముఖంతో పాటు తప్పనిసరిగా మెడకూ మాయిశ్చరైజర్ అప్లై చేస్తూ ఉండాలి. అప్పుడే మెడ మీద గీతలు, మచ్చలు, ముడతలు ఏర్పడకుండా ఉంటాయి.
- **ఫౌండేషన్:** లిక్విడ్ లేదా క్రీమ్ ఎలాంటి ఫౌండేషన్‌ను ఎంచుకున్నా, ముఖం, మెడ మీద సమానంగా పరుచుకునేలా తడిపిన స్పాంజీతో అప్లై చేసుకోవాలి. అలాగే, అవసరానికి మించి ఫౌండేషన్ ఉపయోగిస్తే, మెడ మీది ముడతల్లో ఇరుక్కుపోయి, ముడతలు స్పష్టంగా కనిపించే ప్రమాదం ఉంటుంది. కాబట్టి తగుమాత్రంగానే ఉపయోగించాలి.
- **బ్లష్:** చెక్కిళ్ల మీద అప్లై చేసుకునే బ్లష్‌ను కొద్ది పరిమాణంలో మెడ మీద అప్లై చేసుకోవడం వల్ల, ముఖం, మెడా రెండూ ఈవెన్ కలర్‌లో కనిపించే అవకాశం ఉంటుంది.
- **విటమిన్ సి సీరమ్:** విటమిన్ సితో కూడిన సీరమ్ లేదా మాయిశ్చరైజర్ ఉపయోగించడం వల్ల యువి ఎక్స్‌పోజర్‌తో కలిగే ఫ్రీ ర్యాడికల్ డ్యామేజీ నుంచి మెడ చర్మానికి రక్షణ దక్కుతుంది. కాబట్టి ఈ జాగ్రత్తలు పాటించాలి.
- **హైలైటర్:** మెడ మీద ఇతరుల చూపును పక్కకు తప్పించి, చెక్కిళ్ల మీద నిలపడం కోసం, చెక్కిళ్ల మీద హైలైటర్ అప్లై చేయాలి. అయితే ఇందుకోసం లిక్విడ్ హైలైటర్‌ను ఉపయోగించాలి.



స్పోర్ట్స్

విజయవాడ ● శనివారం 15 జూన్ 2024

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

దక్షిణాఫ్రికా x నేపాల్ (ఉ.5. గం.)

న్యూజిలాండ్ x ఉగాండా (ఉ.6. గం.)

భారత్ X కెనడా (రాత్రి 8. గం.)

నమీబియా x ఇంగ్లండ్ (రాత్రి 10.30. గం.)

పాక్ అవుట్

అమెరికా-ఐర్లాండ్ మ్యాచ్ వర్షంతో రద్దు

సూపర్-8కు ఆతిథ్య యూఎస్‌ఏ

ఫ్లోరిడా: టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్ కథ ముగిసింది. కారణం.. అమెరికా-ఐర్లాండ్ జట్ల మధ్య శుక్రవారం ఇక్కడ జరగాల్సిన గ్రూప్-ఎ మ్యాచ్ వర్షంతో రద్దవడం. దాంతో అమెరికా, ఐర్లాండ్‌కు చెరో పాయింట్ లభించింది. ఇక.. గ్రూపు నాలుగు మ్యాచ్‌లనూ పూర్తి చేసిన ఆతిథ్య అమెరికా జట్టు ఐదు పాయింట్లతో భారత్ (6) తర్వాత రెండో స్థానంలో నిలిచి సూపర్-8కి అర్హత సాధించింది. అరంగేట్రంలోనే సంచలన ప్రదర్శనతో ఆకట్టుకున్న అమెరికా జట్టు.. 2026లో జరిగే టీ20 ప్రపంచకప్‌నకు కూడా బెర్త్ దక్కించుకోవడం విశేషం. మరోవైపు మూడు మ్యాచ్‌ల ద్వారా రెండు పాయింట్లతోనే ఉన్న పాకిస్థాన్ ఆదివారం నాడు ఐర్లాండ్‌తో గ్రూపు ఆఖరి మ్యాచ్ ఆడాల్సి ఉంది. అందులో బాబర్ సేన గెలిచినా 4 పాయింట్లే ఉంటాయి. అలా.. గత టోర్నీ రన్నరప్ పాకిస్థాన్ ఈసారి అనూహ్యంగా లీగ్ దశ నుంచే నిష్క్రమించింది. ఒకవేళ.. ఐర్లాండ్‌తో శుక్రవారంనాటి మ్యాచ్ జరిగి..అమెరికా నెగ్గినా కూడా బాబర్‌సేన అవుటయ్యేది. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో అమెరికా ఓడిపోయుంటే అప్పుడు పాకిస్థాన్‌కు సూపర్-8 చాన్స్ మిగిలి ఉండేది. ఈ టోర్నీలో అమెరికాతో తన తొలి మ్యాచ్‌లో సూపర్ ఓవర్‌లో ఓడడమే పాకిస్థాన్‌కు పెద్ద షాక్. ఆపై..రెండో పోరులో భారత్ చేతిలోనూ ఓడిన పాకిస్థాన్, కెనడాపై నెగ్గి పాయింట్ల ఖాతా తెరిచింది. ఇప్పుడిక తనతోపాటు టోర్నీ నుంచి నిష్క్రమించిన ఐర్లాండ్‌తో పాక్ పోరు నామమాత్రమే.

పాయింట్ల పట్టిక — గ్రూప్-ఎ

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	3	3	0	0	6	1.137
అమెరికా	4	2	1	1	5	0.127
పాకిస్థాన్	3	1	2	0	2	0.191
కెనడా	3	1	2	0	2	-0.493
ఐర్లాండ్	3	0	2	1	1	-1.712

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

విరాట్ ఫామ్‌లోకొచ్చేనా?

నేడు కెనడాతో భారత్ మ్యాచ్



కెనడా కెప్టెన్ జాఫర్



లాడర్‌హిల్ (ఫ్లోరిడా): వరుసగా మూడు మ్యాచ్‌లను న్యూయార్క్‌లో ఆడిన టీమిండియా ఇప్పుడు తమ వేదికను ఫ్లోరిడాకు మార్చింది. శనివారం ఇక్కడ కెనడాతో జరిగే మ్యాచ్‌లోనూ నెగ్గి గ్రూప్ 'ఎ'ను అజేయంగా ముగించాలనుకుంటోంది. ఆరు పాయింట్లతో ఉన్న రోహిత్ సేన ఇప్పటికే టీ20 వరల్డ్‌కప్ సూపర్-8లోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. ఇరు జట్ల మధ్య టీ20ల్లో ఇదే తొలి మ్యాచ్ కాగా, కరీబియన్ టూర్‌కు ముందు దీన్ని వామప్‌గా వినియోగించుకోవాలనుకుంటోంది. అయితే ఈ మ్యాచ్ సజావుగా సాగాలంటే వరుణుడు కూడా సహకరించాల్సి ఉంది. కెనడా ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఐర్లాండ్‌పై మాత్రమే నెగ్గింది. ఈ టోర్నీలో అర్ధసెంచరీలు సాధించిన ఆరోన్ జాన్సన్, కిర్టన్, నవ్‌నీత్ ధలివాల్ బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. ఓవరాల్‌గా భారత జట్టు ఈ స్టేడియంలో ఆడిన ఎనిమిది టీ20ల్లో 5 విజయాలు, 2 ఓటములతో ఉంది. ఒక మ్యాచ్‌లో ఫలితం రాలేదు.

'కుల్చా'కు చాన్స్ దక్కేనా?

చివరి వరల్డ్‌కప్‌లో ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచిన విరాట్ కోహ్లీ ఈసారి ఓపెనర్‌గా 1,4,0 స్కోర్లతో పూర్తిగా నిరాశపరిచాడు. ఐపీఎల్‌లోనూ ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్న అతను న్యూయార్క్ పిచ్‌పై కనీసం పది బంతులైనా ఆడలేకపోయాడు. అయితే కెనడాపై విరాట్‌కు చక్కటి మ్యాచ్ ప్రాక్టీస్ దక్కితే కరీబియన్ దీవులకు ఆత్మవిశ్వాసంతో వెళ్లగలుగుతాడు. కానీ స్థానిక మైదానంలోనూ కోహ్లీకి పేలవ రికార్డే ఉంది. ఒక వేళ విరాట్‌ను వన్‌డౌన్‌లో ఆడిస్తే ఓపెనర్‌గా జైస్వాల్‌కు స్థానం దక్కుతుంది. అప్పుడు మిడిలార్డర్‌లో శివమ్ దూబేపై వేటు తప్పదు. విండీస్ పిచ్‌లు స్పిన్‌కు అనుకూలించే చాన్స్ ఉండడంతో కుల్చా (కుల్దీప్, చాహల్) జోడీని ఆడించే అవకాశం లేకపోలేదు. సూపర్-8కు ముందు వారికి ప్రాక్టీస్ లభించాలని జట్టు భావిస్తోంది. అదే జరిగితే జడేజా, అక్షర్‌లకు విశ్రాంతి తప్పదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్, పంత్, సూర్యకుమార్, దూబే, హార్దిక్, జడేజా/చాహల్, అక్షర్/కుల్దీప్, బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్.

కెనడా: జాన్సన్, నవ్‌నీత్, పర్గత్ సింగ్, కిర్టన్, శ్రేయాస్, రవీందర్‌పాల్, సాద్ బిన్ జాఫర్ (కెప్టెన్), హేలిగర్, కలీమ్ సన, జునైద్ సిద్దిఖి, గార్డన్.

పిచ్, వాతావరణం

ప్రస్తుతం ఫ్లోరిడాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం భారత జట్టు నెట్ సెషన్ కూడా రద్దయ్యింది. మ్యాచ్‌కు కూడా ఆటంకం కలిగే అవకాశం ఉంది. దీంతో ఓవర్లు కుదించడమో లేక రద్దవడమో జరగవచ్చు. ఇక్కడి పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించనుంది. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

అఫ్ఘాన్ అదరహో

- తొలిసారి సూపర్-8లో ప్రవేశం
- పపువా న్యూగినీపై విజయం
- న్యూజిలాండ్ నిష్క్రమణ



ఫరూఖీ (3/16)

టరౌబా (ట్రినిడాడ్): అజేయ ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న అఫ్ఘానిస్థాన్ టీ20 వరల్డ్‌కప్‌లో తొలిసారి సూపర్-8లో ప్రవేశించింది. ఎప్పటిలాగే బౌలర్లు చెలరేగడంతో శుక్రవారం పపువా న్యూగినీతో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం అందుకుంది. రషీద్ సేనకిది వరుసగా మూడో గెలుపు. అలాగే ఇప్పటి వరకు అఫ్ఘాన్‌పై ప్రత్యర్థి జట్లు వంద పరుగుల్లోపే ఆలౌట్ కావడం విశేషం. మరోవైపు వీరి విజయంతో అటు పాయింట్ల ఖాతా తెరవని న్యూజిలాండ్ గ్రూప్ 'సి' నుంచి అధికారికంగా నిష్క్రమించింది. వెస్టిండీస్ ఇప్పటికే సూపర్-8లోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే. ఇక ఈ రెండు జట్ల మధ్య మంగళవారం జరిగే ఆఖరి మ్యాచ్ ద్వారా గ్రూప్ టాపర్ ఎవరో తేలుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పీఎన్‌జీ బ్యాటర్లు కనీస ప్రదర్శన కూడా చేయలేకపోయారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ పేసర్ ఫజల్‌హక్ ఫరూఖీ (3/16), నవీన్ ఉల్ హక్ (2/4)ల ధాటికి 19.5 ఓవర్లలో 95 పరుగులకు ఆలౌటైంది. అయితే ఈ స్కోరులో 25 పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలో రావడం గమనార్హం. కిప్లిన్ డోరిగ (27), నవో (13), ఉరా (11) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. ఆ తర్వాత స్వల్ప ఛేదనలో అఫ్ఘాన్ 15.1 ఓవర్లలో 3 వికెట్లకు 101 పరుగులు చేసి నెగ్గింది. తొలిసారి ఓపెనర్లు గుర్బాజ్ (11), జద్రాన్ (0) విఫలం కావడంతో గుల్బదిన్ నయీబ్ (49 నాటౌట్) జట్టును విజయం వైపు నడిపించాడు. ఆఖర్లో నబీ (16 నాటౌట్) సహకారం అందించడంతో మరో 29 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు

పీఎన్‌జీ: 19.5 ఓవర్లలో 95 ఆలౌట్ (కిప్లిన్ 27, ఎలీ నవో 13; ఫరూఖీ 3/16, నవీనుల్ 2/4). **అఫ్ఘానిస్థాన్:** 15.1 ఓవర్లలో 101/3 (నయీబ్ 49 నాటౌట్, నబీ 16 నాటౌట్; సెమో కమీ 1/16).

పాయింట్ల పట్టిక — గ్రూప్-సి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
అఫ్ఘానిస్థాన్	3	3	0	0	6	4.230
వెస్టిండీస్	3	3	0	0	6	2.596
ఉగాండా	3	1	2	0	2	-4.217
పీఎన్‌ఏ	3	0	3	0	0	-0.886
న్యూజిలాండ్	2	0	2	0	0	-2.425

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

ప్రణయ్, సిక్కి జోడీ ఓటమి

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్, మిక్స్‌డ్ విభాగంలో సిక్కి-సుమిత్ రెడ్డి జోడీ ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు. వరల్డ్ నెంబర్ 10, ప్రణయ్ 19-21, 13-21తో జపాన్ షట్లర్ కొడై నారోకా చేతిలో, సమీర్ వర్మ 12-21, 13-21తో లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలయ్యారు. మిక్స్‌డ్ క్వార్టర్స్‌లో సిక్కి-సుమిత్ ద్వయం 12-21, 14-21తో చైనాకు చెందిన టాప్‌సీడ్ ద్వయం జియాన్-వీ య జిన్ (చైనా) చేతిలో ఓటమిపాలైంది. కాగా, మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ 17-21, 12-21తో యు పో పై (చైనీస్ తైపీ) చేతిలో ఓడింది.

గెలిచి నిలిచారు

సూపర్-8 రేసులో ఇంగ్లండ్ ● 8 వికెట్లతో ఒమన్ చిత్తు



ఆదిల్ రషీద్ (4/11)

నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా) : కీలక మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ చెలరేగింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆదిల్ రషీద్ (4/11)కు పేసర్లు ఆర్చర్, ఉడ్ తోడవడంతో గురువారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో పసికూన ఒమన్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఒమన్ ప్రత్యర్థి బౌలర్ల ధాటికి తాళలేక 13.2 ఓవర్లలో 47 పరుగులకే చేతులెత్తేసింది. షోయబ్ ఖాన్ (11) మినహా మరే బ్యాటరూ రెండంకెల స్కోరుకు చేరలేదు. ఆర్చర్, ఉడ్ చెరో మూడు వికెట్లు సాధించారు. అనంతరం స్వల్ప ఛేదనను కేవలం 3.1 ఓవర్లలోనే 50/2తో ఛేదించిన ఇంగ్లండ్ భారీ విజయం అందుకుంది. ఈ గెలుపుతో ఇంగ్లండ్ మూడు పాయింట్లతో గ్రూపులో మూడో స్థానానికి చేరింది. ఇప్పటికే సూపర్-8కి అర్హత సాధించిన ఆస్ట్రేలియా (6), స్కాట్లాండ్ (5) మొదటి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ మ్యాచ్‌కు ముందు ఇంగ్లండ్ రన్‌రేట్ -1.800. భారీ విజయం దరిమిలా అది +3.081కి చేరింది. రన్‌రేట్‌లో స్కాట్లాండ్ (+2.164) కంటే ఎంతో ముందంజలో నిలిచింది. స్కాట్లాండ్ తదుపరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను ఢీకొననుంది. కాగా..స్కాట్లాండ్‌తో తొలి మ్యాచ్ వర్షంతో రద్దవడంతో ఇంగ్లండ్‌కు ఒకటే పాయింట్ లభించింది. అనంతరం ఆస్ట్రేలియా చేతిలో 36 పరుగులతో ఓటమి చవిచూడడంతో డిఫెండింగ్ చాంపియన్ సూపర్-8 అవకాశాలు ప్రమాదంలో పడ్డాయి. ఈ నేపథ్యంలో ఒమన్‌తో మ్యాచ్‌ను తప్పనిసరిగా అదీ..భారీ తేడాతో నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసిన బట్లర్ సేన..తదుపరి రౌండ్ అవకాశాలను సజీవంగా ఉంచుకోగలిగింది.

సంక్షిప్తస్కోర్లు: ఒమన్: 13.2 ఓవర్లలో 47 ఆలౌట్ (షోయబ్ ఖాన్ 11, కశ్యప్ ప్రజాపతి 9, ఆదిల్ రషీద్ 4/11, ఆర్చర్ 3/12, మార్క్ ఉడ్ 3/12).
ఇంగ్లండ్: 3.1 ఓవర్లలో 50/2 (బట్లర్ 24 నాటౌట్, సాల్ట్ 12).

పాయింట్ల పట్టిక — గ్రూప్-బి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
ఆస్ట్రేలియా	3	3	0	0	6	3.580
స్కాట్లాండ్	3	2	0	1	5	2.164
ఇంగ్లండ్	3	1	1	1	3	3.081
నమీబియా	3	1	2	0	2	-2.098
ఒమన్	4	0	4	0	0	-3.062

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు



న్యూయార్క్‌లోని బీచ్‌లో కుమార్తె సమైరాతో రోహిత్..

సెమీస్‌లో సుమిత్



పెరూగియా (ఇటలీ): భారత ఆటగాడు సుమిత్ నగల్ వరుసగా రెండోవారం టైటిల్ సాధించే దిశగా దూసుకెళ్తున్నాడు. గతవారం జర్మనీలో ఏటీపీ చాలెంజర్ నెగ్గిన సుమిత్.. తాజాగా పెరూగియా చాలెంజర్ ఈవెంట్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఆరోసీడ్ సుమిత్ 6-4, 7-5తో పోలెండ్‌కు చెందిన మాక్స్ కస్నికోవిస్కీపై విజయం సాధించాడు. నగల్‌కిది వరుసగా ఎనిమిదో విజయం కావడం విశేషం. బెర్నాబె (స్పెయిన్), రెండో సీడ్ లాస్లో జెరె (సెర్బియా) మధ్య జరిగే క్వార్టర్స్ విజేతతో సుమిత్ సెమీస్‌లో తలపడనున్నాడు.

బిజినెస్

ఎగుమతుల్లో 9% వృద్ధి

మే నెలలో రూ.3.28 లక్షల కోట్లుగా నమోదు

ఏడు నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు



న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక అస్థిరతల మధ్యన కూడా ఎగుమతుల రంగం మే నెలలో 9.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. ప్రధాన గమ్యాలైన అమెరికా, నెదర్లాండ్స్, యూఏఈ, మలేషియా, బ్రిటన్‌లకు ఎగుమతుల్లో ఆరోగ్యవంతమైన వృద్ధి నమోదైంది. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం మే నెల ఎగుమతులు 3,813 కోట్ల డాలర్లుగా (రూ.3.28 లక్షల కోట్లు) నమోదు కాగా వాణిజ్య లోటు ఏడు నెలల గరిష్ఠ స్థాయి 2,378 కోట్ల డాలర్లకు (రూ.2.05 లక్షల కోట్లు) దూసుకుపోయింది. గత ఏడాది అక్టోబరులో నమోదైన 3,146 కోట్ల డాలర్ల తర్వాత (రూ.3.22 లక్షల కోట్లు) వాణిజ్య లోటు ఈ స్థాయికి చేరడం ఇదే ప్రథమం.

ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్ ప్లాస్టిక్స్ రంగాలు మే నెలలో ఎగుమతుల వృద్ధికి ప్రధాన చోదకంగా నిలిచాయి. మే నెలలో దిగుమతులు 7.7 శాతం పెరిగి 6,191 కోట్ల డాలర్లకు (రూ.5.32 లక్షల కోట్లు) చేరాయి. క్రూడాయిల్ ఎగుమతులు 28 శాతం పెరిగి 2,000 కోట్ల డాలర్లకు (రూ.1.72 లక్షల కోట్లు) చేరడం మే నెలలో దిగుమతులు దూసుకుపోవడానికి కారణమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే రెండు నెలల్లోనూ కలిపి క్రూడాయిల్ ఎగుమతులు 24.4 శాతం పెరిగి 3,604 కోట్ల డాలర్లుగా (రూ.3.10 లక్షల కోట్లు) నమోదు కాగా మొత్తం ఎగుమతులు 5.1 శాతం వృద్ధితో 7,312 కోట్ల డాలర్లకు (రూ.4.97 లక్షల కోట్లు) చేరాయి.

ఈ రెండు నెలల్లో దిగుమతులు కూడా 8.89 శాతం పెరిగి 11,600 కోట్ల డాలర్లుగా (రూ.9.98 లక్షల కోట్లు) నమోదయ్యాయి. ఎగుమతుల రంగానికి మే నెల అద్భుతంగా ఉన్నదని, రాబోయే నెలల్లో కూడా ఇదే ధోరణి కొనసాగుతుందని భావిస్తున్నామని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భర్త్వాల్ అన్నారు.

- బంగారం దిగుమతులు స్వల్పంగా తగ్గాయి. గత ఏడాది మే నెలతో పోల్చితే 369 కోట్ల డాలర్ల (రూ.31,734 కోట్లు) నుంచి 333 కోట్ల డాలర్లకు (రూ.28,638 కోట్లు) దిగివచ్చాయి.
- సేవల ఎగుమతులు మే నెలలో 3016 కోట్ల డాలర్లుగా (రూ.2.59 లక్షల కోట్లు), దిగుమతులు 1728 కోట్ల డాలర్లుగా (రూ.1.49 లక్షల కోట్లు) నమోదయ్యాయి.

15 నెలల గరిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

మే నెలలో టోకు ద్రవ్యోల్బణం 15 నెలల గరిష్ఠ స్థాయి 2.61 శాతానికి దూసుకుపోయింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వడగాడ్పుల కారణంగా ఆహార వస్తువుల ధరలు ప్రత్యేకించి కూరగాయల ధరలు, తయారీ వస్తువుల ధరలు పెరగడం ఇందుకు దోహదకారి అయింది. ఈ ద్రవ్యోల్బణం గత మూడు నెలలుగా పెరుగుతూ వస్తోంది. గత ఏడాది ఫిబ్రవరిలో నమోదైన 3.85 శాతం తర్వాత టోకు ద్రవ్యోల్బణం ఈ స్థాయికి చేరడం ఇదే ప్రథమం. మే నెలలో ఆహార వస్తువుల ధరలు 9.82 శాతం మేరకు దూసుకుపోయాయి. కూరగాయల ధరలు 32.42 శాతం, ఉల్లి ధరలు 58.05 శాతం, బంగాళాదుంప ధరలు 64.05 శాతం పెరిగాయి.

డిజిటల్ లెండింగ్‌పై ఎస్‌బీఐ దృష్టి

ఐదు రోజుల్లో రుణం మంజూరు

ముంబై: టెక్నాలజీ రంగంలోనూ ప్రభుత్వ రంగంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) దూసుకుపోతోంది. చిన్న వ్యాపారాలకు డిజిటల్ పద్ధతిలో రుణాలు మంజూరు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. గత ఏడాది డిసెంబరులో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ పథకం విజయవంతమైందని బ్యాంక్ డిప్యూటీ ఎండీ సురేంద్ర రాణా తెలిపారు. ఈ పద్ధతిలో ఇప్పటి వరకు 20,000 మందికి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రుణాలు మంజూరు చేసినట్టు వెల్లడించారు. ఈ పద్ధతిలో రుణ గ్రహీత బ్యాంకుకు రాకుండా తన ఇంటి నుంచే బ్యాంకు పంపించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత బ్యాంకు అందుబాటులో ఉన్న కొన్ని వివరాల ఆధారంగా ఐదు రోజుల్లో రుణం మంజూరు చేస్తుందని రాణా చెప్పారు. ఈ పథకం విజయవంతం కావడంతో రుణ పరిమితిని రూ.5 కోట్లకు పెంచబోతున్నట్టు తెలిపారు.

4 నెలల తర్వాత రూ.3,000 కోట్ల 'పెన్నా' అప్పు చెల్లింపు

అంబుజా సిమెంట్

న్యూఢిల్లీ: పెన్నా సిమెంట్‌కు ఉన్న రూ.3,000 కోట్ల అప్పుల చెల్లింపుపై అంబుజా సిమెంట్ దృష్టి పెట్టింది. వచ్చే 3-4 నెలల్లో పెన్నా సిమెంట్ కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసి, ఈ అప్పు తీర్చేయాలని అదానీ గ్రూప్ సిమెంట్ కంపెనీ అంబుజా సిమెంట్ భావిస్తున్నట్టు సమాచారం. తద్వారా పెన్నా సిమెంట్‌పై వడ్డీ చెల్లింపుల భారం తగ్గుతుంది. దీనికి తోడు పెన్నా సిమెంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదిలోగా ప్రస్తుత 1.4 కోట్ల టన్నుల నుంచి 1.7 కోట్ల టన్నులకు విస్తరించాలని యోచిస్తోంది.

డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో జర జాగ్రత్త

ఇన్వెస్టర్లను హెచ్చరించిన ఎన్‌ఎస్‌ఈ చీఫ్ చౌహాన్



న్యూఢిల్లీ: ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) డెరివేటివ్స్ కాంట్రాక్టుల్లో ట్రేడింగ్‌పై రిటైల్ మదుపరులను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ హెచ్చరించారు. రిటైల్ ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్ల ద్వారా ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టడం మేలని ఆయన సూచించారు. డెరివేటివ్స్‌లో ట్రేడింగ్‌పై అవగాహన కలిగి, మార్కెట్‌ను అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే ఇందుకు పరిమితం కావాలని శుక్రవారం ఓ కార్యక్రమంలో ఆయన అభిప్రాయపడ్డారు. డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు గణనీయంగా పెరగడంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్‌తో పాటు సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ సైతం ఈ మధ్య ఆందోళన వ్యక్తం చేశారు. 2019 మార్చిలో రూ.217 లక్షల కోట్ల స్థాయిలో నమోదైన నెలవారీ ఎఫ్ అండ్ ఓ టర్నోవర్.. ఈ మార్చిలో రూ.8,740 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంది. గడిచిన కొన్నేళ్లలో డెరివేటివ్స్ ట్రేడింగ్‌కు పెరిగిన ప్రాచుర్యానికిదే ప్రత్యక్ష ఉదాహరణ.

హ్యుండయ్ రూ.25,000 కోట్ల ఐపీఓ!

దేశ చరిత్రలో ఇదే అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్

న్యూఢిల్లీ: దక్షిణ కొరియా కార్ల తయారీ దిగ్గజం హ్యుండయ్‌కు చెందిన భారత అనుబంధ విభాగం హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌ఎంఐఎల్) తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి కంపెనీ నేడో రేపో ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఐపీఓ ద్వారా హ్యుండయ్ కనీసం 300 కోట్ల డాలర్లు (సుమారు రూ.25,000 కోట్లు) సమీకరించే అవకాశం ఉంది. అదే గనుక జరిగితే, దేశంలో ఇదే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ కానుంది. గతంలో ఐపీఓ ద్వారా ఎల్‌ఐసీ సమీకరించిన రూ.21,000 కోట్ల మొత్తాన్ని మించిపోనుంది. అంతేకాదు, రెండు దశాబ్దాలకు పైగా కాలంలో ఐపీఓకు రాబోతున్న కార్ల కంపెనీ కూడా ఇదే. చివరగా, 2003లో మారుతి సుజుకీ ఇండియా పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ఐపీఓలో భాగంగా హ్యుండయ్ 15-20 శాతం వాటా విక్రయం ద్వారా 330-560 కోట్ల డాలర్ల మేర నిధులు సమీకరించవచ్చని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. హ్యుండయ్ మోటార్ భారత కార్యకలాపాలను 1996లో ప్రారంభించింది.

ప్రస్తుతం ఈ కంపెనీ అన్ని సెగ్మెంట్లలో కలిపి మొత్తం 13 మోడళ్లను దేశీయ మార్కెట్లో విక్రయిస్తోంది. గత నెలలో కంపెనీ మొత్తం విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 7 శాతం వృద్ధితో 63,551 యూనిట్లకు పెరిగాయి. అందులో దేశీయంగా విక్రయాలు 1 శాతం పెరుగుదలతో 49,151 యూనిట్లుగా, ఎగుమతులు 31 శాతం వృద్ధితో 14,400 యూనిట్లుగా నమోదయ్యాయి.

- బజాజ్ ఫైనాన్స్ అనుబంధ విభాగమైన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు వచ్చేందుకు సెబీకి శుక్రవారం డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది. ఐపీఓ ద్వారా సంస్థ రూ.7,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.
- లగ్జరీ ఫర్నీచర్ బ్రాండ్ స్టాన్లీ లైఫ్‌స్టైల్స్ ఐపీఓ ఈ నెల 21న ప్రారంభమై 25న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణిని కంపెనీ రూ.351-369గా నిర్ణయించింది. తద్వారా సంస్థ రూ.537 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.

కొనసాగిన రికార్డుల ర్యాలీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో వరుసగా మూడో రోజూ రికార్డుల ర్యాలీ కొనసాగింది. మే నెల ఎగుమతుల గణాంకాలు ఆశాజనకంగా ఉండటంతో పాటు మార్కెట్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. కానీ, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ మార్కెట్ లాభాలను పరిమితం చేసింది. సెన్సెక్స్ ఒక దశలో 270.4 పాయింట్ల వరకు పెరిగి 77,081 స్థాయికి చేరినప్పటికీ, శుక్రవారం ట్రేడింగ్ నిలిచేసరికి 181.87 పాయింట్ల వృద్ధితో 76,992.77 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు స్థాయి. కాగా, నిఫ్టీ ఒక దశలో 91.5 పాయింట్లు ఎగబాకి 23,490.40 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 66.70 పాయింట్ల లాభంతో 23,465.60 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.93 లక్షల కోట్లు పెరిగి సరికొత్త ఆల్‌టైం గరిష్ఠ స్థాయి రూ.434.88 లక్షల కోట్లకు (5.21 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

ఫారెక్స్ నిల్వల్లో కొత్త రికార్డు: భారత విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి పెరిగాయి. ఈ నెల 7తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు 430.7 కోట్ల డాలర్ల వృద్ధితో 65,581.7 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ నిల్వలు 483 కోట్ల డాలర్లకు పైగా పెరిగాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,890 ▼	65,900 ▼	95,000 ▼
ముంబై	71,866 ▲	65,829 ▲	87,833 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ

హైదరాబాద్	510
వరంగల్	512
చిత్తూరు	593
విజయవాడ	500
గోదావరి	490
విశాఖపట్నం	500

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	139
వరంగల్	139
కరీంనగర్	139
మహబూబ్‌నగర్	139
కర్నూలు	139
విశాఖపట్నం	136
గోదావరి	145
విజయవాడ	145
గుంటూరు	145
ఒంగోలు	145
చిత్తూరు	150
నెల్లూరు	150
అనంతపురం	145

బీఎస్‌ఎన్‌ఎల్ భూముల వేలం

- తుని, పాలకొల్లు, కొండపల్లిల్లో స్థలాల ఎంపిక
- రూ.60 కోట్ల ఆదాయమే లక్ష్యం
- బీఎస్‌ఎన్‌ఎల్ డీజీఎం శేషాచలం

విజయవాడ (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్‌కు చెందిన భూములను వేలం వేస్తున్నట్టు ఏపీ సర్కిల్ డీజీఎం శేషాచలం వెల్లడించారు. రాష్ట్రంలోని కాకినాడ జిల్లా తుని, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో ఉన్న భూములను వేలం వేయాలని నిర్ణయించామన్నారు. విజయవాడ చుట్టుగుంటలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తుని బ్యాంక్ కాలనీలో ఉన్న 157.59 సెంట్ల ఖాళీ స్థలానికి అప్‌సెట్ ధరను రూ.12.94 కోట్లుగా నిర్ణయించామన్నారు. అలాగే పాలకొల్లులోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ స్టోర్ యార్డులో ఉన్న 103.29 సెంట్ల స్థలానికి రూ.11.19 కోట్లను ధరగా నిర్ణయించామని తెలిపారు. కొండపల్లిలో ఉన్న టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో గల 148.22 సెంట్ల స్థలానికి రూ.11.02 కోట్లను అప్‌సెట్ ధరగా నిర్ణయించామని వివరించారు. ఈ భూముల వేలం ద్వారా రూ.60 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గడచిన ఏడాది నిర్వహించిన భూముల వేలంలో రూ.40 కోట్ల ఆదాయాన్ని బీఎస్‌ఎన్‌ఎల్ సంపాదించిందన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్‌కు ఉపయోగం లేని స్థలాలను మాత్రమే వేలం వేస్తున్నామన్నారు.

రాష్ట్రంలో మొత్తం 27 స్థలాలను వేలం వేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ వేలం ద్వారా వచ్చిన ఆదాయంతో సంస్థలో పెట్టుబడులు పెడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ వేలాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కన్సార్షియంలు, ప్రభుత్వ సంస్థలు, రియల్టర్లు, పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ట్రస్ట్‌లు, ఎన్జీవో సంస్థలు ఈ వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు. ఇతర వివరాల కోసం 9490100072కు వాట్సాప్‌లో సంప్రదించవచ్చన్నారు.agm.aplb@bsnl.co.in కు మెయిల్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. http://landmonetisation.bsnl.co.inలో భూముల పూర్తి వివరాలను అందుబాటులో ఉంచామన్నారు.

ఆరోగ్య బీమాలోకి ప్రవేశించే ప్రతిపాదనేం లేదు

ఎల్ఐసీ


ముంబై: ఆరోగ్య బీమా విభాగంలోకి ప్రవేశించే ప్రతిపాదనేం లేదని ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ శుక్రవారం వెల్లడించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. జీవిత బీమా కంపెనీలు ఆరోగ్య పాలసీలను విక్రయించడానికి వీల్లేదు. కేవలం సాధారణ బీమా లేదా ఆరోగ్య బీమా సంస్థలకు మాత్రమే ఇందుకు అనుమతి ఉంది. కాగా, కంపెనీ ఆర్యోగ బీమా సేవల్లోకి ప్రవేశించనుందన్న అంచనాలతో ఎల్ఐసీ షేరు శుక్రవారం 6.51 శాతం ఎగబాకి రూ.1,067 స్థాయికి చేరుకుంది.

అమాత్యుల తొలి పలుకులు

పన్నుల బాదుడు ఉండదు

- ఆదాయం పెంపునకు వినూత్న మార్గాలు
- చంద్రబాబు అనుభవంతో ఆర్థిక సమస్యలకు చెక్
- జగన్ సభకు రావాలని కోరుకొంటున్నాం
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సంపద సృష్టి పేరుతో ప్రజలపై పన్నుల భారం మోపబోమని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. మంత్రులకు శాఖలు ప్రకటించిన అనంతరం శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో చేస్తామని, సీఎం చంద్రబాబు బ్రాండ్‌తో రాష్ట్రానికి పరిశ్రమలు, ఐటీ కంపెనీలను తీసుకువస్తామని చెప్పారు. రాష్ట్ర ఖజానా ఎలా ఉందో తామింకా చూడాలేదని, నిధుల మళ్లింపు, భవిష్యత్ ఆదాయాలు తాకట్టు పెట్టడం లాంటి అనేక అవకతవకలు జగన్ హయాంలో జరిగాయని ఆరోపించారు. కాగ్ కూడా తన నివేదికలో వీటిని ధ్రువీకరించినట్టు పయ్యావుల గుర్తుచేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి భయంకరంగా ఉన్నా సీఎం చంద్రబాబు అనుభవం, దూరదృష్టితో ఆ సమస్యలను అధిగమిస్తామన్న నమ్మకం తమకు ఉందన్నారు. 'అప్పులు 11లక్షల కోట్లకు చేరాయని వింటున్నాం. కార్పొరేషన్ల పేరుతో ఇష్టానుసారం అప్పులు తెచ్చి, ఎడాపెడా దారి మళ్లించి ఖర్చు చేశారు. శాసనసభకు చెప్పాల్సినవి కూడా చెప్పలేదు. వైసీపీ ప్రభుత్వం మాదిరిగా వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసిన ప్రభుత్వం గతంలో మరొకటి లేదు. ఈ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అంతు తెలియని గొయ్యని ఆర్థికవేత్తలు వ్యాఖ్యానించే పరిస్థితి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం చేసిన ఆర్థిక అరాచకాల ఫలితంగా కేంద్రం అనేక కొత్త మార్గదర్శక సూత్రాలు జారీ చేయాల్సి వచ్చింది. చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు వస్తాయని విశ్వసిస్తున్నాం. ఇప్పటికే ఆ వాతావరణం కనిపిస్తోంది. సామాన్యులపై భారం మోపకుండా వినూత్న విధానాలతో ఆదాయం పెంచుకొనే మార్గాలు అన్వేషిస్తాం' అని పయ్యావుల చెప్పారు. ప్రతిపక్ష హోదాకు చాలినన్ని సీట్లు రాకపోయినా మాజీ ముఖ్యమంత్రి జగన్ శాసనసభకు రావాలని తాము కోరుకొంటున్నామని పేర్కొన్నారు. సభలో ప్రతిపక్షం ఉండాలన్నదే తమ అభిప్రాయమని తెలిపారు.


మాజీ మంత్రి ఆర్థిక యనమల రామకృష్ణుడును మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఆడపిల్లల భద్రతకు ప్రాధాన్యం


కుమారుడు, కుమార్తెతో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన నూతన హోంమంత్రి అనిత వంగలపూడి

- తప్పుడు ఆలోచనలతో వారివైపు కన్నెత్తి చూసినా కఠిన చర్యలు
- శాంతి భద్రతలు టీడీపీ బ్రాండ్
- దానిని ఆచరణలో నిరూపిస్తాం
- పోలీసు వ్యవస్థలో మార్పును ఆశిస్తున్నాం
- హోంమంత్రి వంగలపూడి అనిత

అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 'ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిని వదిలిపెట్టేది లేదు. తప్పుడు ఆలోచనలతో వారివైపు కన్నెత్తి చూసినా కఠినంగా వ్యవహరిస్తాం. గంజాయి, డ్రగ్స్ వాడినా, అమ్మినా ఊరుకొనేది లేదు' అని అని హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలు భద్రంగా ఉండగలిగే పరిస్థితులు నెలకొనేలా చేస్తామని హామీ ఇచ్చారు. 'మంచి శాంతి భద్రతలు టీడీపీ బ్రాండ్. దానిని నిరూపిస్తాం. ఆచరణలో చూపిస్తాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్డీయే కూటమి మార్క్ ఉండేలా పనిచేస్తాం. మచ్చలేని పాలనను అందించడానికి కృషి చేస్తాం' అని ఆమె పేర్కొన్నారు. 'ఏం తప్పు చేశామని మాపై పరమ నీచంగా సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు చేశారు? ఒక రాజకీయ పార్టీలో ఉండి ప్రజల సమస్యలపై పనిచేస్తే వేధిస్తారా? విశాఖలో డాక్టర్ సుధాకర్‌ను నడిరోడ్డు మీద కొట్టి పిచ్చివాడిగా ముద్ర వేసి చనిపోయేలా చేశారు. ఆయనకు మద్దతుగా పోరాడినందుకు భయంకరమైన ట్రోల్స్ వాటిలో పచ్చిబూతులు. యూట్యూబ్‌లో వచ్చే నా వార్తల కింద కామెంట్లు చదవొద్దని నా పిల్లలను కూర్చోబెట్టి చెప్పాల్సి వచ్చేది. ఒక తల్లిగా నాకు ఇదేం పరిస్థితి? అరవై ఏళ్ల పైబడిన రంగనాయకమ్మను తెచ్చి సీఐడీ ఆఫీసులో కూర్చోబెట్టి వేధించారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని అసెంబ్లీలో నిండు సభలో అమానుషంగా దూషించారు. చంద్రబాబుపై కేసేమిటో తెలియకుండానే అరెస్టు చేసి 53 రోజులు జైల్లో పెట్టారు. ఆయనకు కనీసం వెస్ట్రన్ టాయిలెట్, వేడినీళ్లు కూడా ఇవ్వలేదు. పల్నాడులో ఒక టీడీపీ కార్యకర్తను 'జై జగన్' అనలేదని గొంతు కోసి చంపారు. అరెస్టులు, వేధింపులపై డీజీపీని కలవాలని వెళ్తే ఎన్నోసార్లు రోడ్డు మీద ఆపారు. కనీసం ఎవరో ఒక ఐపీఎస్ అధికారికి వినతిపత్రం ఇస్తామంటే కార్యాలయం లోపలికి తీసుకువెళ్లి ఒక హెడ్ కానిస్టేబుల్‌ను చూపించి అతనికి ఇమ్మని చెప్పారు. కోపంతో ఆ వినతిపత్రం చించేసి వచ్చేశాం. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత మీరే ప్రొటోకాల్ ఇచ్చి మమ్మల్ని లోపలికి తీసుకువెళ్తారని ఆ రోజే చెప్పాను. ఇప్పుడు హోంమంత్రిగా వాళ్లే నన్ను తీసుకువెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది' అని ఆమె అన్నారు. తమకు కక్ష సాధించే ఉద్దేశం లేదని... అయితే తప్పు చేసినవారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. 'ప్రజలకు మంచిచేసే విషయంలో పోలీస్ వ్యవస్థ సానుకూల ధోరణితో వ్యవహరిస్తే ఇబ్బంది లేదు. ఇంకా మాలో ఆ రక్తమే ఉందంటూ పాత పద్ధతిలో ఉంటే మేం మా రక్తాన్ని మేం తెచ్చుకొంటాం. తప్పు చేసినవారి పట్ల కఠినంగా ఉండాలన్నది చంద్రబాబు సిద్ధాంతం. అందులో మేం రాజీ పడం. శాంతి భద్రతలు బాగుంటే పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయి. గత ప్రభుత్వంలో ఉన్నవి పోయాయి. ఆ పరిస్థితులు పునరావృతం కానివ్వం' అని హోంమంత్రి పేర్కొన్నారు.

సమ్మిళిత అభివృద్ధి సాధిస్తాం

- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే నాయకత్వం, ఉమ్మడి కృషితో సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి, సమ్మిళిత అభివృద్ధిని సాధిస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా తనను అభినందించిన సీఎం చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు, ఇతర మంత్రివర్గ సహచరులతో కలసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం మనమందరం ముందుకు నడుద్దామని పవన్ సంఘీభావం ప్రకటించారు.

మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి

- మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ



అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాబోయే మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని, మాస్టర్ ప్లాన్‌లో ఉన్న నిర్మాణాలన్నీ త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. పట్టణాల్లో ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించాలన్న లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ప్రతి పట్టణ పౌరుడికి సురక్షితమైన తాగునీటి కోసం ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేస్తామని తెలిపారు. పట్టణ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమిస్తామని, డ్రైన్లు, డ్రైనేజీ నిర్మాణాలు, ఘన, ద్రవవ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వివరించారు.పెంపొందించేందుకు టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

మిగులు నుంచి కొనే స్థాయికి తెచ్చారు

- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2014- 19 మధ్యకాలంలో మిగులు విద్యుత్తు స్థాయి నుంచి ప్రస్తుతం డిమాండ్‌ను తట్టుకోవాలంటే బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన స్థాయికి తీసుకొచ్చారని గత వైసీపీ ప్రభుత్వాన్ని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆక్షేపించారు. ఈ దుస్థితికి కారణాలపై లోతైన అధ్యయనం చేస్తామని చెప్పారు. ఆదాయం పెరగాలంటే చార్జీలను పెంచడం ఒక్కటే మార్గంగా వైసీపీ సర్కారు ఎంచుకుందని అన్నారు. ఇంధనశాఖ స్థితిగతులపై సమగ్ర అధ్యయనం చేయాల్సి ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. త్వరలోనే శాఖాపరమైన సమీక్షను చేపడతానని, ఆ తర్వాతే పూర్తి వివరాలను అందజేస్తానని తెలిపారు.

హౌసింగ్‌లో అవకతవకలపై విచారణ

- గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి


గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు చేపడుతున్న కె.పార్థసారథి

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గత ఐదేళ్లలో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు జరిగినా, లబ్ధిదారులకు ఎలాంటి నష్టం వాటిల్లినా లోతుగా దర్యాప్తు చేయించి.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. శుక్రవారం అమరావతి సచివాలయం ఐదో బ్లాక్‌లోని గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చాంబర్‌లో గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి సతీసమేతంగా పూజలు నిర్వహించారు. తనకు అప్పగించిన శాఖలను బాధ్యతగా నిర్వర్తిస్తానని, పేదలకు చక్కటి గూడు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. 'గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిపివేసిన దాదాపు 13.80లక్షల గృహాలను పూర్తి చేస్తాం. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని హౌసింగ్ కాలనీల్లో అమృత్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాల కింద పెద్ద ఎత్తున మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా'నని మంత్రి పేర్కొన్నారు.

ఉద్యోగాలు సాధించేలా యువతకు నైపుణ్య శిక్షణ

- ఐటీ, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్



అమరావతి(ఆంధ్రజ్యోతి), మంగళగిరి, జూన్ 14: పరిశ్రమల్లో ఉద్యోగాలు సాధించేలా యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రానికి ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు తీసుకొచ్చి పెద్దఎత్తున యువతకు ఉద్యోగాలు కల్పించడమే తన లక్ష్యమని చెప్పారు. గతంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చగలిగానని, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రిగా అనేక కంపెనీలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించానని గుర్తుచేశారు. గత అనుభవం నేర్పిన పాఠాలతో మరింత సమర్థవంతంగా పనిచేస్తానన్నారు. యువగళం పాదయాత్రలో కేజీ నుంచి పీజీ వరకు విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తానని హామీ ఇచ్చానన్నారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్న తనకు గ్రామీణ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే అవకాశాన్ని ఒక పవిత్రమైన బాధ్యతగా స్వీకరిస్తానని లోకేశ్ స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదాల రహితంగా ఏపీ

- ప్రతి జిల్లాలోనూ స్టేడియాల నిర్మాణం
- రవాణా, క్రీడాశాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, భద్రతా చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేస్తామని, అన్ని శాఖలతోనూ సమన్వయం చేసుకుని.. రాష్ట్రాన్ని రోడ్డు ప్రమాదాల రహితంగా మార్చడమే తన లక్ష్యమని రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఫిటెనెస్ లేకుండా రోడ్డుపైకి వచ్చే కాలం చెల్లిన లారీలు, స్కూల్ బస్సులు, కార్లు, ఇతర వాహనాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం కార్యక్రమంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా వంద శాతం విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ స్టేడియాల ఏర్పాటు, క్రీడాశాఖకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తెప్పించి క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల వసతులను అందించేందుకు కృషి చేస్తామని వివరించారు. అన్ని పాఠశాలల్లో రోజుకు ఒక గంట స్పోర్ట్స్ క్లాస్ నిర్వహిస్తామని, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

ప్రజా పంపిణీని మెరుగుపరుస్తాం

- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరుస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. వినియోగదారుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని చెప్పారు. పేద ప్రజలకు, రైతులకు చిత్తశుద్ధితో సేవలందించే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉందని, ఈ బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గుజరాత్ తరహాలో పారిశ్రామిక ప్రగతి

- పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్



కర్నూలు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గుజరాత్ తరహా మోడల్‌గా ఏపీలో పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తానని పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. స్వతహగా పారిశ్రామికవేత్తనైన తనకు రాష్ట్రానికి పరిశ్రమలు ఎలా తీసుకురావాలో అవగాహన ఉందని తెలిపారు. రాయితీలు ఇవ్వడమే కాకుండా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తేనే పరిశ్రమలు వస్తాయని చెప్పారు. జగన్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టాలంటేనే భయపడే పరిస్థితి తీసుకొచ్చారని, ఈ పరిస్థితుల్లో వారికి ధైర్యం, ప్రోత్సాహం కల్పించాల్సిన బాధ్యత తనపై ఉందని తెలిపారు. దీనిపై అధ్యయనం చేసి రూట్ మ్యాప్ తయారు చేస్తానని వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం ఎంతో కీలకమైనదని, కోస్తాంధ్రలో ఆక్వా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారిస్తానని భరత్ తెలిపారు.

కార్మికులకు అండగా ఉంటాం

- మంత్రి వాసంశెట్టి సుభాష్



అమరావతి(ఆంధ్రజ్యోతి)/ రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 14: గత టీడీపీ ప్రభుత్వం హయాంలో కార్మికుల సంక్షేమానికి అమలు చేసిన అన్ని పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వాటి పునరుద్ధరణకు కృషి చేస్తానని కార్మిక సంక్షేమ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. 'వైసీపీ ఐదేళ్ల పాలనలో కార్మికుల సంక్షేమం మూలనపడింది. ముఖ్యంగా భవన నిర్మాణరంగ కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు నిలిపివేసింది. అందుకే వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడంలో వారు కీలకపాత్ర పోషించారు. గతంలో చంద్రన్న బీమాతో కుటుంబాలకు భరోసా కల్పించాం సాధారణ మరణానికి 30 వేలు, రోడ్డు ప్రమాదంలో మరణాలకు రూ.5లక్షల వరకూ బీమా సౌకర్యం ఉండేది. ఆ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసింది' అని సుభాష్ మండిపడ్డారు. ఈఎస్ఐను అభివృద్ధి చేసి, కార్మికుల కోసం మరిన్ని ఆస్పత్రుల నిర్మాణం, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇసుకను ఉచితంగా ఇవ్వడంతో పాటు కార్మికులకు అండగా ఉంటామన్నారు.

రైతుల ఆదాయం పెంపునకు కృషి


- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల ఆదాయం పెంపొందించడం ద్వారా ఏపీ వ్యవసాయ రంగాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు చెప్పారు. అత్యంత కీలకమైన వ్యవసాయశాఖ మంత్రిగా తనను నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. 'అందరికీ అన్నం పెట్టే రైతన్నకు సేవ చేసే భాగ్యం కల్పించినందుకు ధన్యవాదాలు. నాకు అప్పగించిన బాధ్యతలను అంతఃకరణ శుద్ధితో నిర్వహించి, ప్రతిక్షణం రైతన్నల సంక్షేమానికి, రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి పాటుపడతా. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వ్యవసాయశాఖను భ్రష్టు పట్టించింది. రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి పాటుపడతా. విత్తనం నుంచి విక్రయం వరకు రైతన్నలకు అన్ని విధాలా అండగా నిలబడతాం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అందించిన సబ్సిడీ యంత్రాలు, యంత్రపరికరాలు, మైక్రో ఇరిగేషన్ వంటి అన్ని పథకాలు పునరుద్ధరిస్తాం' అని అచ్చెన్నాయుడు ప్రకటించారు.

టూరిజం హబ్‌గా ఏపీ

- పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్



రాజమహేంద్రవరం, జూన్14(ఆంధ్రజ్యోతి): 'వైజాగ్ అందమైన లోకేషన్. అక్కడ సినిమా రంగాన్ని అభివృద్ధి చేయాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన. మా పార్టీ అధ్యక్షుడు పవన్ ఎలాగూ పెద్ద స్టార్. వారి అభిప్రాయాలు తీసుకుని అభివృద్ధి చేస్తాం' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. 'రాష్ట్రంలో అనేక వనరులు ఉన్నాయి. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల పరీవాహక ప్రాంతాలు, కోనసీమ వంటి అందమైన ప్రదేశాలు ఉన్నాయి. కానీ వనరులు లేని గుజరాత్, రాజస్థాన్ వంటివి టూరిజం హబ్‌గా తయారయ్యాయి. మనం దృష్టిపెడితే ఆంధ్ర అన్నిటికంటే మంచి టూరిజం హబ్ అవుతుంది. రాజమహేంద్రవరం కేంద్రంగా గత పుష్కరాల సమయంలో అఖండ గోదావరి ప్రాజెక్టును చంద్రబాబు అమల్లోకి తెచ్చారు. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించి 2027లో వచ్చే పుష్కరాల నాటికి ఓ రూపం తెస్తాం' అని దుర్గేష్ పేర్కొన్నారు.

వైసీపీ చేసిన అప్పులు.. తాకట్లపై శ్వేతపత్రం

- రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె, జూన్ 14 : రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో జగన్ పాలన అప్పుల కుప్పలుగా మారిందని, ప్రభుత్వభూములను ఎక్కడ తాకట్టు పెట్టారో అధ్యయనం చేయ్యాల్సిన పరిస్థితి నెలకొందని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రెవెన్యూ విభాగంలో అధ్యయనం చేసి శ్వేత పత్రాన్ని విడుదల చేస్తామని తెలిపారు. 2019 నుంచి రెవెన్యూ విభాగంలో జరిగిన అవకతవకలపై దృష్టిసారిస్తామని తెలిపారు. ప్రభుత్వానికి సంబంధించిన కోట్లాది రూపాయల విలువైన భూములను వైసీపీ నాయకులకు తక్కువ ధరకు కట్టపెట్టటం, విలువైన ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టడంపై గత ప్రభుత్వ హయాంలోనే ఎన్నో అవకతవకలు బయటకు వచ్చాయని వాటిపై దృష్టిసారించి పూర్వాపర్వాలు పరిశీలిస్తామని వివరించారు. రెవెన్యూ విభాగాన్ని జగన్ అండ్ కో స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నారని ఆరోపించారు. విజయవాడ, వైజాగ్, తిరుపతి, కాకినాడ తదితర ప్రాంతాల్లో విలువైన భూములను ఇష్టానుసారంగా కట్టబెట్టారని, వీటన్నింటిపై విచారణ జరిపి రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేస్తామని మంత్రి అనగాని తెలిపారు.

ప్రతి పేదవాడికి సర్కారీ వైద్యం

- ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి సత్యకుమార్



అనంతపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వైద్య, కుటుంబ సంక్షేమం, వైద్యవిద్యశాఖలకు అంకితభావంతో సేవ చేస్తానని ఆ శాఖల మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగు పరచడానికి కృషి చేస్తానని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి, ఆస్పత్రుల్లో లోటుపాట్లను సరిదిద్ది, ప్రతి పేదవాడికి సర్కారీ వైద్యం అందేలా చేయడమే కర్తవ్యంగా పేర్కొన్నారు.

నాసిరకం మద్యం లేకుండా చేస్తా

- ఎక్సైజ్, మైనింగ్ మంత్రి కొల్లు రవీంద్ర



విజయవాడ(భవానీపురం), జూన్ 14: ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై నమ్మకం ఉంచి కీలక శాఖలు అప్పగించినందుకు కృతజ్ఞతలు చెబుతున్నానని, రాష్ట్రంలో నూతన ఎక్సైజ్ పాలసీతో నాసిరకం మద్యం లేకుండా చేస్తానని ఎక్సైజ్, మైనింగ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యం, ఇసుక మాఫియాలు దోచుకున్నాయని చెప్పారు. నాసిరకం మద్యంతో పేదల జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. గంజాయిని కూడా విచ్చలవిడిగా రవాణా చేయించారని ధ్వజమెత్తారు. ఇసుక నిలిపివేసి నిర్మాణ రంగాన్ని నాశనం చేశారని, లక్షల మంది కార్మికుల పొట్ట కొట్టారని, ఇసుక దోపిడీతో కోట్లు దోచుకుని ప్రజలకు కన్నీళ్లు మిగిల్చారని తెలిపారు. వారి అవినీతి, అక్రమాలకు సహరించిన అధికారులపై విచారణ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీలో నూతన మద్యం పాలసీ నాసిరకం మద్యం లేకుండా చేస్తామన్నారు.

మరింత నిబద్ధతతో పనిచేస్తా

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా



ఒంగోలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తనపై నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక శాఖను కేటాయించారని, శాఖల విషయంలో చాలా సంతృప్తిగా ఉన్నానని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. అందుకే వెంటనే ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపానని చెప్పారు. ప్రజలు, పార్టీ, ప్రజా సమస్యల పట్ల ఎంత నిబద్ధతతో పనిచేస్తామో ఇప్పటికే నిరూపించుకొని వరుస విజయాలు సాధించానని గుర్తుచేశారు. అంతకన్నా ఎక్కువగా పనిచేసి సీఎం నమ్మకాన్ని నిలబెడుతూ రాష్ట్ర ప్రజల మద్దతు పొందుతానని తెలిపారు.

చేనేతకు పూర్వవైభవం తీసుకొస్తా

- బీసీ సంక్షేమం, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి సవిత



ధర్మవరం/పెనుకొండ టౌన్, జూన్ 14: వైసీపీ పాలనలో కుదేలైన చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తానని బీసీ సంక్షేమం, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి సవిత అన్నారు. బీసీలను గౌరవించిన పార్టీ టీడీపీ అని తెలిపారు. రాష్ట్రంలో 50శాతం ఉన్న బీసీలకు వైసీపీ పాలనలో జగన్ మొండిచేయి చూపారని విమర్శించారు. బీసీ వర్గాల విద్య, వ్యాపార, ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. బీసీలకు ప్రత్యేక చట్టం త్వరలోనే కార్యాచరణ దాల్చుతుందని, జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్ల ద్వారా నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధి, ఉన్నత చదువులకు చేదోడుగా నిలుస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, ప్రాంతాలవారీగా చేనేతల సమస్యలు తెలుసుకుని, వారికి పథకాలు వర్తింపజేస్తామని మంత్రి సవిత హామీ ఇచ్చారు.

రోడ్ల బాగుకు నెలలో రూట్ మ్యాప్

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



నంద్యాల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆ రోడ్లన్నీ ఇప్పుడు బాగు చేయాలి. స్పష్టమైన ప్రణాళికతో ముందుకువెళ్తాం. అందుకోసం నెల రోజుల్లో రూట్ మ్యాప్ ప్లాన్ చేస్తాం' అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. కేంద్రం మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడి రాష్ట్రానికి వీలైనన్ని నిధులు రాబట్టి అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తామని చెప్పారు. పోర్టుల అభివృద్ధికి కృషి చేసి పెట్టుబడులను విరివిగా తీసుకొస్తామని, అందుకోసం ప్రత్యేకమైన ప్రణాళికను నెలరోజుల్లో రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో రహదారులకు ఉండాల్సిన బడ్జెట్‌ను గత వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజలు సౌకర్యవంతమైన ప్రయాణం చేయడానికి కృషి చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

మహిళా సంఘాలను బలోపేతం చేస్తాం

- ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు



మంత్రిగా అవకాశం కల్పించి నాకు అప్పగించిన శాఖల ద్వారా ప్రజలకు న్యాయం చేస్తా. ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పగించిన బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తా. నాకు కేటాయించిన మంత్రి పదవిపై సంతృప్తిగా ఉంది. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తాం.

మైనారిటీలకు న్యాయం చేస్తా

- మైనారిటీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



నంద్యాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు నాపై నమ్మకం ఉంచి మైనారిటీ శాఖ కేటాయించినందుకు ఆనందంగా ఉంది. గతంలో కూడా మైనారిటీ శాఖ మంత్రిగా చేశాను. దీనిపై పూర్తి అవగాహన ఉంది. టీడీపీ హామీ ఇచ్చిన విధంగానే వారి సంక్షేమం కోసం పాటుపడతాను. మా అధినేత చెప్పిన విధంగానే 4 శాతం రిజర్వేషన్ గురించి కూడా కృషి చేస్తాం. బీజేపీతో పొత్తు ఉన్నా, మైనారిటీలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తాం. ఇక న్యాయశాఖపై పూర్తి అవగాహన లేదు. వాటికి సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా తెలుసుకుంటాను. ఎవరికి ఎలాంటి ఇబ్బంది రాకుండా, అవసరమైన మేర న్యాయం చేసేందుకు సహకరిస్తాం' అని మైనారిటీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కసరత్తు జరిపిన సీఎం చంద్రబాబు.. తన సహచర మంత్రులకు శాఖలు కేటాయించారు. అందరూ ఊహించినట్లే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి హోదా కట్టబెట్టారు. కీలకమైన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగు నీటి సరఫరా.. పర్యావరణం, అడవులు.. సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను ఆయనకు కేటాయించారు. నారా లోకేశ్‌కు మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్స్ శాఖలతో పాటు రియల్ టైమ్ గవర్నెన్స్(ఆర్‌టీజీ) కూడా అప్పగించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడైన అచ్చెన్నాయుడికి వ్యవసాయం, మార్కెటింగ్, సహకారం, పాడిపరిశ్రమ, మత్స్యశాఖలు లభించాయి. కీలకమైన హోం శాఖను దళిత(మాదిగ) వర్గానికి చెందిన మహిళ వంగలపూడి అనితకు.. ఆర్థిక, వాణిజ్య పన్నులు, ప్రణాళికా శాఖలతో పాటు శాసనసభ వ్యవహారాలను పయ్యావుల కేశవ్‌కు.. రెవెన్యూ స్టాంపులు-రిజిస్ట్రేషన్లను అనగాని సత్యప్రసాద్‌కు కేటాయించారు. ఇతర ముఖ్య శాఖల్లో జలవనరుల శాఖను నిమ్మల రామానాయుడికి.. ఆహార-పౌరసరఫరాలు నాదెండ్ల మనోహర్‌కు, రాజధాని అమరావతి నిర్మాణంపై అవగాహన ఉన్న పొంగూరు నారాయణకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలు.. బీజేపీకి చెందిన సత్యకుమార్‌కు వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ కేటాయించారు. ఇక సాధారణ పరిపాలన, శాంతి భద్రతలు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి.



చంద్రబాబుతో పవన్ కరచాలనం (ఫైల్‌ఫొటో)

పవన్‌కు, మంత్రివర్గానికి బాబు అభినందనలు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ట్వీట్ చేశారు. అలాగే కేబినెట్ సహచరులకు శాఖలు కేటాయించిన సందర్భంగా ప్రజా సేవలో నిమగ్నం కానున్న మంత్రులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులుగా సేవలందించి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తారని నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. కాగా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, అధికార ప్రతినిధి మాల్యాద్రి అభినందించారు. మంత్రి అయిన తర్వాత టీడీపీ పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆమెకు వర్ల రామయ్య శాలువా కప్పి సన్మానించారు.

మంత్రులకు శాఖలు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

మంత్రులు	శాఖలు
1. చంద్రబాబునాయుడు	సాధారణ పరిపాలన.. శాంతి భద్రతలు.. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్.. మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు
2. పవన్ కల్యాణ్	పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా.. పర్యావరణం, అడవులు... శాస్త్ర సాంకేతిక శాఖలు
3. లోకేశ్	మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్
4. కింజరాపు అచ్చెన్నాయుడు	వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ.. మత్య శాఖ
5. కొల్లు రవీంద్ర	గనులు, భూగర్భ శాఖ.. ఎక్సైజ్
6. నాదెండ్ల మనోహర్	ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు
7. పొంగూరు నారాయణ	పురపాలక, పట్టణాభివృద్ధి
8. వంగలపూడి అనిత	హోం, విపత్తు నిర్వహణ
9. సత్యకుమార్	ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య
10. నిమ్మల రామానాయుడు	జలవనరుల శాఖ
11. ఎన్ఎండీ ఫరూక్	న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమం
12. ఆనం రామనారాయణరెడ్డి	దేవదాయ శాఖ
13. పయ్యావుల కేశవ్	ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాలు
14. అనగాని సత్యప్రసాద్	రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు
15. కొలుసు పార్థసారథి	గృహ నిర్మాణం, సమాచార-పౌరసంబంధాలు
16. డోలా బాలవీరాంజనేయ స్వామి	సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం
17. గొట్టిపాటి రవికుమార్	విద్యుత్
18. కందుల దుర్గేశ్	పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ
19. గుమ్మడి సంధ్యారాణి	మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమం
20. బీసీ జనార్దన్‌రెడ్డి	రోడ్లు-భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు
21. టీజీ భరత్	పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి
22. ఎస్.సవిత	బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడినవారి సంక్షేమం, జౌళి, వస్త్ర పరిశ్రమ
23. వాసంశెట్టి సుభాష్	కార్మిక, కర్మాగార, బాయిలర్స్, వైద్య బీమా సేవలు
24. కొండపల్లి శ్రీనివాస్	ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత, సంబంధాలు
25. ఎం.రాంప్రసాద్‌రెడ్డి	రవాణా, యువజన సర్వీసులు, క్రీడలు

సాయంత్రం 6 వరకు సచివాలయంలోనే!

- అందరికీ అందుబాటులో ఉండేలా సీఎం చంద్రబాబు నిర్ణయం
- శాఖలపై పట్టు పెంచుకోవాలని మంత్రులకు దిశానిర్దేశం

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గతంలో మాదిరిగానే సచివాలయం నుంచే పాలన సాగించాలని నిర్ణయించినట్లు తెలిసింది. 2019 ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ సచివాలయాన్ని కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో సచివాలయం కళావిహీనంగా మారిపోయింది. టీడీపీ కూటమి గెలుపొందడం, చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించడంతో సచివాలయానికి ప్రాధాన్యత పెరిగింది. అంతేకాదు, గతంలో మాదిరిగానే సచివాలయంలోనే నిరంతరం అందుబాటులోనే ఉండి సమీక్షలు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించుకున్నారు. తనను కలిసిన ప్రజా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి 6 గంటల వరకు సచివాలయంలోనే ఉంటానని స్పష్టం చేశారు. అదేవిధంగా సచివాలయంలో తనను కలిసిన మంత్రులకు కూడా ఆయన దిశానిర్దేశం చేశారు. సమయపాలన ఖచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు. అదేవిధంగా మంత్రులు రెగ్యులర్‌గా సచివాలయానికి రావాలని చంద్రబాబు సూచించారు. తమ శాఖలపై పట్టు పెంచుకోవాలని, పరిపాలన పరంగా పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలని మంత్రులకు దిశ నిర్దేశం చేశారు.

నవతరానికి 'బరువు' బాధ్యతలు

- శాఖల కేటాయింపుపై చంద్రబాబు సుదీర్ఘ కసరత్తు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మంత్రివర్గంలో కొత్త తరానికి పెద్దపీట వేసిన సీఎం చంద్రబాబు.. శాఖల కేటాయింపులోనూ అదే ఒరవడి కొనసాగించారు. నవతరానికి పెద్ద బాధ్యతలు అప్పగించారు. ఇదే సమయంలో పాతతరానికీ ప్రాధాన్యం కొనసాగించారు. ప్రతిభ, సామర్థ్యం, నేపథ్యం, అనుభవానికి నడుమ సమతూకం పాటించారు. అలాగే మిత్రపక్షాలకు సముచిత గౌరవం లభించింది. తొలిసారి ఎమ్మెల్యే(పిఠాపురం)గా గెలిచిన జనసేనాని పవన్ కల్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి హోదాతో పాటు కీలకమైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి.. అటవీ, పర్యావరణం శాఖలు ఇచ్చారు. లోకేశ్(మంగళగిరి)కు ఈసారి మానవ వనరుల అభివృద్ధి శాఖ కేటాయించారు. విద్యా శాఖలోని అన్ని విభాగాలనూ కలిపి 2014లో ఈ శాఖను ఏర్పాటు చేశారు. దీంతోపాటు ఆయనకు పట్టున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్లను కూడా అప్పగించారు. తొలిసారి మంత్రి అయిన పయ్యావుల కేశవ్(ఉరవకొండ)కు అతిముఖ్యమైన ఆర్థిక శాఖ ఇచ్చారు. జగన్ ప్రభుత్వ హయాంలో ప్రజాపద్దుల కమిటీ(పీఏసీ) ఛైర్మన్‌గా పనిచేసిన ఆయనకు ఆర్థిక వ్యవహారాలపై మంచిపట్టుంది. నిమ్మల రామానాయుడి(పాలకొల్లు)కి జలవనరుల శాఖ, అనగాని సత్యప్రసాద్(రేపల్లె)కు రెవెన్యూ, గొట్టిపాటి రవి(అద్దంకి)కు విద్యుత్, అచ్చెన్నాయుడి(టెక్కలి)కి వ్యవసాయం, డోలా బాల వీరాంజనేయస్వామి(కొండపి)కి సాంఘిక సంక్షేమం, వలంటీర్లు-గ్రామసచివాలయాల శాఖలు లభించాయి. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర(మచిలీపట్నం)కు గనులు, ఎక్సైజ్ శాఖలు కేటాయించారు. టీజీ భరత్(కర్నూలు)కు పరిశ్రమలు, కొండపల్లి శ్రీనివాస్(గజపతినగరం)కు చిన్న తరహా పరిశ్రమలు, సెర్ప్.. మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి(రాయచోటి)కి రవాణా, యువజన వ్యవహారాలు, క్రీడలు దక్కాయి.

సీనియర్లకూ సముచిత గౌరవం

సీనియర్ల గౌరవానికి భంగం కలుగకుండా వారికి సముచిత శాఖలు ఇచ్చారు. వయసులో పెద్దవాడు, సీనియర్ అయిన ఆనం రామనారాయణరెడ్డి(ఆత్మకూరు)కి దేవదాయ శాఖ ఇచ్చారు. తొలుత ఆయనకు ఆర్థిక శాఖ ఇవ్వాలన్న చర్చ జరిగింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా 24 గంటలూ క్రియాశీలంగా ఉండాల్సి రావడం.. తరచూ ఢిల్లీ వెళ్లాల్సిన పరిస్థితుల్లో ఆయనపై తీవ్ర ఒత్తిడి పెట్టినట్లు అవుతుందని భావించారు. దీంతో దేవదాయ శాఖ అప్పగించారు. మరో సీనియర్ నేత ఎన్ఎండీ ఫరూక్(నంద్యాల)కు న్యాయ శాఖతో పాటు మైనారిటీ సంక్షేమం కేటాయించారు. గతంలో మంత్రిగా చేసిన కొలుసు పార్థసారథి(నూజివీడు)కి గృహ నిర్మాణంతోపాటు సమాచార-పౌర సంబంధాల శాఖ లభించింది. గత జగన్ ప్రభుత్వం హోం శాఖను దళిత మహిళలకు(తానేటి వనిత, మేకతోటి సుచరిత) ఇచ్చింది. అదే సంప్రదాయాన్ని చంద్రబాబూ కొనసాగించారు. వంగలపూడి అనిత(పాయకరావుపేట)కు ఈశాఖ కట్టబెట్టారు. అనేక మంది మంత్రులు ఆ శాఖను ఆశించినా చివరకు ఆమెకు ఇవ్వడం విశేషం. గిరిజన వర్గానికి చెందిన సంధ్యారాణి(సాలూరు)కి గిరిజన సంక్షేమంతోపాటు మహిళా సంక్షేమ శాఖ దక్కాయి. రాయలసీమకు చెందిన సవిత(పెనుకొండ)కు బీసీ సంక్షేమం, చేనేత శాఖలు లభించాయి. లోకేశ్ సహా ఎవరికీ పాత శాఖలు ఇవ్వలేదు. మాజీ మంత్రి పొంగూరు నారాయణ(నెల్లూరు సిటీ) ఒక్కరికే గత టీడీపీ ప్రభుత్వంలో నిర్వహించిన శాఖ(పురపాలక, పట్టణాభివృద్ధి) మళ్లీ దక్కింది. రాజధాని నిర్మాణం పురపాలక శాఖ పరిధిలోకే వస్తుంది. ఆయనకు దానిపై అవగాహన ఉండడంతో కొనసాగించినట్లు సమాచారం. మిత్రపక్షాలకూ మంచి శాఖలు దక్కాయి. జనసేన సీనియర్ నేత నాదెండ్ల మనోహర్(తెనాలి)కు పౌర సరఫరాల శాఖ, కందుల దుర్గేశ్(నిడదవోలు)కు పర్యాటకం, సినిమాటోగ్రఫీ లభించాయి. బీజేపీ నేత సత్యకుమార్(ధర్మవరం)కు ఆరోగ్య శాఖ ఇచ్చారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఈయన ఇంత ముఖ్యమైన శాఖ నిర్వహించగలరా అన్న చర్చ జరిగింది. అయితే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి సుదీర్ఘకాలం పాటు ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా పని చేశారు.ఢిల్లీ స్థాయిలో మంచి సంబంధాలే ఉన్నందున ఈ శాఖ ఇచ్చారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా?

- మరోసారి ఉత్తరాంధ్ర బీసీలకు అవకాశం!



అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్ష మరోసారి ఉత్తరాంధ్ర బీసీ నేతకు దక్కే అవకాశం ఉందని టీడీపీలో ప్రచారం జరుగుతోంది. విశాఖ జిల్లా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాదవ్ వైపు ఆ పార్టీ అధిష్ఠానం మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. రాష్ట్ర విభజన అనంతరం ఈ పదవి మూడు దఫాలు ఈ ప్రాంత నేతలనే వరించింది. టీడీపీ జాతీయ పార్టీగా ఆవిర్భవించిన తర్వాత చంద్రబాబు జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం.. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవులు సీనియర్ నేతలకు ఇవ్వడం రివాజుగా ఉంది. విభజన అనంతరం 2015 సెప్టెంబరులో ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడిగా సీనియర్ నేత కిమిడి కళావెంకట్రావును నియమించారు. తర్వాత ఆయన మంత్రివర్గంలో చేరినా దరిదాపుగా ఐదేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. 2020 అక్టోబరులో అచ్చెన్నాయుడు రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఇప్పుడాయన చంద్రబాబు మంత్రివర్గంలో చేరారు. దీంతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తారని పార్టీలో ప్రచారం సాగుతోంది. ఇటీవలి ఎన్నికల్లో గాజువాక టీడీపీ అభ్యర్థిగా ఆయన రాష్ట్రంలోనే అత్యధికంగా 95 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మంత్రివర్గంలో ఆయనకు చోటు ఖాయమని అందరూ భావించినా.. కొన్ని సమీకరణల కారణంగా చంద్రబాబు ఇవ్వలేకపోయారు. దీంతో ఆయనకు పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశాలు మెండుగా ఉన్నాయని టీడీపీ నేతలు పలువురు పేర్కొంటున్నారు.

ఎంఎస్ఎంఈలకు మంచి రోజులు: ఫ్యాప్సియా

విజయవాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు మంచి రోజులు వచ్చాయని ఫ్యాప్సియా(ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్) శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు దశాబ్దం పైగా కంటున్న కల ఇప్పుడు నెరవేరిందని పేర్కొంది. ఈ శాఖకు ఇప్పటి వరకు కార్యదర్శి మాత్రమే ఉన్నారంటూ.. ఇప్పుడు ఒక మంత్రిని కేటాయించిన చంద్రబాబుకు అభినందనలు తెలిపింది.

ఒక్క సంతకంతో రెట్టింపు పెన్షన్: లోకేశ్

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఒక్క సంతకంతో సంక్షేమ సారథి చంద్రబాబు సామాజిక పింఛన్లను రెట్టింపు చేశారని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. 'రూ.3వేల వృద్ధాప్య పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచారు. దివ్యాంగుల పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారికి ఇచ్చే పెన్షన్‌ను రూ.5వేల నుంచి రూ.15 వేలకు పెంచారు. కిడ్నీ బాధితుల పెన్షన్ రూ.5వేల నుంచి రూ.10 వేలకు పెంచారు. ఇదీ సంక్షేమం అంటే.. ఇదీ పేదలపై ప్రేమ చూపడమంటే.. ఒకాయన ముక్కుతూ, మూలుగుతూ దశల వారీగా వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు తీసుకున్నాడు.' అని 'ఎక్స్' వేదికగా లోకేశ్ పేర్కొన్నారు.

కోడ్ మాటున కోట్లు కొట్టేశారు

(మొదటి పేజీ తరువాయి)


అనుమతుల ఫైళ్లు గత ఏడాది కాలంగా పెండింగ్‌లో పెట్టారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చేదాకా వాటిని సెటిల్ చేయలేదు. ఎన్నికల సమయంలో కమీషన్ వాటాను పెంచి ఇస్తారా....చస్తారా? అన్న ధోరణిలో సెటిల్‌మెంట్ చేసినట్లు తెలిసింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక ఏప్రిల్ 18వ తేదీన 190 దరఖాస్తులను పాత తేదీలతో ఆమోదించినట్లు తెలిసింది. మార్చి 13, 14, 15 తేదీలతో ఆ లీజులకు రెన్యూవల్, గ్రాంట్లు, అనుమతులు ఇచ్చినట్లుగా సమాచారం. అంతకుముందే జిల్లాలకు చెందిన అధికారులతో మార్చి 13, 14, 15 తేదీల్లోనే ఎల్‌వోఐలకు ప్రతిపాదనలు పంపించినట్లుగా ఫైల్స్ తెప్పించుకున్నట్లు తెలిసింది. ఆ తేదీల్లోనే పంపించినట్లుగా కొత్తగా నోట్‌ఫైల్స్ కూడా తెప్పించుకున్నారు. వీటి ఆధారంగా 190 దరఖాస్తులను సెటిల్‌చేసి ఎల్‌వోఐల జారీకి ఆమోదం తెలిపినట్లు తెలిసింది. ఆ రోజు గనుల శాఖ కీలక అధికారితోపాటు ఆయన పీఏ కూడా రాత్రి వరకు ఆఫీసులోనే ఉండి ఆ ఫైళ్లపై సంతకాలు చేసినట్లు తెలిసింది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చాయి. మరుసటి రోజుమధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి పది గంటల వరకు వారిద్దరే ఆఫీసులో ఉన్నారు. సాయంత్రం ఆరు గంటలకే ఆఫీసులో ఉన్న ఇతర అధికారులు, సిబ్బందిని ఇంటికి పంపించేశారు. ఆ తర్వాతే 90 ఎల్‌వోఐల జారీకి సంబంధించిన ఫైళ్లపై ఆ అధికారి సంతకాలు చేశారని తెలిసింది. వీటిని కూడా మార్చి 13,14,15 తేదీల్లోనే జారీచేసినట్లుగానే వ్యవహారం నడిపించినట్లు సమాచారం. ఇలా రెండు దఫాలుగా 280 ఎల్‌వోఐల జారీ ఫైళ్లను ఆమోదించినట్లు తెలిసింది. ఇందులో కొత్త లీజులు, పాత లీజులకు రెన్యూవల్, గ్రాంట్లు ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా పాత తేదీలతో సెటిల్ చేసిన లీజు దరఖాస్తుల వెనక రూ.90 కోట్ల పైనే డీల్ ఉందని విశ్వసనీయంగా తెలిసింది. ఒక్కో ఎల్‌వోఐకు సగటున రూ.40 లక్షల చొప్పున వసూలు చేసినట్లుగా చెబుతున్నారు. లీజుదారులను అదిలించి, బెదిరించి భారీ టార్గెట్‌లతో వసూలు చేసినట్లుగా చెబుతున్నారు. కీలక అధికారి వద్ద పనిచేసే పీఏకు డబ్బు మూటలు అందాకే సంతకాలు చేసినట్లుగా బాధిత లీజుదారు ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

ప్రాంతాలవారీ భేటీలు.. బెదిరింపులు

డబ్బు సంచులు సదరు అధికారి పీఏకు అందకముందు మరో ఐదుగురు తెర వెనుక వ్యవహారాన్ని నడిపారు. సెటిల్‌మెంట్‌కు ముందు లీజుదారులను ప్రాంతాలవారీగా విశాఖ, ఒంగోలు, కృష్ణా జిల్లాలకు చెందిన ముగ్గురు కీలక అధికారులు సమావేశపరిచారు. ఇప్పుడు ఎల్‌వోఐలు రాకపోతే, కొత్త ప్రభుత్వంలో అసలే రావని, మరింత ఇబ్బందిపడతారని బెదరగొట్టారు. కమీషన్‌ను 20లక్షల నుంచి 40 లక్షలకు పెంచారు. ఈ ముగ్గురే ఆ సొమ్ము వసూలు చేసి కీలక అధికారి పీఏకు అందించినట్లు తెలిసింది. ఆ తర్వాతే ఎల్‌వోఐలపై ఆ అధికారి సంతకాలు చేసినట్లుగా చెబుతున్నారు. ఈ ప్రక్రియలో గనుల శాఖలో పెద్దన్నపాత్ర పోషించిన వ్యక్తి వద్ద పనిచేసిన శశి, ఓఎస్‌డీ కూడా ఇందులో పాత్రధారులని తెలిసింది. వారు తమ వాటాను విడిగా వసూలు చేసుకున్నారని సమాచారం. అయితే, వారు దండుకున్న సొమ్ము విలువ ఎంత అన్నది తేలాల్సి ఉంది.

విచారిస్తే ఫైళ్లే నిజం చెబుతాయి

కోడ్ అమల్లో ఉండగా పాత తేదీలతో ఎల్‌వోఐలు జారీ చేసిన ఉదంతంపై ప్రభుత్వం విచారణ చేపట్టాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. తమను బెదిరించి, అదిలించి డబ్బులు వసూలు చేశారని బాధిత లీజుదారులు కొందరు చెబుతున్నారు. సమగ్ర విచారణకు ఆదేశిస్తే, గనుల శాఖలో ఉన్న ఫైళ్లే నిజాలు చెబుతాయని సీనియర్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆ ఫైళ్లు తెప్పించుకొని పరిశీలన చేస్తే వందల కోట్ల దందా బయటకొస్తుందని పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 18, జూన్ 5నుంచి 6వ తేదీల్లో గనుల శాఖ డైరెక్టరేట్ పరిధిలోని సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని కోరుతున్నారు.



సోమవారం పోలవారం!

- క్షేత్రస్థాయి పర్యటనకు సీఎం చంద్రబాబు
- నవ్యాంధ్ర సీఎంగా ప్రతి సోమవారం సమీక్ష
- తిరిగి ఇప్పుడు కూడా అదే ఆనవాయితీ

అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అధికారపగ్గాలు చేపట్టిన వెంటనే పోలవరం ప్రాజెక్టుపై సమీక్షకు ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధమవుతున్నారు. విభజన అనంతరం నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా ఉండగా, ప్రతి సోమవారం ఆయన పోలవరంపై సమీక్షించేవారు. 'సోమవారం పోలవారం' అని అప్పట్లో సరదాగా అనేవారు. అదే ఆనవాయితీని కొనసాగిస్తూ, సోమవారం ఆయన పోలవరం వెళుతున్నట్లు తెలిసింది. ఇంధనం, జల వనరులు తదితర కీలక శాఖలపై శ్వేత పత్రాలను విడుదల చేయాలన్న యోచనలో ముఖ్యమంత్రి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆయా శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని చంద్రబాబుకు అధికారులు అందించారు. పోలవరం సహా రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం లోతైన సమీక్ష చేపడతారని అధికారులు చెబుతున్నారు. ఐదేళ్ల కాలంలో జగన్ ఏస్థాయిలో విధ్వంసానికి పాల్పడ్డారనేది ఈ సమీక్షలతో తేలిపోతుందని అంటున్నారు. నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా 2016 డిసెంబరు 30వ తేదీన పోలవరం హెడ్‌వర్క్స్‌కు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2019 ఫిబ్రవరి నాటికి 73 శాతం పనులు పూర్తిచేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారిపోయింది. అప్పటికే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తి అయింది. మిగిలిన 27 శాతం పనులు పూర్తి చేయలేక జగన్ చేతులు ఎత్తేశారు. వాస్తవానికి, ఈ డ్యామ్‌ల ఎత్తును 41 మీటర్లకు పెంచడంతోపాటు, డయాఫ్రమ్‌వాల్‌పై 50 మీటర్ల ఎత్తులో ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్‌ను సమాంతరంగా నిర్మించి ఉంటే 2021 నాటికి ప్రాజెక్టు పూర్తయ్యేది. స్పిల్‌వే , స్పిల్ చానల్ నిర్మాణం, తయారై సిద్ధంగా ఉన్న 48 రేడియల్ గేట్ల బిగింపు కూడా కొనసాగించడం ద్వారా .. పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను దిగువకు వదిలే ప్రక్రియ మొదలయ్యేది. 2019 మే 30వ తేదీన ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు స్వీకరించారు. ఆ ఏడాది జూన్ ఆరోతేదీన .. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సంస్థను తొలగించారు. రివర్స్ టెండర్‌కు వెళ్లారు. పనులు దక్కించుకున్న మేఘా ఇంజినీరింగ్ సంస్థ 2021 డిసెంబరు నాటికి పనులు పూర్తి చేస్తామని ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. కానీ చేయలేదు. ఈ కారణంగా 2020, 21లో వచ్చిన వరదలకు డయాఫ్రమ్‌వాల్ దెబ్బతింది. ఎగువ,దిగువ కాఫర్ డ్యామ్‌ల్లో సీపేజీ మొదలైంది. జగన్ దిగిపోయే సమయానికి ప్రధాన కట్టడాలన్నీ విధ్వంసకర స్థితిలోకి చేరుకున్నాయి. దీనిపై సీఎం సమగ్ర సమీక్ష చేయనున్నారు.

జగన్ 'బొమ్మ'తో కోట్లు వృథా

(మొదటి పేజీ తరువాయి)

వీటన్నింటిపై జగన్ ఫొటోలు వేశారు. వీటి ముద్రణకు 22 కోట్లకు పైగా ఖర్చు చేశారు. 'మరో రెండు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. ఈ సమయంలో కార్డులు, బుక్‌లెట్ల మీద జగన్ బొమ్మలు ముద్రించడం ఎందుకు?' అన్న ఆలోచన కూడా అప్పట్లో అధికారులు చేయలేదు. ఆరోగ్య శాఖలోని కొంతమంది అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మళ్లీ జగన్ ప్రభుత్వమే వస్తుందని ఊహించుకుని పట్టుబట్టి మరీ బొమ్మలు ముద్రించేశారు. పర్మినెంట్ ఆరోగ్యశ్రీ కార్డులపై జగన్ బొమ్మ ఉండేలా పక్కా ప్లాన్ ప్రకారం చేశారు. ఆరోగ్యశ్రీ కార్డుల ముద్రణ డిసెంబరులో ప్రారంభించి ఇప్పటికీ ముద్రిస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబానికి ఒక కార్డు చొప్పున మొత్తం దాదాపు 1.49 కోట్ల కార్డులు ముద్రించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 1.32 కోట్ల కార్డులు ముద్రించారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ దాదాపు రూ.19.80 కోట్లు ఖర్చు పెట్టింది. ప్రతి కార్డుకు రూ.15 చొప్పున చెల్లించారు. ఈ లెక్కన మొత్తం కార్డుల ప్రింటింగ్‌కు దాదాపు రూ.22.35 కోట్లు ఖర్చవుతుంది. ప్రభుత్వం మారడంతో ఇప్పుడా కార్డులు ఏం చేయాలన్న దానిపై ట్రస్ట్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



రేషన్ వాహనాలపై జగన్ బొమ్మలు తొలగింపు

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కార్యాలయాలు, ప్రభుత్వ వాహనాలపై జగన్ చిత్రపటాలను తొలగిస్తున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని పలు ఎండీయూ వాహనాలపై జగన్ స్టిక్కర్లను శుక్రవారం ప్రజలు, రేషన్ కార్డుదారులతో కలిసి టీడీపీ నేతలు తొలగించారు. - పిఠాపురం

బుక్‌లెట్లకు రూ. 3 కోట్లు

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో చిన్నపిల్లల కోసం ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా డాక్టర్లు నేరుగా పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లకు వెళ్లి అక్కడ పిల్లల పెరుగుదలపై వైద్య పరీక్షలు నిర్వహించాలి. ప్రతి చిన్నారికి ఒక బుక్‌లెట్ అందించి, దానిపై చిన్నారికి సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేయాలి. గత ప్రభుత్వంలో ఈ కార్యక్రమం నిలిచిపోయింది. ముఖ్యంగా కోవిడ్ వల్ల ఆర్‌బీఎస్‌కేకు ప్రభుత్వం బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత పలు సమస్యలతో ముందుకు తీసుకెళ్లలేకపోయింది. తీరా ఎన్నికల ముందు ఫిబ్రవరిలో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులకు అందించే బుక్‌లెట్లు దాదాపు 70 లక్షల వరకూ ముద్రించాలని నిర్ణయించారు. మార్చి నెలలో ఎన్నికల కోడ్ అమలుల్లో వచ్చింది. మేలో ఎన్నికలు జరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికల ముందు హడావుడిగా ఈ నిర్ణయం తీసుకున్నారు. అంగన్‌వాడీల చిన్నారులకు 30 లక్షలు, ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకూ చిన్నారులకు దాదాపు 40 లక్షల బుక్‌లెట్లు ముద్రించారు. బుక్‌లెట్లపై కచ్చితంగా జగన్ బొమ్మ ఉండాలని అధికారులు నిర్ణయించారు. ఒక్కో బుక్‌లెట్‌కు దాదాపు రూ.5 ఖర్చు చేశారు. 70 లక్షల బుక్‌లెట్లకు రూ.3.50 కోట్లు ఖర్చు చేశారు. ప్రభుత్వం మారిపోవడంతో ఇప్పుడా బుక్‌లెట్లు ఏం చేయాలన్న దానిపై అధికారులకు పాలుపోవడం లేదు.

ఎన్‌హెచ్‌ఎం అధికారి అత్యుత్సాహం

గత ప్రభుత్వంలో సీఎంవోలో పనిచేసిన ఓ అధికారి ఎన్‌హెచ్‌ఎంలోకి కీలకమైన పోస్టులో చేరారు. వైసీపీ నాయకులకు అత్యంత సన్నిహితంగా ఉండే సదరు అధికారి మళ్లీ జగన్ ప్రభుత్వమే వస్తుందని చెప్పి పట్టుబట్టి మరీ బుక్‌లెట్లు ముద్రించారు. పైగా ముద్రణ టెండర్ కూడా కావాల్సిన కంపెనీలకే కట్టబెట్టారు. చిన్నారులు అంగన్వాడీ కేంద్రాల్లో చేరినప్పటి నుంచి 10వ తరగతి పూర్తి అయ్యే వరకూ.. అంటే దాదాపు 15 ఏళ్ల పాటు వారి వద్ద బుక్‌లెట్లు ఉంటాయి. అలాంటి బుక్‌లెట్లపై జగన్ బొమ్మను పెద్దగా ముద్రించారు. ఆర్‌బీఎస్‌కే అనేది కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన స్కీమ్. చాలా వరకు కేంద్రమే ఆర్థిక సాయం చేస్తుంది. అలాంటి పథకానికి సంబంధించిన బుక్‌లెట్లపై జగన్ బొమ్మ ముద్రించడంపై విమర్శలు వస్తున్నాయి.

యువతకు భవిత

- ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం
- చంద్రబాబు ప్రభుత్వం చకచకా అడుగులు
- 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ
- మరోవైపు యువత నైపుణ్యాల అంచనా ప్రక్రియ
- బహుళ నైపుణ్యాలు పెంపొందించేలా శిక్షణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నాన్చుడు ధోరణి లేదు. చేద్దాం.. చూద్దాంలే అన్న సాగదీత విధానం లేదు. కొలువు దీరిన వెంటనే కూటమి ప్రభుత్వం పని ప్రారంభించింది. కొన్నేళ్లుగా ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న యువత ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా రంగంలోకి దిగింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తొలిరోజే 16,347 టీచర్ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేశారు. అలాగే యువతలో నైపుణ్యాల అంచనా (స్కిల్ సెన్సెస్) ఫైలుపై మరో సంతకం చేశారు. యువతలో ఉన్న నైపుణ్యాలేంటి? ప్రస్తుతం మార్కెట్‌లో ఎలాంటి నైపుణ్యాలు అవసరం? అందుకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలు ఎలా పెంచాలి? అనే అంశాలపై ఈ సర్వే జరుగుతుంది. అటు ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ, ఇటు ప్రభుత్వేతర సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు వీలుగా నైపుణ్యాల మెరుగుదల.. రెండింటిపైనా ప్రభుత్వం ఒకేసారి దృష్టి పెట్టింది. ఈ అంశాల్లో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. దీంతో కూటమి ప్రభుత్వం మొదట వీటిపై దృష్టి కేంద్రీకరించింది. చెప్పినట్టుగానే అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంది. మెగా స్థాయిలో 16,347 టీచర్ పోస్టుల భర్తీకి ఉత్తర్వులు జారీచేసింది. అది కూడా ఆలస్యం కాకుండా ఈ ఏడాది చివరికే మొత్తం భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రకటించింది.

మరింత సరళంగా...

యువతలో నైపుణ్యాల పెంపుపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. వినూత్నంగా నైపుణ్య సర్వేకు శ్రీకారం చుట్టింది. యువతలో ప్రస్తుతం ఎలాంటి నైపుణ్యాలు ఉన్నాయి? ఉద్యోగాలిచ్చే సంస్థలు ఏం కోరుకుంటున్నాయి? ఈ రెండింటిని అనుసంధానం చేసేలా ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అన్నది అధ్యయనం చేయడమే ఈ సర్వే ఉద్దేశం. రాష్ట్రంలో 310 ఇంజనీరింగ్ కాలేజీలు, 1400 డిగ్రీ కాలేజీలు, 267 పాలిటెక్నిక్‌లు, 516 ఐటీఐలు ఉన్నాయి. వీటి నుంచి ఏటా సుమారు 4.4 లక్షల మంది విద్యార్థులు ఉత్తీర్ణులై బయటికొస్తున్నారు. కానీ రాష్ట్రంలో సరైన ఉపాధి అవకాశాలు లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. అందుకోసం విజ్ఞాన ఆధారిత ఎకానమీపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. మరింత సరళంగా, వెంటనే అనుసంధానం అయ్యేలా యువతలో బహుళ నైపుణ్యాలు(మల్టిపుల్ స్కిల్స్) పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న నైపుణ్యాలకు, ఉపాధి అవసరాలకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించేందుకు ఈ సర్వే చేస్తోంది.

సర్వే ఇలా...

- ప్రస్తుతం యువతలో ఉన్న విభిన్న నైపుణ్యాలను జనాభా, రంగాల వారీగా అంచనా వేయడం.
- ఉత్పత్తి, నిర్మాణం, సేవలు, ఇతరత్రా రంగాల్లో ఎలాంటి నైపుణ్యాలు కావాలో గుర్తించడం.
- యువతలో ఉన్న నైపుణ్యాలు, వాస్తవిక నైపుణ్య అవసరాల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడం.
- నైపుణ్య శిక్షణ, విద్య, ఉపాధి పాలసీల్లో మార్పుల కోసం సరైన డేటాను అందుబాటులో ఉంచడం.
- మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలను మెరుగుపరచడం, సంబంధిత శిక్షణ కార్యక్రమాలు ఇతర అంశాలను యువతకు అందుబాటులో ఉంచి వారిని సాధికారత దిశగా అడుగులు వేయించడం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

చీకటి చట్టం రద్దుతో రైతుల్లో హర్షం

- జగనన్న భూరక్ష రాళ్లను తొలగించిన రైతు నాయకులు
- చంద్రబాబునాయుడు చిత్రపటానికి ఆయిల్‌పామ్ కాయలతో అభిషేకం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 14 : వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన చీకటి చట్టం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు రెండో సంతకంతో రద్దు చేయడం పట్ల రైతునాయకులు హర్షం వ్యక్తం చేశారు. రంగన్నగూడెంలో సాగునీటి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ, టీడీపీ రాష్ట్ర



కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణప్రసాద్ ఆధ్వర్యంలో రైతులు గతంలో వేసిన భూరక్ష సర్వే రాళ్లను పెకిలించివేశారు. చంద్రబాబు చిత్రపటానికి ఆయిల్‌పామ్ కాయలతో అభిషేకం చేశారు. జగన్ ప్రభుత్వం పిచ్చికి పరాకాష్టగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించకుండా స్వంత వ్యవస్థను తీసుకువచ్చి 90లక్షల మందికి పైగా పట్టాదారు రైతుల పండిస్తున్న 22.06కోట్ల ఎకరాల సాగుభూమిని అక్రమించేందుకు చేసిన ఎత్తుగడగా ఆళ్ల అభివర్ణించారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఒరిజినల్ డాక్యుమెంట్లను ప్రభుత్వం వద్ద ఉంచి నకలును రైతులకిచ్చి భూములను కూడా తాకట్టు పెట్టేందుకు వైసీపీ పన్నిన కుట్రను ప్రజలు అర్థం చేసుకుని తగిన గుణపాఠం చెప్పారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణప్రసాద్ అన్నారు. డ్రోన్ సర్వే కోసం కోట్లరూపాయలు వృధా చేయడం, రీసర్వేలతో పాటు జగన్ పేరుతో సర్వేరాళ్లను ఏర్పాటు చేయడం ద్వారా వేల కోట్ల ప్రజాధనాన్ని వృధా చేయడంతో పాటు మరో స్కాం ఉందేమోనని రైతు నాయకులు అనుమానం వ్యక్తం చేశారు. రంగన్నగూడెంలోనే 1610 ఎకరాల సాగుభూమిలో 1432 ఎకరాలు తప్పుల తడకగా సర్వే చేశారని రైతులు తెలిపారు. ఐదు సంవత్సరాల్లో రైతులకు న్యాయం చేయకపోగా సర్వేలంటూ విధ్వంసం సృష్టించి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై సంతకం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు జేజేలు పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, మొవ్వా శ్రీనివాసరావు, తెలుగుమహిళ అధ్యక్షురాలు దోనవల్లి నాగశిరోమణి, రైతు నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, బెజవాడ వెంకటకృష్ణారావు, కనకవల్లి శేషగిరిరావు, ముక్కపాటి సత్యనారాయణ, నెరుసు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భూరక్ష సరిహద్దురాళ్లను పెకిలిస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ, చిరుమామిళ్ల సూర్యం, రైతులు



అన్నక్యాంటీన్ వద్ద బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వృద్ధులు

ఐదు సంతకాలతో సుపరిపాలనకు శ్రీకారం

- టీడీపీ నేతలు, ఉద్యోగుల హర్షం
- చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం

భవానీపురం/విద్యాధరపురం, జూన్ 14 : రాష్ట్రంలో సుపరిపాలనకు సీఎం చంద్రబాబు నాయుడు నాంది పలుకుతూ ఐదు సంతకాలతో సుపరిపాలనకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని టీడీపీ నేతలు ముక్తకంఠంతో ప్రకటించారు. స్థానిక 43వ డివిజన్ ఆర్టీసీ వర్కుషాపు రోడ్డులో పాత అన్నక్యాంటీన్ వద్ద టీడీపీ మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్.బేగ్ ముఖ్య అతిథిగా హాజరై పెన్షన్ లబ్ధిదారులతో చంద్రబాబునాయుడు చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎస్.బేగ్ మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఇచ్చిన మాట ప్రకారం అన్నక్యాంటీన్‌ల పునరుద్ధరణ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, మెగా డీఎస్సీ, స్కిల్ డెవలప్‌మెంట్ పథకాల అమలు జీవోలు జారీ చేయడం అందరూ హర్షిస్తున్నారన్నారు. రామయ్య మాట్లాడుతూ, గతంలో చంద్రబాబు ఆధ్వర్యంలో ఇక్కడ ప్రారంభించిన అన్నక్యాంటీన్‌ను ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే సుజనా చౌదరీల ద్వారా త్వరలోనే పునరుద్ధరిస్తామని తెలిపారు. పశ్చిమ టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త సారేపల్లి వెంకట రాధాకృష్ణ,నెలకుర్తి వెంకట్రావు, స్రవంతి, శివశర్మ, బబ్బూరి శ్రీనివాస్, దేవరసాయి సుధాకర్, బోరా కనకరారావు, దేవరకొండ చక్రవర్తి, సురేష్, మల్లెబోయిన కొండలు పాల్గొన్నారు.





మంత్రులు అచ్చెన్నాయుడు, మండిపల్లి రాంప్రసాద్‌లకు అభినందనలు తెలుపుతున్న బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ప్రజా రవాణా సంస్థ కార్మిక పరిషత్ రాష్ట్ర నాయకులు

మంత్రులకు ఉద్యోగ సంఘ నేతల శుభాకాంక్షలు



వన్‌టౌన్/విద్యాధరపురం, జూన్ 14 : రాష్ట్ర వ్యవసాయ, సహకార తదితర శాఖల మంత్రి కింజారపు అచ్చెన్నాయుడును ప్రజారవాణా సంస్థ బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంఘం నాయకులు అభినందించారు. మంత్రికి దుశ్శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావు, సలహాదారుడు మమ్ముల తిరుపతిరావు రెడ్డి, శంకర్ తదితరులు మంత్రిని అభినందించిన వారిలో ఉన్నారు. రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ప్రజా రవాణా సంస్థ కార్మిక పరిషత్ రాష్ట్ర కమిటీ సభ్యులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి సత్కరించారు. సంస్థ పురోగాభివృద్ధి చెంది ప్రగతి పథంలో పయనించాలని ఉద్యోగుల విలీన సమస్యలను పరిష్కరించడం ద్వారా ఉద్యోగులందరి ప్రయోజనాలను కాపాడాలని మంత్రిని కోరారు.

మంత్రి అచ్చెన్నకు టీడీపీ నేతల శుభాకాంక్షలు

మంత్రి అచ్చెన్నాయుడును ఆయన నివాసంలో శుక్రవారం టీడీపీ నాయకులు కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, ఎన్‌టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి కోగంటిరామరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు సోలంకి రాజేంద్రకుమార్ జైన్‌లు కలిశారు. అచ్చెన్నాయుడును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి నిమ్మల రామానాయుడును సత్కరిస్తున్న బొండా ఉమా

మంత్రి నిమ్మలకు సత్కారం..

అజిత్‌సింగ్‌నగర్ : రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెలుగుదేశం పార్టీ సెంట్రల్ కార్యాలయానికి వచ్చారు. ఎమ్మెల్యే బొండా ఉమా, నియోజకవర్గ నేతలతో కొంత సేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా బొండా ఉమా నియోజకవర్గ నేతలు జలవనరుల శాఖా మంత్రిగా నియమితులైన నిమ్మల రామానాయుడును శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి ఘనంగా సత్కరించారు. నేతలు గొట్టుముక్కల రఘు, ఎరుబోతు రమణ, పైడి శ్రీను, ఘంటా కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సవితకు శుభాకాంక్షలు..



వన్‌టౌన్ : మంత్రి సవితను కొలనుకొండలోని ఆమె నివాసంలో శుక్రవారం ఆర్యవైశ్యనాయకులు కలిశారు. ఆమెకు దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికలలో కూటమి విజయ దుందుభి మోగించడం పై హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర ఆర్యవైశ్య నాయకుడు డూండిరాకేష్,వీవీకే నరసింహరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులున్నారు.



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మైనారిటీ నాయకులు

సీఎం తొలి ఐదు సంతకాలు చారిత్రాత్మకం

విద్యాధరపురం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఐదు ఫైళ్లపై సంతకాలు చేయడం చారిత్రాత్మకమని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు అన్నారు. ఆటోనగర్‌లోని జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, వృద్ధులకు పెన్షన్ పెంపు, స్కిల్ సెన్సెస్, అన్నక్యాంటీన్‌ల పునరుద్ధరణ ఫైళ్లపై సంతకాలు చేయడం కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ సెల్ నాయకులు మోహనరావు, ఆశీర్వాదం, శ్యామ్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల హామీల అమలులో భాగంగా ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఐదు ఫైళ్లపై సంతకాలు చేసినందుకు సీఎం చంద్రబాబునాయుడును అభినందిస్తూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 55వ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ జాహిద్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టీడీపీ సీనియర్ నేత మహమ్మద్ ఫతావుల్లా పాల్గొని మాట్లాడుతూ, ఎన్నికల హామీలను అమలు చేసే నాయకుడు చంద్రబాబునాయుడేనని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు షేక్ ఆశా, అన్సర్, రజావుల్లా, మాదుగుల నాగమల్లేశ్వరరావు, శంకర్, ప్రసాద్, గౌస్, ఫిరోజ్, డూండీ రాజకుమార్, హసీనా, రేష్మ, ముంతాజ్, పద్మ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు చేరువ చేద్దాం

- రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



మంత్రి కొలుసును అభినందిస్తున్న సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది

విజయవాడ లీగల్, జూన్ 14 : రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలను ఆచరణలో పెట్టడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంలో సఫలీకృతమయ్యేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని రాష్ట్రసమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంత్రి సారథిని శుక్రవారం పెనమలూరు మండలం, తాడిగడప కామినేని ఆస్పత్రిరోడ్డులోని క్యాంపు కార్యాలయంలో సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాఖ ప్రస్తుత పరిస్థితులు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను సంబంధించి ప్రచార విధివిధానాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి వంటి సమాచార, పౌర సంబంధాల శాఖ పనితీరు ఎంతో కీలకమైందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి అమలుచేసే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వినూత్న విధానాలను అవలంబించాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న విధానాలతో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ప్రజలకు అవగాహన కల్పించడంలో సఫలమైనప్పుడు ముఖ్యమంత్రి ఆలోచనలను ఆచరణలో పెట్టినవారవుతామని అన్నారు. ఈ దిశగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమన్వయపరుచుకొని ముందుకు వెళ్లాలని మంత్రి అధికారులకు సూచించారు. మంత్రిని కలిసిన వారిలో అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత, పి.కిరణ్ కుమార్, టి.కస్తూరిబాయి, ఒ.మధుసూదనరావు, ఆర్ ఐఈ సీవీ కృష్ణారెడ్డి, డిప్యూటీ డైరక్టర్లు బి.పూర్ణచంద్రరావు, ఏడీలు జీవీ ప్రసాద్, ఎం.భాస్కర నారాయణ, డీఐపీఆర్‌ఓ యు.సురేంద్రనాథ్, డీపీఆర్‌ఓ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన వీరమహిళ



విజయవాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబు క్యాబినెట్‌లో పదవులు దక్కించుకున్న మంత్రులను జనసేన వీరమహిళ విభాగం కృష్ణా, పెన్నా రీజనల్ కో-ఆర్డినేటర్ రావి సౌజన్య శ్రీనివాస్ శుక్రవారం కలిశారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, హోంమంత్రి అనితను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారికి అభినందనలు తెలిపారు.

సస్పెండ్ అయిన ఆర్టీసీ ఉద్యోగులు తిరిగి విధుల్లోకి..

బస్‌స్టేషన్, జూన్ 14 : మోడల్ కోడ్ ఉల్లంఘన కేసుల్లో సస్పెండ్ అయిన ఆర్టీసీ ఉద్యోగులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించడంపై ప్రజారవాణాసంస్థ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు కమిటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే జిలానీబాషా, ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలలో సస్పెండ్‌కు గురికావడంతోపాటు ఉద్యోగాల నుంచి తొలగించినవారు కూడా ఉన్నారని,వారందరూ కూడా తమకు మంచి జరుగుతుందన్న ఆశతో ఉన్నారని, వారిని కూడా ఉద్యోగాలలోకి తీసుకోవాలని కోరారు. కొత్త ప్రజా రవాణా మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీలో జారీ అయిన 1/2019జీవోను ఉపసంహరించాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణం అంశంలో వివిధ రాష్ట్రాలలో జరుగుతున్న తీరుపై తాము అధ్యయనం చేసి అటు ప్రభుత్వానికి, ఇటు యాజమాన్యానికి ఒక నివేదిక ఇస్తామని తెలిపారు. కాగా కోడ్ ఉల్లంఘనల కేసులలో సస్పెండ్ అయిన వారిని విధులలోకి తీసుకునడానికి యాజమాన్యం నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేశారు. కోడ్ ఉల్లంఘనలో లేనప్పటికి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుందరయ్యను కూడా అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఈ అంశంపై నిరసనలు, ఆందోళనలు కూడా చేశామని తెలిపారు. ఆందోళనలకు మద్దతు పలికిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు భేష్



బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదుల విజయోత్సవ సభ

విజయవాడ లీగల్, జూన్ 14: నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ తీసుకొన్న నిర్ణయం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో విజయోత్సవ సభ నిర్వహించారు. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రూపొందిస్తే తొలుతగా న్యాయవాదులు ప్రతిఘటించారని, నిరాహార దీక్షలు ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. ఆ ప్రయత్నంలో న్యాయవాదులు విజయం సాధించారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టగానే రెండో సంతకాన్ని ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుకు పెట్టడం అభినందనీయమన్నారు. న్యాయవాదులంతా విజయోత్సవాన్ని నిర్వహించుకొంటున్నట్లు తెలిపారు. బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివరామ్‌ప్రసాద్ (రాజా), బార్ మాజీ అధ్యక్షులు వి.గురునాథం, చేకూరి శ్రీపతిరావు, వేముల హజరత్తయ్య గుప్తా, మట్టా జయకర్, సోము కృష్ణమూర్తి, సునీల, అచ్చమ్మ, అనిత, కోటేశ్వరరావు, జయప్రభ, రాంప్రసాద్, గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై ఐఏఎల్ హర్షం

న్యాయవాదులను, ప్రజలను ఇబ్బంది పెట్టేలా గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం పట్ల ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఈ యాక్ట్ రద్దు కోసం రాష్ట్రస్థాయిలో న్యాయవాదులు వివిధ పద్ధతుల్లో కోర్టుకు, విధులకు హాజరుకాకుండా నిరసనలు తెలియజేస్తూ ఉద్యమాలు చేశారని, ఈ ఉద్యమాన్ని జయప్రదం చేసి విజయం సాధించిన న్యాయవాదులందరికీ అభినందలు తెలిపారు. అమరావతిలోనే రాష్ట్ర హైకోర్టు పూర్తిస్థాయిలో ఉండేలా పనులు మొదలుపెట్టాలని చలసాని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పాలన మారినా.. పెత్తనం వారిదే!

- కాశీ విశ్వేశ్వరాలయంలో ధర్మకర్తలకు దక్కని గౌరవం
- వైసీపీ చోటా నేతలకే రాచమర్యాదలు
- భక్తుల సొమ్ముతో హోమాలు, పూజలు



గవర్నర్‌పేట : రాష్ట్రంలో ప్రభుత్వం మారినా చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో వైసీపీ, చోటా నేతల ఆగడాలు కట్టడి కాలేదు. మాజీ ప్రజాప్రతినిధి అండతో వచ్చిన ఈ నేతలు ఈవో వత్తాసుతో అక్కడ పెత్తనం చెలాయిస్తూనే ఉన్నాయి. గవర్నర్‌పేట ప్రాంతంలో కోట్లాది రూపాయల విలువ చేసే స్థలంలో తమ పూర్వీకులు నిర్మించిన దేవాలయంలో కనీస గౌరవ మర్యాదలు దక్కడం లేదని వంశపారంపర్య ధర్మకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండోమెంట్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా వైసీపీ నేతల ఆగడాలకు చెక్ పడటం లేదని వారు వాపోతున్నారు. గుడికి వస్తే తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈవో అండతో వైసీపీ చోటా నేతలకు మాత్రం ఆలయంలో రాచమర్యాదలు జరుగుతున్నాయని ధర్మకర్తలు ఆరోపిస్తున్నారు. ఈవో సమక్షంలోనే భక్తులపై దౌర్జన్యాలు చేస్తున్నారని ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. పూర్వీకులు ఆలయానికి 33 ఎకరాల పంట భూములు, ఇతర స్థిరాస్తులు సమకూర్చిపెట్టారని, తమకు వంశపారంపర్య ధర్మకర్తల హోదా ప్రభుత్వం కల్పించినా, వైసీపీ చోటా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధి అనుచర గణం అక్కడ పెత్తనం చెలాయిస్తోందని, తమకు ఈవో విలువ ఇవ్వడం లేదని వంశపారంపర్య ధర్మకర్తలు వాపోతున్నారు. ఈవో సహకారంతో వైసీపీ చోటా నేతలు ఎన్నికలు ముగిసిన వెంటనే సెంట్రల్ నుంచి వైసీపీ అభ్యర్థి విజయం సాధించాలని భక్తుల సొమ్ముతో హోమాలు, పూజలు చేయించారని ఆరోపిస్తున్నారు. ఆలయంలో అన్నదానం జరిగిన ప్రతీసారి నియోజవర్గ వైసీపీ బాస్ నుంచి చోటా నేతల ఇళ్లకు భోజనం క్యారేజీలు చేరవేయించడం చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.

మూడు దేవాలయాలకు ఒక్కరే ఈవో..

కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో పనిచేస్తున్న ఈవో మరో రెండు దేవాలయాలకూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దేవస్థానం ఈవోగా ఉండగానే ఏడాది క్రితం ఈయనకు అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ)గా ప్రమోషన్ వచ్చి నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానానికి ఈవోగా వెళ్లారు. అప్పటి నుంచి మరో వ్యక్తిని ఇక్కడ ఈవోగా నియమకం చేయకుండా ఎండోమెంట్ అధికారులు ఆయన్నే కాశీ విశ్వేశ్వర ఆలయంలో ఇన్‌చార్జి ఈవోగా కొనసాగిస్తున్నారు.

అమెరికా నుంచే పాలన..

ప్రస్తుత ఈవో సొంత పనులపై అమెరికా టూర్‌లో ఉన్నారు. ఇన్‌చార్జి బాధ్యతలు మరొకరికి అప్పగించకుండా అధికారులు మూడు చోట్ల ఆయన్నే కొనసాగించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఏడాది కాలంలో రెండు పర్యాయాలు అమెరికా సొంత పనులపై వెళ్లినా ఇన్‌చార్జిగానే కొనసాగిస్తున్నారు. ఆయన పేరునే ఆలయానికి సంబంధించిన ప్రకటనలు వెలువడుతున్నాయి.

ఆరోపణలు వచ్చినా పట్టని అధికారులు..

ఆలయ పునర్నిర్మాణ పనుల్లో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చినా వాటిపై ఎలాంటి విచారణ జరగడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. భక్తులు ఇచ్చే విరాళాలతో అన్నదానాలు చేస్తూ వాటిని ఆలయ ఖర్చుల్లో చూపిస్తున్నారని, హుండీల లెక్కింపు సమయంలో కౌంటింగ్ జరిగేటప్పుడు రాసే పుస్తకాలు, రికార్డుల్లోకి వెళ్ళే సరికి మారిపోతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ పూజారులను నియవించుకుని ఇష్టారాజ్యంగా పూజలకు భక్తుల నుంచి వసూళ్లు చేస్తున్నారని, ప్రత్యేక వ్యక్తిని నియమించుకుని ప్రతి పూజకు చీటీలు లేకుండా మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజారంజక పాలన మొదలు

విజయవాడ, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజారంజక పాలన మొదలైందని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి నేత ఫారూక్ షుబ్లీ వ్యాఖ్యానించారు. దీనిపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయడానికి తొలి సంతకం చేసిన చంద్రబాబు పాలన ఎలా ఉంటుందో చూపించడానికి సంకేతమిచ్చారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మాట తప్పను మడమ తిప్పనని ప్రగాల్భాలు పలికే నాయకుల్నే చూశామని పరోక్షంగా జగన్‌ను విమర్శించారు. అదేవిధంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం శుభపరిణామన్నారు.

ఆర్టీసీ విలీన సమస్యలు పరిష్కరించండి

బస్సుస్టేషన్, జూన్ 14 : ఆర్టీసీ విలీన సమస్యలు పరిష్కరించాలని ప్రజా రవాణా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేదారేశ్వరరావు సీఎం చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణను కలిసి అభినందనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ మార్పులో ప్రధాన పాత్ర ఉద్యోగులదేనని, అవమానాలకు గురిచేసిన గత ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఐక్యవేదిక సమావేశాలను అడ్డుకున్న సంఘాలు ఇప్పుడు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఇటువంటి సంఘాలను వీడనాడాలని కోరారు. ఆర్టీసీ విలీనం వలన ఏర్పడిన పెన్షన్, వైద్య సౌకర్యాల సమస్యలను పరిష్కారించాలని ముఖ్యమంత్రిని కోరారు. కార్యక్రమంలో నాయకులు థామస్, టీకే ఆంజనేయులు, రామకృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



టీటీఈలపై దాడికి నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు

టీటీఈలపై దాడులను ఆపండి

రైల్వేస్టేషన్, జూన్ 14 : ఇటీవల ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో టీటీఈ స్క్వాడ్ బృందాలపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ టికెట్ చెకింగ్ బ్రాంచ్, మజ్దూర్ యూనియన్‌ల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విధుల్లో ఉన్న టీటీఈలపై దాడులు చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. రైల్వేస్టేషన్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫారాల మీదుగా నిరసన ప్రదర్శన సాగింది. అనంతరం డివిజన్ కమర్షియల్ మేనేజర్‌ను కలిసి మెమోరాండం సమర్పించారు. టీటీఈలపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ్ కార్యదర్శి బాలాజీ, మజ్దూర్ యూనియన్ చైర్మన్ డీవీ వర్మ తదితరులతో పాటు రెండు బ్రాంచీల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



రైల్వేస్టేషన్, జూన్ 14 : రక్తదానం మహాదానమని రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ ఎం.శౌరిబాల అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం రైల్వే ఆసుపత్రిలో రైల్వే రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ, ఇండియన్ రెడ్‌క్రాస్, బ్లడ్ సెంటర్ స్టాఫ్ ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. రక్తదానం చేసేందుకు సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జయదీప్ మాట్లాడుతూ, కార్ల్ ల్యాండ్ స్టైయినర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేశారు.

'రాజీ' దాడి కేసులో తొమ్మిది మంది అరెస్టు

వన్‌టౌన్, జూన్ 14 : కృష్ణలంక కల్పన ప్రింటర్స్ రోడ్డుకు చెందిన మద్దిల రాజేష్, పవన్‌లపై గురువారం జరిగిన దాడి కేసులో సూర్యారావుపేట పోలీసులు శుక్రవారం తొమ్మిదిమందిని అరెస్టు చేశారు. గతంలో రాజేష్, పవన్, అదే ప్రాంతానికి చెందిన కొర్రా సత్యనారాయణ, శ్రీనుల మధ్య గొడవలు జరిగాయి. దీనిపై కేసు కోర్టులో నడుస్తోంది. ఈక్రమంలో గురువారం జరిగిన కోర్టు వాయిదాకు రాజేష్, పవన్‌లు హాజరై తిరిగి బయటకు వస్తున్న సమయంలో వారిని రాజీకి పిలిచిన కొర్ర సత్యనారాయణ మరికొందరు సివిల్ కోర్టు సమీపంలో దాడిచేసి గాయపరిచారు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కొర్రసత్యనారాయణతో పాటు కృష్ణలంకకు చెందిన ఎ.అశోక్ అలియాస్ కుక్కల, సీహెచ్ రమేష్‌బాబు, బి.అయ్యప్ప, ఆర్.వెంకటేశ్వర్లు, భ్రమరాంబపురానికి చెందిన జి.సూర్యనారాయణ, కొత్త రాజరాజేశ్వరిపేటకు చెందిన ఇమిడి శివకృష్ణ, ప్రకాష్‌నగర్‌కు చెందిన రెడ్డిపల్లి సతీష్‌కుమార్, సింగ్‌నగర్‌కు చెందిన రెడ్డిపల్లి కిరణ్‌కుమార్‌లను అరెస్టు చేశారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సూర్యారావుపేట స్టేషన్ పరిధిలోని సీఎస్ఐ చర్చి సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుంది. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

వివాహితను తరచు వేధింపులకు గురిచేస్తున్న రాణిగారితోటకు చెందిన సత్యారెడ్డిపై శుక్రవారం కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. రాణిగారితోట కరెంట్ ఆఫీసు వద్ద వివాహిత (29) నివాసం ఉంటోంది. ఆమె గాంధీనగర్‌లోని ఒక హోటల్‌లో పనిచేస్తున్నది. ఆమెకు గతంలో పరిచయం ఉన్న సత్యారెడ్డి తరచుగా ఫోన్ చేస్తూ వెంటపడుతూ తనతో సహజీవనం చేయాలని ఒత్తిడి చేస్తున్నాడు. అందుకు ఆమెకు నిరాకరించింది. ఈనెల 12వతేదీన హోటల్‌లో విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న ఆమెను రాణిగారి తోట కట్ట వద్ద సత్యారెడ్డి అడ్డగించి తనతో ఎందుకు మాట్లాడవు అంటూ అసభ్యకరంగా దూషించి, చేతిలో ఉన్న తాళంచెవులతో ఆమెను కొట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.



జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఎన్నారై టీడీపీ ఆధ్వర్యంలో మినీమహానాడు

జర్మనీలో ఘనంగా టీడీపీ విజయోత్సవం

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఎన్నారై టీడీపీ ఆధ్వర్యంలో మినీమహానాడు ఘనంగా జరిగింది. ఏపీలో విధ్వంస కర, నియంత పాలనకు చరమగీతం పాడినందుకు జర్మనీలో ఎన్నారై టీడీపీ విజయోత్సవాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కావలి గ్రీష్మ మాట్లాడుతూ... 'ఈ ఎన్నికల్లో ఎన్నారైలు టీడీపీ విజయం కోసం ఎనలేని కృషి చేశారు. ఎన్నికల ముందు ఉద్యోగాలు, కుటుంబాలు వదిలి, ఏపీకి వచ్చి, పార్టీ విజయం కోసం పనిచేశారు. నియంత జగన్‌రెడ్డి సామ్రాజ్యాన్ని నేలమట్టం చేసిన యోధుడు చంద్రబాబు. రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపిస్తూ, ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించిన దార్శనికుడు చంద్రబాబుపై నమ్మకంతో కూటమికి ప్రజలు పట్టం కట్టారు' అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎన్నారై కోర్ కమిటీ నేతలు కుర్ర పవన్, బీ శివ, కొర్రపాటి సుమంత్, దాసరి వంశీ, కోనేరు నరేశ్, శ్రీకాంత్, వెంకట్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిపథ్ సమీక్షకు కమిటీ..17న కేంద్రానికి నివేదిక

న్యూఢిల్లీ, జూన్ 14: ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కారు 2022లో తీసుకొచ్చిన పథకంపై మొదటి నుంచీ అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా లోక్‌సభ ఎన్నికల అనంతరం ఎన్డీయే మిత్రపక్షాలు, భారత సైన్యం కూడా ఈ పథకాన్ని పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని సూచించాయి. మిత్రపక్షాల నుంచి వచ్చిన ఒత్తిళ్ల నేపథ్యంలో అగ్నిపథ్‌లోని లోపాలను సరిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. ఈ పథకాన్ని సమీక్షించడానికి, అగ్నివీర్‌లకు మరింత లాభం చేకూర్చే అంశాలపై చర్చించేందుకు పది మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ బృందం ఈ స్కీమ్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చడానికి అవసరమైన సిఫారసులు చేయనుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఇటలీలో జరిగే జీ7 సదస్సు నుంచి తిరిగొచ్చిన తర్వాత ఈ నెల 17, 18వ తేదీల్లో ఈ కమిటీ నివేదిక ఇవ్వనున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అగ్నివీర్‌ల నియామక ప్రక్రియలో కొన్ని మార్పులను ఈ కమిటీ సూచించవచ్చు. ప్రస్తుతం నాలుగేళ్ల కాలానికి ఎంపికైన అగ్నివీర్‌లకు అదనపు ఆర్థిక ప్రయోజనాలను సిఫారసు చేయవచ్చు. అలాగే భారత సైన్యం కూడా ఈ పథకంపై ఒక అంతర్గత నివేదికను కేంద్రానికి సమర్పించే అవకాశం ఉందని భావిస్తున్నారు. అగ్నివీర్‌ల శిక్షణ వ్యవధిని పెంచడం, నాలుగేళ్లు పూర్తయిన తర్వాత రెగ్యులర్ సర్వీసుల్లోకి చేరేవారి శాతాన్ని పెంచడం వంటి మార్పులు దీనిలో ఉండవచ్చు. ఈ సిఫారసులతోపాటు మిత్రపక్షాల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రధాని కార్యాలయం తుది నిర్ణయం తీసుకునే అవకాశ ఉంది.

త్వరలో క్యాబినెట్ ముందుకు కోవింద్ కమిటీ నివేదిక

న్యూఢిల్లీ, జూన్ 14: 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ సమర్పించిన నివేదికను సాధ్యమైనంత త్వరగా కేంద్ర కేబినెట్ ముందుంచాలని న్యాయ మంత్రిత్వ శాఖ యోచిస్తున్నట్టు తెలిసింది. ఇది లెజిస్లేటివ్ విభాగం 100 రోజుల ఎజెండాలో భాగంగా ఉన్నట్టు శుక్రవారం సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తదుపరి ప్రభుత్వం కోసం 100 రోజుల అజెండాను రూపొందించాలని లోక్‌సభ ఎన్నికలకు ముందు అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలను ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించిన విషయం తెలిసిందే. కాగా ఒకే దేశం - ఒకే ఎన్నికపై రామ్‌నాథ్ కోవింద్ కమిటీ తన నివేదికను మార్చి 15న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది. ఇందులో మొదటి దశగా లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని సిఫారసు చే సింది. ఆ తర్వాత 100 రోజుల్లోగా స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని సూచించింది. కమిటీ సిఫారసుల అమలును పరిశీలించేందుకుగాను ఒక అమలు బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. మరోవైపు జమిలి ఎన్నికలపై లా కమిషన్ కూడా సొంతంగా వేరే నివేదికను రూపొందిస్తున్నట్టు సమాచారం.

జూలై 22న కేంద్ర బడ్జెట్!

న్యూఢిల్లీ, జూన్ 14: 2024-25 ఏడాదికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను జూలై 22న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. కొత్తగా ఏర్పడిన 18వ లోక్‌సభ సమావేశాలు జూన్ 24 నుంచి జూలై 3 వరకు జరుగుతాయని పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఇందులో కేవలం ఐదు రోజులే పనిదినాలున్నాయి. సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నికకే ఈ సమయం సరిపోతుంది. అందువల్ల పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టాలని భావిస్తున్నారు. జూలై 22 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు వర్షాకాల సమావేశాలు నిర్వహించాలని అనుకుంటున్నారు. ఆ సమావేశాల తొలి రోజు, జూలై 22న పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

వచ్చే వారం బొగ్గు గనుల వేలం: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యపర అవసరాల కోసం ఉద్దేశించిన బొగ్గు గనుల వేలం వచ్చే వారం జరుగుతుందని బొగ్గు గనుల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో పదో రౌండ్ కమర్షియల్ బొగ్గు గనుల వేలాన్ని నిర్వహిస్తారని పేర్కొంది. ఇందులో 62 బ్లాకులను అమ్మకానికి పెడుతారని తెలిపింది. బొగ్గును ఎవరు వినియోగిస్తారన్నదానితో సంబంధం లేకుండా గనుల కేటాయింపు ఉంటుంది. పూర్తి పారదర్శకతతో వేలం జరుపుతామని, గరిష్ఠ ఆదాయాన్ని పొందేందుకు ప్రయత్నిస్తామని కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపర బొగ్గు బ్లాకుల వేలాన్ని ప్రధాని మోదీ 2020 జూన్‌లో ప్రారంభించారు. ఇంతవరకు జరిగిన తొమ్మిది రౌండ్ల వేలంలో 256 మిలియన్ టన్నుల నిల్వలు ఉన్న 107 బ్లాక్‌లను వేలం వేశారు. వీటిలో 11 బ్లాక్‌ల్లో బొగ్గు తవ్వకాలు ప్రారంభమయ్యాయి. వీటి ద్వారా గత ఏడాది 17.5 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగింది. కిషన్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టగా శుక్రవారం తొలిసారిగా బొగ్గు, గనుల శాఖల అధికారులతో సమావేశమయి సమీక్ష జరిపారు. ఈ రంగాల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు ఉద్దేశించిన ప్రణాళికలను, ఇంతవరకు సాధించిన ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.

పోక్సో కేసులో యడియూరప్పకు ఉపశమనం

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ కావడంతో ఇరకాటంలో పడ్డ బీజేపీ సీనియర్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు ఉపశమనం లభించింది. రెండువారాలపాటు ఎటువంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం శుక్రవారం ఆదేశించింది. యడియూరప్పకు వయసు పైబడిందనీ, సహజంగానే ఆరోగ్య సమస్యలు ఉంటాయనీ, అరెస్టు చేసి విచారణ చేయాల్సిన అవసరం లేదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ ఎస్.దీక్షిత్ అభిప్రాయపడ్డారు. విచారణ చేయవచ్చనీ, అరెస్టు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సీఆర్‌పీసీ 41ఏ ప్రకారం మార్చి 28న పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఏప్రిల్ 12న యడియూరప్ప విచారణకు హాజరయ్యారు. రెండో నోటీసుకు ఆయన విచారణకు వెళ్లలేదు. జూన్ 17న విచారణకు హాజరవుతానని తెలిపారనీ, ఈ నేపథ్యంలో యడియూరప్ప అరెస్టు అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది. గురువారం పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌కు కోర్టు అరెస్టు వారెంట్ జారీచేసిన విషయం తెలిసిందే. యడియూరప్ప అరెస్టు అవుతారని పార్టీ వర్గాల్లో ఆందోళన రేగింది. ఆయన బెయిల్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ధర్మాసనం అరెస్టు అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా కృష్ణ, రామకృష్ణ ఎన్నిక

మండపేట, జూన్ 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో శుక్రవారం జరిగిన ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.వి.కృష్ణ (గుంటూరు), ఎం.రామకృష్ణ (విజయవాడ), రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చీకట్ల వేంకటేశ్వరరావు (ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా), సహాయ కార్యదర్శిగా కె.రమేష్ (చిత్తూరు), కోశాధికారిగా ఎస్.బాలరాజు (కర్నూలు), కార్యవర్గ సభ్యులుగా షేక్‌అజీజ్ బాషా(కర్నూల్), ఆర్.కనకారావు(విజయవాడ), రాజశేఖర్(పశ్చిమగోదావరి జిల్లా), శంకర్ (గుంటూరు), సూరిబాబు (తూర్పుగోదావరి) ఎన్నికయ్యారు. వారితోపాటు నలుగురు కోఆప్షన్‌సభ్యులు, 15మంది రాష్ట్రకౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఐదేళ్ల విధ్వంసానికి ప్రతిరూపాలు





అమరావతి సచివాలయంలో గత ఐదేళ్లుగా నిరుపయోగంగా వదిలేయడంతో పాడైపోయిన బ్యాటరీ ఆటోలు, సైకిళ్లు. సచివాలయానికి వెళ్లే ఉద్యోగులు, సందర్శకుల కోసం అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం వీటిని సమకూర్చింది. అప్పట్లో అధికారంలోకి రాగానే జగన్ ప్రభుత్వం అమరావతిని పక్కన పెట్టడంతో ఇవి కూడా శిథిలావస్థకు చేరాయి. ఇక, కియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చార్జింగ్ స్టేషన్లు కూడా నిరుపయోగంగా మిగిలిపోయాయి.



చేనేతకు శరాఘాతం!

- ఆప్కోను ప్రక్షాళన చేస్తామన్న హామీకి జగన్ నీళ్లు
- నేతన్నల వెతలు పట్టించుకోని గత వైసీపీ సర్కారు
- ఆప్కో షోరూముల వార్షిక టర్నోవర్ అంతంతమాత్రం
- అయినా ఫర్నీచర్, అలంకరణలకు రూ.కోట్లల్లో వ్యయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నేతన్నల బతుకు భారమైంది. ఊళ్లల్లో మగ్గం చప్పుళ్ల కరువయ్యాయి. నేత కార్మికులు భవన నిర్మాణ పనుల్లో రోజువారీ కూలీలుగా మారిపోయారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, ఆప్కో నుంచి కొనుగోళ్ల నిలిచిపోవడం, నూలుకు రాయితీలు చెల్లించకపోవడంతో రాష్ట్రంలో చేనేత రంగం పరిస్థితి చిరిగిన వస్త్రంలా మారింది. తరతరాలుగా నమ్ముకున్న వృత్తి నేతన్నలను పస్తులు పెడుతోంది. రాష్ట్రానికి ఖండాంతర ఖ్యాతిని ఆర్జించి పెట్టిన చేనేత రంగాన్ని కాపాడుకోవడానికి గత ప్రభుత్వాలు ఎంతో కృషి చేశాయి. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత పరిశ్రమను ఆదుకుంటామని గత సీఎం జగన్ ఇచ్చిన హామీ ఎక్కడా అమలు కాలేదు. ఎన్నికల ముందు ఆప్కోను ప్రక్షాళన చేస్తానని చెప్పి... చివరకు చేనేత సహకార సంఘాలను నిర్వీర్యం చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జగన్ బొమ్మను ముద్రించి మరీ ఇచ్చిన యూనిఫాంను పొరుగు రాష్ట్రాలకు చెందిన మరమగ్గాల నుంచి కొనుగోలు చేశారు. రూ.వేల కోట్ల ఆర్డర్ అటు పోవడంతో ఇక్కడి చేనేత సొసైటీల్లో వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. వీటిని పూర్తిగా గాలికొదిలేసిన రాష్ట్ర చేనేత జౌళి శాఖ... పొరుగు రాష్ట్రాలిచ్చే కమీషన్ల కోసం వారినుంచి విద్యార్థుల యూనిఫాం కోసం కోట్లాది మీటర్ల వస్త్రం కొనుగోలు చేసిందంటూ విజిలెన్స్‌కు ఫిర్యాదులు అందుతున్నాయి. ఆప్కో ఉన్నతాధికారిగా అదనపు బాధ్యతల్లో పనిచేసిన ఒక ఐఏఎస్ అధికారి నాసిరకం వస్త్రాలను ఎక్కువ ధరకు కొనుగోలు చేశారని ఆరోపణలు



వెల్లువెత్తుతున్నాయి. వీటికితోడు ఆప్కో షోరూమ్‌ల అలంకరణలకు రూ.కోట్లల్లో ఖర్చు చేస్తున్న కొందరు అవినీతి అధికారులు సంస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఏసీబీకి ఫిర్యాదులొస్తున్నాయి. ఈ వ్యవహారం చేనేత, జౌళిశాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఏదీ ఆనాటి ఊతం?

ధర్మవరం, మదనపల్లె, శ్రీకాళహస్తి, వెంకటగిరి, ఎమ్మిగనూరు, చీరాల, ఉప్పాడ, మంగళగిరి, పెడన, రాజమండ్రి, పొందూరు తెలుగుజాతి ఔన్నత్యానికి ప్రతీకలుగా నిలిచాయి. అలాంటి ప్రాంతాల్లోని చేనేత కళాకారులను గౌరవిస్తూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అధికారంలోకి రాగానే చేనేత వస్త్రాలను స్వయంగా తాను ధరించడంతో పాటు ఆ రంగానికి జవజీవాలు నింపారు. చంద్రబాబు ప్రభుత్వం కూడా పలు పథకాలు కొనసాగించింది. చేనేత రంగానికి ఊతమిస్తూ మార్కెటింగ్ సదుపాయాలు కల్పించింది. ఆప్కోను బలోపేతం చేసి రిబేటు అమలు చేసింది. సహకార సంఘాల్లో కార్మికుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంది. వాటిలో సభ్యులైన కార్మికులకు 'త్రిఫ్ట్' పథకాన్ని ప్రవేశపెట్టి నేత కార్మికులు నెలవారీ ఆదాయంలో 8శాతం పొదుపు చేస్తే అందుకు సమానంగా ప్రభుత్వం మరో 8శాతం కలిపేది. పట్టుచీరలు నేసే కార్మికులకు ముడిసరుకు రాయితీగా నెలకు రూ.2వేలు చెల్లించేది. ఇలా గత ప్రభుత్వం వీలైనంత మేరకు చేనేతలకు ప్రోత్సాహం అందించింది. అయితే అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ వాటన్నింటినీ రద్దు చేసేశారు. చేనేత అనుబంధ రంగాల్లో 3.5లక్షల మందికి పైగా పనిచేస్తుంటే కేవలం 81వేల మందికే నేతన్న నేస్తం వర్తింపజేసి సరిపెట్టారు.

కాసుల కోసం కక్కుర్తి

రాష్ట్రంలో లక్షన్నర వరకూ చేనేత మగ్గాలుంటే సుమారు 800 చేనేత సహకార సంఘాలున్నాయి. వాటి ద్వారా ఉపాధి పొందే నేతన్నను ఆదుకోవడానికి గత ప్రభుత్వాలు నూలు, పట్టు, ఇతర ముడిసరుకు రాయితీపై సరఫరా చేసేవి. ఈ సహకార సంఘాల నుంచి ప్రభుత్వానికి అవసరమైన వస్త్రాన్ని కొనుగోలు చేసి చేనేతకు ఊతమిచ్చేవి. ఆప్కో వస్త్రాల విక్రయాలకు తోడ్పాటు అందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కోసం చంద్రబాబు ప్రభుత్వం గట్టిగా శ్రమించింది. అయితే గత జగన్ ప్రభుత్వం మాత్రం పాఠశాల విద్యార్థులకు ఇచ్చే యూనిఫాం కోసం కోట్లాది మీటర్ల వస్త్రం అవసరం కాగా రాష్ట్రంలోని ఒక్క చేనేత సంఘానికి లేదా కార్మికుడికి నూలు ఇచ్చిన పాపాన పోలేదు. అయితే పాఠశాల విద్యార్థుల యూనిఫాంను మన చేనేతల నుంచే కొనుగోలు చేయాలని ఆదేశించినట్లు ఎన్నికల ప్రచారంలో జగన్ బహిరంగంగా చెప్పారు. టెక్స్‌టైల్ కమిటీ ద్వారా కొన్నామని అధికారులు పైకి చెబుతున్నా నాణ్యతను నిర్ధారించే 'లైట్స్' వద్దన్నా కొనుగోలు చేయడం వెనుక కోట్లాది రూపాయల కమీషన్లు చేతులు మారాయని బలమైన వాదన వినిపిస్తోంది.

వ్యాపారం లేకున్నా సోకులు: చేనేత కార్మికులకు ముడిసరుకు ఇచ్చి, వస్త్రాల ఉత్పత్తికి తోడ్పాటు అందించి, వాటిని కొనుగోలు చేసి ఆప్కో ద్వారా విక్రయాలు పెంచాల్సిన చేనేత జౌళిశాఖ అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. వస్త్రాల నిల్వలు పెంచి వ్యాపారాభివృద్ధి చేయకుండా షోరూమ్‌ల్లో లైట్లు, ఫర్నీచర్, ఇతర అలంకరణలకు రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. ఒక ఉన్నతాధికారి కమీషన్లకు కక్కుర్తిపడి ఈ హంగుల కోసం ఒక్కో షోరూమ్‌కు రూ.25లక్షల నుంచి 40 లక్షల వరకూ ధారపోశారు. అయితే ఏడాది మొత్తమ్మీద చూసినా ఆ షోరూమ్‌ల టర్నోవర్ అంత లేకపోవడం ఆశ్చర్యకరం. మరోవైపు సిబ్బందికి ప్రతినెలా రూ.2.5 కోట్ల జీతాలు చెల్లిస్తున్న ఆప్కో ఆ మాత్రం టర్నోవర్ కూడా చేయకపోవడం సంస్థను ఏ స్థాయిలో నిర్వీర్యం చేస్తున్నారనే దానికి ప్రత్యక్ష నిదర్శనం. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరనున్న టీడీపీ కూటమి ప్రభుత్వమైనా ఆప్కోను సంస్కరించాలని, చేనేత రంగానికి ఊపిరులూదాలని ఆ వర్గాలు కోరుతున్నాయి.



ఐఎన్ఎస్ జలాశ్వ యుద్ధనౌకలో సెయిలర్లతో ముచ్చటిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

శాంతి, స్వేచ్ఛా నౌకాయానానికే ప్రాధాన్యం

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి

విశాఖపట్నం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): హిందూ మహాసముద్రంలో స్వేచ్ఛా నౌకాయానానికి, శాంతి, సుస్థిరతకు, సముద్రపు దొంగల బెడద నివారణకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడించారు. శుక్రవారం ఆయన తూర్పు నౌకాదళాన్ని సందర్శించారు. కార్యాచరణ సంసిద్ధతను సమీక్షించారు. సముద్ర పర్యటన చేశారు. ఐఎన్ఎస్ జలాశ్వను సందర్శించి సెయిలర్లతో ముచ్చటించారు. అంతకుముందు సైనిక వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హిందూ, పసిఫిక్ సముద్ర తీర ప్రాంతాల్లో ఏ జాతీ నష్టపోకుండా నౌకాదళం సమర్థంగా వ్యవహరిస్తుందన్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేకవిమానంలో విశాఖ వచ్చిన రాజ్‌నాథ్‌కు నేవీ ఎయిర్‌పోర్టు ఐఎన్ఎస్ డేగాలో కలెక్టర్ మల్లికార్జున, ఎంపీ ఎం.శ్రీభరత్, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, తూర్పు నౌకాదళం ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ స్వాగతం పలికారు.

దివ్యాంగురాలిపై అఘాయిత్యం

- పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు

చీమకుర్తి, జూన్ 14: ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలపరిధిలోని ఓ గ్రామంలో మాటలు రాని, వినపడని యువతిపై 3నెలలుగా అఘాయిత్యం జరుగుతున్నట్లు బయటపడింది. ఆ యువతి గర్భిణి అని తేలటంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసిన చీమకుర్తి పోలీసులు.. యువతి గుర్తించిన మేరకు అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. ఈ ముగ్గురిలో ఒకరు అవివాహితుడు కాగా ఇద్దరు వివాహితులు. బాధితురాలికి ఆసుపత్రిలో వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామంలో సంచలనం రేపిన ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

పోతూ పోతూ.. విద్యార్థులపై ప్రయోగం



- ఇంటర్ సప్లిమెంటరీకి ఆన్‌లైన్ మూల్యాంకనం
- వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో తీవ్ర ఇబ్బందులు
- ఆన్‌లైన్‌తో జూనియర్ లెక్చరర్లకు పాట్లు
- ఇప్పటివరకూ దిద్దింది 35% పేపర్లే
- ఉన్నత విద్య అడ్మిషన్లకు అడ్డంకులు

అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పోతూ పోతూ.. చేసిన ప్రయోగం ఇంటర్మీడియట్ విద్యార్థులకు కొత్త ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ముందస్తు ఆలోచన లేకుండా సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్ విధానంలో మూల్యాంకనం చేయించాలని ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఉన్నత విద్య అడ్మిషన్లకు అడ్డంకిగా మారింది. మూల్యాంకనం ప్రారంభమై పది రోజులు దాటినా ఇప్పటికీ 35 శాతం కూడా పూర్తికాలేదు. అసలు ఎప్పుడు పూర్తవుతుందో.. ఫలితాలు ఎప్పుడు విడుదల చేస్తారో.. కూడా స్పష్టత లేదు. మరోవైపు ఇప్పటికే ఈఏపీసెట్ ఫలితాలు విడుదల కావడం, డిగ్రీ అడ్మిషన్లకు షెడ్యూల్ సిద్ధం చేస్తుండటంతో విద్యార్థుల్లో ఆందోళన పెరిగింది.

ఏకపక్షంగా నిర్ణయం

ఇంటర్ విద్యార్థుల సమాధాన పత్రాలను ఏటా జూనియర్ లెక్చరర్లు మాన్యువల్ విధానంలో మూల్యాంకనం చేస్తారు. ఈ ఏడాది రెగ్యులర్ పరీక్షలకు కూడా అదే విధానంలో పూర్తిచేశారు. కానీ.. సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ పరీక్షలు పూర్తయిన తర్వాత అకస్మాత్తుగా ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేయాలని ఇంటర్ విద్యాశాఖ ఆదేశించింది. రాష్ట్రంలో సుమారు 5 లక్షల మంది విద్యార్థులు సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ పరీక్షలు రాశారు. సబ్జెక్టుల ఆధారంగా 12.7 లక్షల సమాధాన పత్రాలు వచ్చాయి. ఒక్కో సమాధాన పత్రం 24 పేజీల బుక్‌లెట్ రూపంలో ఉంటుంది. వాటన్నిటినీ ఇంటర్ విద్యాశాఖ అధికారులు స్కానింగ్ చేయించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. జూనియర్ లెక్చరర్లు (జేఎల్స్) వాటిని డౌన్‌లోడ్ చేసుకుని మూల్యాంకనం చేస్తున్నారు. అయితే చాలా చోట్ల సమాధానపత్రాలు సక్రమంగా డౌన్‌లోడ్ కావడంలేదు. ఇష్టానుసారంగా స్కానింగ్ చేయడంతో సమాధానాలు సరిగా కనిపించడం లేదు. జేఎల్స్ వాటిని చూసి మార్కులు వేయడం, మూల్యాంకనం పూర్తయిన తర్వాత తిరిగి వాటిని అప్‌లోడ్ చేయడం.. ఇదంతా పెద్ద ప్రహసనంగా మారింది. ఆన్‌లైన్ మూల్యాంకనం చేపట్టిన అధికారులు జేఎల్స్‌కు ల్యాప్‌టాప్‌లు ఉన్నాయా? లేవా? అనేది పరిశీలించలేదు. వెబ్‌క్యామ్‌లు లేని కంప్యూటర్లలో మూల్యాంకనం చేయడం సాధ్యం కాదు. ఎందుకంటే మూల్యాంకనం చేస్తున్న సమయంలో పేపరు దిద్దే జూనియర్ లెక్చరర్ వెబ్‌క్యామ్‌లో కనిపిస్తూ ఉండాలి. ఇవన్నీ ఆన్‌లైన్ మూల్యాంకనంలో తీవ్ర జాప్యానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. ఒక్కో జేఎల్ కనీసం 40 నుంచి 70 పేపర్లు దిద్దాలనే నిబంధన ఉండగా ఇప్పటివరకూ వాటిలో సగం కూడా పూర్తికాలేదు.

బోధన ఆపి పేపర్లు దిద్దండి

మూల్యాంకనంలో తీవ్ర జాప్యంతో నష్ట నివారణ చర్యలకు దిగిన అధికారులు మొత్తం బోధన నిలిపేయాలని ఆదేశించారు. మూల్యాంకనం పూర్తయ్యేవరకూ ఇతర పనులేమీ చేయొద్దని స్పష్టం చేశారు. గతంలో మూల్యాంకనంలో పాల్గొనే జేఎల్స్ విడతల వారీగా మూల్యాంకనం చేసేవారు. కానీ ఇప్పుడు మొత్తం పనులు ఆపేసి దీనిపైనే కూర్చోవాలని అధికారులు చెబుతున్నారు. గతేడాది జూన్ 13న సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఏడాది 20వ తేదీకి కూడా ఫలితాలు వస్తాయన్న నమ్మకం లేదు. మరోవైపు డిగ్రీ అడ్మిషన్లకు షెడ్యూల్ విడుదల చేసేందుకు ఉన్నత విద్యామండలి సిద్ధమైంది. ఇప్పుడు కాకుండా రెండో విడతలో అయితే కోరుకున్న సీట్లు దక్కే అవకాశాన్ని విద్యార్థులు కోల్పోతారు.

హౌసింగ్‌లో వసూల్ రాజాలు

- ఉద్యోగ విరమణ వయసు పెంపుపై కోర్టుకు వెళ్దామంటూ మాయ మాటలు
- రిటైర్డ్ ఉద్యోగులకు జేఏసీ నేత వల
- ఒక్కొక్క రిటైర్డ్ ఉద్యోగి నుంచి 30 వేలు చొప్పున వసూళ్లకు ప్రణాళిక
- నేడు మంత్రి కొలుసు అపాయింట్‌మెంట్ ఉందంటూ మెసేజ్‌లు

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ శాఖలో వసూల్ రాజాలు తెరమీదికి వచ్చారు. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, ఈ క్రమంలో కోర్టుకు కూడా వెళ్తున్నామని నమ్మబలుకుతున్నారు. కోర్టు ఖర్చుల కింద సొమ్ములు ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.30వేల చొప్పున వసూలుకు నిర్ణయించారు. "రాష్ట్ర గృహనిర్మాణశాఖకు కొత్త మంత్రిగా కొలుసు పార్థసారథి వచ్చారు. ఆయన శనివారం(నేడు) ఉదయం 7గంటలకు మనకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. గృహనిర్మాణశాఖ ఉద్యోగుల జేఏసీ తరఫున అందరం వెళ్లి మంత్రిని కలుస్తున్నాం. గత నెలలో రిటైరైన ఉద్యోగులు, ఈనెల్లో రిటైరవుతున్నవారు తమ ఆధార్ కార్డులు, ప్రొసీడింగ్స్ కాపీలు తీసుకుని రావాలి. మంత్రిని కలిసి చర్చించిన అనంతరం లాయర్‌ను కలిసి కోర్టులో కేసు ఫైల్ చేస్తాం. కోర్టు నుంచి స్టే తెచ్చుకుంటే రిటైరైనవారంతా సర్వీసులో కొనసాగడానికి అవకాశం ఉంటుంది. రెండు, మూడు నెలల్లో 62ఏళ్ల పదవీ విరమణ వయసు డిమాండ్ సాధించుకోవడానికి అవకాశముంది. స్టే తెచ్చుకునేందుకు రూ.30 వేల చొప్పున లాయర్ తీసుకుంటున్నారు. కాబట్టి మీరందరూ ముందుకు రండి. లేదా మీకు తెలిసిన లాయర్లు ఉంటే వారి ద్వారా కోర్టుకు వెళ్లండి. విజయవాడలో ఒక లాయర్ చేస్తాడన్న నమ్మకంతోనే అయనతో మాట్లాడుతున్నాం. అయితే, రేపు 'మీరు మాట్లాడిన లాయరే కదా.. స్టే కూడా తీసుకురాలేకపోయాడు' అంటే మా దగ్గర ఆన్సర్ లేదు" ఇదీ.. గృహ నిర్మాణ శాఖలో రిటైరైన ఉద్యోగులకు శుక్రవారం ఆ శాఖ ఉద్యోగుల జేఏసీ నేత ఒకరు వాట్సాప్ ద్వారా పంపించిన వాయిస్ మెసేజ్. కేవలం రూ.30 వేలతో రెండేళ్లపాటు సర్వీసులో కొనసాగే అవకాశం లభిస్తుందంటూ రిటైర్డ్ ఉద్యోగులకు ఆశలు కల్పిస్తూ ఈ వసూళ్ల పర్వానికి ప్రణాళిక రచించారు. హౌసింగ్‌లో గత నెలలో 18 మంది 60 ఏళ్లకే పదవీ విరమణ చేయగా.. ఈ నెలలో మరో 48 మంది పదవీ విరమణ చేయనున్నారు. మొత్తం 66 మంది నుంచి రూ.30 వేలు చొప్పున దాదాపు రూ.20 లక్షల వరకు వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. అంతా చేశాక కోర్టు నుంచి 'స్టే' రాకపోతే తమను ఏమీ అడగొద్దంటూ ముందే కండిషన్ పెట్టడం గమనార్హం.

ఇదే తొలిసారి కాదు!

హౌసింగ్‌లో ఉద్యోగుల జేఏసీ పేరుతో సొమ్ములు వసూలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది అన్ని జిల్లాల్లో హౌసింగ్ డీఈఈలుగా పని చేస్తున్న 26 మందికి ప్రభుత్వం ఈఈలుగా ప్రమోషన్లు కల్పించింది. ఈ పదోన్నతులకు ఒక రేటు.. పని చేస్తున్న చోటనే పోస్టింగ్ ఇచ్చేందుకు మరో రేటు చొప్పున.. ఆ 26 మంది నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. ఈ వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టడంతో అప్పటి ప్రభుత్వం పదోన్నతులను నిలిపివేసింది. ఈ వసూళ్ల వ్యవహారంపై తూతూ మంత్రంగా విచారణ జరిపించి.. వసూళ్లకు ఆధారాల్లేవంటూ నివేదిక తెప్పించుకుని, డీఈఈలకు ప్రమోషన్లు ఇచ్చేశారు. అప్పటి గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్ పేషీ నుంచే ఈ తతంగం నడిపించినట్లు హౌసింగ్ వర్గాల్లో ఇప్పటికీ చర్చ నడుస్తోంది. తర్వాత ఏఈలకు ప్రమోషన్లు ఇప్పించే పేరుతో హౌసింగ్‌లో వసూల్ రాజాలు మరోసారి రూ.లక్షల్లో వసూళ్లు చేసినట్లు ఆరోపణలొచ్చాయి. జగన్ సర్కారు.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ 2022, జనవరి 31న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కార్పొరేషన్లలో పని చేస్తున్న ఉద్యోగులకు ఆ ఉత్తర్వులను వర్తింపజేయలేదు. దీంతో హౌసింగ్ కార్పొరేషన్‌లో కూడా 60 ఏళ్లకు రిటైరైన ఉద్యోగులందరికీ వీడ్కోలు పలుకుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై కొంతమంది ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. ఆగస్టు 31న న్యాయస్థానం వారికి వ్యతిరేకంగా తుది తీర్పును వెలువరించింది. దాంతో వివిధ క్యాడర్లలో సేవలందిస్తున్న 76 మంది రిటైర్డ్ ఉద్యోగులను హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు తొలగించారు. కాగా, హైకోర్టు తుది తీర్పు వెలువరించినా మళ్లీ పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పొడిగించాలని కోరుతూ కోర్టు వెళ్దామని జేఏసీ నేత చెప్పడం చర్చనీయాంశంగా మారింది. దీనికి తోడు మంత్రి కొలుసు అపాయింట్‌మెంట్ ఉందంటూ వాయిస్ మెసేజ్‌లు పంపించడం అనుమానాలకు తావిస్తోంది. జేఏసీ నేతలు తరచూ పదోన్నతులు, కావాల్సిన చోటకు బదిలీలు అంటూ రూ.లక్షలు కాజేస్తున్నారని, తాజాగా రిటైర్డ్ ఉద్యోగులపై పడ్డారని హౌసింగ్ ఉద్యోగులు చెబుతున్నారు.

రిటైరైనా.. రైట్ రైట్..!

- ఎన్నికల ముందు వైసీపీ సర్కారు ఆగడాలు
- అనుకూల అధికారులకు మళ్లీ పోస్టింగులపై సర్వత్రా చర్చ

అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సర్వీసులో రిటైరైన కొందరు అధికారులను మళ్లీ కొనసాగిస్తూ వైసీపీ సర్కారు ఎన్నికల ముందు హడావుడిగా ఆదేశాలివ్వడంపై సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖలో పనిచేస్తున్న అడిషనల్ సెక్రటరీ ఎం.ప్రతాప్‌రెడ్డి ఏప్రిల్ 30న రిటైరయ్యారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎస్‌గా ఉన్న జవహర్‌రెడ్డి మార్చి 12న ఆయన రీపోస్టింగ్‌కు ఆదేశాలు జారీచేయడం చర్చనీయాంశంగా మారింది. అలాగే.. వైసీపీ సేవలో తరించిన ఉపాధి హామీ పథకం డైరెక్టర్ చినతాతయ్య రిటైర్ అయినా.. గ్రామీణాభివృద్ధి శాఖలో కొనసాగిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఎన్నికలకు ముందు ఆదేశాలిచ్చింది. మంత్రి పెద్దిరెడ్డి అండతో చక్రం తిప్పిన చినతాతయ్య రిటైరైన తర్వాత పైరవీలు చేసి రెండు సార్లు ఎక్స్‌టెన్షన్ దక్కించుకున్నారు. తిమ్మిని బమ్మిని చేసే సామర్థ్యం ఉన్న ఆయన గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రి నారాయణ సిఫారసులతో మెప్మా మిషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పెద్దిరెడ్డి చెంతకు చేరారు. సెర్ప్ విభాగంలో అభయహస్తం డైరెక్టర్‌గా నియమితులైన ఆయనకు ఉపాధి హామీ పథకం డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒకప్పుడు ఐఏఎస్ అధికారులు నిర్వహించిన ఉపాధి హామీ పథకం డైరెక్టర్ బాధ్యతలను ఇప్పుడు ఈ రిటైర్డ్ అధికారి నిర్వహిస్తున్నారు. ఉపాధి పథకాన్ని అధికార పార్టీ కార్యకర్తల కల్పతరువుగా మార్చడంలో సిద్ధహస్తుడిగా మారిన ఈ అధికారి మేలో బాధ్యతలు వదిలేయాల్సి ఉన్నా.. రెండు నెలల ముందే కొనసాగింపు ఉత్తర్వులు తెచ్చుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆయనకు మే 1 నుంచి మరో ఏడాది కొనసాగేలా రీపోస్టింగ్ ఇచ్చారు.

100 కోట్ల బ్యాంకు మోసం కేసు.. రంగంలోకి దిగిన ఈడీ

- హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లో సోదాలు

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వ్యాపార విస్తరణ కోసం రూ.101.48 కోట్ల బ్యాంకు రుణం తీసుకుని దారిమళ్లించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈడీ ప్రత్యేక బృందాలు హైదరాబాద్, కర్నూల్, ఘజియాబాద్‌లో తనిఖీలు చేపట్టాయి. రామకృష్ణ ఎలక్ట్రానిక్స్, రామకృష్ణ టెలిట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు వి.రాఘవేంద్ర, రవికుమార్‌లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.101.48 కోట్ల రుణం తీసుకున్నారు. సెల్‌ఫోన్ల ట్రేడింగ్, మార్కెటింగ్ నిర్వహించే ఈ సంస్థల వ్యాపారాల విస్తరణ పేరుతో బ్యాంకు నుంచి రుణం తీసుకుని దారిమళ్లించారు. బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెంగళూరు సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ రంగంలోకి దిగింది. శుక్రవారం ఏకకాలంలో వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో బ్యాంకు రుణాన్ని దారిమళ్లించి కొన్న ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలు ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డైరెక్టర్ల బ్యాంకు ఖాతాల్లోని రూ.1.45 కోట్లు ఫ్రీజ్ చేశారు. డిజిటల్ ఆధారాలు, కేసు దర్యాప్తునకు సంబంధించిన కీలక పత్రాలు సోదాల్లో స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 15 జూన్ 2024



గర్భవతి వ్యాకులతను పట్టిఇచ్చే యాప్



గర్భవతులు డిప్రెషన్(వ్యాకులత)కు లోనవుతుంటారు. అయితే దాన్ని ముందుగానే పట్టి ఇచ్చే యాప్ ఇప్పుడు ఉనికిలోకి వచ్చింది. గర్భవతి నుంచి కొన్ని ప్రశ్నలకు సమాధానాలను రాబట్టగలిగితే ఆమె డిప్రెషన్‌లోకి వెళుతోందా లేదా అన్నది కనుగొనవచ్చని యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్‌కు చెందిన జనరల్ ఇంటర్నల్ మెడిసిన్ ప్రొఫెసర్ ఒకరు తేల్చారు. తన బృందంతో కలిసి జరిపిన ఈ కొత్త పరిశోధన ప్రకారం మొబైల్ యాప్ ఒకటి ఇందులో తోడ్పడుతుంది. గర్భందాల్చిన తదుపరి అంటే మొదటి మూడు నెలల్లో ఎదురయ్యే రిస్క్ కారకాలను పరిశోధకులు గుర్తించారు. నిద్ర నాణ్యత, ఆహార సంబంధిత అభద్రత వంటివి డిప్రెషన్‌ను పెంచుతాయని పేర్కొన్నారు. డిప్రెషన్‌లోకి వెళుతున్నారని ముందే కనుగొంటే రెమెడికి అవకాశం ఉంటుందని కూడా పేర్కొన్నారు. ఈ పరిశోధనలో భాగంగా 944 మంది గర్భవతులను ప్రశ్నించి సమాచారాన్ని రాబట్టారు.

వ్యక్తిగత మెడికల్ హిస్టరీ సహా పలు ప్రశ్నలకు సమాధానం వారు ఇచ్చారు. వారందరిని మూడు నెలలకు ఒకసారి అంటే మూడు సెమిస్టర్లలో ఆ మహిళలను స్క్రీనింగ్ చేశారు. వీటి నుంచి పరిశోధకులు ఆరు మెషిన్ లెర్నింగ్ మోడల్స్‌ను రూపొందించారు. అందులో బెస్ట్ వన్ ఒకటి 89 శాతం మేర డిప్రెషన్‌ను కరెక్ట్‌గా అంచనా కట్టింది. అలాగే గర్భవతులు ఇతర ఆప్షనల్ ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలను కూడా క్రోడీకరిస్తే, 93 శాతం ఆక్యురసీని సదరు మోడల్ సాధించింది. మొత్తమ్మీద ఆహారం అందుబాటు, సంబంధిత అభద్రత డిప్రెషన్‌కు కారణమని కూడా ఆ పరిశోధకుల బృందం తేల్చింది.

యాడ్ బ్లాకర్స్ కౌంటర్‌గా యాడ్ ఇంజెక్షన్



యూట్యూబ్ - యాడ్ బ్లాకర్స్‌కు కౌంటర్‌గా సెర్వర్ సైడ్ యాడ్ ఇంజెక్షన్‌ను తీసుకువస్తోంది. ప్రస్తుతం ఇది టెస్టింగ్‌లో ఉంది. దీని ప్రకారం ప్రకటన అనేది వీడియోలో భాగంగా వస్తుంది. ప్రస్తుతం ఉన్న విధానంలో ప్రకటనను తీసి వీడియోను చూపించేందుకు యాడ్ బ్లాకర్స్‌కు అవకాశం ఉంది. టెస్టింగ్‌లో ఉన్న చర్య ప్రకారం సెర్వర్‌లో డిటెక్షన్ ప్రక్రియ ఉంటుంది. అదే ప్రకటనలు తీసేయకుండా అడ్డుకుంటుంది. డేటా బేస్‌లోకి తప్పుడు జోక్యం లేకుండా చేస్తుంది. ప్రస్తుతం ఏడాదిగా ఈ పనిపైనే గూగుల్ ఉంది. ప్రకటనలు రాకుండా అడ్డుకునే చర్యలను నిరోధిస్తుంది. తెరవెనుక ఏమి జరుగుతోందన్నది తెలియదు. అయితే ప్రకటనలను అడ్డుకునే ప్రక్రియకు గూగుల్ ఎలా చెక్ పెడుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

లైక్స్‌ను దాచిపెడుతున్న ఎక్స్!



సామాజిక మాధ్యమం ఎక్స్ - లైక్స్‌ను దాచిపెడుతోంది. తద్వారా ప్రతి యూజర్‌కు లైక్స్ విషయంలో ఉండే ప్రైవసీని పరిరక్షిస్తోంది. ఈ పద్ధతిలోనూ యూజర్ తన పోస్టుకు వచ్చిన లైక్స్ చూసుకోవచ్చు. అయితే ఇతరులకు మాత్రం ఆ యూజర్‌కు వచ్చిన లైక్స్ చూసే వీలు ఉండదు. ఈ పద్ధతి ఇప్పటికే అమలులోకి వచ్చింది. యూజర్ ప్రొఫైల్ పేజీలో మాత్రమే తనకు లభించిన లైక్స్ కనిపిస్తాయి. ఇతరులకు వచ్చిన లైక్స్‌ను చూడగలిగే వెసులుబాటు కలిగిన టాబ్ ఇకపై అందుబాటులో ఉండదు. ఇంజనీరింగ్ టీమ్ ఇచ్చిన అప్డేట్ ప్రకారం లైక్ కౌంట్స్, ఇతర మేట్రిక్స్ వంటివి ఇప్పటికీ నోటిఫికేషన్స్ కింద కనిపిస్తాయి. తద్వారా ఒక పోస్టుకు వచ్చిన లైక్స్ మాత్రం తెలుస్తాయి. అంటే పోస్టును రాసిన వ్యక్తికి మాత్రమే తెలుస్తాయి. నిజానికి ఈ వెసులుబాటు ప్రీమియం ఖాతాదారులకు మాత్రమే ఇంతకుమునుపు ఉండేది. ఎలన్‌మస్క్ చేతిలోకి ఎక్స్ వెళ్ళిన తరవాత వచ్చిన మార్పుల్లో ఇది కూడా ఒకటి.

జూలై 10న

శాంసంగ్ వాచీ, ఇయర్ బడ్స్!



శాంసంగ్ ఉత్పత్తులు కొన్ని వచ్చే నెల 10న విడుదల అవుతాయని సమాచారం. న్యూజనరేషన్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లు, గెలాక్సీ వాచీలు, టీడబ్ల్యూఎస్ ఇయర్ బడ్స్ ఈ ప్యాకేజీలో ఉన్నాయి. అయితే ఈ విషయమై శాంసంగ్ మెంబర్స్ యాప్‌లోని సపోర్ట్ పేజీని ఉటంకిస్తూ స్క్రీన్‌షాట్‌తో ఒక పోస్టును యూజర్ ఒకరు ఎక్స్‌లో పోస్టు చేశారు. అందులో ఉన్న ప్రకారం గెలాక్సీ వాచీ 7, ఎఫ్ఈ మోడల్ కొత్త వాచీ, గెలాక్సీ బడ్స్ 3 ప్రొ, గెలాక్సీ రింగ్ ఉన్నాయి. గెలాక్సీ వాచీ ఎఫ్ఇ ఉనికిని ఈ పోస్టు ఖరారు చేసింది. బడ్స్‌కు సంబంధించిన కొత్త సిస్టమ్ డిజైన్ కూడా బైటపడింది. గెలాక్సీ రింగ్ కూడా జాబితాలో ఉంది. వేరబుల్ డివైజెస్‌కు తోడు గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6 కూడా ఉన్నాయి. అన్నీ సరికొత్త డిజైన్‌తో రానున్నాయి. శాంసంగ్ ఫోల్డబుల్స్ వంద డాలర్లు అంటూ మరో పుకారు కూడా వినవచ్చింది. అయితే రేట్లు ఖరారైనట్టు ఎలాంటి సమాచారం లేదు.



గెలాక్సీ కెమెరా వివరాలు లీక్?

శాంసంగ్ గెలాక్సీ ఎస్24 ఎఫ్ఈ వివరాలు లీకయ్యాయి. ఎస్ 23 తరవాతి వెర్షన్‌గా ఈ ఏడాది చివర్లో ఈ ఫోన్ విడుదల కానుంది. ఈ ఫోన్‌కు సంబంధించి శాంసంగ్ ఏ విషయాన్ని ఇప్పటివరకు కన్‌ఫర్మ్ చేయలేదు. 'గెలాక్సీ క్లబ్' నివేదిక ప్రకారం 50 మెగా పిక్సల్ కెమెరా అదీ 1/1.57 ఇంచీల ఐసోసెల్ జనరేషన్ 3 సెన్సర్ ఉంటాయి. ఇదే కెమెరా శాంసంగ్ గెలాక్సీ ఎస్24 హ్యాండ్‌సెట్‌లో ఉంది. దీనికి ముందు ఇంకో రిపోర్టు ప్రకారం ప్రాంతాన్ని అనుసరించి ఎక్సినోస్ 2400 లేదా స్నాప్‌డ్రాగన్ 8జన్. 3 చిప్‌సెట్ ఉండనుంది. ఎస్23 కంటే చిన్నగా అంటే 6.1 ఇంచీల అమోల్డ్ స్క్రీన్ ఉండనుంది.

4500ఎంఏహెచ్ బ్యాటరీ, 12జీబీ ఎల్‌పీడీడీఆర్5ఎక్స్ ర్యామ్, 256 జీబీ వరకు యూఎఫ్ఎస్ 3.1 ఆన్‌బోర్డ్ స్టోరేజీ ఉంటాయని సమాచారం. అలాగే కొన్ని దేశాలకు విడుదల చేసే ఫోన్ మోడల్ నంబర్లు కూడా లీకయ్యాయి. హ్యాండ్ కోడ్‌నేమ్ ఆర్ 12గా ఉండనుంది.



వాట్సాప్ - వీడియో కాలింగ్‌కు సంబంధించి 'స్పీకర్ స్పాట్‌లైట్' పేరిట అదనపు విలువను సమకూర్చే ఫీచర్‌ను తెచ్చింది. కాల్ సమయంలో మెసెంజర్ యాప్ ఆటోమెటిక్‌గా మాట్లాడుతున్న వ్యక్తిని స్క్రీన్‌పైకి తీసుకువస్తుంది.

స్పీకర్ స్పాట్‌లైట్

తద్వారా వీడియో కాల్‌లో ఎవరు మాట్లాడుతున్నారన్నది పార్టిసిపెంట్లు అందరికీ తెలుస్తుంది. వాట్సాప్ వీడియోకాల్‌కు సంబంధించి పార్టిసిపెంట్స్ విషయంలో పరిమితి ఉంది. ఫోన్‌లో 32 మంది విండోస్ పీసీలో గరిష్ఠంగా పదహారు మంది, మేక్స్‌లో ఎనిమిది మంది చేరవచ్చు. అయితే ఇప్పుడు అన్ని డివైజ్‌లకు ఒకే పరిమితి అంటే 32 మంది హాజరుకావచ్చు. తాజాగా స్పీకర్ స్పాట్‌లైట్‌తో మాట్లాడుతున్న వ్యక్తి మొదట స్క్రీన్‌పై కనిపిస్తారు. ఆడియో సపోర్ట్‌తో స్క్రీన్ షేరింగ్ మరో గుర్తించదగ్గ విషయం. దీంతో వీడియో కాల్ జరుగుతున్నప్పుడే వీడియోలను వీక్షించవచ్చు. ఇదే సమయంలో జనరేటివ్ ఏఐ పవర్డ్ టూల్‌పై పనిచేస్తోంది. దీంతో పర్సనలైజ్డ్ ప్రొఫైల్ ఫొటోస్‌ను క్రియేట్ చేసుకునే వీలు ఉంటుంది.

రీకాల్ ఫీచర్ జాప్యం!

మైక్రోసాఫ్ట్ - సెక్యూరిటీ కారణాల రీత్యా రీకాల్ ఏఐ ఫీచర్ విడుదలలో జాప్యం చేస్తోంది. వెబ్ బ్రౌజింగ్ నుంచి వాయిస్ చాట్స్ వరకు అన్నింటినీ ట్రాక్ చేసే వీలు ఉన్న ఫీచర్ ఇది. అయితే ప్రైవసీని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతానికి ఈ ఫీచర్‌ను పక్కనపెట్టింది. నిజానికి వెబ్ బ్రౌజింగ్‌తో మొదలుపెట్టి వాయిస్ చాట్స్ నుంచి యావత్తు హిస్టరీని కంప్యూటర్‌లో ఈ ఫీచర్ నిక్షిప్తపరుస్తుంది. అలా స్టోర్ అయిన వివరాలను నెలల తరవాత కూడా గుర్తు చేస్తుంది. యూజర్ కూడా సెర్చ్ చేసుకోవచ్చు. అయితే ప్రస్తుతానికి రీకాల్ ఫీచర్‌ని కేవలం చూడవచ్చు. అది కూడా విండోస్ ఇన్‌సైడర్ ప్రోగ్రామ్(డబ్ల్యుఐపీ)లో రాబోయే వారాల్లో లభ్యమవుతుంది. కోపైలెట్ ప్లస్ పీజీ యూజర్లుకు అందుబాటులో ఉంటుందని మైక్రోసాఫ్ట్ ఒక బ్లాగ్‌పోస్టులో వెల్లడించింది. ఒక నమ్మకమైన ఫీచర్‌గా దీన్ని అందరికీ అందుబాటులోకి తేవాలని అనుకుంటున్నామని, మరింత ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తరవాత విడుదల చేస్తామని కూడా పేర్కొంది. కోపైలెట్ ప్లస్ పీసీ అనేది ఈ ఏడాది మే నెలలో ఆరంభించారు. ఏఐ ఫీచర్లు ఉన్న పర్సనల్ కంప్యూటర్‌లో మాత్రమే ఇది ఉంటుంది. ఇక డబ్ల్యుఐపీ అనేది సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ ప్రోగ్రామ్. మిలియన్ల కొద్ది ఉండే విండోస్ బిగ్గెస్ట్ ఫ్యాన్లకు ఇది చేరువగా ఉంటుంది. దీన్ని ప్రకటించిన వెంటనే ప్రైవసీ విషయమై యూజర్ల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అదే జాప్యానికి దారితీసింది.

నోకియా మెరుగైన కాల్

నోకియా కాల్ క్వాలిటీని పెంచింది. ప్రపంచంలో మొట్టమొదటి 'ఇమ్మెర్సివ్' కాల్‌ని నోకియా సీఈఓ చేయడం ఈ సందర్భంలో గమనార్హం. కాల్ విషయంలో దీన్ని పేర్కొనదగ్గ పై మెట్టుగా దీన్ని చెప్పవచ్చు. కాల్



విప్లవంగానూ పేర్కొనవచ్చు. తదుపరి జనరేషన్ టెక్నాలజీ అంటే కాన్ఫరెన్స్ కాల్స్‌లో హాజరైన వ్యక్తుల మాట స్పష్టంగా వినిపించాలి. ఇంకా బాగా చెప్పాలంటే తమ సమక్షంలోనే మాట్లాడుతున్నట్టు ఉండాలి. అంటే మాట్లాడుతున్న వ్యక్తి గొంతు సమూహం నుంచి విడివడి స్పష్టంగా వినిపించాలి. ఏమాత్రం అవగాహన ఉన్నా స్పేషియల్ టెక్నాలజీ మాత్రమే ఇందుకు దోహదపడుతుందని అర్థమవుతుంది. ఏ దిశ నుంచి ధ్వని వస్తోందో కూడా తెలుస్తుంది. గ్రూప్ కాలింగ్‌లో ఇది బాగా ఉపయోగపడుతుంది. కాన్ఫరెన్స్ రూమ్‌లో కూర్చున్నప్పుడు ఎటువైపు నుంచైనా ఒక వ్యక్తి మాట్లాడుతుంటే మిగిలిన అందరి దృష్టి అటువైపు ఉంటుంది. సరిగ్గా అదేవిధమైన అనుభవం ఈ ఇమ్మెర్సివ్ కాల్‌తో లభిస్తుంది. చాలా వరకు స్మార్ట్‌ఫోన్లలో కనీసం రెండు మైక్రోఫోన్లు ఉంటాయి. అయితే ఈ టెక్నాలజీలో రియల్ టైమ్‌లో వాయిస్ ట్రాన్స్‌మిట్ అవుతుంది. 5జీ అడ్వాన్స్‌డ్ ప్రమాణాల్లో ఈ ఇమ్మెర్సివ్ కాల్ టెక్నాలజీ భాగం.

ఐఫోన్ ముచ్చట్లు



ఐపాడ్‌లో ఓఎస్ 18లో ఎట్టకేలకు బిల్ట్-ఇన్ క్యాలిక్యులేటర్ వచ్చిచేరింది. యూనిట్ కన్వర్షన్స్‌కు అనువైనది. అలాగే బేసిక్, సైంటిఫిక్ క్యాలిక్యులేటర్ కూడా ఇది. డివైజ్‌పై అతి పెద్ద డిస్‌ప్లే బటన్స్ అదే సమయంలో ఫంక్షనాలిటీస్‌ను ఒకేసారి చూపుతుంది. అందులో హిస్టరీ ఆప్షన్ కూడా ఉంటుంది. అది కాలిక్యులేషన్స్‌కు సంబంధించి ఇంతకుమునుపు చేసినవి చూపుతుంది. మేథ్ నోట్స్ క్యాలిక్యులేటర్‌ని నోట్స్

ఐపాడ్‌లో ఓఎస్ 18లో క్యాలిక్యులేటర్ యాప్

యాప్‌నకు జతచేశారు. మేథమెటికల్ ఎక్స్‌ప్రెషన్స్‌ను ఇక్కడ రాయవచ్చు, టైప్ చేయవచ్చు. వెంటనే అవి సాల్వ్ అవుతాయి. సమాధానం లభిస్తుంది. వేరియబుల్ ప్రశ్నలకూ సమాధానం లభిస్తుంది. ఫలితాలకు సంబంధించిన గ్రాఫ్స్ ప్రత్యక్షమవుతాయి. అదే గ్రాఫ్‌కు మల్టిపుల్ ఈక్వేషన్స్‌ను జతచేయవచ్చు.

నోట్స్ యాప్‌నకు అప్‌గ్రేడ్ వచ్చింది. కంటెంట్‌ను ఇక్కడ ఆర్గనైజ్ చేసుకోవచ్చు. అయిదు సరికొత్త టెక్స్ హైలైట్ రంగులను జోడించారు.

పెన్సిల్ నిర్దేశిత ఫీచర్‌ని కూడా కలిపారు. హ్యాండ్ రిటెన్ నోట్స్ తీసుకునే యూజర్లకు అది సహకరిస్తుంది. రాసిన దానికి లెజిబిలిటీని మెరుగుపరుస్తుంది. టైప్ చేసిన మేటర్‌కు మాదిరిగానే ఇక్కడ కూడా ఎడిటింగ్ సౌలభ్యం ఉంటుంది. టైప్డ్ టెక్స్‌ని చేతి రాత స్టయిల్లో పేస్ట్ కూడా చేసుకోవచ్చు.

ఐపాడ్ యూజర్లు సైతం తమ హోమ్ స్క్రీన్‌ను కస్టమైజ్ చేసుకోవచ్చు. కొత్త అప్డేట్‌తో ఇప్పుడు యాప్ ఐకాన్స్ అలాగే విడ్జెట్స్‌ను స్క్రీన్‌పై ఎక్కడైనా పెట్టుకోవచ్చు. డార్క్, లైట్, టింట్‌తో కనిపించేలా ఐకాన్‌లను మార్చుకోవచ్చు. సైజు పెంచుకోవచ్చు. అందంగా కనిపించేందుకు అనువుగా పేర్లను తొలగించనూవచ్చు.

కంట్రోల్ సెంటర్‌ని కూడా రిడిజైన్ చేస్తున్నారు. కంట్రోల్ సెంటర్‌లో ఇకపై కుప్పలకొద్దీ సెట్టింగ్ టూల్స్ కనిపించనున్నాయి. మీడియా ప్లేబ్యాక్, హోమ్ కంట్రోల్స్, కనెక్టివిటీ కోసం వేర్వేరు కంట్రోల్స్ ఉంటాయి. ఈ కంట్రోల్స్ మధ్య స్వైపింగ్‌కు వీలు ఉంటుంది. మరిన్ని కంట్రోల్స్‌ను క్రియేట్ చేయాలని యాపిల్ ఇప్పటికే డెవలపర్లను కోరింది.



ఐపాడ్‌ఓఎస్ 18 ఫీచర్లు

- ఫేవరేట్ టాబ్స్ కనిపించేందుకు వీలుగా రీడిజైన్డ్ ట్యాబ్‌ని కలిపారు.
- ఫొటో యాప్ ఇకపై ఆటోమేటిక్‌గా లైబ్రరీలను నిర్వహిస్తుంది.
- మెసేజెస్ యాప్‌లో యానిమేటెడ్ టెక్స్ట్ సహా సరికొత్త ఫార్మేటింగ్ టూల్స్ సెట్ వస్తోంది.
- సఫారీ బ్రౌజర్‌లో రీడర్ వ్యూ ఉండనుంది.
- ఐపాడ్ యూజర్లు కూడా యాప్స్‌ని హైడ్ లేదంటే లాక్ చేసుకోవచ్చు.
- చాట్ జీపీటీ, సిరి ఇంటిగ్రేట్ కావడంతో యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్స్ అంటే రైటింగ్ టూల్స్, ఇమేజ్ కేపబిలిటీస్ అందుబాటులోకి వస్తాయి.
- పాస్‌వర్డ్ యాప్ జతపడుతుంది.
- షేర్‌ప్లే నుంచి రిమోట్ యాక్సెస్ లభిస్తుంది.
- కేలెండర్ యాప్‌లో ఈవెంట్స్, రిమైండర్స్ నుంచి టాస్క్‌లు కనిపిస్తాయి.

యాపిల్ డెవలపర్ ప్రోగ్రామ్ ద్వారా మాత్రమే ప్రస్తుతం ఐపాడ్‌ఓఎస్ 18 డెవలపర్ బీటాను పొందే వీలు ఉంది.

టైమ్ సెట్టింగ్స్‌తో ఐఫోన్‌లో వెబ్‌సైట్స్ బ్లాక్

ఐఫోన్‌లో స్క్రీన్ టైమ్ సెట్టింగ్స్ ఉపయోగించి వెబ్‌సైట్స్‌ను బ్లాక్ చేసుకోవచ్చు. తమ ఫోన్స్



ఉపయోగించే పిల్లలపై అదుపు లేదంటే స్క్రీన్‌టైమ్ సెట్టింగ్ కోసం ఇది బాగా ఉపయోగపడుతుంది. దీనికోసం...

- ఐఫోన్‌లో సెట్టింగ్ యాప్స్‌ని ఓపెన్ చేయాలి.
- స్క్రీన్ టైమ్‌ని టాప్ చేయాలి.
- కంటెంట్ అండ్ ప్రైవసీ రెస్ట్రిక్షన్స్‌ను టాప్ చేయాలి. ఇదివరకు సెట్ చేసుకుని ఉంటే ఇక్కడ స్క్రీన్‌టైమ్ పాస్‌కోడ్‌ని ఎంటర్ చేయాలి.
- కంటెంట్ అండ్ ప్రైవసీ రెస్ట్రిక్షన్స్‌ను టోగెల్ చేయాలి. ఆపై స్విచ్ టర్నాన్ అయిందీ లేనిదీ సరి చూసుకోవాలి.
- కంటెంట్ అండ్ ప్రైవసీ రెస్ట్రిక్షన్స్‌ని టాప్ చేయాలి. తదుపరి కంటెంట్ అండ్ ప్రైవసీ రెస్ట్రిక్షన్స్‌కు నేవిగేట్ చేయాలి.
- వెబ్‌కంటెంట్‌ని సెలెక్ట్ చేసుకోవాలి. అక్కడ అన్‌రెస్ట్రిక్టెడ్ యాక్సెస్, లిమిట్ అడల్ట్ వెబ్‌సైట్స్, అలౌడ్ వెబ్‌సైట్స్ ఉంటాయి. వాటిలో నుంచి ఒకటి సెలెక్ట్ చేసుకోవాలి. ఇలా ఐఫోన్‌లో వెబ్‌సైట్స్‌ను బ్లాక్ చేసుకోవచ్చు. ఇలా పిల్లల విషయంలో బ్రౌజింగ్ ఎన్విరాన్‌మెంట్ సేఫ్‌గా ఉండేలా చేసుకోవచ్చు.



యాపిల్ నుంచి ఫ్రీ పాస్‌వర్డ్ మేనేజర్

యాపిల్ తాజాగా పాస్‌వర్డ్ మేనేజర్‌ని ఆరంభించింది. ఇది ఐఓఎస్ 18, ఐపాడ్‌ఓఎస్ 18, మాక్‌ఓఎస్15కి అందుబాటులో ఉంటుంది. యాపిల్‌కు చెందిన ఐక్లౌడ్ కీచెయిన్ ఫీచర్‌కు ఎక్స్‌టెన్షన్‌గా ఇది పనిచేస్తుంది. యూజర్ నేమ్స్, పాస్‌వర్డ్స్, క్రెడిట్ కార్డ్ వివరాలు, సెక్యూరిటీ కోడ్స్, వైఫై పాస్‌వర్డ్స్ తదితరాలను దాచుకునేందుకు ఇది అవకాశం ఇస్తుంది. యూజర్లు చాలా సమర్థంగా తమ పాస్‌వర్డ్‌లను ఇందులో నిర్వహించుకోవచ్చు. వేర్వేరు ఆన్‌లైన్ అకౌంట్స్ క్రెడెన్షియల్స్ యాక్సెస్ సహా వెరిఫికేషన్ కోడ్స్ జనరేషన్ తదితరాలకు ఇది ఉపయోగపడుతుంది. ఏతావత ఇది మూడో పార్టీ పాస్‌వర్డ్ మేనేజర్ సర్వీసులకు సవాలుగా మారుతుంది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 15 జూన్ 2024
diksuchi@andhrajyothy.com

హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 26 సీట్లు ఉన్నాయి. నిమ్స్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇది మూడేళ్ల వ్యవధిగల ఫుల్ టైం ప్రోగ్రామ్. గరిష్ఠంగా అయిదేళ్లలో పూర్తిచేయవచ్చు. డాక్టోరల్ కమిటీ అనుమతి మేరకు మరో మూడేళ్లు పొడిగించే వీలుంది. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు; పబ్లిక్ సెక్టార్ సంస్థలు/యూనివర్సిటీలు/ఇతర ఇన్‌స్టిట్యూషన్‌లకు చెందిన ఉద్యోగులు అడ్మిషన్ నాటికి సంబంధిత సంస్థ నుంచి 'నో అబ్జెక్షన్' సర్టిఫికెట్‌ను సబ్మిట్ చేయాలి. ప్రోగ్రామ్ సమయంలో ఇతర డిగ్రీలు/డిప్లొమాలు చేసేందుకు అనుమతించరు.



నిమ్స్‌లో పీహెచ్‌డీ

విభాగాలు-సీట్లు: బయోకెమిస్ట్రీ 3, క్లినికల్ ఫార్మకాలజీ అండ్ థెరపిటిక్స్ 1, ఎమర్జెన్సీ మెడిసిన్ 1, మెడికల్ జెనెటిక్స్ 4, మెడికల్ అంకాలజీ 2, మైక్రోబయాలజీ 5, న్యూరాలజీ 1, నెఫ్రాలజీ 6, పాథాలజీ 1, ఫిజియోథెరపీ 2.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(లైఫ్ సైన్సెస్/అలైడ్ మెడికల్ సైన్సెస్) ఉత్తీర్ణులు; కనీసం 55 శాతం మార్కులతో ఎంబీబీఎస్/ బీడీఎస్ ఉత్తీర్ణతతోపాటు ఏడాది రీసెర్చ్ అనుభవం ఉన్నవారు; నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీతో పాటు రీసెర్చ్ అనుభవం ఉన్నవారు; ఎన్ఎంసీ/డీఎన్‌బీ నుంచి ఎండీ/ఎంఎస్ ఉత్తీర్ణులు; ఎంటెక్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/డేటా సైన్స్/మెషీన్ లెర్నింగ్/బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ జేఆర్ఎఫ్, ఐసీఎంఆర్-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్, డీబీటీ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్, ఇన్‌స్పైర్ ఫెలోషిప్ అర్హతల్లో ఒకటి ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: పరీక్ష 50 మార్కులకు ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ మెథడాలజీ, బయో స్టాటిస్టిక్స్, ఎథిక్స్ అంశాల నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ఇది అన్ని విభాగాలవారికి కామన్‌గా ఉంటుంది. రెండో పార్ట్‌లో అభ్యర్థులు హ్యూమన్ అనాటమీ, హ్యూమన్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, సెల్ బయాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, జెనెటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మకాలజీ విభాగాల నుంచి మూడింటిని ఎంచుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థి ఎంచుకొన్న విభాగాల నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. వీరిని మాత్రమే ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. తరవాత మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2000
- **మెడికల్ ఎగ్జామినేషన్ ఫీజు:** రూ.4050
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27
- **డాక్యుమెంట్స్ సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూలై 1
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 3
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూలై 6 నుంచి
- **నిమ్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 13
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 18
- **ఇంటర్వ్యూలు:** జూలై 25, 26
- **ఇంటర్వ్యూ ఫలితాలు విడుదల:** జూలై 30
- **అడ్మిషన్ తేదీ:** ఆగస్టు 3
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** ఆగస్టు 17
- **వెబ్‌సైట్:** www.nims.edu.in



విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ- 'డిప్లొమా ఇన్ ఫిషరీస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ పొందవచ్చు. ప్రభుత్వ కళాశాలల్లో 55 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 440 సీట్లు ఉన్నాయి. 75 శాతం సీట్లను కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రత్యేకించారు. 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలో డిప్లొమా

పాలిటెక్నిక్ కళాశాలలు

- కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్, ముతుకూరు
- కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్, నరసాపురం
- శ్రీ ఎంవీకేఆర్ ఫిషరీస్, భావదేవరపల్లి
- బీ ఆర్ ఫిషరీ పాలిటెక్నిక్, నర్సీపట్నం
- పైడ కాలేజ్ ఆఫ్ ఫిషరీస్ పాలిటెక్నిక్, పటవల
- పైడ గ్రూప్ ఫిషరీస్ పాలిటెక్నిక్, పటవల
- శ్రీ నిధి ఫిషరీస్ పాలిటెక్నిక్ కాలేజ్, చేకురపాడు
- బెల్లంకొండ ఫిషరీస్ పాలిటెక్నిక్, కంబాలపాడు
- శ్రీ వేంకటేశ్వర ఫిషరీస్ పాలిటెక్నిక్, టక్కోలు
- శ్రీ వేంకటేశ్వర ఫిషరీస్ పాలిటెక్నిక్, ఎస్ఎస్ఆర్ పురం
- శ్రీ హరి ఫిషరీస్ పాలిటెక్నిక్, పసుపుల

అర్హత: ఎస్ఎస్‌సీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ నుంచి 2024 మార్చిలో పదోతరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్, ఏపీఓఎస్ఎస్, టీఓఎస్ఎస్ అభ్యర్థులు; కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/ మధ్యలో ఆపేసినవారు కూడా అర్హులే. ఇంటర్/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తుకు అనర్హులు. 2024 ఆగస్టు 31 నాటికి అభ్యర్థుల వయసు 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **ఎడిటింగ్ ఆప్షన్:** జూలై 2 నుంచి 3 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 6
- **వెబ్‌సైట్:** apfu.ap.gov.in

ఎయిమ్స్ రిషికేశ్‌లో ఎమ్మెస్సీ

రిషికేశ్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- ఎమ్మెస్సీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- మెడికల్ బయోకెమిస్ట్రీ 7, మెడికల్ ఫిజియాలజీ 2, మెడికల్ ఫార్మకాలజీ 2, పెర్ఫ్యూజన్ టెక్నాలజీ 2 సీట్లు ఉన్నాయి.
- మెడికల్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఎమ్మెస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

అర్హత: ఎమ్మెస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌నకు బీఎస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. మిగిలిన మెడికల్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లకు ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ/బీ ఫార్మసీ/నాలుగున్నరేళ్ల బీపీటీ/మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి.

రిటెన్ టెస్ట్: పరీక్ష సమయం మూడు గంటలు. అభ్యర్థి ఎంచుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 200. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం పర్సెంటైల్ రావాలి.



ముఖ్యసమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,000; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులకు ఫీజు లేదు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూలై 15 నుంచి
- రిటెన్ టెస్ట్ తేదీని త్వరలో ప్రకటిస్తారు.
- **రిజిస్టర్డ్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ఎగ్జామినేషన్ సెల్, ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రిషికేశ్-249203
- **వెబ్‌సైట్:** www.aiimsrishikesh.edu.in

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఆఫీస్ ఆటోమేషన్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ(డీఓఏఏటీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, మెంటల్ ఇల్‌నెస్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీ, మల్టిపుల్ డిజెబిలిటీస్ కేటగిరీలకు ప్రత్యేకించారు. దీనికి తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. చెన్నై క్యాంపస్‌లో స్టడీ సెంటర్ ఉంది.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇందులో కంప్యూటర్ నాలెడ్జ్, మేథమెటిక్స్, జనరల్ నాలెడ్జ్ అంశాలకు సంబంధించి మొత్తం 30 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 30. నెగెటివ్ మార్కులు లేవు. మోడల్ ప్రశ్న పత్రాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫొటో, కమ్యూనిటీ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

నీలిట్‌లో ఎంటెక్ ప్రోగ్రామ్

గోరఖ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)-ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎలక్ట్రానిక్స్ డిజైన్ అండ్ టెక్నాలజీ, వీఎల్ఎస్ఐ డిజైన్ స్పెషలైజేషన్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 18 సీట్లు ఉన్నాయి. ఇన్‌స్టిట్యూట్ లెవెల్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు. గేట్ అభ్యర్థులకు ఏఐసీటీఈ నుంచి పీజీ స్కాలర్‌షిప్ లభిస్తుంది. నాన్ గేట్ అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ స్కీం కింద సంస్థ స్టయిపెండ్ చెల్లిస్తుంది.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో (బీఈ/బీటెక్)(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంట్రెన్స్ టెస్ట్: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీ) కోడ్ పేపర్‌కు నిర్దేశించిన గేట్ సిలబస్ ఆధారంగా పరీక్ష నిర్వహిస్తారు. ఈ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 19
- **కౌన్సెలింగ్:** జూన్ 20
- **వెబ్‌సైట్:** nielit.gov.in

ఎస్‌బీఐలో ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్లు

ఖాళీలు 150

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), సెంట్రల్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్...రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్(ఎంఎంజీఎస్-2)- మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2

అర్హతలు: ఏదైనా విభాగంలో డిగ్రీ, ఐఐబీఎఫ్ ఫారెక్స్ సర్టిఫికేట్‌తో పాటు ట్రేడ్ ఫైనాన్స్ ప్రాసెసింగ్‌లో రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2023 డిసెంబరు 31 నాటికి 23 నుంచి 32 సంవత్సరాల మధ్య ఉండాలి.

పే స్కేల్: నెలకు రూ.48,170 - రూ.69,810

పోస్టింగ్ ఏరియా: హైదరాబాద్, కోల్‌కతా

దరఖాస్తు రుసుము: రూ.750. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు చెల్లింపు మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 27

వెబ్‌సైట్: https://sbi.co.in/

ఎన్ఎఫ్‌సీలో మెడికల్ ఆఫీసర్లు

హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్... అడ్‌హాక్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టు: జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్: 3 ఖాళీలు

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి

వయోపరిమితి: 50 ఏళ్లు మించకూడదు

జీతం: నెలకు రూ.98,400

ఇంటర్వ్యూ తేదీ: జూన్ 24

వేదిక: ఎన్ఎఫ్‌సీ గెస్ట్‌హౌస్(గురుకుల్), న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, ఈసీఐఎల్ ఫ్యాక్టరీ దగ్గర, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://nfc.gov.in/

జాబ్ కార్నర్

బీఎస్ఎఫ్‌లో వెటర్నరీ ఖాళీలు

ఖాళీలు 6

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. హెడ్ కానిస్టేబుల్(వెటర్నరీ): **4 పోస్టులు**
2. కానిస్టేబుల్(కెన్నెల్‌మన్): **2 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, వెటర్నరీ స్టాక్ అసిస్టెంట్ కోర్సు సర్టిఫికెట్‌తో పాటు పని అనుభవం ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 18-25 సంవత్సరాల మధ్య ఉండాలి

జీతభత్యాలు: నెలకు హెచ్‌సీకి రూ.25,500 - రూ.81,100; కానిస్టేబుల్‌కు రూ.21,700 - రూ.69,100.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.100

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 17

వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in/







బద్ధకానికి శిక్ష

ఒక ఊరిలో రామ వర్మ అనే జమీందారు ఉండేవాడు. అతన దగ్గర అంకయ్య, వెంకయ్య అనే ఇద్దరు కూలీలు ఉండేవారు. ఆ జమీందారు చాలా క్రమశిక్షణ కలవాడు. ప్రతిరోజూ తెల్లవారుఝామునే నిద్ర లేచి, ఆ నౌకర్లు ఇద్దరినీ నిద్రలేపి పొలం పనికి పంపేవాడు. ఇది ఆ ఇద్దరు పనివాళ్లకు నచ్చేది కాదు. మరి కొంతసేపు నిద్ర పోనివ్వకుండా తమ యజమాని ప్రతిరోజూ చీకటితోనే లేపి పొలానికి పంపుతాడని జమీందారును తిట్టుకునే వారు. అంత మెత్తటి పట్టు పరుపు పైన హాయిగా పడుకున్నా కూడా తమ యజమానికి అంత ఉదయమే ఎలా మేలుకుంటున్నాడా? అని ఆలోచించాడు. కూపీ లాగాడు. చివరికి ఒక కోడిపుంజు ప్రతిరోజూ చీకటితోనే లేచి కూయడం వల్లే యజమాని మేలుకుంటున్నాడని తెలుసుకున్నాడు. ఒకరోజు ఆ కోడి పుంజును ఎవరూ చూడకుండా తీసుకుపోయి కోసుకుని తిన్నాడు. ఆ మర్నాడు కోడి కూయకపోవడంతో ఆలస్యంగా నిద్రలేచి, పనులన్నీ ఆలస్యంగా జరగడం గమనించాడు జమీందారు. తరువాతి రోజునుండి సరిగా నిద్ర పోనందువల్ల అర్ధ రాత్రే నిద్ర మేలుకుని, ఆయనకు మెలకువ వచ్చిన సమయానికే నౌకర్లు ఇద్దరినీ లేపి పనిలోకి పంపడం ప్రారంభించాడు. దానితో వారిద్దరికీ అంతకుముందు ఉన్నంత నిద్ర కూడా ఉండక 'అనవసరంగా ఆ కోడి పుంజును తినేసి.. మన విశ్రాంతి సమయాన్ని మనమే తగ్గించుకున్నాం' అని ఇద్దరూ బాధపడ్డారు.


సరైన నీడ ఏది?



ఎన్ని వరాహాలు ఉన్నాయి?



7 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



7			1					2
1								
	2			3		7		6
5	3				9	6		
	6		7		1		9	
		4	2				5	8
6		5		7			3	
								4
2					4			5

డైలీ సుడోకు - 333

సుడోకు - 332 సమాధానం

6	3	8	1	2	5	4	9	7
1	4	2	6	7	9	3	5	8
7	9	5	4	3	8	6	2	1
4	5	7	9	6	1	8	3	2
9	8	3	7	4	2	1	6	5
2	6	1	8	5	3	7	4	9
3	1	9	5	8	4	2	7	6
8	7	4	2	9	6	5	1	3
5	2	6	3	1	7	9	8	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.